







తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ,
హైదరాబాదు

సహ పాఠ్యాంశాలు

# విలువల విద్య - జీవన నైపుణ్యాలు



**10వ తరగతి**




రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ,
తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు

# విలువల విద్య - జీవన నైపుణ్యాలు

## వాచకం, ఉపాధ్యాయ కరదీపిక

## 10వ తరగతి

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ

తెలంగాణ, హైదరాబాదు.

# ముందుమాట

మానవులు సంఘజీవులు. తమ మనుగడకోసం అవసరమైన సమాజాన్ని నిర్మించుకొన్నారు. ఈ వ్యవస్థ నిర్వహణకు, కలిసికట్టుగా మనుగడసాధించడానికి, అభివృద్ధి పొందడానికి సరైన అవగాహన, విశ్వసనీయతలు అవసరం. దీనికి సమిష్టితత్త్వం, పరస్పరాధారిత భావాలు కూడా అవసరం. కాబట్టి మానవ సమాజాలకు జనమెరిగిన ఆమోదయోగ్యమైన ప్రవర్తనా నియమావళి అవసరం. మనం కోరుకొన్న విధంగా మనం ప్రవర్తించలేం. ప్రతి సమాజానికీ దానికి అనుగుణమైన నైతిక నియమావళి ఉంటుంది. ఈ నైతిక నియమాల బహుళత్వానికి కూడా అంతర్లీనంగా కొన్ని ఆమోదిత ఉమ్మడి నియమాలు ఉంటాయి.

నీతిసూత్రాలు మన నడవడికి మార్గదర్శకంగా ఉండే నియమాలు. కాబట్టి పిల్లలుకూడా వాటిని ఆకళింపుచేసుకోవాలి. నైతికాభివృద్ధి అంటే కొన్ని నిబంధనలను అనుసరించడమో లేక ఎవరో ఏర్పరిచిన ఆదర్శ నమూనాల ప్రకారంనడుచుకోవడం మాత్రమేకాదు. నైతికాభివృద్ధి అంటే ప్రతి సందర్భంలోనూ సరైన కారణాన్ని తెల్సుకోగలగడం, విచక్షణతో నిర్ణయాన్ని తీసుకొని దాని ప్రకారం నడుచుకోగల సామర్థ్యం కలిగి ఉండడం. నైతిక చైతన్య అభివృద్ధిలో తాను తీసుకోబోయే నిర్ణయంతో తాను స్థిరంగా ప్రశాంతంగా ఉండగలిగే సామర్థ్యంకూడా ఉంటుంది. “అది నాకలాగే చెప్పారు. కాబట్టి నేను చేస్తున్నాను” అనే భావనకు ఇది విరుద్ధం. అందుచేత ఒక వ్యక్తి తనకు తాను శాంతి సౌఖ్యాలతో, ప్రశాంతంగా, స్థిరంగా ఉండడమే నైతికాభివృద్ధి సారాంశం. ఇందుకవసరమైన నైపుణ్యాలు కలిగి ఉండడమే జీవననైపుణ్యాలు. వీటిలో సమస్యను పరిష్కరించుకోవడం కలిసిపనిచేయడం, భావప్రసారంచేయడం, నాయకత్వం వహించడం, ఇతరులతో పరస్పర సంబంధాలను కల్గి ఉండడం వంటివి ముఖ్యమైనవి.

దురదృష్టవశాత్తు నేడు సమాజంలో నైతిక విలువలు పతనమౌతున్నాయని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. మనలో స్వార్థం పెరగడం, దురాశ పెరగడం, అవినీతికి అలవాటుపడడం, నైతిక నియమావళిని ఉల్లంఘించడం, లోభత్వం పెరగడం, నేను నాది వంటి అవలక్షణాలవల్ల వ్యక్తులు తమ జీవితాన్ని సంక్లిష్టం చేసుకోవడంతోపాటు సమాజంలోని వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. ప్రతి ఒక్కరిలో అశాంతి పెరిగింది. నైతిక విలువల పతనంతోపాటు, పెరిగిపోతున్న ఒత్తిడిని, కనుమరుగౌతున్న మానవతా విలువలు, మానవసంబంధాలను గమనించవచ్చు. ఇవన్నీ ఒకరోజులోనో, ఒక సంవత్సరంలోనో వచ్చినవి కావు. మన జీవితాలలో సంయమనం, సమతుల్యత, విచక్షణ లోపించడమే దీనికి కారణం. వాటి స్థానంలో దురాశ, వినిమయవాదం, దోపిడీలు చోటుచేసుకొంటున్నాయి. వాటి నికర ఫలితమే సమాజంలోని అభద్రతాభావం, అపనమ్మకం, విచ్ఛిన్నమైన కుటుంబవ్యవస్థ, విలువల పతనం, సమాజంలో అశాంతి వ్యాపించడం మొదలగునవి.

వీటిని అరికట్టడానికి విద్యను ఒక సాధనంగా భావించి మనం విలువల విద్య, జీవననైపుణ్యాలు అనే అంశాన్ని ఒక ప్రధాన సబ్జెక్టుగా పాఠశాల విద్యలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రవేశపెట్టడం ద్వారా పిల్లలు పాఠశాల విద్య పూర్తయ్యేసరికి హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన శిక్షణ పొందుతారు. ఉన్నతమైన విలువలు, వైఖరులు, త్యాగబుద్ధి కలిగి ఉండి సమాజంపట్ల, పర్యావరణంపట్ల, తోటివారిపట్ల సమన్యాయంతో ప్రతిస్పందించే బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవసరమైన పాఠ్యప్రణాళికను (Syllabys) రాష్ట్రవిద్య, పరిశోధన, శిక్షణసంస్థ రూపొందించింది. పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడడం, ప్రశ్నించడం, ప్రతిస్పందించడం, విచక్షణతో వ్యవహరించడం చేయగలగాలని రాష్ట్ర విద్యాప్రణాళిక

పరిధిపత్రం 2011లోని రాష్ట్ర దృక్పథం (State Vision)లో పేర్కొన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో 1 నుండి 10వ తరగతి వరకు విలువల విద్య, జీవన నైపుణ్యాల పాఠ్యప్రణాళిక రూపొందించారు. అనంతరం తరగతి వారీగా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకోసం ఉపాధ్యాయుల కరదీపికలను రూపొందించారు. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు పెంపొందించాల్సిన 18 ప్రధాన విలువలను గుర్తించి ప్రతి తరగతిలో వీటికి సంబంధించిన పాఠాలను చేర్చారు. అవి, 1) స్వేచ్ఛ, 2) సంతృప్తిగా జీవించడం, 3) శీలనిర్మాణం, 4) జీవన నైపుణ్యాలు, 5) బాధ్యతవహించడం, 6) పొదుపుచేయడం, 7) ఆరోగ్యవిలువలు, 8) సంస్కృతి సంప్రదాయలపట్ల గౌరవం, 9) ఆరోగ్య విలువలు, 10) శాస్త్రీయదృక్పథం, 11) న్యాయం, 12) శాంతి, కలిసిమెలిసి జీవించడం, 12) శ్రమవిలువ, 14) సేవాభావం, 15) సమానత్వం, సోదరభావం, స్త్రీలపట్ల గౌరవం, 16) జాతీయ భావన – దేశభక్తి, 17) లౌకికతత్త్వం – మతసామరస్యం, 18) ప్రజాస్వామ్య విలువలపట్ల గౌరవం. వీటిలో ప్రాథమికస్థాయికి 12 ప్రధాన విలువలు, ఉన్నతస్థాయికి మొత్తం 18 విలువల ఆధారంగా ఒక్కొక్క విలువకు తరగతివారీగా ఉపవిలువలను నిర్ధారించి పాఠాలను పొందుపర్చారు.

విలువలు ప్రధానంగా బోధిస్తే వచ్చేవికావు. ఆచరిస్తే వచ్చేవి. కాబట్టి తరగతి వారీగా రూపొందించిన ఉపాధ్యాయ కరదీపికల్లో సన్నివేశాలు, సంఘటనల ఆధారంగా చర్చించడం, ఆచరించి అనుభవాలు చెప్పడం వంటి కృత్యాలతో కూడిన అభ్యాసాలు ఉన్నాయి. చర్చల ద్వారా వైఖరి నిర్మాణం జరగాలి. ఆచరణ ద్వారా ప్రవర్తనలో మార్పురావాలని ఆశించి పాఠాలను పొందుపరచారు. వీటిని నిర్వహించడం మన బాధ్యత. నిర్వహణతీరుతెన్నులను గురించి “ఉపాధ్యాయులకు సూచనలు” కూడా చేర్చారు. అట్లే విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి.

ఎంత మంచి కరదీపికైనా ఉపాధ్యాయుడికి ధీటుగాదు. ఉపాధ్యాయుడు తాను ఆదర్శంగా ఉంటూ విలువలను పెంపొందించడానికి కృషి చేయాలి. ప్రణాళికాబద్ధంగా తరగతి వారీగా రూపొందించిన కరదీపికల ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. మన రాజ్యాంగం పీఠికలో పేర్కొన్నవిధంగా ఉన్నతమైన విలువలు, వైఖరులుకల్గిన హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి ఉపాధ్యాయులుగా మనవంతు కృషిచేయాలి. ఈ కరదీపికలోని అంశాలు మీకు కొంతమేరకు దిశానిర్దేశం చేస్తాయి. వీటికే పరిమితం కాకుండా అదనపు అంశాలు కూడా సేకరించవచ్చు. వినియోగించవచ్చు. విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి మన ఈ చిన్న ప్రయత్నం గోరంతదైనా ఇది కొండంత వెలుగునిస్తుందనే విశ్వాసంతో ప్రయత్నిద్దాం. ఫలితాలు సాధిద్దాం!

**సంచాలకులు**
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

**యత్కర్మకుర్వతోஉస్యస్యాత్, పరితోషోஉంతరాత్మనః**
**తత్ ప్రయత్నేన కుర్వీత, విపరీతం తు వర్జయేత్ – మనుస్మృతి**

**ఏపని చేస్తే అంతరాత్మకు సంతృప్తి కలుగుతుందో, ఆపనులే చేయాలి. దానికి విపరీతమైన పనులు చేయకూడదు.**

## రూపొందించినవారు

**శ్రీ సువర్ణ వినాయక్,** కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ టి.వి.ఎస్.రమేశ్,** కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ శ్రీనివాసుల రఘురాం,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., గ్రంథసిరి, గుంటూరు జిల్లా.

**శ్రీ ఎల్.ఎం.ప్రసాద్,** ఉపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., సి.పి.ఎల్, అంబర్‌పేట్, హైదరాబాదు.

**శ్రీ పసుల ప్రతాప్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా.గిమ్మ, జైనత (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ బలగం రామ్మోహన్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., రవీంద్రపూర్, ముథోల్ (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ నందిగామ కిశోర్‌కుమార్,** తెలుగు పండితులు, జి.ప.ఉ.పా., ఇప్పటూరు, మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీమతి కె.ఆర్.టి.ఎల్. జ్యోతిర్మయి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి యు. బుగ్గమ్మ,** తెలుగు పండితులు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి వంగీపురం స్వర్ణలత,** ఉపాధ్యాయిని, జి.ఉ.పా., పాతపట్టిసం, పోలవరం, పశ్చిమగోదావరి జిల్లా.

**శ్రీమతి అగుదూరి సరళమ్మ,** ఉపాధ్యాయిని, ప్రా.పా., చెర్లోపల్లి, చిత్తూరు జిల్లా.

**శ్రీమతి పల్లి మాధవి,** తెలుగు పండితులు, భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లీహిల్స్, హైదరాబాదు.

**శ్రీమతి జి. సరళాదేవి,** ఉపాధ్యాయిని, ప్రా.పా, గంగాపూర్, మహబూబ్‌నగర్

## సహకరించినవారు

**డా॥ రమాదేవి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ బొజ్జల శరత్‌బాబు,** తెలుగు పండితులు, సీతాఫల్‌మండి, హైదరాబాదు.

**డా॥ దోనేపూడి నరేశ్ బాబు,** తెలుగు పండితులు, జి.ఉ.పా., గోస్పాడు, కర్నూల్ జిల్లా.

**శ్రీ దోరవేటి చెన్నయ్య,** సూల్ అసిస్టెంట్, జగద్గిరినగర్, రంగారెడ్డి జిల్లా.

**శ్రీ రామక విఠల్‌శర్మ,** ఉపాధ్యాయుడు, కరీంనగర్ జిల్లా.

**డా॥ గుడిసేవ విష్ణుప్రసాద్,** స్కూల్ అసిస్టెంట్, కృష్ణా జిల్లా.

**శ్రీ కలమట సోమేశ్వరరావు,** ఉపాధ్యాయుడు, శ్రీకాకుళం జిల్లా.

**శ్రీ దివ్వెల చిన్నారావు,** తెలుగుపండితులు, విజయనగరం జిల్లా.

**శ్రీ అయ్యగారి శ్రీనివాసరావు,** స్కూల్ అసిస్టెంట్, విజయనగరం జిల్లా.

**ముఖచిత్రం – డిజైనింగ్**

**శ్రీ కె.సుధాకరాచారి,** SGT, UPS నీలకుర్తి, వరంగల్

**డిజైనింగ్**

**శ్రీ దార కన్నయ్య,** కంప్యూటర్ ఆపరేటర్ SCERT, హైదరాబాదు

## విషయనిపుణులు, ఎడిటింగ్

**డా॥ఎన్.ఉపేందర్‌రెడ్డి,**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక విభాగాధిపతి,
ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ సువర్ణ వినాయక్,**
కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాదు.

## సలహాదారులు

**శ్రీ జి.గోపాల్‌రెడ్డి,**
పూర్వ సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు.

**శ్రీ ఎస్.జగన్నాథరెడ్డి,**
సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు.

# కృతజ్ఞతలు

**"విలువల విద్య – జీవననైపుణ్యాలు"** కరదీపిక / వాచకాలను రూపొందించడంలో తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందజేసి అవసరమైన సామగ్రిని ఇచ్చి ప్రోత్సహించిన పెద్దలకు, ఆయా సంస్థలకు రాష్ట్ర విద్యా, పరిశోధన, శిక్షణ సంస్థ, పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు.

**సలహాలు, సూచనలిచ్చినవారు :**

**శ్రీ శితికంఠానంద,** రామకృష్ణమఠం, హైదరాబాద్.

**శ్రీ కె.ఆర్.వేణుగోపాల్,** విశ్రాంత ఐ.ఎ.ఎస్., అధికారి, హైదరాబాదు.

**శ్రీ వాసగిరి లక్ష్మీనారాయణ,** ఐ.పి.ఎస్., కమీషనర్ ఆఫ్‌పోలిస్, థానే, మహారాష్ట్ర.

**డా॥ వి.బ్రహ్మారెడ్డి,** ప్రజావైద్యశాల, కర్నూలు జిల్లా.

**శ్రీ దూస రామకృష్ణ,** ఉపాధ్యక్షులు, విద్యాభారతి, అఖిలభారతీయ శిక్షాసంస్థాన్, న్యూఢిల్లీ మరియు సంచాలకులు, విజ్ఞానవిహార్, గడిలోవ, విశాఖపట్టణం.

**శ్రీ రావుల సూర్యనారాయణ,** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల శైక్షణిక ప్రముఖ, సరస్వతి విద్యాపీఠం, బండ్లగూడ, హైదరాబాదు.

**శ్రీ ఫాదర్ పల్లిదానం,** సంచాలకులు, పీపుల్స్ ఆక్షన్ ఫర్ రూరల్ అవేకనింగ్ (PARA), రావులపాలెం, తూ.గో.జిల్లా.

**శ్రీ సుదర్శనాచార్య,** జాతీయ సంధానకర్త, లీడ్ ఇండియా సంస్థ, హైదరాబాదు.

**శ్రీమతి పోరూరి కృష్ణకుమారి,** ప్రజ్ఞ, కో–ఆర్డినేటర్, వికాస తరంగిణి, జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, హైదరాబాదు.

**శ్రీ ప్రేమ్‌కుమార్‌సింగ్,** రామకృష్ణమఠం, హైదరాబాద్.

**డా॥ పి.జయధీర్ రెడ్డి,** విశ్రాంతప్రధానాచార్యులు, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, కరీంనగర్.

**శ్రీ రవీందర్,** కో–ఆర్డినేటర్, వందేమాతరం సంస్థ, వరంగల్ జిల్లా.

**శ్రీ కె.మాధవరెడ్డి,** వందేమాతరం సంస్థ, మహబూబ్‌నగర్ జిల్లా.

**సహకరించిన సంస్థలు :**

- జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్టు, హైదరాబాదు.
- రామకృష్ణమఠం, హైదరాబాదు.
- సత్యసాయి విద్యాసంస్థలు, హైదరాబాదు.
- బ్రహ్మకుమారీ సంస్థ, హైదరాబాదు.
- వందేమాతరం సంస్థ, వరంగల్, మహబూబ్‌నగర్.
- ఈనాడు, నమస్తే తెలంగాణ, ఆంధ్రజ్యోతి, సాక్షి, దినపత్రికలు.
- శ్రీ సరస్వతీ విద్యాపీఠం, బండ్లగూడ, హైదరాబాదు.
- ఎమెస్కో పబ్లిషింగ్ సంస్థ, హైదరాబాదు.
- జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్.సి.ఇ.ఆర్.టి.), న్యూఢిల్లీ.
- శ్రీ సీతారామ సేవాసదన్, మంథని, కరీంనగర్ జిల్లా.

పైన తెల్పిన వ్యక్తులు, సంస్థలతోపాటు పరోక్షంగా కూడా సహకరించిన వ్యక్తులకు, సంస్థలకు, వాచకాలు / కరదీపికల రూపకల్పనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, విషయనిపుణులు, ఎడిటింగ్ చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. **విలువల విద్య – జీవన నైపుణ్యాల** గురించి వాచకం కరదీపికను రూపొందించడంలో ఇది ఒక తొలి అడుగుమాత్రమే! దీన్ని మరింత వృద్ధిపరచుకోవచ్చు. ఇందుకోసం భవిష్యత్తులో కూడా అందరూ సహాయ సహకారాలను ఇలాగే అందిస్తారని ఆశిస్తున్నాం.

**సంచాలకులు**

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

# ఉపాధ్యాయులకు సూచనలు

- "విలువల విద్య – జీవన నైపుణ్యాలు" కోసం 1 నుండి 10 తరగతులకు తరగతివారీగా కరదీపికలు రూపొందించారు. వీటిని పిల్లలను ఉద్దేశించి తయారుచేశారు. అనగా వీటిని ఉపాధ్యాయులు బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు, పిల్లలు స్వయం అభ్యసనానికి వినియోగించవచ్చు.
- ఒక విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యాశాఖ సబ్జక్టువారీగా కేటాయించిన పీరియళ్ళ భారత్వం ప్రకారం తరగతి వారీగా పాఠాలు పొందుపర్చారు.
- 6 నుండి 10 తరగతులకు వారానికి 48 పీరియళ్ళు ఉంటాయి. వీటిలో ఒక్కొక్క సబ్జక్టుకు కింది విధంగా భారత్వం ఉంటుంది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రథమ భాష | – | 6 పీరియళ్ళు | సాంఘికశాస్త్రం | – | 6 పీరియళ్ళు |
| ద్వితీయ భాష | – | 3 పీరియళ్ళు | విలువలవిద్య, జీవననైపుణ్యాలు | – | 2 పీరియళ్ళు |
| తృతీయ భాష | – | 6 పీరియళ్ళు | శారీరక, ఆరోగ్యవిద్య | – | 3 పీరియళ్ళు |
| గణితం | – | 8 పీరియళ్ళు | కళలు, సాంస్కృతికవిద్య | – | 3 పీరియళ్ళు |
| భౌతిక, రసాయన శాస్త్రం | – | 4 పీరియళ్ళు | పని, కంప్యూటర్ విద్య | – | 3 పీరియళ్ళు |
| జీవ శాస్త్రం | – | 4 పీరియళ్ళు | **మొత్తం** | – | **48 పీరియళ్ళు** |

- విలువల విద్య, జీవన నైపుణ్యాల గురించి బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు ప్రాథమికస్థాయిలో వారానికి 1 పీరియడ్, ఉన్నతస్థాయిలో వారానికి 2 పీరియళ్ళు ఉన్నందున, ఇందుకనుగుణంగానే పాఠాలను పొందుపర్చారు.
- ప్రాథమిక స్థాయిలో 12 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్కదానికి ఒకటి చొప్పున 12 పాఠాలు ఉన్నాయి. అట్లే ఉన్నత స్థాయిలో 18 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్క దానికి ఒక పాఠం చొప్పున 18 పాఠాలు ఉన్నాయి.
- వీటితోపాటు విలువలను పెంపొందించడానికి తోడ్పడేలా పద్యాలు, కథలు, గేయాలు, పాటలు అదనంగా చేర్చారు. 3వ తరగతి నుండి స్ఫూర్తిదాతలను కూడా చేర్చారు.
- విలువల విద్య – జీవన నైపుణ్యాలను పాఠాలలో సగటున ఒక పాఠానికి 3 పీరియళ్ళు అవసరమౌతాయి.
- ఒక పాఠంలోని విషయం అమరిక కింది విధంగా ఉంటుంది.

  ●) పాఠం పేరు, ●) ప్రధానవిలువ, ●) ఉపవిలువ, ●) ఆశించేఫలితాలు / లక్ష్యాలు, ●) ఉపోద్ఘాతం, ●) విషయం – సన్నివేశాలు / సంఘటనలు / కథనాలు, ●) అభ్యాసాలు – 'ఆలోచించడం – ప్రతిస్పందించడం', 'తరగతి కృత్యం – జట్టుపని', 'ఆచరించడం – అనుభవాలు చెప్పడం', ●) సూక్తి.
- విలువల విద్య, జీవన నైపుణ్యాలలోని అంశాలు ప్రధానంగా చర్చింపజేయడానికి ఉద్దేశించినవి. ఆచరించి అనుభవాలు చెప్పించడానికి ప్రాధాన్యతనిచ్చారు. కాబట్టి వీలైనంతమేరకు వీటిని రాయించకూడదు.
- **ఆలోచించడం – ప్రతిస్పందించడం**లోని ప్రశ్నల ద్వారా తరగతిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత **'తరగతి కృత్యం – జట్టుపని'** నిర్వహించాలి. అట్లే **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'**లోని అంశాలను ఆచరింపజేసేలా చేసి పిల్లలతో వారి అనుభవాలు, అనుభూతులను చెప్పించాలి.
- మిగతా సబ్జక్టులవలెనే **విలువల విద్య – జీవన నైపుణ్యాల**ను కూడా మూల్యాంకనం చేయాలి. వీటిని సంగ్రహాత్మక మూల్యాంకనం సందర్భంగా చేయాలి. అనగా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం పరీక్షలు నిర్వహించకూడదు. పిల్లల్ని పరిశీలించడం, వారి అనుభవాలు, ఆచరణ, ప్రవర్తన, విలువలు మొదలగు వాటి ఆధారంగా మూల్యాంకనం చేయాలి.
- దీని మూల్యాంకనాన్ని 50 మార్కులకు నిర్వహించాలి. **విలువల విద్య – జీవన నైపుణ్యాలు** ఆధారంగా పిల్లల్లో విద్యాప్రమాణాలు సాధించాలి. అవి 1) మంచి, చెడు విచక్షణ జ్ఞానాన్ని ప్రదర్శించడం, సత్ప్రవర్తనకల్గి ఉండడం, 2) రాజ్యాంగ విలువలు పాటించడం, 3) వ్యక్తిగత విలువలు అనగా సహనం, దయ, సానుభూతి, తదానుభూతి

మొదలగునవి కల్గి ఉండడం, 4) జీవన నైపుణ్యాలు కల్గి ఉండడం, 5) ఉపాధ్యాయులు, పెద్దలు, సమాజం, ప్రభుత్వ ఆస్తుపట్ల సరైన వైఖరులు కల్గి ఉండడం.

- పైన తెల్పిన విద్యాప్రమాణాలను ఆయా పాఠాల ఆధారంగా పరిశీలించాలి. వీటిని సాధించడానికి అనుగుణంగానే ప్రధాన విలువకు సంబంధించిన పాఠాలు తరగతుల వారీగా ఉన్నాయి. ఒక్కొక్క సామర్థ్యానికి 10 మార్కుల చొప్పున 50 మార్కులకు నిర్వహించాలి. అనగా పరిశీలించి మార్కులు కేటాయించాలి.
- పిల్లల ప్రగతిని పరిశీలించి గ్రేడింగ్ నమోదుచేయాలి.

  A1 - 91%

  A2 - 71% - 90%

  B1 - 51% - 70%

  B2 - 41% - 50%

  C - 0 - 40%
- పిల్లల ప్రగతిని గురించి గ్రేడింగ్ నమోదు చేసినప్పుడు వాటికి సంబంధించిన గుణాత్మక రిమార్కులు కూడా నమోదుచేయాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ విధానం - ప్రాథమిక స్థాయి

**మొదటి పీరియడ్** :
- ఉపోద్ఘాతం గురించి తెలియజేయాలి.
- పాఠానికి సంబంధించిన విషయంలోని సన్నివేశాలు / సంఘటనలు / కథనాలను ఒకరితో చదివించాలి. లేదా చెప్పాలి.
- 'ఆలోచించండి - ప్రతిస్పందించండి' లోని ప్రశ్నల ఆధారంగా తరగతిలో చర్చ నిర్వహించాలి.

**రెండవ పీరియడ్** :
- **'తెలుసుకోండి'**లోని విషయాన్ని గురించి పిల్లలకు చెప్పాలి లేదా ఒకరితో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- **'తరగతి కృత్యం - జట్టుపని'**ని తరగతిలో పిల్లలను జట్లుగా విభజించి నిర్వహించాలి.
- ఒక్కొక్క జట్టువారు చేసిన పనులను ప్రదర్శించాలి.
- **'ఆచరించండి - అనుభవాలు చెప్పండి'** లోని అంశాలను ఇంటివద్ద ఆచరించమని చెప్పాలి.

**మూడవ పీరియడ్** :
- పుస్తకం చివర ఉన్న 'అనుబంధం'లో చేర్చిన కథ / పాట / పద్యం / శ్లోకం / స్ఫూర్తిదాతల గురించి తరగతిలో పిల్లలతో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- ఆ తరవాత **'ఆచరించండి - అనుభవాలు చెప్పండి'** గురించి ఒక్కొక్కరితో మాట్లాడించాలి.
- పాఠం చివర ఉన్న సూక్తి గురించి తెలియజేయాలి.

- పాఠశాలలో **'విలువల విద్య - జీవన నైపుణ్యాలు'** పుస్తకాలను పిల్లలకు కూడా ఇవ్వవచ్చు. గ్రంథాలయ పీరియడ్ సమయంలో లేదా భోజన విరామ సమయంలో కూడా పిల్లలకిచ్చి చదువుకోమని చెప్పాలి.
- 'విలువల విద్య - జీవన నైపుణ్యాలు' లోని సన్నివేశాలు, సంఘటనలు, సూక్తులు, పద్యాలు, శ్లోకాలు, కథలు, స్ఫూర్తిదాతల వంటి ఇతర అంశాలు కూడా సేకరించి తెలియజేయవచ్చు. వాటి ఆధారంగా కూడా చర్చ నిర్వహించడం, జట్టుపనులు చేయించడం, 'ఆచరించండి - అనుభవాలు చెప్పండి' వంటివి నిర్వహించవచ్చు.
- పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలు, మ్యాగజైన్లు, వార్తాపత్రికలు వంటి వాటిని వినియోగించాలి.
- విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి. వీటిని మొదటి పీరియడ్‌లోనే చదివి వినిపించాలి. వీటి గురించి అర్థం చేయించాలి. ఆ ప్రకారం పిల్లలు నడుచుకొనేలా చూడాలి.

# విద్యార్థులకు సూచనలు

- పిల్లలూ! **'విలువల విద్య – జీవన నైపుణ్యాలు'** పుస్తకం మీకోసమే రూపొందించి పాఠశాలలకు పంపారు.
- వీటిలోని పాఠాలు, పద్యాలు, కథలు, శ్లోకాలు, పాటలు, స్ఫూర్తిదాతల గురించి మీకు మీ ఉపాధ్యాయులు బోధిస్తారు. లేదా మీరే చదవండి. ఇతరులకు చెప్పండి, వాటి గురించి చర్చించండి.
- వీటి గురించి మీకు వారానికి ఒకరోజు బోధిస్తారు.
- ఒక పాఠంలోని సన్నివేశాలు, సంఘటనలు గురించి మీలో ఒకరు చదివిన తర్వాత మీ ఉపాధ్యాయుడు, కొన్ని ప్రశ్నలు అడుగుతారు. వీరందరూ ఆ ప్రశ్నలకు ఆలోచించి జవాబులు చెప్పండి. చర్చలో పాల్గొనండి.
- తరగతిలో జట్టు కృత్యాలు నిర్వహిస్తారు. మీరు మీ మిత్రులతోకల్సి జట్టు పనుల్లో పాల్గొనండి. మీరు జట్లలో చర్చించిన విషయాల గురించి తరగతిలో చెప్పండి.
- **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** అని కొన్ని పనులను మీకు పురమాయిస్తారు. ఆ ప్రకారం మీరు ఆచరించండి. ఆ తరవాత వచ్చే పీరియడ్‌లో ఏం చేశారు? మీకెలా అనిపించిది? దీన్నుండి మీరేమి నేర్చుకొన్నారు? మొదలగు విషయాలను, మీ అనుభవాలను తెలియజేయండి.
- వీటిలోని అంశాలు ఎక్కువగా చర్చించడానికి, ఆచరించి అనుభవాలు చెప్పడానికి ఉద్దేశించినవి కాబట్టి రాయాలని భావించకండి. తప్పనిసరిగా చేయండి.
- మీరు తెల్సుకొన్న, చర్చించిన అంశాల ఆధారంగా వార్తాపత్రికలలో చూడండి. వాటి నుండి సేకరించిన విషయాలు, వార్తలు, వ్యాసాలు, సూక్తులు మొదలగువాటిని తరగతిలో చదివి విన్పించండి. ఆ తరవాత వాటిని తరగతిలోని గోడపత్రికలో ప్రదర్శించండి.
- వీటికి కూడా మూల్యాంకనం ఉంటుంది. ఐతే, వీటికి పరీక్షలు ఉండవు. మీరెలా పాల్గొంటున్నారు? మీ ప్రవర్తన ఎలా ఉంది? మీలో ఏం మార్పువచ్చింది? మొదలగు విషయాలను మీ ఉపాధ్యాయులు పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. వాటి ఆధారంగా మీకు గ్రేడింగ్ ఇస్తారు.
- ఇలా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మీ గురించి నమోదుచేస్తారు. మొదటి సంగ్రహణాత్మక, రెండవ సంగ్రహణాత్మక, మూడవ సంగ్రహణాత్మక మూల్యాంకనాలతోపాటు మిమ్మల్ని పరిశీలించి మీ ప్రగతిని గ్రేడుల రూపంలో నమోదుచేస్తారు.
- 10వ తరగతి మెమో / సర్టిఫికెటులో కూడా ఈ వివరాలు ఉంటాయి.
- వంట ఎంత మంచిగా వండినా, దాంట్లో చిటికెడు ఉప్పు లేకుంటే రుచి ఉండదని భాస్కరశతకంలోని పద్యం ఉంది. అట్లే మనం ఎంత చదువుకున్నా, ఎంత మంచి గ్రేడు వచ్చినా, మనలో 'వినయం, సహనం, శీలం, విచక్షణ' లేకుంటే మనకు విలువ ఉండదు. కాబట్టి విలువల విద్య – జీవన నైపుణ్యాలు పాఠాల ద్వారా మీరు గొప్పవారుగా ఎదగాలి.

# విషయసూచిక


| వ.సం. | ప్రధాన విలువ | నేర్పవలసిన విలువ | పాఠ్యాంశం | పేజీ |
|---|---|---|---|---|
| 1. | స్వేచ్ఛ | మహిళలు - స్వేచ్ఛ - మహిళా చట్టాలు | మహిళా స్వేచ్ఛ | 1 |
| 2. | ఏకాగ్రత | ఏకాగ్రత విజయానికి మూలం | ఏకాగ్రత | 5 |
| 3. | శీలనిర్మాణం | ఆత్మవిశ్వాసాన్ని కలిగిఉండడం | ఆత్మవిశ్వాసం | 10 |
| 4. | జీవననైపుణ్యాలు | భావోద్వేగ నైపుణ్యాలు, ఒత్తిడిని అధిగమించడం, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించడం | భావోద్వేగ నైపుణ్యాలు | 16 |
| 5. | బాధ్యతలు నిర్వర్తించడం - కర్తవ్యపాలన | దేశ వారసత్వ సంపదను కాపాడుకోవడం | మన వారసత్వసంపద | 23 |
| 6. | పొదుపు ఆవశ్యకత | ఆడంబరాలకు, వస్తు వ్యామోహానికి దూరంగా ఉండడం | ఆడంబరాలు | 28 |
| 7. | ఆరోగ్య విలువలు | ప్రాథమిక చికిత్సపై అవగాహన కలిగిఉండడం | ప్రథమ చికిత్స | 32 |
| 8. | సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం | వసుధైక కుటుంబ భావన | వసుధైక కుటుంబం | 44 |
| 9. | పర్యావరణ–పరిరక్షణ | జీవవైవిధ్య సమతుల్యతను కాపాడడం | జీవవైవిధ్యం | 49 |
| 10. | శాస్త్రీయ దృక్పథం | విజ్ఞానశాస్త్రానికి సామాజిక బాధ్యత ఉంటుందని గుర్తించడం | సమాజం - శాస్త్రీయాభివృద్ధి | 55 |
| 11. | న్యాయం | చట్టాలగురించిన కనీస పరిజ్ఞానం కలిగిఉండడం | చట్టాలు | 59 |
| 12. | శాంతి, అహింస సౌందర్యాత్మక స్పృహ | ప్రపంచశాంతి | శాంతి | 64 |

| వ.సం. | ప్రధాన విలువ | నేర్పవలసిన విలువ | పాఠ్యాంశం | పేజీ |
|---|---|---|---|---|
| **13.** | శ్రమవిలువ | శ్రమతోనే విజయం లభిస్తుందని తెలుసుకోవడం | శ్రమ విజయం | **68** |
| **14.** | సేవాభావం | సామాన్యులు అసామాన్య సేవలు చేయడం | సమాజసేవ | **72** |
| **15.** | సమానత్వం, సోదరభావం, స్త్రీల పట్ల గౌరవం | స్త్రీల పట్ల గౌరవభావం కలిగిఉండడం | స్త్రీ గౌరవం | **77** |
| **16.** | జాతీయభావన-దేశభక్తి | దేశ ఔన్నత్యాన్ని, కీర్తిప్రతిష్టలకు చాటడం | భారతదేశఔన్నత్యం | **82** |
| **17.** | లౌకికత్వం - మతసామరస్యం | పరమత సహనభావనలు కలిగిఉండడం | పరమతసహనం | **90** |
| **18.** | ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం | అవినీతి రహిత సమాజాన్ని నిర్మించడం | అవినీతి నిర్మూలనం | **95** |

## అనుబంధాలు


1. శ్లోకాలు 102
2. పద్యాలు 104
3. పాటలు / గేయాలు 108
4. కథలు 120
5. స్ఫూర్తిదాతలు 140

# 1 మహిళా స్వేచ్ఛ

**I. ప్రధాన విలువ**

స్వేచ్ఛ

**II. ఉప విలువ**

మహిళలు - స్వేచ్ఛ - మహిళా చట్టాలు

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- మహిళలకున్న స్వేచ్ఛను గుర్తించగల్గుతారు.
- మహిళలకు స్వేచ్ఛను ఇవ్వడంపట్ల బాధ్యతను కలిగి ఉంటారు.

## IV. ఉపోద్ఘాతం

ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేశం సుభిక్షంగా ఉంటుందని మన పురాణాలు ఘోషిస్తున్నాయి. అంతటి ఉన్నత స్థానాన్ని స్త్రీలకు ఇచ్చింది మనదేశం అటువంటి మన దేశంలో కూడా స్త్రీలపట్ల వివక్షత, వారికి స్వేచ్ఛను ఇవ్వకపోవడం, స్వేచ్ఛ ఇచ్చినా వారికి రక్షణ లేకపోవడం వంటివి మనం నిత్యం చూస్తున్నాం. స్వేచ్ఛ అనేది ఈ భూమిమీద ఉన్న సమస్త జీవరాశికి ఉంది. ఎప్పుడైతే అర్థరాత్రి నడిరోడ్డులో స్త్రీలు తిరగగలరో అప్పుడే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లు అన్న గాంధీజీ మాటలు నేటి సమాజంలో ఎంతవరకు సాధ్యపడుతున్నాయి. దీనికి ఎవరు బాధ్యులు. వీటిపట్ల మన బాధ్యతలు ఏంటో తెలుసు కుందాం.

## V. విషయం

**సంఘటన – 1 :** కొందరు ఆడపిల్లలు రోడ్డుమీద నడుస్తున్నారు. వాళ్ళ వెనక బైకుమీద అబ్బాయిలు ఎగతాళిగా మాట్లాడుతూ కామెంట్ చేస్తున్నారు. ఆడపిల్లలైతే బిక్కు బిక్కుమంటూ భయంతో తలలు వంచుకొని వెళుతున్నారు. ఎవరు వచ్చి సహాయం చేస్తారా అని ఎదురుచూస్తున్నారు. ఛీ... వీళ్ళెందుకు ఇలా ప్రవర్తిస్తున్నారు అని చీదరించుకున్నారు.

**సంఘటన – 2 :** ఇలాగేనా వండడం తింటున్న కంచాన్ని భార్యపై విసిరికొట్టాడు భర్త. ఆ కంచం సరాసరి ఆమె నుదుటికి తగిలి రక్తం కారింది.

**సంఘటన – 3 :** ఇంట్లో చెప్పాపెట్టకుండా ఎక్కడికి పోయావు? ఇంటికి టైముకు రావాలని తెలీదా? ఆడపిల్ల ఎలా ఉండాలి. ఇంకోసారి చెప్పకుండా బయటకు కాలు పెట్టు చెప్తాను. రెండుకాళ్ళు విరగొట్టి ఇంట్లో కూచోపెడతా! తెలిసిందా అంటూ లావణ్య నాన్న లావణ్యను చితకబాదాడు.

**సంఘటన – 4 :** రత్తమ్మకు ఇంట్లో బండెడు చాకిరీ. పాపం ఉదయం లేచింది మొదలు ఇల్లు ఊడ్వడం, గిన్నెలు కడగడం, బట్టలు ఉతకడం, నీళ్ళు చేదడం, వంట చేయడం. సరుకులు బాగుచేసుకోవడం, ఇలా ఒక్క నిముషంకూడా తీరికలేకుండా పని చేస్తూనే ఉంటుంది. అంత పని చేస్తున్నా పాపం రత్తమ్మను ఎవరూ గుర్తించరు, గౌరవించరు.

**సంఘటన – 5 :** "నాన్నా! నేను ఎమ్‌పిసి తీసుకొని ఇంజనీరునౌతా" అడిగింది పద్మ. "ఏమీ అక్కరలేదు. ఆడపిల్లవి నీకు ఇంజనీరు చదువు ఎందుకు. బైపిసి తీసుకొని నర్స్ ఉద్యోగం చేద్దువుగాని. నేను చెప్పినట్లు విని బైపిసిలో చేరు అంతే" ఖచ్చితంగా చెప్పాడు పద్మ వాళ్ళ నాన్న.

**సంఘటన – 6 :** అమ్మా! నన్ను పక్కింటికి ఇది తీసుకురా! అది తీసుకురా! అని పంపకు. ఆ అంకుల్ నాతో మాట్లాడేటప్పుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. నాకు వెళ్ళాలంటే భయంగా ఉంది. అతని చూపులు మాటలు వింటుంటే అసహ్యం వేస్తుంది. అంది 10వ తరగతి చదువుతున్న సుశీల.

## VI. (అ) ఆలోచించండి – ప్రతిస్పందించండి

1. ఆడపిల్లలను ఏడిపించే ఆకతాయిలు ఉంటారు కదా! వాళ్ళలా ఏడిపించడం వల్ల ఆడపిల్లలు ఎలా బాధపడతారు? అటువంటివి మీరు చూస్తే ఏం చేస్తారు?

2. ఇంట్లో గొడవల్లో చాలాచోట్ల ఆడవాళ్ళు దెబ్బలు తినడం, తిట్లు తినడం వంటివి మనం చూస్తుంటాం. ఇలా ఆడవాళ్ళను హింసించడం సరైనదేనా? ఎందుకు?

3. ఆడపిల్లలకు రకరకాల ఆంక్షలు పెట్టడం వల్ల వాళ్ళకు ఎలా అనిపిస్తుంది? ఇది సరైనదేనా? పెద్దవాళ్ళు అలా ఆంక్షలు పెట్టడానికి గల కారణాలేవి?

4. కొంతమంది ఇళ్ళల్లో ఆడవాళ్ళకు అసలు విశ్రాంతి అనేది ఉండదు. విరామం తీసుకొనే స్వేచ్ఛ ఆమెకు ఉంటుందా? లేదా? దీనిపట్ల మీ అభిప్రాయం ఏమిటి?

5. ఆడపిల్లలకు వాళ్ళు ఏమి చదవాలో, ఎలా ఉండాలో అని కొన్ని ఇష్టాలు ఉంటాయి. వాళ్ళ ఇష్టాలను ఎంతమంది పెద్దవాళ్ళు గౌరవిస్తున్నారు? మీరు గమనించిన సంఘటనలు చెప్పండి.

6. సమాజంలో ఈమధ్య తరచుగా మహిళలపై, ఆడపిల్లలపై లైంగికవేధింపులు ఎక్కువయ్యాయి అనే వార్తలతో మీరు ఏకీభవిస్తారా? ఎలా?

7. ఆడపిల్లలు స్వేచ్ఛగా ఉంటున్నారా? ఆడవాళ్ళ స్వేచ్ఛకు భంగం కలిగే పరిస్థితులు ఏవని మీరు భావిస్తున్నారు?

8. మహిళలకు రక్షణ కల్పించేందుకు ఎవరు బాధ్యత వహించాలి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ ఇంట్లోకాని, చుట్టుపక్కల కుటుంబాలలోగాని ఆడవాళ్ళకు స్వేచ్ఛ ఎక్కడెక్కడ లభిస్తుందో, ఎక్కడెక్కడ లభించడంలేదో గమనించండి, చర్చించండి.

## VII. తెలుసుకోండి

స్త్రీలపై నానాటికీ పెరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు వారి హక్కులను పరిరక్షించేందుకు గత దశాబ్దకాలంగా ఎన్నో చట్టాలు రూపుదిద్దుకున్నాయి. అయితే ఈ చట్టాలు సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. అలా మహిళలకోసం రూపొందించిన చట్టాలు అమలుకు నోచుకుని ఉన్నట్లయితే భారతదేశంలో మహిళల పక్ష వివక్ష మరియు అత్యాచారాలు ఈపాటికే సమసిపోయి ఉండేవి.

కాని నేటి పురుషాధిక్య సమాజంలో విశృంఖలమైన పరిస్థితులు ఈ అద్భుత ఆవిష్కరణకు అడ్డుపడుతున్నాయి. అయితే ప్రస్తుతం పూర్తిస్థాయిలో కాకపోయినా కొంతమేరకు ఈ చట్టాలు అమలుకు నోచుకుంటున్నాయి. భారతీయ చట్టసభలలోని ప్రతి అంశం కూడా మహిళలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ రూపుదిద్దుకుంటున్నాయి. ఈ విషయమై అందరూ ముఖ్యంగా మహిళలు సంపూర్ణమైన అవగాహనను కలిగిఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొన్ని చట్టాల గురించి తెలుసుకుందాం.

- **మహిళాచట్టాలు - సాంఘిక దురాచారాలు - రెండు పెళ్ళిళ్ళు :** భార్యకాని, భర్తకాని జీవించి ఉండగా మరో పెళ్ళి చేసుకోవడం భారత శిక్షాస్మృతి కింద నేరం. హిందూ వివాహచట్టం సెక్షన్ 5 వివాహానికి

అర్హతలు తెలుపుతూ పెళ్ళిచేసుకునే సమయానికి పెళ్ళికొడుకుకాని, పెళ్ళికూతురుకాని అప్పటికే పెళ్ళి అయి మొదటి భార్యకాని, భర్తకాని బతికేఉన్నట్లైతే ఆ పెళ్ళి చెల్లదని చెపుతుంది. రెండవపెళ్ళిని కోర్టు రద్దుచేయవచ్చు.

- **గృహహింస – కుటుంబహింస :** కుటుంబహింసా బాధితులైన మహిళలకు భారత శిక్షాస్మృతి కింద క్రిమినల్ పరిష్కారాలు ఉన్నాయి. ఐతే నేరం జరిగిన తరువాత ఈ పరిష్కారాలు లభిస్తాయి. నేరము జరగకుండా నిరోధించడానికి మహిళలకు రక్షణ కల్పించుటకు, గృహహింస నుండి రక్షణచట్టము, 2005 కొన్ని పరిష్కారాలు కల్పిస్తున్నది.

  ఇందులో కొన్ని

  ★ భర్త భార్యను ఇంటినుండి గెంటివేయలేడు. భర్త ఇంట్లోనే భార్య నివసించవచ్చు.

  ★ ఇంట్లో కొంతభాగాన్ని భార్యకు అప్పగించవలసినదిగా కోర్టు భర్తను ఆదేశించవచ్చు.

  ★ భర్త భార్యను నిరాశ్రయురాలుగా చేయలేడు.

  ★ ఆమెకు కలిగిన మానసిక వ్యధకుగాను నష్టపరిహారము చెల్లించమని ఆదేశించవచ్చు.

- **క్రిమినల్ నేరాలు – మానభంగం :** ఆధునిక సమాజంలో మహిళలపైన మానభంగాలు ఎక్కువైనాయి. దేశ రాజధాని ఢిల్లీలో నిర్భయ అనే మెడికల్ స్టూడెంట్‌పై జరిగిన సామూహిక అత్యాచార సంఘటన ఎంతో సంచలనాన్ని సృష్టించింది. దానిపై వెల్లువెత్తిన ప్రజా నిరసనలతో మహిళలపై అత్యాచారాలకుగాను కఠినమైన శిక్షలను విధించే దిశగా నిర్భయ చట్టాన్ని రూపొందించారు. నేరం ఋజువైతే జైలుశిక్షతోబాటు మరణశిక్షను కూడా నేరస్తులకు విధించవచ్చు.

- **మహిళా గౌరవానికి భంగం :** మహిళలను కొట్టడం, ఆమెపై నేరపూరితమైన బలప్రయోగం చేయడం, ఆమె గౌరవానికి భంగం కల్గించాలని ఉద్దేశించడం ఇవన్నీ నేరాలకింద పరిగణిస్తారు.

మహిళల రక్షణ కోసం ఎన్ని చట్టాలు వచ్చినా ఆ చట్టాల గురించి అవగాహన చేసుకోవడంలో మహిళలకు న్యాయం జరిగేలా చూడడంలో అందరూ బాధ్యత వహించాలి.

**సూక్తి**

**పురుషులు అనుభవిస్తున్న స్వేచ్ఛాయుత వాతావరణం, స్నేహితుల సాంగత్యం, తాము చూడాలన్న ప్రదేశాలకు, స్నేహితుల దగ్గరకు ఒంటరిగా వెళ్ళగడపడం, వెన్నెల్లో రాత్రివేళ ఒంటరిగా వీధుల్లో తిరగడం స్త్రీలలో ఎంతమందికి లభిస్తుందో ఆలోచించండి.**

# 2 ఏకాగ్రత

**I. ప్రధాన విలువ**

ఏకాగ్రత

**II. ఉప విలువ**

ఏకాగ్రత విజయానికి మూలం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- ఏకాగ్రత యొక్క ప్రాముఖ్యతను తెలుసుకుంటారు.
- ఏ పనినైనా ఏకాగ్రతతో చేయాలని అవగాహన చేసుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

ఏకాగ్రతే విజయ రహస్యం. ఏ పనిలో విజయం సాధించాలన్నా ఆ పనిపట్ల ఏకాగ్రత అవసరం. ఏకాగ్రత ఉంటే పనులు త్వరగా నెరవేరుతాయి. విద్యార్థులు తమ యొక్క చదువులో రాణించాలంటే కూడా ఏకాగ్రత అవసరం. కనుక ఏకాగ్రత యొక్క ఆవశ్యకత, ఏకాగ్రతను పెంచుకోడానికి అవలంబించాల్సిన అంశాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలి.

## V. విషయం

### కథ

ద్రోణాచార్యుడు కౌరవులకు, పాండవులకు గురువు. ఆయన వీరికి అస్త్ర శస్త్ర విద్యలను నేర్పించాడు. ఒక రోజు తన శిష్యుల ఏకాగ్రతను పరిశీలింపదలచి వారికి ఒక పరీక్షను నిర్వహించాడు. ఒకపెద్ద చెట్టుకొమ్మకు ఒక పక్షి బొమ్మను వేలాడదీసి దాని కన్నును లక్ష్యంగా చేసుకొని బాణం వేయాలని తన శిష్యులకు సూచించాడు. ముందుగా ధర్మరాజుని పిలిచాడు. ధనుస్సును ఎక్కుపెట్టమన్నాడు, ధనుస్సును

ఎక్కుపెట్టిన తర్వాత నీకు ఏమేమి కనిపిస్తున్నాయని అడిగాడు. దానికి ధర్మరాజు చెట్టు, చెట్టుకొమ్మలు, ఆకులు, పక్షి అని సమాధానం చెప్పాడు. ఇక నీవు వెళ్ళు అన్నాడు ద్రోణాచార్యుడు. భీముడు, దుర్యోధనుడు వచ్చారు. వారు కూడా ఇలానే సమాధానం చెప్పారు. వారిని కూడా వెళ్ళమన్నాడు. చివరికి అర్జునుడు వచ్చాడు ధనుస్సును ఎక్కుపెట్టాడు. అర్జునుని కూడా నీకు ఏమి కనిపిస్తున్నాయని అడిగాడు ద్రోణాచార్యుడు పక్షి కన్ను తప్ప తనకేమి కనపడట్లేదన్నాడు అర్జునుడు. బాణం విడువ మన్నాడు ద్రోణుడు. అర్జునుడు విడిచిన బాణం నేరుగా పక్షికంటిని తాకింది.

### సంఘటన - 1

అనీల్, సునీల్ ఇద్దరూ పక్కపక్క ఇళ్ళలో ఉంటారు. వీరు 10 వ తరగతి చదువుతున్నారు. ఇద్దరూ తెలివైన విద్యార్థులే. అనీల్ ఎప్పుడూ ఇంట్లో చదువుతున్నట్లే కనిపిస్తాడు. చదువు మధ్యలో మంచినీళ్ళకని తినడానికని, బాత్రూంకని లేచిపోయి వస్తాడు. స్థిరంగా కూర్చోడు, కానీ చాలాసేపు చదువుతాడు. సునీల్ ఎక్కువసేపు చదవడు. చదివినంత సేపు శ్రద్ధతో, ఏకాగ్రతలో చదువుతాడు. తక్కువసమయం చదివినా పాఠశాలలో ఎప్పుడూ ప్రథమస్థానం సునీల్‌దే.

### సంఘటన - 2

ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నాయి. పిల్లలందరూ శ్రద్ధగా పరీక్షలు రాస్తున్నారు. ఇంతలో పాఠశాల పక్క భవనంలో పెళ్ళి సందర్భంగా సినిమా పాటలు పెట్టారు. పరీక్షలు రాస్తున్న 'నితీష్' ఆ సినిమా పాటలు వింటూ పరీక్ష సరిగా రాయలేక పోయాడు.

### సంఘటన - 3

ప్రవీణకు మరుసటిరోజు EAMCET పరీక్ష ఉంది. కానీ ఆరోజే వాళ్ళ ఇంటికి వాళ్ళ పిన్నివాళ్ళు పిల్లలతో సహా వచ్చారు. అందరూ కలిసి వాళ్ళ ఇంట్లో టి.వి చూస్తూ ఆనందిస్తున్నారు. కానీ ప్రవీణ మాత్రం ఇవేవీ పట్టనట్లుగా తన రూంలో కూర్చొని పరీక్షలకు తయారవుతోంది. పిల్లలు చేస్తున్న అల్లరి ప్రవీణ ఏకాగ్రతను భంగం చేయలేకపోయింది.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. కథలో ద్రోణాచార్యుడు అర్జునుని మాత్రమే బాణం వేయమన్నాడు కదా! ఎందుకు?
2. 1వ సంఘటనలో సునీల్‌కే మార్కులు ఎందుకు ఎక్కువ వస్తున్నాయి?
3. 2వ సంఘటనలో నితీష్ చేసిన పని సరైనదేనా? అలా ఎందుకు చేశాడు అని మీరనుకుంటున్నారు?

4. 3వ సంఘటనలో ప్రవీణ వాళ్ళ పిన్ని పిల్లలతో ఎందుకు ఆడుకోలేదు. అలా చేయడం సరైనదేనా?
5. ఎవరికైనా ఏకాగ్రత ఎందుకు అవసరం? ఏకాగ్రత లేకపోతే ఏమవుతుంది?
6. మీరు ఏకాగ్రతను కోల్పోయిన సందర్భాలేవి? మీరు మళ్ళీ ఏకాగ్రతను ఎలా పొందారు? ఏకాగ్రతను పెంపొందించే అంశాలేవి?

### (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- ఈ కింది వాటిలో ఏదైనా ఒక పనిని ఎంపిక చేసుకోండి దానిని ఏకాగ్రతతో చేయండి.

  1. పుస్తకపఠనం / వార్తాంశపఠనం - నివేదిక రాయండం.
  2. రేడియో / టి.విలో వార్తలు వినడం - నివేదికరాయడం.
  3. ఏదైనా ఒక చర్చాకార్యక్రమాన్ని టి.విలో చూడడం నివేదిక రాయడం.
  4. ఏదైనా ఒక పనిని నేర్చుకోవడం - బొమ్మలు గీయడం / నమూనాలు తయారుచేయడం / ఎంబ్రాయిడరీ పనులు చేయడం.

పై పనులను చేసేటపుడు మీరు ఏకాగ్రతను కోల్పోయారా! ఎందుకు? మళ్ళీ ఏకాగ్రతను ఎలా సాధించారు? ఏకాగ్రతతో చేసిన తర్వాత మీకు కలిగిన ప్రయోజనం ఏమిటి? మీ అనుభవాలను తెలపండి?

## VII. తెలుసుకోండి

### ఏకాగ్రతా రహస్యం

ఏకాగ్రతే విజయ రహస్యం. ఈ సంగతి తెలుసుకున్న వాళ్ళు వివేకవంతులు. విద్యార్థులు తమ చదువుల్లో రాణించాలంటే ఏకాగ్రత అవసరం. అలాగే చేస్తున్న వృత్తి ఉద్యోగాలు ఏవైనప్పటికీ, ప్రతి ఒక్కరికీ ఏకాగ్రత అవసరం. కమ్మరులు, క్షురకులు, వడ్రంగులు, స్వర్ణకారులు, నేతగాళ్ళ లాంటి పనివారందరిలో ఏకాగ్రత అంతర్గతంగా అభివృద్ధి చెంది ఉండడాన్ని గమనించవచ్చు. సుత్తితో కొడుతున్నప్పుడు కమ్మరి ఏ కొద్దిగా ఏమరుపాటుగా ఉన్నా, అతని చేతి మీద సుత్తిదెబ్బ పడే ప్రమాదం ఉంది. అలాగే క్షురకుడి కత్తి గనుక ఏమాత్రం జారినా చర్మం తెగి, రక్తం కారే ప్రమాదం ఉంది. అదే విధంగా వడ్రంగి ఉలిని గనక గట్టిగా పట్టుకొని పనిచేయకపోతే, అతడి చిటికెనవేలు పోయే ప్రమాదం ఉంది. ఇక స్వర్ణకారుడి పని ఎంతో నైపుణ్యంతో కూడుకొన్నదనడంలో సందేహం లేదు. వారి వారి వృత్తులు సృష్టించిన పరిస్థితులే వారు

తప్పనిసరిగా ఏకాగ్రతను పెంపొందించుకునేలా చేశాయి. వీటిని బట్టి చూస్తే నిరంతర ప్రయత్నం ద్వారా ఏకాగ్రతను సాధించవచ్చని తెలుస్తుంది.

మనస్సు చంచలమైనది. ప్రతి దాంట్లో తల దూర్చడం, ఒక విషయం మీద నుంచి మరో విషయానికి దూకడం, విచిత్రమైన కోరికలు కోరడం, వేలాది విషయాల గురించి ఆలోచించడం, ఎన్నో సమస్యల గురించి దుఃఖించడం, గాలిలో మేడలు కట్టడం, మనకు అప్పగించిన పని గురించి కాక మిగిలిన ప్రతి ఒక్క పని గురించి పట్టించుకోవడం మనస్సు స్వభావం. దీనిని పరిసరాలు మరింత ఎగదోస్తుంటాయి. మనస్సును నియంత్రించుకోవాలనుకుంటే మనస్సును పక్కదోవ పట్టించే వాతావరణానికి దూరంగా ఉండాలి. మనస్సు గనక అదుపులో ఉంటే ఉన్నత లక్ష్యాలను సైతం సాధించగలం. అదే మనస్సు అదుపులో లేనట్లయితే, అత్యంత సామాన్యమైన పనులు చేయడం కూడా అసాధ్యమై కూర్చుంటుంది. మన మనసుల్లో సహజసిద్ధంగానే అసాధారణమైన శక్తి ఉంటుంది. అయితే అవసరమైన, అవసరం లేని అన్ని రకాలైన అంశాల మీదా ఈ శక్తిని మనం ఖర్చుచేస్తున్నాం. అందువల్లే మనం అత్యంత సాధారణమైన పనులను తప్ప మిగిలినవేవీ చేయలేకపోతున్నాం. ఘనకార్యాలను సాధించాలంటే చెల్లాచెదురుగా ఉన్న మానసిక శక్తులన్నింటినీ క్రమబద్ధీకరించాలి. మన మనస్సులు మన స్వాధీనంలో ఉన్నప్పుడే మనం ఏ పనినైనా చేయగలం.

స్వామి వివేకానంద చెప్పినట్లు ఏకాగ్రతతో కూడుకున్న మనస్సు నిజంగా ఓ సెర్చి దీపం లాంటిది. దూరంగా, చీకటి మూలల్లో పడి ఉన్న వస్తువులను కూడా మనకు కనిపించేలా చేస్తుంది.

విద్యార్థులు తమ చదువుల మీద మనస్సు ఎలా లగ్నం చేయాలనే అంశాన్ని తెలుసుకుందాం.

1. ప్రతి విద్యార్థీ పుస్తకాలు పరచుకొని హాయిగా చదువుకోవడానికి సౌకర్యవంతమైన ప్రదేశాన్ని ఎంచుకోవాలి.

2. నిర్ణీత సమయంలో ఏదో ఒకే అంశాన్ని తీసుకొని, దానినే అధ్యయనం చేయాలి. చదివే అంశం పట్ల ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలి.

3. అధ్యయనం చేయడం ప్రారంభించాక అది క్రమంగా చదువుతున్న అంశం లోతుల్లోకి వెళు తుంది. సరిగ్గా అప్పుడు ఉన్నట్టుండి అధ్యయనం ఆపుచేస్తే ఏకాగ్రత పోతుంది. చదువు దెబ్బతింటుంది. కాబట్టి మనస్సు ఏకాగ్రమయ్యాక, మరింత లోతుగా వెళ్ళి గాఢంగా అధ్యయనం చేయాలి.

4. విద్యార్థులు చదువులో ఉన్నతస్థానానికి ఎదగాలనే గట్టి కోరికను పెంపొందించుకున్నట్లయితే, చదువులో ఏకాగ్రతను సాధించగలరు.

5. చదువుతున్న విషయం పట్ల పూర్తి శ్రద్ధ చూపించడం ద్వారా ఏకాగ్రతను సాధించవచ్చు.

6. అపార విజ్ఞానాన్ని సంపాదించుకునే అద్భుత సామర్థ్యం ప్రతి విద్యార్థిలోనూ దాగి ఉంటుంది. విద్యార్థి తన అంతర్గత శక్తిని సందేహించకూడదు.

7. "జాగ్రత్తగా అధ్యయనం చేయడం ద్వారా నేను నా పరిజ్ఞానాన్ని ఖచ్చితంగా మెరుగుపరచుకుంటాను" అని దృఢనిశ్చయం చేసుకుని చదవడానికి కూర్చోవాలి.

8. చదువు మీద ఇష్టాన్ని పెంచుకోవాలి. ఇష్టం ద్వారా పొందిన ఏకాగ్రత చాలా సహజమైనది. అందులో ఎలాంటి పోరాటమూ, ఒత్తిడీ ఉండదు.

9. విద్యార్థులు ఏదైనా అంశాన్ని చదివేటప్పుడు దానిని అర్థం చేసుకొని చదవాలి. అర్థం తెలియనిదే చదవడం కొనసాగించకూడదు. తెలియని అంశాల్ని గురించి మిత్రులతో లేదా పెద్దవారితో చర్చించి అర్థంచేసుకొని చదవడం కొనసాగించాలి.

విద్యార్థి ఎంత తెలివిగలవాడైనా శ్రమ, కృషి లేనిదే దేన్నీ సాధించలేడు. లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదలతో ఏకాగ్రతతో కృషిచేసినపుడే విజయం సిద్ధిస్తుంది.

**సూక్తి**

**మనకు ఉన్నదానితో సంతృప్తిపడటం ఉత్తమమే కానీ మనకున్న జ్ఞానం చాలనుకోవడం అజ్ఞానం.**

**– డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్**

# 3 ఆత్మవిశ్వాసం

**I. ప్రధాన విలువ**

శీల నిర్మాణం

**II. ఉప విలువ**

ఆత్మవిశ్వాసాన్ని కలిగిఉండడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- ఆత్మవిశ్వాసం కలిగిఉంటారు.
- ఆత్మవిశ్వాసంతో ప్రవర్తిస్తారు.

## IV. ఉపోద్ఘాతం

ప్రతి వ్యక్తీ తనపై తాను విశ్వాసం పెంచుకోవాలి. మనమీద మనకి విశ్వాసం పెరిగితే మనం ఎదుర్కొనే బాధలు, ఇబ్బందులు తొలగిపోతాయి. మానవజాతిలో అత్యంత క్రియాశీలకమైన లక్షణం వారిలో ఉన్న విశ్వాసమే. మనమీద మనకు నమ్మకం ఉంటే మనం దేన్నయినా సాధిస్తాం! ఆత్మవిశ్వాసం మనలో పట్టుదల, ఉత్సాహం పెంచుతుంది.

మనలో ఆత్మవిశ్వాసం కలగాలంటే దిగులు, శోకం, ఆత్మనింద మొదలైనవాటిని దూరం చేయాలి. మన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. మనలో సామర్థ్యం లేకపోతే ఆత్మవిశ్వాసం కలగదు.

## V. విషయం

గొప్పపనులు హఠాత్తుగా జరగవు. నిరంతర శ్రమ వల్లనే సాధ్యం కాగలవు. ఆత్మవిశ్వాసం గలవారు జీవితంలో అనుకున్నది సాధించగలరు.

### సంఘటన - 1

గ్రీకు దేశంలో గొప్ప వక్తగా పేరుగాంచిన డెమోస్తనీస్‌కు బాల్యంలో నత్తి ఉండేది. ఆరోగ్యం కూడ అంత బాగా ఉండేదికాదు. తోటి మిత్రుల ఎగతాళికి గురయ్యాడు. గ్రీకు దేశంలో ఆనాడు ప్రముఖ వక్తగా పేరుగాంచిన ఒక వక్తను గమనించాడు డెమోస్తనీస్. ఆ వ్యక్తిపట్ల ప్రజలు చూపే గౌరవాదరాలు డెమోస్తనీస్ మనసుపై చెరగని ముద్రవేశాయి. తాను కూడా గొప్ప వక్త కావాలని నిశ్చయించుకున్నాడు. మాట్లాడడం మొదలుపెట్టిన వెంటనే నత్తి అతనిని బాధించేది. ఒకపెద్ద వాక్యం చెప్పే సామర్థ్యం అతనికి ఉండేది కాదు. ఒక వైద్యుని సలహా ప్రకారం నాలుకపై చిన్న గులకరాళ్ళను పెట్టుకొని స్పష్టంగా, బిగ్గరగా పదాలను పలకసాగాడు. ఎత్తైన కొండలను ఎక్కుతూ దిగుతూ చాలాసేపు ఊపిరిపీల్చడం అభ్యాసం చేశాడు. పెద్దపెద్ద వాక్యాలను పలకడం ప్రారంభించాడు. ప్రతిదినం సముద్రం ఎదుట నిలబడి సముద్రఘోషను మించిన ధ్వనితో ఉపన్యసించడం అలవరచుకున్నాడు. న్యాయశాస్త్ర గ్రంథాలను, గ్రీకు భాషలోని మహాకావ్యాలను ప్రతిరోజూ పదహారు గంటలకుమించి అధ్యయనం చేశాడు. ఇలా అతడు నిరంతర సాధనతో ఆత్మవిశ్వాసంతో తన దౌర్బల్యంపై విజయం సాధించాడు. గొప్ప వక్తగా పేరుపొందాడు.

### సంఘటన - 2

అబ్రహాం లింకన్ తన జీవితంలో చూడని అపజయాలు లేవు. 27 ఏళ్ళ వయసులో నరాలబలహీనతతో బాధపడ్డాడు. 46 ఏళ్ళ వయసులో సెనేట్ ఎన్నికల్లో ఓడిపోయాడు. 47 ఏళ్ళ వయసులో వైస్‌ప్రెసిడెంట్ పదవికి పోటీచేసి ఓడిపోయాడు. ఇన్ని అపజయాలు చవిచూసినా అతనిలో ఆత్మవిశ్వాసం చెక్కుచెదరలేదు. 52 ఏళ్ళ వయసులో ఆయన అమెరికాకి అధ్యక్షుడయ్యాడు.

### సంఘటన - 3

తోటలో మంచి పూలమొక్కలు నాటాలని అనుకొంది రాధ. మామయ్య దగ్గరికి వెళ్ళింది. "మీకు తోటపనిలో అనుభవం ఉందా మామయ్యా" అని అడిగింది.

"తోటపనిలో పెద్ద అనుభవం ఏమీలేదు కానీ తోటలో పెరిగే మొక్కలపై కొన్ని ప్రయోగాలు చేసిన అనుభవం ఉంద"న్నాడు. ఆ అనుభవాన్ని ఇలా చెప్పాడు. ఒక తోటలో చాలా గుమ్మడి కాయలు ఉన్నాయి. వాటిలో పదింటిని ఎంపిక చేసుకొని ఐదింటికి మాత్రం చిన్న చిన్న కుండలు తొడిగాను. వారంరోజుల తర్వాత గుమ్మడికాయలన్నీ వేరువేరు ఆకారాల్లో పెరిగాయి. కుండలు తొడిగిన గుమ్మడి కాయలు మాత్రం చిన్నవిగా కాశాయి. కారణం కుండలవల్ల వాటి ఎదుగుదల పరిమితమైపోయింది. మిగతా ఐదుమాత్రం చాలా పెద్దవిగా పెరిగాయి. ఐదుకుండలను పగులగొట్టాను. వారంరోజుల తర్వాత అవికూడా పెద్దవిగా పెరిగాయి. ఏవి కుండలు పెట్టినవో తెలుసుకోలేనంత సమానంగా గుమ్మడికాయలు ఎదిగాయి.

గుమ్మడికాయల ప్రయోగం మన జీవితాలకు ఎంతమంచి పాఠాన్ని నేర్పిందో గమనించారా? కాయల్లో పెద్దగా పెరిగే శక్తి అంతర్గతంగా దాగిఉంది. కాని వాటిని చిన్న కుండలకే పరిమితం చేయటంవల్ల తమ శక్తిమేర ఎదగలేకపోయాయి. వాటి అడ్డంకులు తొలగించగానే యధావిధిగా పెరిగాయి. అదేవిధంగా మనిషిలోకూడా ఎంతో శక్తి ఉంది. కాని భయంచేత, ఆత్మన్యూనతాభావంచేత తన అభివృద్ధిని తానే పరిమితం చేసుకుంటున్నాడు. దీన్ని అధిగమించాలంటే ఆత్మవిశ్వాసం ద్వారా సాధ్యపడుతుందని మామయ్య చెప్పాడు.

## సంఘటన - 4

రామయ్యకు పెద్దతోట ఉంది. అందులో రకరకాల పూలమొక్కలు, పండ్లచెట్లు ఉన్నాయి. ఒకరోజు ఇద్దరు కుర్రాళ్ళు తోటలోకి వచ్చి పూలు, పండ్లు దొంగిలిస్తున్నారు. దీన్ని తోటమాలి గమనించి వారిని పట్టుకొన్నాడు. తనతోపాటు తోటలోకి తీసుకెళ్ళాడు. పిల్లలిద్దరూ భయపడ్డారు. తోటమాలి తమను కొడతాడేమో ననుకొన్నారు. కానీ, బాగా పండిన రెండుపళ్ళు పిల్లలచేతుల్లో పెట్టారు. వారు పళ్ళను తినేలోపు, ఆ పిల్లలు పగులగొట్టిన పూలకుండీలను పక్కన పడేశాడు. చెదిరిన మొక్కలను సరిగ్గా అమర్చాడు. పళ్ళు తిన్నాక ఆ పిల్లలుకూడా తోటమాలికి పనిలో సాయపడ్డారు. పాడైపోయిన మొక్కల స్థానంలో కొత్తమొక్కలు నాటారు.

తరువాత తోటమాలి "ఎందుకిలా చేశారని" పిల్లలను అనునయంగా అడిగారు. "అమ్మకు ఆరోగ్యం బాగలేకపోవడంతో మందులకోసం దొంగతనం చేశామని చెప్పారు. ఆమాటలు నమ్మిన తోటమాలి పిల్లల చేతిలో యాభైరూపాయలు పెట్టి మందులు కొనుక్కోమన్నాడు. ఆ పిల్లలు ఆశ్చర్యపోయారు. "దొంగతనం చేయకుండా ఉంటే ఎంత బాగుండేది. పూలకోసం తోటంతా పాడుచేశాం. ఆయన మాపై ఎంతో దయచూపాడు" అని అనుకొన్నారు.

దాంతో పిల్లలు అతన్ని క్షమించమని అడిగారు. తోటలో ఏదైనా పని ఇప్పించమని, తోటపనిలో సహాయపడే అవకాశం కల్పించమని అడిగారు. పూలు, పండ్లు అమ్మేపనిని పిల్లలకి అప్పగించాడు తోటమాలి. వాటిని తీసుకొని వస్తుంటే "కష్టపడి పనిచేయండి, ఆత్మవిశ్వాసంతో ఉండండి. తనకు తాను సహాయం చేసుకునేవారికే దేవుడు సాయం అందిస్తాడు" అని చెప్పాడు.

## సంఘటన - 5

కొలంబస్ భూమి గుండ్రంగా ఉందని నిరూపించేందుకు పిల్టా అనే పేరుగల చిన్న ఓడపై సహచరులతో బయలుదేరారు. సముద్రంలో అలల తాకిడికి పడవ చెడిపోయింది. అనుచరులు మేము రాలేమని వెనుదిరిగి పోయారు. వారిని ఉత్సాహపరిచాడు. కొందరు మాత్రం అతనితో వెళ్ళడానికి సిద్ధపడ్డారు. నరీజ్ ద్వీపానికి 200 మైళ్ళ దూరంలో పశ్చిమాన ఒకచోట దిక్సూచీయంత్రం చెడిపోయింది. దాని ముల్లు ఉత్తర ధృవం వైపు చూపడం మానివేసింది. ఇంటినుండి 2,300 మైళ్ళ దూరంలో అక్కడ చిక్కుకున్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో ఎంతో ప్రయత్నించాడు. ముందుకు వెళ్ళాడు. చివరకు తన ప్రయత్నంలో విజయం సాధించాడు. 2-10-1492న నూతన ప్రపంచంపై అడుగుపెట్టి కొలంబస్ తన జెండా నాటాడు.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పై సంఘటనల గురించి తెలుసుకొన్నారుకదా! వీటిపై మీ అభిప్రాయాలు చెప్పండి.
2. ఆత్మవిశ్వాసం అంటే మీకేమి అర్థమైంది? ఏఏ సందర్భాల్లో ఆత్మవిశ్వాసాన్ని కలిగిఉండాలి?
3. ఆత్మవిశ్వాసం లేకపోతే జరిగే పరిణామాలను గురించి చెప్పండి.
4. ఆత్మవిశ్వాసాన్ని ఎలా పెంపొందించుకోగలం?
5. "తనకు తాను సహాయం చేసుకునేవాడికే దేవుడు సాయమందిస్తా"డని తోటమాలి పిల్లలతో అన్నాడు కదా! అంటే అర్థం ఏమిటి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- వారంరోజుల్లో ఆత్మవిశ్వాసంతో మీరేమి పనులు చేశారు? దీనివల్ల ఏంజరిగిందో మీ అనుభవాలు చెప్పండి.

## VII. తెలుసుకోండి

### ఆత్మ విశ్వాసం

విజయం సాధించాలంటే ముందుగా ఆత్మవిశ్వాసం కావాలి. అనుకున్నంత సులభంగా దీన్ని సంపాదించలేము. ఎందుకంటే దీని కోసం పలు అంశాలను జయించాల్సి ఉంది. ఇది లేకపోవడాన్ని ఇన్‌ఫిరియార్టీ కాంప్లెక్స్ అని కూడా అంటారు. అసలేంటీ ఈ ఇన్‌పిరియార్టీ కాంప్లెక్స్ ఎందుకు వస్తుంది? కారణాలేమిటి? అధిగమించడానికి మార్గాలున్నాయా? తెలుసుకుందాం.

నేనేది సాధించలేను, నేను అందంగా లేను, నాకు ఏమీ తెలీదని ఇతరులను చూస్తే కలిగే భావనే ఇన్‌ఫిరియార్టీ కాంప్లెక్స్. అంటే ఆత్మవిశ్వాసం లోపించడం, ఏపనిలో దిగినా ఈ ఆత్మవిశ్వాసలోపం మిమ్మల్ని వెంటాడుడూ ఉంటుంది. దీనికి కారణం గతంలో ఏదో ఒక పనిలో మీరు విఫలం కావడమే. ఈ వైఫల్యమే మీ భవిష్యత్తులో కూడా జరుగుతుందనీ మీ మనస్సులో ఏర్పడే భయమే దీనికి కారణం. ముందుగా మిమ్మల్ని మీరు విశ్వసించండి అంటే మీరే ఏ పనైనా చేయగలరు. ఎవరికీ తీసిపోరని మనసుకు గట్టిగా చెప్పుకోండి. మిమ్మల్ని ఎవరైనా నొప్పించేవిధంగా ప్రవర్తిస్తే వారిని వెంటనే మన్నించండి. అలా చేయడంతో వారి తప్పు వారికే తెలుస్తుంది. అలాగే మీ పక్కవారిలో ఉన్న మంచి గుణాలు మీకు లేవని మీరు అనుకుంటే వాటిని సాధించడం కోసం ఏమిచేయాలో ఆలోచించండి. అంతేకానీ వారిపై ఈర్ష్యాద్వేషాలు పెంచుకోవద్దు. విజయం సాధించడానికి తొలి మెట్టుగా టేకిట్ ఈజీ విధానాన్ని అలవర్చుకోవాలి. అంటే మీకు కావలసిన విషయాలను మెదడులోకి ఎక్కించండి. అక్కరలేని విషయాలను అక్కడే వదిలేయండి. లేదంటే వాటి గురించి ఆలోచిస్తే మనసు పాడవుతుంది. అనవసర విషయాలను మనసులోకి ఎక్కించుకోకుండా

ప్రశాంతంగా ఉండగలిగితే అదే మీరు సాధించే తొలి విజయం అవుతుంది.

మీలో ఆత్మన్యూనతా భావం కలుగకుండా ఉండాలంటే మీరు ఎవరిపైనా ఆధారపడకూడదు. ఎందుకంటే అంతవరకు మీ వెంట ఉన్నవారు ఒక్కసారిగా వెళ్ళిపోతే మీరు ఒత్తిడికి గురై తేరుకోలేని ప్రమాదం వుంది. మీకు మీరు స్వతంత్రంగా వ్యవహరించడానికి అలవాటుపడండి. ఏపని చేసినా మీరు మీపై విశ్వాసాన్ని సాధించండి. మీకు తెలియని విషయాల కోసం ఇతరుల సాయం కోరవచ్చు. కానీ అదే అలవాటుగా చేసుకోకండి. అందుకోసం ముందుగా మీరు ఆ పనిలోకి దిగండి. మీకు నష్టాలు వస్తే మీ వెనుకుండే వారిని సలహాలు అడగండి. తప్పక విజయం మీదే అవుతుంది. ఎవరు ఉన్నా లేకపోయినా మనంతట మనం పనులు సాధించుకోగలిగే సత్తా ఉండాలి. అప్పుడే జీవితంలో విజయాలను సాధించగలం.

అందుకని సాధ్యమైనంత వరకు ఆధారపడటం మానేసి స్వతంత్రంగా వ్యవహరించడం నేర్చుకోవాలి. విజయాన్ని సాధించేందుకు వ్యక్తిగత సంసిద్ధత చాలా ముఖ్యం. నేర్చుకోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. ఏదైనా సంభ్రమాన్ని కలిగించే విజయం సాధించే వ్యక్తులతో మాట్లాడటం, వారు సాధించిన స్థానాన్ని ఎలా పొందారో తెలుసుకోవడం, వారు ఎన్నెన్ని కష్టాలు అనుభవించారో వాటిని తెలుసుకోవడం వంటివి చేయాలి. వారు చేసిన పొరపాట్లు, అనుభవించిన పరాభవాలు విజయ సాధనకు దోహదపడుతాయి. దీనితోపాటు విజయం సాధించేందుకు సాహసం అవసరం. సవాళ్ళను ఎదుర్కోవడం అధునాతన విధానాలను పాటించడం ద్వారా పాతపద్ధతులకు స్వస్తి చెప్పడం వంటివి చేస్తే కచ్చితంగా విజయానికి దగ్గరవుతారు. సాహసంతో కృషి కూడా తప్పకుండా ఉంటే విజయం మీకు చేరువైనట్లే !

## మీకు తెలుసా

గ్రద్దకు 70 ఏళ్ళపాటు జీవించే అవకాశం ఉంది. నైతిక ధైర్యంతో గ్రద్ద జీవించే విధానం చూస్తే మనకు చాలా ఆశ్చర్యం వేస్తుంది. గ్రద్దకు 40 ఏళ్ళ వయస్సు వచ్చేసరికి అనేక సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. అప్పుడు దానికి రెండే మార్గాలు. మరణించడం లేదా అత్యంత బాధాకరమైన మార్పును అనుసరించి 150 రోజులపాటు కఠోరశ్రమ చేయడం గ్రద్దకు 40 ఏళ్ళు వచ్చేసరికి ఈకింది సమస్యలు ప్రారంభమౌతాయి.

- పొడవుగా, వాడిగా, పదునుగా ఉండే ముక్కు నిరంతరం రాపిడివల్ల అరుగుదలవల్ల వంగిపోతుంది.
- పొడవుగా ఉండి, సులభంగా వంగి ఆహారాన్ని సులభంగా తన్నుకు తీసుకపోయేందుకు ఉపకరించే దాని కాలిగోళ్ళు బలహీనమై ఆహారాన్ని గుంజుకు తీసుకుపోయే సామర్థ్యాన్ని కోల్పోతాయి.
- వయస్సువల్ల దాని బరువైన రెక్కలు, దట్టమైన ఈకలు దాని గుండెకు అతుక్కొనిపోయి ఎగరడంలో కష్టం కలిగిస్తాయి.

గద్ద తన జీవితాన్ని మరొక 30 సంవత్సరాలు పొడిగించడానికి 150 రోజులపాటు బాధాకరమైన శరీర పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టాల్సి ఉంటుంది. అందుకు అది పర్వతాల మీదకు పోయి అక్కడ ఒక

గూడును నిర్మించుకుంటుంది. కొండరాతిపై తన ముక్కును ఢీ కొడుతూ దాన్ని రాల్చివేసి దాని స్థానంలో కొత్త ముక్కు పెరిగేవరకు వేచిఉంటుంది. కొత్తగా ముక్కు పెరిగాక ఆ ముక్కుతో తన కాలిగోళ్ళను పీకివేస్తుంది. కొత్తగా పెరిగే వరకు వేచిఉంటుంది. కొత్తగోళ్ళు పెరిగిన తర్వాత ఎంతో బాధకు ఓర్చి తన బరువైన రెక్కలను పీకివేసి కొత్త రెక్కలు ఎదిగేవరకు వేచిఉంటుంది. ఈవిధంగా బాధను ఓర్చుకుంటూ 5 నెలలపాటు అష్టకష్టాలు పడి ఒక నూతన జీవితాన్ని పొంది 30 సంవత్సరాలు జీవిస్తుంది.

**అన్వయం**

గ్రద్దలాగే మనమూ ఎన్నో క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటూ ఉంటాము. కొన్ని పరిస్థితులలో ఐతే సర్వస్వం కోల్పోతాము. అలాంటి పరిస్థితుల్లో వెనుకంజ వేస్తే మన ఉనికినే కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అందుకే ఎటువంటి పరిస్థితుల్లోనైనా నైతిక ధైర్యంతో పద్ధతుల్లో మార్పును అనుసరించాలి. ఎంత కఠినమైనాసరే, మన పద్ధతుల్లో మార్పును అవలంబించి, కష్టాలనుండి గట్టెక్కాలి.

**సూక్తి**

"తమపై తమకు విశ్వాసం ఉన్న కొందరి చరిత్రే ప్రపంచచరిత్ర. ఆ విశ్వాసం మనలోని దివ్యత్వాన్ని వెలికి తీస్తుంది. నీవు ఏదైన చేయగలవు; నీలోని అనంతమైన శక్తిని ఆవిష్కరించలేనప్పుడే ఓటమి పాలవుతావు".

– స్వామి వివేకానంద

ఆత్మ విశ్వాసంపై స్వామి వివేకానంద పల్కిన ధీరవాక్కులను చదవండి!

"నీవు ఏది తలచుకొంటావో అదే అవుతావు; నిన్ను నీవు బలహీనుడిగా భావిస్తే బలహీనుడివే అవుతావు; బలవంతుడను అనుకొంటే బలవంతుడవే అవుతావు. నీకు నీవు అపవిత్రుడను అనుకుంటే అపవిత్రుడవే అవుతావు ! పవిత్రుడవు అనుకొంటే పవిత్రుడవవుతావు. అవసరమైన పనికి తమ శక్తిని తెలివిని ఉపయోగించిన వారే రాణిస్తారు, గౌరవించబడతారు. ఆత్మవిశ్వాసంతో కృషిచేసే మనిషి అందుకోలేని శిఖరాలు ఉండవు.

ఇది మనలను బలహీనులుగా భావించుకోవద్దని, మనల్ని మనం బలవంతులుగా, సర్వ శక్తిమంతులుగా, సర్వజ్ఞులుగా భావించుకొమ్మనే పాఠాన్ని నేర్పుతుంది."

**సూక్తి**

అవసరమైన పనికి తమ శక్తిని తెలివిని ఉపయోగించినవారే రాణిస్తారు, గౌరవింపబడతారు. ఆత్మవిశ్వాసంతో కృషిచేసే మనిషి అందుకోలేని శిఖరాలు ఉండవు.

# 4 భావోద్వేగ నైపుణ్యాలు

**I. ప్రధాన విలువ**

జీవన నైపుణ్యాలు

**II. ఉప విలువ**

భావోద్వేగ నైపుణ్యాలు, ఒత్తిడిని అధిగమించడం, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించడం.

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- భావోద్వేగాలను నియంత్రించుకునే నైపుణ్యాలు పెంపొందించుకోగలగాలి.
- ఒత్తిడిని తట్టుకోగలగాలి.
- గెలుపు ఓటములను సమానంగా స్వీకరించగలగాలి.

## IV. ఉపోద్ఘాతం

ప్రస్తుత కాలంలో, ఈ పోటీ ప్రపంచంలో ప్రతిఒక్కరు ఒత్తిళ్ళకు లోనవుతున్నారు. ఈ ఒత్తిడి శారీరక సమస్యలకు దారితీస్తుంది. మానసిక ఒత్తిడిని కలుగజేస్తుంది. దీనివల్ల మానసిక ప్రశాంతత లోపించి మనిషి భావోద్వేగ నియంత్రణను కోల్పోతాడు. దీనివల్ల మానవ సంబంధాలు దెబ్బతింటాయి.

శక్తికి మించిన హోంవర్క్‌లు ఇవ్వటం, టార్గెట్లను నిర్దేశించడం, మరొకరితో పోల్చడం ద్వారా పిల్లలు ఒత్తిడికి గురవుతారు. ప్రణాళిక ఏర్పరచుకొని పని చేయకపోవడంవల్ల, చదవకపోవడంవల్ల పరీక్షలు దగ్గరకు వచ్చినపుడుకూడా ఒత్తిడికి లోనవుతారు. ఒత్తిడి మూలంగా సరిగా చదవలేకపోతారు, ఆలోచించలేకపోతారు, భావోద్వేగాలు (కోపం, ఆవేశం, విసుగు) ఎక్కువౌతాయి. అలాగే పోటీతత్వం వల్ల తమకు ఇతరులకన్నా మార్కులు తక్కువ వచ్చినా, ఆటలలో ఓటమి ఎదురైనా తట్టుకోలేకపోతున్నారు.

కనుక సరైన ప్రణాళికలు ఏర్పాటుచేసుకోవటం ద్వారా, పనిని వాయిదాలు వేయకుండా ఉండటం ద్వారా, అనవసర ఆలోచనలు చేయకుండటం ద్వారా ఈ ఒత్తిడిని భావోద్వేగాలు నియంత్రించుకోవచ్చని తెలియజేయాలి.

## V. విషయం

### సంఘటన - 1

విశాల్ ఒక ప్రైవేటు కంపెనీలో ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఆరోజు ఆఫీసులో తన ప్రాజెక్టు రిపోర్టు సబ్‌మిట్ చేయాల్సి ఉంది. దానిమీదనే అతని ప్రమోషన్ ఆధారపడి ఉంది. ఆ రిపోర్టు తయారుచేసుకున్నాడు. కానీ సరిగా ప్రజెంట్ చేయగలనా, ప్రమోషన్ వస్తుందా రాదా? అన్న ఒత్తిడిలో ఉన్నాడు.

ఆఫీసుకు రెడీఅయి టిఫెన్ చేయడం కోసం డైనింగ్ టేబుల్ మీద కూర్చున్నాడు. భార్య కూడా ఆఫీసుకు రెడీ అవుతోంది. తనే ప్లేటులో ఇడ్లీలు పెట్టుకున్నాడు. పచ్చట్లో ఉప్పు ఎక్కువయింది. ఈయనకు కోపమూ ఎక్కువయ్యింది. భార్యమీద కేకలు వేశాడు. సాంబారు వేయమన్నాడు. ఆమె ఆఫీసు తొందరలో వేయబోతే కొంచెం అతని చేతిమీద పడింది. ఇంక తన భావేద్వేగాలను కంట్రోల్ చేసుకోలేకపోయాడు. కోపంతో భార్యను తిట్టాడు. ఆమె పట్టించుకోలేదు. ఆమె నుంచి రియాక్షన్ లేకపోయేటప్పటికి ఈయన కోపం మరీ ఎక్కువయి అరవసాగాడు. ఆమెకు ఓపిక నశించి ఎదురుతిరిగింది. ఇద్దరూ పోట్లాడుకున్నారు. కోపంతో టిఫిన్ చేయకుండా ఆఫీసుకు బయలుదేరాడు.

ఇంకా కోపం, ఆవేశం తగ్గలేదు. దీని ప్రభావంగా అతడు విసుగుతో, పరధ్యానంగా స్కూటర్ నడుపుతూ అదుపుతప్పి మరొక స్కూటర్‌కి తగిలించాడు. అక్కడా చిన్న కొట్లాట జరిగింది. దానితో అతని మనసంతా చికాగ్గా తయారయింది.

ఆఫీసుకు చేరుకున్నాడు. కానీ ఈ భావోద్వేగాల ప్రభావం మాత్రం తగ్గలేదు. మనసంతా చిరాగ్గా ఉంది. అక్కడ తన పైఆఫీసర్ల ముందు తను అనుకున్నట్లుగా తన ప్రాజెక్టును ప్రదర్శించలేకపోయాడు. దాని ఫలితంగా అక్కడ అవమానాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. ప్రమోషన్ కూడా తన కొలీగ్ 'నిఖిల్' కు వచ్చింది. వస్తుందనుకున్న ప్రమోషన్ రాకపోవడంతో చాలా నిరాశ, నిస్పృహకు గురయ్యాడు.

### సంఘటన - 2

ప్రత్యూష 10వ తరగతి చదువుతోంది. చాలా తెలివిగల అమ్మాయి. ఎప్పుడూ తన పాఠశాలలో, తన తరగతిలో ఆ అమ్మాయే ఫస్ట్. ఈ అమ్మాయి తెలివిని చూసిన ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఈసారి 10వ తరగతిలో స్టేట్ ఫస్ట్ రావాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. దానికి తగ్గట్టుగా కోచింగ్ కూడా ఇచ్చారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు సహకరించారు. వారి అంచనాలకు అనుగుణంగానే తను కూడా బాగానే తయారయింది. కానీ పరీక్షలు దగ్గరకి రాగానే ఒత్తిడి, ఆందోళన మొదలయ్యాయి. నేను మంచి మార్కులతోనే పాసవుతాను కానీ ఉపాధ్యాయుల తల్లిదండ్రుల అంచనాలకు అనుగుణంగా స్టేట్ ఫస్ట్ రాగలవా! వారిని నిరాశపరుస్తానా అన్న ఆలోచనలతో ఒత్తిడి పెరిగిపోయింది. చదువుమీద మనస్సు నిలవటం లేదు. దానితో ఆందోళన ఎక్కువైంది.

## సంఘటన - 3

తుదిదాకా వచ్చిన విజయం చేజారిపోతే మన మానసికస్థితి ఎలా ఉంటుంది? అదీ సాధారణ విజయంకాదు, అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చే అసాధారణ విజయం. అదీ తృటిలో జారిపోయింది. అప్పుడెలా ఉంటుంది. ఇదే పరిస్థితి 'లగాన్' సినిమా కథానాయకుడు అమీర్‌ఖాన్‌కు ఎదురైంది. ఆస్కార్ అవార్డుకు నామినేట్ అయి 'లగాన్' కు వచ్చిన ప్రచారం అంతాఇంతా కాదు. అమీర్‌ఖాన్ భారతీయ చిత్రానికి ఆస్కార్ దక్కిందన్న ఖ్యాతికోసం శక్తివంచన లేకుండా శ్రమించాడు. చేయగలిగినంత కృషి చేశాడు. యావత్ భారతదేశం అమీర్ విజయం కోసం ఒళ్ళంతా కళ్ళుచేసుకొని ఎదురుచూసింది. కానీ అంచనాలు తలకిందులయ్యాయి. విదేశీ చిత్రాల విభాగంలో 'లగాన్' ఒక్క అవార్డుకూ నోచుకోలేదు. 'నోమ్యాన్స్ లాండ్స్'కు ఆ గౌరవం దక్కింది. రిక్తహస్తాలతో అమీర్‌ఖాన్ స్వదేశానికి తిరిగి రావాల్సి వచ్చింది. దీనిపై అమీర్‌ఖాన్ స్పందన ఏమిటి? 'పర్వాలేదు' - లగాన్‌కు వస్తుందనుకున్న అవార్డు మరో మంచి చిత్రానికి వచ్చింది' అని వ్యాఖ్యానించారు అంతేతప్ప అమీర్ దీనిని అపజయంగా స్వీకరించలేదు, కృంగిపోలేదు.

## సంఘటన - 4

అలెగ్జాండర్ గ్రాహంబెల్ తన చెవిటి భార్యకు వినికిడికి సహాయపడే పరికరం కనిపెట్టేందుకు ఎన్నో ఏళ్ళు అహోరాత్రులు కష్టపడ్డాడు. అలాంటి పరికరం కనిపెట్టడంలో ఆయన వైఫల్యం చెందాడు కానీ సుదూర తీరాలకు మాటలను మోసుకువెళ్ళే టెలిఫోన్ కనిపెట్టగలిగాడు.

స్కూల్‌లో చదువుకునేందుకు పనికిరాడని బయటకు గెంటివేసిన ఎడిసన్ 'బల్బును కనిపెట్టి ప్రపంచాన్ని తేజోవంతం చేశాడు.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. మొదటి సంఘటనలో విశాల్ తన ప్రాజెక్టును సరిగా వివరించలేకపోవడానికి గల కారణాలేవి?
2. విశాల్ ప్రవర్తన సరైనదేనా? అతను ఎలా ప్రవర్తించి ఉండవలసినది?
3. రెండవ సంఘటనలో ప్రత్యూష ఒత్తిడికి గురవడానికి గల కారణమేమి? ఇలా మీరెపుడైనా ఒత్తిడికి గురయినారా? ఎప్పుడు?
4. 3వ, 4వ సంఘటనల ద్వారా మీరు ఏమి గ్రహించారు?
5. మీకు ఎప్పుడైనా ఓటమి ఎదురైందా? అప్పుడు మీకు ఎలా అనిపించింది?

**(ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి**

- మనసును ప్రశాంతంగా ఉంచుకోండి. మీ ఇంట్లోవారిమీద, మీ స్నేహితులమీద కోపం, విసుగు ప్రదర్శించండి, వాయిదాలు వేయకుండా ఎప్పటి పనిని అప్పుడే చేయండి. మీ అనుభవాలు చెప్పండి.

**VII. తెలుసుకోండి**

## భావోద్వేగ నైపుణ్యాలు

ఒక శుభవార్త తెలియగానే ఆనందం, ఆలోచనలు భవిష్యత్తు వైపు సాగినపుడు తెలీని ఆందోళన, మనసు గాయపడిన క్షణం ఆక్రోశం ఇలా ప్రతి భావోద్వేగమూ మనసులో సిద్ధంగా ఉంటుంది. మనకు ఎదురయ్యే అనుభవాలకు తగ్గ భావోద్వేగాలు మనసులో ఏర్పడి కాసేపు మనను ఉక్కిరిబిక్కిరి చేసి తరువాత సర్దుకుంటాయి. మంచిదైనా చెడ్డదైనా ఓ సంఘటన జరిగినవెంటనే మదిలో వేగంగా జరిగే సంఘర్షణకు సంబంధించిన వ్యక్తీకరణలే ఈ భావోద్వేగాలు. భావోద్వేగమంటే మనసులో కలిగే భావనలు వాటికి తోడుగా వచ్చిన ఆలోచనలు, ఫలితంగా కలిగిన శారీరక, మానసిక స్థితి, ప్రవర్తనలో సంభవించే మార్పులు మొదలైన వాటి సమాహారం. ఆనందం, కోపం, అసహ్యం, బాధ, ప్రేమ, సిగ్గు, భయం, ఆశ్చర్యం, అనురాగం ఇవి కలిగినప్పుడు గుర్తించగలగడం, సరైన రీతిలో వ్యక్తీకరించడం, అదుపు చేసుకోగలగడమే భావోద్వేగ మేధశక్తి. భావోద్వేగాల మర్మాన్ని గ్రహిస్తే అవి మనపై స్వారీ చేసేముందే వాటి తీవ్రతను కట్టడిచేసుకోగల భావోద్వేగ మేధాశక్తి అలవడుతుంది. ఏ ఆనందానికైనా, ఆవేశానికైనా, విచారానికైనా కల్లోలితం అయ్యే ఆలోచనా ప్రవాహమే మూలం. వాటిని వీలైనంత వేగంగా స్థిరత్వంవైపు మళ్ళిస్తే ఆ భావోద్వేగపు గాఢత క్షీణించిపోతుంది.

తన భావోద్వేగాలను నియంత్రించుకోగలిగిన వ్యక్తి ఇతరుల భావోద్వేగాలను కూడా అర్థంచేసుకోగలడు. ఇతరుల భావోద్వేగాలను అర్థంచేసుకుంటూ వారిని సంతోషపరచగలిగినపుడు సమాజాన్ని ముందుకు నడిపించగల సామర్థ్యం ఏర్పడుతుంది. మానవసంబంధాలపై కూడా పట్టు సాధిస్తాడు. అంటే భావోద్వేగ మేధాశక్తి కలిగిన వ్యక్తి స్వయంగా తాను తృప్తిగా, సంతోషంగా ఉంటూ ఇతరులను కూడా సంతృప్తిపరచగలగి సమాజంలో హాయిగా జీవించగలుగుతాడు. భావోద్వేగ నైపుణ్యాలు గలిగిన వ్యక్తి ఒత్తిడిని కూడ తట్టుకోగలడు.

### ఒత్తిడిని అధిగమించడం

ఉదయం లేచినప్పటినుండి రాత్రి పడుకునేవరకు మనిషి సాగించే ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు. మారుతున్న కాలానికి అనుకూలంగా మనిషి అన్ని విషయాల్లో వేగం పెంచాడు. కానీ ఈ బిజీలైఫ్‌లో ఒత్తిళ్ళతో సతమతమవుతుఆన్నడు. ఈ ఒత్తిడే మనిషిపాలిట శాపంగా మారుతోంది. తాజా సర్వేలు దాదాపు

70% ఆరోగ్య సమస్యలు కేవలం ఒత్తిడివల్లే వస్తున్నాయని తేల్చాయి. ఒత్తిడి మన శరీరంపైన అంతటా ప్రభావం చూపించి, అనేక ఆరోగ్య సమస్యలకు కారణమౌతుంది. ఒత్తిడివల్ల కోపం, బాధలాంటి నెగటివ్ ఎమోషన్స్ పెరిగి యాంగ్జయిటీ, డిప్రెషన్‌లకు దారితీస్తాయి. కనుక ప్రతిఒక్కరు ఒత్తిడిని అధిగమించే నైపుణ్యాలను పెంపొందించుకోగలగాలి.

అసలు ఒత్తిడి అంటే ఏమి? అది ఎలా కలుగుతుందో తెలుసుకుందాం. ఒకవ్యక్తి ఆశించిన దానికీ నిజంగా జరిగేదానికీ లేదా జరగబోతున్నదానికీ మధ్య ఉండే తేడానే ఒత్తిడి. మనం కోరుకున్న అంశం ఎంతగా అనివార్యమైతే ఒత్తిడిఅంతా తీవ్రంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో మనం కోరుకునే దానికంటే అందుబాటులో ఉండే వనరులే తక్కువ కాబట్టి ప్రతివారి జీవితంలోనూ ఒత్తిడి తప్పదు.

ఒత్తిడికి గురయ్యే వ్యక్తి యొక్క మానసిక పరిణతి, వ్యక్తిత్వాన్నిబట్టీ ఫలితం ఉంటుంది. ఇద్దరు వ్యక్తులు ఒకేరకపు ఒత్తిడికి గురిఅయినపుడు ఒకరు దాన్ని అసలు ఒత్తిడికింద పరిగణించకపోగా, రెండోవ్యక్తి ప్రాణాల మీదకు తెచ్చుకునేంతగా స్పందించవచ్చు. ఒత్తిడికి స్పందించే తీరు వారి సర్దుబాటుతత్వం, సమస్యను ఎదుర్కొనే సామర్థ్యంమీద ఆధారపడి ఉంటుంది.

పిల్లలు మోతాదుకు మించి ఎక్కువ ఒత్తిడికి గురిఅయినపుడు మనసుకు నిలకడ కుదరదు. ఏపనిమీద ధ్యాస పెట్టలేరు. నేర్చుకోవడం మందగిస్తుంది. నేర్చుకున్న విషయాలు సరిగా గుర్తుకురావు. మతిమరుపు ఎక్కువ అవుతుంది. చిన్నచిన్న విషయాలకు తికమక పడతారు. ప్రతికూల ఆలోచనలు ఎక్కువగా వస్తుంటాయి. వారిమీద వారికి నమ్మకం పోతుంది. ఆలోచనల్లో స్పష్టత లేకపోవడంవల్ల నిర్ణయాలు సరిగా తీసుకోలేరు. చదువులమీద, ఆటలమీద ఆసక్తి కోల్పోతారు. ఎవరితో కలవడానికి ఇష్టపడరు. తల్లిదండ్రులతో ముభావంగా ఉంటారు. ఇంటినుండి పారిపోవడం, ఆత్మహత్యా ప్రయత్నం లాంటి చర్యలకు పాల్పడతారు.

ప్రస్తుత కాలంలో ఒత్తిడి ఏర్పడటానికి గల ప్రధాన కారణాలు

1. పోటీప్రపంచం (పోటీతత్వం)
2. వైఫల్య భయం
3. సమయాభావం
4. ప్రతికూలధోరణి
5. భవిష్యత్తు గురించిన భయం
6. ఆత్మవిశ్వాసలేమి
7. శక్తిసామర్థ్యాలకు మించిన ఆశలు, పని మొ॥వి
8. యాంత్రికజీవనం
9. వ్యాయామలేమి

ఒత్తిడిని కంట్రోల్ చేసుకోవాలంటే ముందుగా పాజిటివ్ దృక్పథాన్ని అలవరచుకోవాలి. సమస్యని భూతద్దంలో చూడకూడదు. అన్ని కోణాలనుంచీ సమస్యని విశ్లేషిస్తే ఎలా పరిష్కరించుకోవాలో అర్థం అవుతుంది. దాన్నిబట్టి సమస్య నుంచి తద్వారా ఒత్తిడినుంచి త్వరగా బయటపడగలం. ఏదైనా పనిని నిర్వహించాలంటే ఒక ప్రణాళికను ఏర్పరచుకొని సమయానుసారంగా చేస్తూపోవటం వల్ల ఒత్తిడిని నివారించగలం. యోగా, ప్రాణాయామం ఒత్తిడిని తగ్గించటంలో మంచి ఫలితాలనిస్తాయి. అన్నింటికన్నా ముఖ్యంగా ఆరోగ్యకరమైన ఆహారం, మంచి అలవాట్లు పెంచుకోవడం అవసరం. మానసికోల్లాసాన్ని కలిగించే అభిరుచులను పదునుపెట్టడం ద్వారా ఒత్తిడి నుంచి బయటపడవచ్చు. సృజనాత్మకత ఉన్న ఏ పని అయినా ఒత్తిడి నుంచి బయటపడేయడానికి సహకరిస్తుంది.

## గెలుపు ఓటములను సమానంగా స్వీకరించడం

ఏ కార్యం తలపెట్టినా దానిలో గెలుపు ఓటములు రెండూ ఉంటాయి. తలపెట్టిన ప్రతి కార్యంలోనూ విజయం సిద్ధించదు. ఓటమి విజయానికి మెట్టు కనుక విజయం వస్తే పొంగిపోకూడదు. ఓటమి కలిగితే కృంగిపోకూడదు.

ఓటమి ఎదురవ్వనిది ఎవరికి? బిల్‌గేట్స్ నుంచి సచిన్ టెండూల్కర్ వరకు ఓటమిని చవిచూడని వారెవరు? మీరు విఫలం చెందుతున్నారంటే విజయం కోసం ప్రయత్నిస్తున్నారన్నమాట. మనిషి చేయవలసింది ఆ ప్రయత్నమే. వైఫల్యాలు సహజం – ఒకసారో రెండుసార్లో ఆఖరికి పదిసార్లో విఫలం చెందినా పర్వాలేదు. ప్రయత్నాన్ని విరమించకుండా కొనసాగిస్తే చాలు విజయం సిద్ధించకపోదు. వైఫల్యం ప్రకృతినియమం. వైఫల్యాలే లేకపోతే విజయాలు ఎలాఉంటాయి? దారి మధ్యలో కొన్ని వైఫల్యాలు ఉంటాయి. ఎదురుదెబ్బలకు పరాజయాలకు పలాయనం చిత్తగించకుండా ధీరోదాత్తంగా ఎదుర్కోవడంలోనే మన గొప్పతనమంతా ఆధారపడి ఉంటుంది. కనుక వీటిని ఎదుర్కొని గెల్చిన వ్యక్తిని విజయ సాధకుడు లేదా విజేత అంటాం. దుఃఖం ఉన్నప్పుడే సుఖం ఉంటుంది. దుఃఖించినవాడికే సుఖం విలువ తెలుస్తుంది. వైఫల్యం ఎదుర్కొన్న వ్యక్తి విజయం తాలూకు ప్రాధాన్యాన్ని విలవనూ గుర్తించగలుగుతాడు. వైఫల్యాలు సహజమైనవి. ఫెయిల్ అవగానే నిరుత్సాహపడకూడదు.

విజయసౌధానికి దారితీసే సోపానాల్లో అపజయాన్ని ఒప్పుకోవడం ఒకటి, పరాజయాన్ని అంగీకరించడం అంటే వెనక్కి తగ్గడమేగా అనిపించవచ్చు కానీ అది విజయశిఖరానికి సేతువు నిర్మిస్తుంది. అపజయం తటస్థించడం తప్పుకాదు అపజయాన్ని అంగీకరిస్తే మనసు తేలికపడుతుంది. మరోప్రయత్నంలో విజయం సాధించాలన్న పట్టుదల పెరుగుతుంది. లేకుంటే మనలో అన్నింటిమీదా కోపం పెరుగుతుంది. డిప్రెషన్ ఆవరిస్తుంది. వ్యతిరేక భావనలు అంకురిస్తాయి. దీనితో భవిష్యత్తు అంతరించిపోతుంది, కనుక గెలుపోటములను సమానంగా స్వీకరించాలి.

## నేను పాటిస్తాను

1. నేను చెడు ఆకర్షణలకు లోనుకాను.
2. ఇక నుంచి సోమరితనం వదిలేస్తాను.
3. నా అభివృద్ధికి ఉపయోగపడే గొప్ప కోరికలనే కోరుకుంటాను.
4. నేను ధూమపానం, మద్యపానం త్రాగను త్రాగేవారిని మాన్పిస్తాను.
5. నేను అవినీతికి వ్యతిరేకంగా పోరాడతాను. ఎన్నికల సమయంలో అమ్మానాన్న, బంధువులు ఎవరూ అవినీతికి పాల్పడకుండా చర్యలు తీసుకుంటూ నిజాయితీగా ఓటు వేయిస్తాను.
6. అమ్మకు, నాన్నకు, బంధువులకు చదవటం, రాయటం నేర్పిస్తాను.
7. కుల, మత, భాష, ప్రాంత విభేదాలను పాటించను. మనమంతా భారతీయులం అనే భావనతో జీవిస్తాను.

### సూక్తి

నీ ఆలోచనలను మార్చుకో ప్రపంచమే మారిపోతుంది అన్నాడు నార్మన్ విన్సంట్ పీలే. ఖచ్చితంగా ఆలోచనలే విజయంవైపు నడిపిస్తాయి. లేదా అధఃపాతాళానికి తోసేస్తాయి. అనుకూల ఆలోచనలు పుష్కల విజయాలు తెచ్చిపెడతాయి. ప్రతికూల ఆలోచనలు జీవితకాలం వెనక్కినెడతాయి.

ఆలోచనలే విజయాలకు మూలం. సరికొత్త ఆలోచనలు నూతన విజయాలకు నాంది పలుకుతాయి. ఏ కార్యాన్నయినా సరికొత్త పంథాలో ఆలోచించి నిర్వర్తించడం వల్ల విజయావకాశాలు మెరుగుపడతాయి.

గొప్ప లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నించి విఫలమవటం నేరం కాదు. గొప్ప లక్ష్యం లేకపోవడమే నేరం

– లోవెల్

# 5 మన వారసత్వ సంపద

**I. ప్రధాన విలువ**

బాధ్యతలు నిర్వర్తించడం, కర్తవ్యపాలన

**II. ఉప విలువ**

దేశ వారసత్వ సంపదను కాపాడుకోవడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- మన దేశంలో తరతరాలనుండి వారసత్వంగా వస్తున్న సంపదను పరిరక్షించుకోవడంలో మన బాధ్యతలను తెలుసుకోవడం.

**IV. ఉపోద్ఘాతం**

మన దేశము విభిన్న మతాలు, సంస్కృతులు, భాషలతో ఉన్నప్పటికినీ ఏకత్వాన్ని కల్గియున్నది. మన దేశం యొక్క గొప్పతనాన్ని తెలిపే సంస్కృతీ సంప్రదాయాలు, కళలు, వస్తువులు, కట్టడాలు మొదలగు వాటిని కాపాడడం మనందరి బాధ్యత. ఇందుకోసం వాటి ఆవశ్యకతను మన బాధ్యతలను గురించి తెలుసుకుందాం.

## V. విషయం

### ప్రతిజ్ఞ

భారతదేశం మా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. **సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.**

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను. జంతువులపట్ల దయతో ఉంటాను.

నాదేశం పట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను వారి శ్రేయోభివృద్ధిలే నా ఆనందానికి మూలం.

### సంఘటన

10వ తరగతి విద్యార్థులందరూ విహారయాత్రలో భాగంగా తమ ఉపాధ్యాయులతో కలిసి మహారాష్ట్ర లోని అజంతా, ఎల్లోరా గుహలను చూడటానికి వెళ్ళారు. అక్కడి విశేషాల గురించి గైడు వివరిస్తుంటే పిల్లలందరూ ఆశ్చర్యంతో, కుతూహలంగా వింటున్నారు. అజంతా గుహల్లో చిత్రించిన చిత్రాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయి. ఆనాటి కాలంలోనే ఎటువంటి రసాయనిక రంగులని ఉపయోగించకుండా ప్రకృతి సిద్ధమైన రంగులతో, వివిధ రంగుల మేళవింపుతో చిత్రాలు చిత్రించబడ్డాయి. అవి చిత్రకారుల యొక్క ప్రతిభను చాటుతున్నాయి. అలాగే ఎల్లోరా గుహల్లోని శిల్పాలు కూడా అద్భుతంగా ఉన్నాయి. అక్కడక్కడ కొన్ని పగులగొట్టబడి ఉన్నాయి. కానీ ఆయా శిల్పాలు శిల్పి యొక్క ప్రతిభకు అద్దం పట్టేలా ఉన్నాయి. వీటిని చూస్తుంటే మన పూర్వీకులకు ఎంతటి శక్తి సామర్థ్యాలుండేవో కదా! ఇంతటి అద్భుత కళాఖండాల సృష్టికి కారకులయ్యారు అనిపించకమానదు. పిల్లలందరూ ఈ అద్భుతాలను ఆస్వాదిస్తున్నారు. అంతలో ఒక పిల్లవాడు సూదంటురాయి తీసుకొని అక్కడి గోడలపై తనపేరు రాయడానికి ప్రయత్నించాడు. ఉపాధ్యాయుడు ఏమి చేస్తున్నావు? అని అడిగితే ఇక్కడికి నేను వచ్చినాను అన్నందుకు గుర్తుగా నాపేరు రాస్తున్నాను అన్నాడు. అప్పుడు ఉపాధ్యాయుడు అలా చేయటం తప్పు, అలా చేయటం వలన ఇక్కడి శిల్పకళా సౌందర్యం నాశనమవుతుంది. ఈ కట్టడాలు, శిల్పాలు, చిత్రాలు ఇవన్నీ మన వారసత్వ సంపదలు వీటి ద్వారా మన దేశ గొప్పదనం చాటబడుతుంది. కనుక వీటిని సంరక్షించు కోవడం మనబాధ్యత అని చెప్పాడు.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. మీరు ప్రతిరోజు చేస్తున్న "ప్రతిజ్ఞలో నాదేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషిచేస్తాను" అనిచెప్పారు కదా! దీనికి అర్థం ఏంటి? ఇలా చేయాలంటే మీరేం చేయాలి?
2. మన పూర్వీకులనుండి తరతరాలుగా వస్తున్న మన సంస్కృతికి ప్రతిరూపాలైన సంపదలను మనం ఎందుకు కాపాడుకోవాలి?
3. దేశ వారసత్వ సంపదను కాపాడుకోవడానికి మీరైతే ఏం చేస్తారు? అలా కాపాడే ప్రయత్నం చేయడంవల్ల మీరు పొందే అనుభూతుల్ని రాయండి.
4. మన వారసత్వ సంపదల యొక్క లిస్ట్‌ను తయారు చేయండి?
5. వారసత్వ సంపదను గురించి తెలుసుకున్నారుకదా! వీటిని తర్వాత తరాలకు అందించాలంటే వాటిని పరిరక్షించడానికి మనం ఏఏ బాధ్యతలను నిర్వర్తించాలి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ ప్రాంతంలో వారసత్వంగా లభించే సంపదల వివరాలను రాయండి. అవి ఇప్పుడు ఎలాఉన్నాయి? వాటిని ఎలా కాపాడుకోవాలో రాయండి.

| మీ ప్రాంతంలో లభించే సంపదలు | వాటి పరిస్థితి ఇప్పుడు ఎలా ఉంది? | కాపాడటానికి చేపట్టే చర్యలు |
|---|---|---|
| 1 | | |
| 2 | | |
| 3 | | |
| 4 | | |

- వార్తాపత్రికలలో, దినపత్రికలలో లేదా అంతర్జాలం (Internet) నుండి మనదేశ వారసత్వ సంపదలైన చారిత్రాత్మక కట్టడాలు, దేవాలయాలు మొ॥ వాటికి సంబంధించిన చిత్రాలు, వివరాలను సేకరించండి. మీ పాఠశాలలో ప్రదర్శించండి.

## VII. తెలుసుకోండి

# దేశ వారసత్వ సంపదను కాపాడుకోవడం

మనదేశం భిన్నత్వంలో ఏకత్వం కల్గియున్నది. మన దేశంలోని సంస్కృతీ సాంప్రదాయాలు, కళలు, వస్తువులు, కట్టడాలు మొ॥గు వాటిద్వారా మన దేశ ఔన్నత్యం కనిపిస్తుంది. దేవాలయాలు, కట్టడాలు మనదేశం ఆరోప్రాణంగా ఉన్నవి. ఇలాంటి దేవాలయాలను, కట్టడాలను ధ్వంసం చేశారు. పూర్వం దురాక్రమణల్లో దాడులలో దేవాలయాలు, కట్టడాల ధ్వంసంకాబడ్డాయి. ఆంగ్లేయుల కాలంలో వారి తరహాలో వారు, మత మార్పిడులు, ఆలయ విధ్వంసాలు సాగించారు.

స్వతంత్రం వచ్చిన తర్వాత కూడా వీటి స్థితి ఇలాగే కొనసాగుతూ ఉంది. నేటి పాలకులు మతాతీతమంటూ, సెక్యులరిజమంటూ ఈ పంచప్రాణాల ఘోష పట్టించుకోకుండా దేశమాత గుండెమంటల్ని మరింత రగిలిస్తున్నారు. గుడిలో బాంబులు, అక్షర ధామ్‌నుండి హైదరాబాద్ బాబామందిరం వరకు బాంబులు ప్రతిధ్వనించాయి. వీటిద్వారా  మంచి మంచి దేవాలయాలు, ఎంతో కళానైపుణ్యంతో నిర్మించిన కట్టడాలు నాశనం అయ్యాయి.

నాడు మన సంస్కృతిలో కుటుంబ సంబంధాలు కేవలం డబ్బుతోకాక ధర్మంతో నడిచాయి. ఉమ్మడి కుటుంబంలో అందరు కలిసిమెలిసి అనుబంధాలు పంచుకొని సంస్కారాలు పెంచుకునేవారు. ఒక వ్యక్తి తన కుటుంబం కోసం స్వసుఖాలను, తన గ్రామంకోసం కుటుంబాన్ని, తనదేశం కోసం గ్రామాన్ని త్యాగంచేసేవాడని శాస్త్రాలు చెప్తున్నాయి. తనకంటే పెద్దవారిని వరుసపెట్టి పిలవడం, చిన్నవారిని పేరుపెట్టి పిలవడం, ఆ కుటుంబ వాతావరణంలో అలవాటయ్యేది.

నేటి తరం మన సంస్కృతికి దూరమౌతుంది. మరోవైపు సంస్కృతీ విలువ నాశనమౌతున్నాయి. వినోదం పేరుతో వస్తున్న సినిమాలు, కుటుంబ వ్యవస్థను, సామాజిక విలువలను నాశనం చేసేవిధంగా ఉంటున్నాయి

ఇన్ని జరుగుతున్నా మనం వింటున్నాం, చూస్తున్నాం కాని ఇది తప్పు అని గట్టిగా చెప్పి వాదించడం లేదు. మార్చలేకపోతున్నాం, పట్టించుకోవడం లేదు. ఇవన్నీ సాధారణమే అన్నట్లు ఉంటున్నాం. మనకే దేశంపట్ల, ఈ దేశ సంస్కృతిపట్ల బాధ్యత ఉంది. వారసత్వ బంధం ఉంది. జరుగుతున్న అన్యాయంపట్ల స్పందించకపోతే, ఈ వికృత ధోరణులనరికట్టే ప్రయత్నం చేయక ఎవరికివారు నాకెందుకని ఊర్కుంటే, మన చరిత్రను, సంస్కృతిని నాగరికతను విమర్శించేవాళ్ళ నోళ్ళు మూయించకుంటే చరిత్ర ఉనికిని కోల్పోయే దుస్థితి తప్పదు.

కాబట్టి మనదేశ సంపదను అంటే మనదేశానికి సంబంధించిన స్ఫూర్తిప్రదాతలు, కట్టడాలు, గొప్పచరిత్రకారులు సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, భాషలు, చిత్రకళ, శిల్పకళ, సంగీతము,

నృత్యము, ప్రాచీన కట్టడాలు, మసీదులు, దేవాలయాలు, చట్టాలు, సాహిత్యం, తాళపత్రగ్రంథాలు, నాణాలు, మొ॥వాటిని కాపాడుకోవాలి. వీటిద్వారానే మనదేశచరిత్రను, గొప్పతనాన్ని, విశేషాలను తెలుసుకోవడం సాధ్యమవుతుంది. వీటిని ప్రతి తరంవారు కాపాడడం వారి బాధ్యత. మనదేశంలో వారసత్వంగా లభించే సంపదను కాపాడుకున్నప్పుడే మనకు కూడా పేరుప్రఖ్యాతులు, గుర్తింపు, గౌరవం లభిస్తాయి. వాటిని కాపాడుకొని పదిమందికి వీటి గురించి తెలియజేసినపుడే భారతదేశ వారసత్వ గౌరవాన్ని పొందడానికి మనం అర్హులమవుతాము.

తాజ్‌మహల్ వంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కట్టడము, రామేశ్వరం, కాళహస్తి, మధురై, తిరువనంతపురంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన దేవాలయాలు, శిల్పకళలతో కూడిన దేవాలయాలు, సారనాథ్, అమరావతిలోని స్థూపాలు, అజంతా, ఎల్లోరా, ఖజురాహోలోని శిల్పచిత్రకళలు, కోణార్క్‌లోని శిల్పకళ, వేదాలు, భారతం, రామాయణం, భగవద్గీత వంటి ప్రాచీన సాహిత్యం ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కళాకారులతో మనదేశం గొప్పగా ప్రపంచంలో గుర్తించబడుతున్నది. కుటుంబ విలువలు, మానవ సంబంధాలతో భారతీయ సంస్కృతి ప్రపంచంలో ప్రత్యేకంగా గుర్తించబడింది. ఇలాంటి మనదేశ వారసత్వ సంపదను కాపాడడంతోపాటు వాటిని గౌరవించడం, వాటిని ఆచరించి అమలుపరచడం మన బాధ్యత.

"ఏదేశమేగినా, ఎందుకాలిడినా, ఏ పీఠమెక్కినా, ఎవ్వరెదురైనా పొగడరా నీతల్లి భూమి భారతిని నిలుపరా నీ జాతి నిండు గౌరవము అని గేయంలో చెప్పినట్లు మనదేశ ఔన్నత్యాన్ని, మనదేశ సంస్కృతిని ప్రతిబింబించేట్లు మనమాటలు, చేతలు ఉండాలి.

మనకంటే ముందుతరాలవారు అంటే మన పూర్వులు మనకిచ్చిన సంపద అంతా వారసత్వ సంపద. దీనిని మన తర్వాతి తరాలవారికి అందించాల్సిన బాధ్యత మనది. అది ప్రజలందరి ఉమ్మడి ఆస్తి. దాన్ని పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత. మన వ్యక్తిగత ఆస్తులపట్ల ఎంత శ్రద్ధ చూపిస్తామో, జాతీయ ఆస్తులు/ఉమ్మడి ఆస్తులను కాపాడుకునేందుకు అంతే శ్రద్ధ చూపడం అవసరం.

**సూక్తి**

**"జీవితంలో ప్రతిక్షణం అమూల్యమైనది, ఏదైనా కోల్పోవడానికి క్షణం పట్టదు. కానీ దానిని తిరిగి సాధించాలంటే ఒక దశాబ్దమైనా చాలకపోవచ్చు"**

# 6 ఆడంబరాలు

**I. ప్రధాన విలువ**

**పొదుపు - ఆవశ్యకత**

**II. ఉప విలువ**

**ఆడంబరాలకు వస్తువ్యామోహానికి దూరంగా ఉండటం**

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- ఆడంబరాలకు, విలాసాలకు దూరంగా ఉంటారు. పరిమితులు తెలుసుకుంటారు. గొప్పలకుపోయి ఇతరులతో పోటీపడి పెళ్ళిళ్ళకు, పుట్టినరోజు పార్టీలకు మనకు లేకున్నా అప్పుచేసి ఎక్కువడబ్బును వృధాచేయకూడదని తెలుసుకో గలగాలి.
- వస్తువులను అవసరాలకు వినియోగించడం, వ్యామోహాలకు పోయి అధికంగా వినియోగించడం మధ్య తేడాలను గమనించగలరు.

## IV. ఉపోద్ఘాతం

మన తాహతును మరచిపోయి, ఇతరులతో పోటీపడి, ఇతరుల మెప్పు పొందాలని అవసరమైనదానికన్నా ఎక్కువ మోతాదులో ఖర్చుపెట్టడమే ఆడంబరం. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు ఎవడో డబ్బున్నవాడు గొప్పగా పెళ్ళిచేశాడని మనం కూడా అప్పుచేసి అదేవిధంగా పెళ్ళిచేయాలనుకోరాదు. చివరికి మనకు అప్పే మిగులుతుంది. అలాగే మనకు సరిపడా వస్తువులు (బట్టలు, నగలు, చెప్పులు, సెల్‌ఫోన్స్ మొ॥వి) ఉన్నా అవసరానికి మించి ఇంకా కావాలనుకోవడం వస్తువ్యామోహం. ఈ ఆడంబరాలవల్ల, వస్తువ్యామోహం వల్ల ఒనగూరే ప్రయోజనాలకన్నా సంభవించే నష్టాలే ఎక్కువ. ఆడంబరాలతో అనేక వస్తువులను, డబ్బును, కాలాన్ని ఇలా చాలా రకాలుగా వృథా చేస్తున్నాం. ఇది సరియైన విధానం కాదు. ఉన్నదాంట్లో పొదుపు చేసుకుంటూ సుఖంగా, సంతృప్తిగా జీవించాలి.

## V. విషయం

### సంఘటన - 1

రూపేష్ వాళ్ళ ఇల్లంతా సందడిగా ఉంది. ఎందుకంటే వాళ్ళ అక్కయ్య పెళ్ళిగురించి అందరూ కలిసి ఎంత ఘనంగా చేయాలో ఎలా చేయాలో చర్చించుకుంటున్నారు. రూపేష్ కూడా తనకు కావలసిన బట్టలు పెండ్లినాడు కాల్చాల్సిన టపాకులు అని తన లిస్ట్‌కూడా చెప్పాడు. పెళ్ళిరోజు రానేవచ్చింది. పెళ్ళి జరిగే ఇల్లు ఉన్న వీధంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు. పెళ్ళిమంటపం కూడా రకరకాల విద్యుత్ దీపాలతో, పూలతో అలంకరించారు. అందరి చెవులు చిల్లులుపడేలా డిజిటల్ సౌండ్‌ను, రకరకాల బ్యాండ్‌మేళాలను ఏర్పాటుచేశారు. రూపేష్ ఆనందంగా లక్షల విలువచేసే టపాసులను పేల్చాడు. పెళ్ళి మంటపమంతా సందడిగా ఉంది. పెండ్లి భోజనానికి ఇరవై ముప్పై రకాల వంటకాలు స్వీట్స్, చాట్స్, టిఫిన్స్ మొ॥వి తయారుచేశారు. తినేవారు తింటున్నారు పారవేసేవారు పారవేస్తున్నారు. రూపేష్ కూడా భోజనం చేశాడు. ఏదో పని ఉండి పెళ్ళిమంటపం బయటికి వచ్చాడు. అక్కడ కనిపించిన దృశ్యాన్ని చూసి చలించి పోయాడు. అక్కడ నలుగురైదుగురు పిల్లలు పెళ్ళిలో తిని పారేసిన ప్లేట్లలో మిగిలిన ఆహారపదార్థాల కోసం పోటీపడుతున్నారు.

ఈ పిల్లలు కనీసం తినటానికి తిండి లేక, కట్టడానికి బట్టలేక అవస్థ పడుతుంటే మనం ఎంత డబ్బుని, ఆహారాన్ని వృథాచేస్తున్నాం అనిపించింది. రూపేష్‌కు వెంటనే వారిని పిలిచి కడుపునిండా భోజనం పెట్టాడు. ఇలాంటి వృథాను అరికట్టడానికి తనవంతు కృషి చేయాలనుకున్నాడు.

### సంఘటన - 2

రాజేష్, వాసు ఇద్దరూ మంచి స్నేహితులు రాజేష్‌వాళ్ళు ధనవంతులు, వాసుది మధ్యతరగతి కుటుంబం. రాజేష్ తన ప్రతి పుట్టినరోజుని హెూటల్‌లో ఘనంగా జరుపుకుంటాడు. తన స్నేహితులని బంధువులని అందరినీ పార్టీకి పిలుస్తాడు. హెూటల్‌లో పార్టీ జరిగే ప్రదేశాన్ని, పూలతో, బెలూన్లతో అలంకరిస్తారు. పెద్ద కేక్ కట్ చేసి అందరికీ పంచుతారు. అతిథులందరూ బహుమతులిస్తారు. తరువాత రకరకాల వంటకాలతో భోజన కార్యక్రమం ఉంటుంది. దీనిని చూస్తున్న వాసు కూడా ఇలానే తన పుట్టినరోజు కూడా జరపాలని తన తల్లిదండ్రులను వేధిస్తున్నాడు.

### సంఘటన - 3

అర్చన 10వ తరగతి చదువుతోంది. వారిది మధ్యతరగతి కుటుంబం. ప్రతి సంవత్సరం ఆ అమ్మాయి పుట్టినరోజును చాలా సింపుల్‌గా జరుపుకుంటుంది. తన స్నేహితులందరికీ చాక్లెట్స్ పంచుతుంది. సాయంత్రంపూట తల్లిదండ్రులతో అనాథాశ్రమానికి వెళ్ళి అక్కడి పిల్లలకు తమకున్నంతలో స్వీట్లు, బట్టలు పంచివస్తుంది. ఇతరులకు ఇవి ఉన్నాయి, అవి ఉన్నాయి అని తనకూ కావాలని పేచీపెట్టదు. తనకు ఉన్నంతలో ఇతరులకు సహాయం చేస్తూఉంటుంది.

## సంఘటన - 4

సుకన్య 10వ తరగతి చదువుతోంది. ఈ అమ్మాయికి ఆడంబరాలు, వస్తువ్యామోహం ఎక్కువ. ప్రతి పండక్కీ తల్లిదండ్రులనడిగి కొత్తబట్టలు, నగలు కొంటుంది. ఎవరిదగ్గరైనా ఏదైనా కొత్తవస్తువును చూసిందంటే దానిని కొని తీరవలసిందే. ఇప్పటికే ఆమెకు ఒక బీరువానిండా బట్టలు, 10-12 నగలసెట్లు, ఒక పెట్టెనిండా గాజులు, రకరకాల చెప్పులు ఉన్నాయి. ఇంకా వాళ్ళ ఇంటినిండా ఎక్కడచూసినా ఆ అమ్మాయి వస్తువులే కనిపిస్తాయి.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. సంఘటన 1 లో పెళ్ళి జరిగిన విధానాన్ని చూశారుకదా! పెళ్ళిళ్ళంటే అలాగే జరగాలా? సింపుల్‌గా కూడా చేయవచ్చా! ఎలాగో చెప్పండి.
2. మీరు రూపేష్ స్థానంలో ఉంటే ఏం చేస్తారు?
3. 2వ సంఘటనలో వాసు రాజేష్‌లా పుట్టినరోజు జరుపుకోవాలనుకున్నాడుకదా! ఇది సరైనదేనా? అలా జరుపుకుంటే ఏమవుతుంది?
4. 3వ సంఘటనలో పుట్టినరోజునాడు అర్చన చేసే పని మంచిపనేనా? మీరు మీ పుట్టినరోజునాడు ఏమి చేస్తారు?
5. 4వ సంఘటనలో సుకన్యలా వస్తువులు అవసరానికి మించి కొనడం మంచి పద్ధతేనా? ఎందుకు?
6. "మనిషికి ఆడంబరాలు అవసరం" అవునా కాదా? మీ సమాధానాన్ని విశ్లేషించండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీలో ఉన్న ఆడంబరాలను, వస్తువ్యామోహాన్ని నియంత్రించడానికి ప్రయత్నించండి. మీ అనుభవాలను చెప్పండి.

## VII. తెలుసుకోండి

### ఆడంబరాలు

ఆడంబరాలకు, అట్టహాసాలకు జనం ఎప్పుడూ ముందే ఉంటారు. వేషభాషల్లోనూ, జీవనవిధానంలోనూ ఆడంబరాలకు ప్రాధాన్యం బాగా పెరిగిపోతూ ఉంది. కొందరిలో వాగాడంబరం ఎక్కువ. వీరి మాటలు కోటలు దాటిపోతూ వుంటాయి. కానీ చేతలు మాత్రం గడపదాటవు. అల్పునిమాటలు ఆడంబరంగానే వుంటాయన్నాడు వేమన. సమయం సందర్భం లేకుండా లేనిపోని గొప్పలు చెప్పుకోవడం తమని తాము పొగుడుకోవడం వాగాడంబరమే అవుతుంది.

సమాజంలో తాము హెచ్చుగా ఉన్నామనుకొనికానీ, ఇతరులతో పోటీపడికానీ ఆడంబరాలవైపు మొగ్గుచూపుతూ ఉంటారు. ఆడంబరాలకు ప్రభావితం కానివారు అరుదుగానే ఉంటారు. కొన్ని ఆడంబరాలు పులినిచూసి నక్క వాతపెట్టుకున్న చందంగా ఉంటాయి. శక్తి ఉన్నవాళ్ళు ఆడంబరాలకు పోయినా తప్పులేదుకానీ శక్తిలేనివాళ్ళు కూడా మెహర్బానీలకోసం అప్పుచేసి ఆడంబరాలకు పోవడం వల్ల నష్టాలే కలుగుతాయి. ఈ ఆడంబరాలవల్ల వాళ్ళు తిన్నట్లు కాదు. ఇతరులకు పెట్టినట్లు కాదు. ఆవిధంగా డబ్బు వృధాగా ఖర్చయిపోతుంది. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే పనులకు ఎక్కువ ఖర్చుపెడుతూ ఆడంబరాలకు పోవడమన్నది ఇప్పటికాలంలో ఒక సంప్రదాయంగా మారిపోతున్నది. పుట్టినరోజు వేడుకలు, నిశ్చితార్థాలు, పెళ్ళిళ్ళు మొదలైన శుభకార్యాల్లో వేదికలను ఎక్కువగా అలంకరించడం, లెక్కకు మిక్కిలిగా ఆహారపదార్థాల తయారీ, వీటికి ఎక్కువగా డబ్బును దుర్వినియోగం చేస్తున్నారు. ఇక చీరలకూ, నగలకూ లెక్కలేకుండా పోతోంది.

ఇటువంటి ఆడంబరాలతోపాటు నిత్యజీవితంలో ఉపయోగించే వస్తువుల విషయంలో కూడా ఆడంబరాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఆడంబరాల కోసమని అవసరంలేని గృహోపకరణాలను సేకరించుకుంటూ పోయేవారి సంఖ్య అధికంగానే ఉంది. ఒకప్పుడు కనీస వస్తువులు, విలాస వస్తువులు అని ఒక విభజన ఉండేది. ఇప్పుడు ప్రతీ వస్తువు కనీసావసర వస్తువే. కారు, ఫోను, టి.వి. ఫ్రిజ్ మొదలైనవి ఇప్పుడు విలాస వస్తువులు కావు. ఇప్పుడు ప్రత్యేకించి చెప్పుకునే విలాస వస్తువులంటూ ఏవీ లేవు.

అంతమాత్రంచేత ఆడంబరాలను ఆక్షేపించడం కూడా సమర్థనీయం కాదు. కానీ, హద్దులు మీరి, శక్తికి మించి ఆడంబరాలకు పోయి కష్టాలను కొనితెచ్చుకోవడం కూడదు.

ఇటీవల కొన్ని గణాంకాలు వెల్లడించిన విషయాలనుబట్టి తెలుస్తున్న విషయం ఏమిటంటే తిండి లేకపోయినా ఫర్వాలేదు కానీ ఆడంబరాలు మాత్రం అత్యవసరమన్న ధోరణి ప్రజల్లో పెరుగుతున్నది. కొన్నిచోట్ల మనిషికి అవసరమైన మరుగుదొడ్లు మొదలైన సదుపాయాలైతే లేవు కానీ సెల్‌ఫోన్ల వినియోగం మాత్రం మన దగ్గర అధికంగా ఉందట. పూట గడవడం కష్టమైనవాళ్ళు కూడా ఇంట్లో అన్ని హంగులూ ఉంటే చాలనుకుంటున్నారు. విద్యార్థులు కూడా సెల్‌ఫోన్ల వాడకంలో, సినిమాలకు, షికార్లకు తిరిగే విషయంలో, బట్టలకు ఖర్చుచేసే విషయంలో చూపించే శ్రద్ధను పుస్తకాలను కొనుక్కోవడంలోనూ, చదవడంలోనూ చూపించడం లేదు. ఇందులోనూ ఆడంబరాలే నిండిపోతున్నాయి. పాఠశాలల విషయంలో కూడా బోధనకంటే ఆడంబరాలకే అగ్రతాంబూలమిస్తున్నారు. వైద్యశాలల్లో కూడా వైద్యంకంటే ఆడంబరాలనే చూస్తున్నారు. ప్రమాణాలకంటే షో అంటే చాలునన్న ధోరణి సమాజాన్ని పెడదారి పట్టిస్తున్నది. ప్రమాణాలు కుంటుపడని ఆడంబరాలవల్ల ప్రమాదంలేదు కానీ పోటీలతో కూడిన ఆడంబరాలు మాత్రం ప్రమాదకరమైనవే.

లేనిపోని ఆడంబరాలకుపోయి అష్టకష్టాలు పడటంకన్నా, నలుగురిలో నవ్వులపాలు కావడంకన్నా ఉన్నదాంట్లో తృప్తిగా ఉందాం. మన హోదాను, తాహతును గుర్తుంచుకుని నడుచుకుందాం.

**సూక్తి**

**వ్యక్తి పొదుపే జాతి పొదుపు. జాతి సౌభాగ్యమే వ్యక్తి సౌభాగ్యము.**

# 7 ప్రథమ చికిత్స

**I. ప్రధాన విలువ**

ఆరోగ్య విలువలు

**II. ఉప విలువ**

ప్రాథమిక చికిత్సపై అవగాహన కలిగి ఉండడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- ప్రథమ చికిత్స అవసరాన్ని గూర్చి తెలుసుకొని, వినియోగించడం.

## IV. ఉపోద్ఘాతం

సాధారణంగా ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు, వ్యాధులు వచ్చినప్పుడు వైద్యుని వద్దకు వెళ్ళాలి. అలా వెళ్ళడానికి కొంత ఆలస్యం కావచ్చు. ఈలోగా కొంత ప్రాథమిక చికిత్స జరిగితే కొంత మేలు జరుగుతుంది. ఇంట్లో, బడిలో, బజారులో ప్రమాదాలు జరిగినప్పుడు సాధారణ వ్యాధులు వచ్చినప్పుడు ముందుగా కంగారుపడకుండా ప్రథమచికిత్స చేయాలి. ఆతరువాత తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలి. ఏయే విషయాలకు ప్రథమచికిత్స అవసరమో, వాటిని ఎలా చేయాలో తెలుసుకుందాం.

## V. విషయం

సైన్సు బొమ్మ గీయడానికి వేణు పెన్సిలు చెక్కుతున్నాడు. మధ్యలో టి.వీ.లో వస్తున్న క్రికెటు మ్యాచు చూస్తున్నాడు. ఏకాగ్రత లోపించడంవల్ల అతని చేయి తెగింది. అమ్మో అని అరిచాడు. రక్తం కారుతున్నది. అమ్మ గబగబా వంటింట్లోకి వెళ్ళి పసుపు తెచ్చింది. అన్నయ్య వేణుతో తెగిన వేలు నోట్లో పెట్టుకోమన్నాడు. అక్క ప్రథమ చికిత్స డబ్బా తెచ్చి కాస్తంత అయోడిన్ రాసి, కట్టు కట్టింది.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. ప్రథమచికిత్స అంటే ఏమిటి? దానిని ఎందుకు చేయాలి?
2. ఎటువంటి వాటికి ప్రాథమిక చికిత్స అవసరం? దీనికోసం ఏమైనా ప్రత్యేక శిక్షణ అవసరమా? కాదా? చర్చించండి.
3. మీరు ఎటువంటి సందర్భంలోనైనా ప్రాథమిక చికిత్స చేసారా? ఎలా చేసారో చెప్పండి.
4. ప్రాథమిక చికిత్స డబ్బా (First Aid Box) ను ఎప్పుడైనా చూసారా? ఎక్కడెక్కడ చూసారు? దానిలో ఏమేమి ఉంటాయి?
5. వడదెబ్బ తగిలి పడిపోయిన వారికి మీరెలా ప్రాథమిక చికిత్స చేస్తారు? వివరించండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- ఏదైనా సాధారణ వ్యాధికిగాని, ప్రమాదం జరిగినప్పుడుగాని ఆ వ్యక్తికి ప్రథమచికిత్స చేయండి. మీ అనుభూతిని చెప్పండి.
- మీ పాఠశాలలో ప్రథమచికిత్స పెట్టెను తయారుచేయండి. దానిలో ఉండవలసిన వస్తువులను మీ సైన్సుటీచరు సాయంతో అమర్చిపెట్టండి. స్కూల్లో పిల్లలకు జరిగిన చిన్నచిన్న ప్రమాదాలకు చికిత్స చేయండి. మీ అనుభవాలను చెప్పండి.

## VII. తెలుసుకోండి

వైద్యం ఉంది. ఎంతోమంది వైద్యుల ఉన్నారు. అటువంటప్పుడు ప్రథమచికిత్స దేనికి? అన్న ప్రశ్న సహజం. అందరికీ కాకపోయినా కొందరికయినా సందేహం కలుగవచ్చు.

జీవితం కోసం, జీవనం కోసం, ప్రతిమనిషి శ్రమపడాలి. శ్రమ అతని ఉపాధి. శ్రమవల్లనే అతని జీవితం గడుస్తుంది. భవననిర్మాణాల్లో, పరిశ్రమల్లో, పొలాల్లో, వాహనాలు నడుపుతూ, రోడ్లపై పనులుచేస్తూ ఎంతోమంది జీవిస్తున్నారు. అలాగే విద్యార్థులు, ఇండ్లలోని ఆడవారు, ఉద్యోగులు తమ తమ విధులు నిర్వర్తిస్తుంటారు. ప్రమాదవశాత్తు అంటే ఊహించని విధంగా జరగడమే ప్రమాదం. గాయం కావచ్చు. ఆటలలో, పోటీపందాలలో, నీళ్ళలోని పాకుడు వల్ల జారిపడినప్పుడు ఇలా అనేకవిధాలుగా ప్రమాదం కలుగవచ్చు. అటువంటి సమయంలో వైద్యసహాయం అందేలోపు అవసరమైనది ఏదో ఒకటి చేస్తాం. అదే ప్రథమచికిత్స.

పూర్వకాలంలో అనేక రోగాలకు, ప్రమాదాలు జరిగినప్పుడు పెద్దలు తాము పెద్దలనుండి విన్న పద్ధతిలో, లేక చూసి నేర్చుకొన్న విధంగానో ప్రథమచికిత్స చేసేవారు. అంటే ప్రమాదంబారిన పడినవారిని చూసి వారి దారిన వారు పోయేవారు కాదు. ఇప్పటికీ మనం రోడ్డుపై పడిపోతే ఎవరో ఒకరు లేపి, కాసిని మంచినీళ్ళు ఇస్తారు. ఏదో వాళ్ళకు చేతనైనవిధంగా ప్రథమచికిత్స చేస్తారు.

ప్రథమచికిత్స అనేది సాధారణమయింది. అతి త్వరగా చేయగలిగింది. దీనివలన అపాయానికి లేదా ప్రమాదానికి గురయిన మనిషి ప్రాణాన్ని రక్షించడమే కాక ముందు ముందు జరిగే పరిణామాలను నివారించవచ్చు.

ప్రథమచికిత్సను ఎవరో కొందరే చేయాలని లేదు. ఎవరైనా చేయవచ్చు. అయితే కొన్ని విషయాలు తెలిసినందువల్ల ఉపయోగం ఎక్కువగా ఉంటుంది. ప్రథమచికిత్స చేసేవారి చొరవపై, చేసేవారి శక్తిపై దెబ్బతిన్న వారి ప్రాణం ఆధారపడి ఉంది. తప్పు చికిత్స జరిగినా, చికిత్స లోపం జరిగినా అది ప్రమాదం, ప్రాణాపాయం. ఉదాహరణకు మంటలు, అంటుకొన్న వ్యక్తికి బక్కెట్ల కొద్దీ నీళ్ళు పోసి మంటలార్పితే అది ప్రమాదకరం. అందుకే సరైన అవగాహనతోనే ప్రథమచికిత్స చేయాలి. ఇది కనీసం సహాయం మాత్రమే. సరైన వైద్యసహాయం అందేవరకూ, చికిత్స లభించేవరకూ, మనిషిని ఎటువంటి ప్రమాదమూ లేకుండా చేయడమే ప్రథమచికిత్స.

మన సమాజంలో ఇంకా కొంతవరకు మంచితనం, ఇతరులకు సహాయపడే గుణం ఉంది కనుకనే ప్రమాదాలు జరిగినప్పుడు ఎవరో స్పందిస్తున్నారు. జంతువులకు, పక్షులకూ కూడా ప్రథమచికిత్స చేసేవారు. ఇప్పుడు కూడా కొంతమంది చేస్తున్నారు. ఏదైనా ఒక ప్రాణాన్ని నిలబెట్టడానికి తోటిమనిషి చూపించే జాలి, కరుణ మానవత్వాన్ని కొంచెమైనా మిగులుస్తాయనేది సత్యం.

## ప్రథమ చికిత్స పరికరాల పెట్టె

ప్రతి ఫ్యాక్టరీ, ఆఫీసు, పాఠశాల, ఇళ్లల్లో అందరికీ అందుబాటులో ప్రథమ చికిత్స పెట్టి ఉండాలి. ఇది షాపులో రెడీమేడ్‌గా లభిస్తుంది. మీరైతే రేకు లేదా అట్టపెట్టెతో మీ ఇట్లో ప్రథమచికిత్స బాక్స్‌ను తయారు చేసుకోవచ్చు. ఈక్రింద పేర్కొన్న పరికరాలు, వస్తువులు మీ ప్రథమ చికిత్స పెట్టెలో ఉండాలి.

- వివిధ రకాల సైజుల్లో అతుక్కునే గుణం గల బ్యాండేజీలు
- పీల్చుకునే గుణం గల (అబ్జార్బెంట్) నూలు బ్యాండేజీ లేదా రకరకాల సైజుల్లో ఉన్న నూలు గాజ్‌ప్యాడ్లు
- అతుక్కునే టేపులు
- త్రికోణపు బ్యాండేజీ రోలు (చుట్ట)
- ఒక చుట్ట దూది
- బ్యాండ్ - ఎయిడ్స్ (ప్లాస్టర్స్)
- కత్తెర
- పెన్నుసైజు టార్చిలైటు
- చేతులకు వేసుకునే తొడుగులు / లేటెక్స్ గ్లోవ్స్ (రెండు జతలు)
- ట్వీజర్స్ (పట్టుకర్ర)
- సూది
- తడిగా గల టవలు మరియు శుభ్రమైన పొడి బట్టముక్కలు
- యాంటీ-సెప్టిక్ ద్రవం (సేవ్లన్/డెట్టాల్)
- థర్మోమీటర్
- ఒక చ్ని వాజ్లిన్ (పెట్రోలియం జెల్లీ) ట్యూబ్ లేదా
- ఇతర ల్యూబ్రికెంట్ (పొడిబారిన చర్మాన్ని మెత్తబరిచే క్రీమ్లు)
- వివిధ రకాల సైజుల్లో పిన్నీసులు (సేఫ్టీపిన్నులు)
- సబ్బు లేదా డిటర్జెంట్ పొడి

### ఔషధాలు

- ఆస్పిరిన్ లేదా నొప్పి తగ్గించే పారాసెటమాల్ మాత్రలు
- విరేచనాలు అరికట్టే (యాంటీ-డయోరియా) ఔషధాలు
- తేనెటీగలు కుట్టిన చోట్ల పూయటానికి యాంటీ హిస్టామిన్ క్రీము (అలర్జీలు/దురదలు మంటలు తగ్గేందుకు క్రీము)
- అజీర్తికి, అసిడిటికి మాత్రలు (ఆంటాసిడ్ మాత్రలు)
- విరేచనం సాఫీగా అవ్వటానికి (ల్యాక్సెటివ్) మాత్రలు)

సులువుగా అందుబాటులో ఉండేలా మీ ప్రథమ చికిత్స పెట్టెను ఏర్పాటుచేసుకోవాలి. గడువు తీరిన ఔషధాలను పారేసి, తాజా ఔషధాలను బాక్స్‌లో పెట్టాలి.

### మూర్ఛలు

మూర్ఛలనేవి (తీవ్రంగా లేక ఉగ్రంగా కండరాలు తమ ప్రమేయం లేకుండా ముడుచుకుపోవడం, ఈడ్చుకుపోవడం) ఆకస్మిక జబ్బులోకానీ, మూర్ఛరోగం, అపస్మారకంలో కనబడుతాయి. రోగి శ్వాస ఆగిపోవడం ప్రమాదకరమైన పరిస్థితి. వెంటనే వైద్యుల సహాయం తీసుకోవాలి.

**లక్షణాలు**

కండరాలు గట్టిగా బిగుసుకుపోయినట్టుగా వెంటనే చివుక్కున లాగుతున్నట్టు కదలికలు మొదలవుతాయి (Jerking movements).

- రోగి నాలుక కొరుక్కోవడం, శ్వాస ఆగిపోవడం జరగవచ్చు.
- ముఖము, పెదవులు నీలంగా మారవచ్చు.
- లాలాజలం అధికంగా కారడం, నోటినుంచి నురగ కారడం జరగవచ్చు.

**సహాయానికి చిట్కాలు**

- రోగి చుట్టూవున్న వస్తువులు అడ్డం తీసేసి తలక్రింద మెత్తలు, తలగడ పెట్టాలి.
- పళ్ళ మధ్యగానీ, నోటిలోగానీ ఏ వస్తువు పెట్టవద్దు.
- రోగికి ఎటువంటి ద్రవపదార్థాలు త్రాగడానికి ఇవ్వవద్దు.
- ప్రశాంతంగా వుండండి, రోగికి సహాయం అందేవరకూ సౌకర్యంగా వుంచండి.
- చాలావరకూ మూర్ఛల తరువాత స్పృహతప్పడం లేదా మళ్ళీ మూర్ఛలు రావడం జరుగుతుంది. వీలయినంత త్వరగా రోగిని వైద్యసహాయానికి తీసుకువెళ్ళండి.

## వడదెబ్బ

**ప్రాథమిక చికిత్స**

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లబరచాలి.
- వీలయితే రోగిని చల్లని నీటిలో ముంచాలి (టబ్ వంటివి లభిస్తే) చల్లటి, తడిబట్టలలో చుట్టాలి. చల్లని తడిబట్టతో ఒళ్ళంతా అద్దుతూ వుండాలి.
- రోగి శరీర ఉష్ణోగ్రత $101^{\circ}$ F కు వచ్చినప్పుడు చల్లని నీటిలో నుంచి తీసేసి చల్లటి గదిలో సౌకర్యంగా పడుకోబెట్టాలి.
- ఉష్ణోగ్రత మళ్ళీ పెరుగుతున్నట్లయితే మళ్ళీ పైవిధంగా సూచించినట్లు చేస్తూపోవాలి.
- రోగి త్రాగగలిగితే చల్లని పానీయాలు ఇవ్వాలి.
- ఎటువంటి మందులూ ఇవ్వరాదు.
- వెంటనే వైద్యులను సంప్రదించాలి.

## కంటిలోనికి చిమ్మిన రసాయనాలు

వీటి వలన కంటికి శాశ్వతమైన హాని కలగడమే కాకుండా చూపు కూడా కోల్పోవచ్చు. కాబట్టి చికిత్స అతి త్వరితగతిన మొదలైపోవాలి. ముందుగా రసాయనాన్ని పలుచపరచే పని చూడాలి.

- రోగిని వెల్లికిలా పడుకోబెట్టి బొటనవేలు వుంగరంతో వేళ్ళతో కంటిరెప్పలను వేరుచేసి ముక్కువైపు నుంచి కంటి ముందుభాగం వైపు చల్లని నీరు ఆపకుండా కొద్దిసేపు పోయాలి. దీని మూలంగా రసాయనం పలుచబడుతుంది. రెండోకంటిలో రసాయనం పడకుండా తల కొద్దిగా ప్రక్కకు తిప్పి నీరు

పోయాలి.

- కంటి రెప్పలు పదే పదే మూసి తెరవడం వల్ల రసాయనం కంటి లోపలి భాగంలో ఉండి (మడతలలో) పోకుండా బయటకు వచ్చేస్తుంది.
- కంటిని కడిగే ప్రక్రియ కనీసం పది నిమిషాలు చేయాలి. గడియారంలో చూసుకుంటూ చేయాలి. సమయం తగ్గించకూడదు.
- కంటిని కడిగిన తరువాత రెప్పలు మూసి కంటిపై శుభ్రమైన బట్టపెట్టాలి.
- రోగికి ధైర్యం చెప్పి ఆసుపత్రికి తరలించాలి.

**కరెంటుతో కాలిన గాయలు**

ఈ గాయాలు చిన్నవిగా వున్నా లోతుఎక్కువగా ఉంటాయి. ఇవి ముఖ్యంగా కరెంట్ శరీరంలోనికి ప్రవేశించి మరలా బయటకు వెళ్ళిపోయిన ప్రదేశంలో కనబడతాయి.

- అత్యవసర పరిస్థితిలో వున్న రోగికి చికిత్స చేసేముందు కరెంట్ స్విచ్ బంద్ చేసి ప్లగ్గు తీసివేయాలి. దీని మూలంగా కరెంట్ సరఫరా నిలిచిపోతుంది.
- రోగి నీళ్ళలోపడి ఉన్నట్లయితే మీరు దూరంగా వుండండి. తడి కరెంట్ ప్రసరణ చేసే గుణాన్ని శ్రేష్టంగా పెంచుతుంది. దీని మూలంగా రోగిని సంకలకింద చేతులు వేసి లేపకూడదు.
- రోగి శ్వాస ప్రక్రియను గమనించాలి. విద్యుశ్చక్తి ఛాతీ మరియు గుండెగుండా ప్రసరించి శ్వాసను, గుండెను ఆపివేసి ఉండవచ్చు. నోటిద్వారా శ్వాసనందించడం, గుండె మర్దన వెంటనే మొదలుపెట్టాలి.
- రోగిని అనుకూలంగా పరుండబెట్టి సాధారణ చికిత్స మొదలుపెట్టాలి.

కొన్ని సామాన్య వ్యాధులకు చేయదగు చికిత్సలను గురించి తెలుసుకుందాం.

**1. విరేచనములు, వాంతులు**

- సమృద్ధిగా ద్రవపదార్థాలు ముఖ్యంగా తీయటి పళ్ళరసాలు ఇవ్వాలి.
- చెరుకు గడలు తినిపించాలి.
- ఓ.ఆర్.ఎస్. ద్రావణం త్రాగించాలి.
- కారం, మసాలాలు లేని చప్పటి ఆహారం పిల్లలకు ఇవ్వాలి.
- నీళ్ళ విరేచనాలు బాగా ఎక్కువైనా, కళ్ళు పసుపుపచ్చగా మారినా డాక్టరును సంప్రదించాలి.

**2. పుండ్లు**

- పుండ్లు వేడినీటితో కడిగి దూదితో శుభ్రపరచాలి.
- యాంటీ సెప్టిక్ క్రీమ్ పూయాలి.
- కట్టును శుభ్రమైన బ్యాండేజ్ గుడ్డతో కట్టాలి.

3. **స్కేబిస్ (గజ్జి, దురద)**

- ప్రతిరోజు సబ్బునీళ్ళతో స్నానం చేయించాలి.
- ఎప్పుడైతే చర్మం తడిగా ఉంటుందో అప్పుడు బెంజిన్ బెంజోయేట్ ఎమల్షన్ శరీరం మొత్తానికి (తలకు, మెడభాగంలో తప్ప) రుద్దాలి.
- శరీరాన్ని పాక్షికంగా ఆరనివ్వాలి.
- బెంజాయిల్ బెంజాయేట్‌ను రెండవసారి పూయాలి. 24 గంటలు అలాగే ఉంచాలి.
- సబ్బు నీటితో పిల్లవానికి స్నానం చేయించాలి.
- ఇదే విధంగా 3 రోజులు చేయాలి. తగ్గినపుడు డాక్టర్‌ను సంప్రదించాలి.

4. **దురద, తామర, చర్మంపై మచ్చలు**

- సబ్బునీళ్ళతో స్నానం చేయించాలి.
- చర్మం పొడిగా చక్కగా ఆరనివ్వాలి.
- బెంజోయిక్ సాలిసిలిక్ ఆయింట్‌మెంట్‌ను రుద్దాలి.
- బట్టలు శుభ్రంగా ఉతికి పరిశుభ్రంగా ఉంచాలి.
- డాక్టరు సలహా ప్రకారం మాత్రలు తీసుకోవాలి.

5. **చెవిపోటు**

- సల్ఫసెటమైడ్ చుక్కల్ని చెవిలో వేయాలి.
- ఒకవేళ జ్వరం ఉన్నా, వినికిడిలోపం ఉన్నా డాక్టరును సంప్రదించాలి.

6. **అనీమియా (రక్త బలహీనత)**

- ఆహారం తీసుకున్న తరవాత ఐరన్, ఫోలిక్ ఆమ్లం మందుబిళ్ళలు ఇవ్వాలి.
- శ్వాస పీల్చడంలో ఇబ్బంది, ముఖం, పాదాలు వాచినపుడు డాక్టరును సంప్రదించాలి.

7. **పెదవులు పగులుట, పాలిపోయి ఉండుట**

- కోల్డ్ క్రీము, వ్యాసెలిన్ పగుళ్ళకు పూయాలి.
- బికాంప్లెక్స్ అధికంగా గల దంపుడు బియ్యం, ఆకుకూరలు, కోడిగ్రుడ్లు, పాలు తీసుకోవాలి.

8. **నోటి దుర్వాసన, పిప్పిపండ్లు, పండ్లపై పాచి**

- ఉప్పుగాని, పొటాషియం పెర్మాంగనేటుగాని గోరువెచ్చని నీటిలోవేసి, పుక్కిలించాలి.
- లవంగముతో పుచ్చిన పంటితో చప్పరించాలి.
- నోటిని శుభ్రంగా బ్రష్‌తో తోముకోమని చెప్పాలి.

**9. తలలో పేలు ఉన్నప్పుడు**

- గామా బెంజీన్ హెక్సాక్లోరైడ్ పూయాలి.
- పూసిన తర్వాత తలకు బట్ట / టవల్ చుట్టాలి.
- మరుసటిరోజు ఉదయం కుంకుడుకాయలతో స్నానం చేయాలి.
- తదుపరి సన్నపళ్ళ దువ్వెనతో దువ్వుకోమని చెప్పాలి.

## విష ప్రభావానికి చికిత్స మరియు సామాన్య సూత్రములు

- వెంటనే వైద్యునికి కబురు పంపాలి. రోగి పరిస్థితి నీకు తెలిసిన యెడల రోగ కారణమును తెలియజేయాలి. వైద్యపరీక్ష కొరకు ఈ కింది వాటిని భద్రంగా ఉంచాలి.
  - ◆ అక్కడ మిగిలివున్న వస్తువులు
  - ◆ విషము ఫలానాదని గుర్తించుటకు అక్కడనున్న అట్టపెట్టె, బుడ్డి, సీసా మొదలైనవి వెదకవలెను, కనుగొనవలెను.
  - ◆ వాంతి
- రోగి స్పృహ తప్పియున్న ఎడల –
  - ◆ రోగిని బోరగిల పరుండబెట్టాలి /బోర్ల పడుకోపెట్టాలి. తలను ఒక ప్రక్కకు త్రిప్పిఉంచాలి. తలక్రింద దిండు పెట్టకూడదు. అలా చేయడం వలన వాంతి పదార్థము గాలిగొట్టములోనికి పోదు. నాలుక కూడ ఊపిరి మార్గమునకు అడ్డుపడును. అవసరమైతే వెంటనే ఊపిరి సాధన చేయుటకు వీలగును. డోకు, వాంతి ఎక్కువగా ఉంటే రోగి ఒక కాలిని ముందుకు వంచియుండుట మంచిది. అంటే, రోగి ఒక ప్రక్కకు పరుండును. పైకిఉన్న కాలు వంచి ఒక దిండును రొమ్ముక్రింద పెట్టాలి.
  - ◆ ఊపిరి నీరసముగా ఆడుతుంటే, వెంటనే ఊపిరిసాధన చేయవలెను. వైద్యుడు వచ్చువరకు ఆ యత్నమును మానకూడదు.
- రోగి విషము మ్రింగి తెలివితో నున్నప్పుడు –

మొదట వాంతి చేయించడం ద్వారా ఆ విషమును కక్కించాలి. ఒక గరిటెనుగాని, రెండు వ్రేళ్ళను గొంతుకలో పెట్టి ఆడించిన, రోగికి వాంతియగును. అప్పటికిని వాంతికానియెడల రెండు పెద్ద గరిటెల ఉప్పును ఒక గ్లాసుడు నీళ్ళలో కలిపి త్రాగించాలి.

ఈక్రింది పరిస్థితులలో వాంతి చేయించకూడదు.

1. రోగి స్పృహ తప్పియున్నప్పుడు

2. రోగి పెదవులు లేక నోరు కాలియున్నప్పుడు, మరిగే ద్రావకములు పడినప్పుడు, చర్మము మీద పసుపు లేక బూడిదరంగు మచ్చ లేర్పడును. వాటిని సులభముగా గుర్తించవచ్చును.

తదుపరి విషపు విరుగుడు పదార్థము ఇవ్వాలి. అట్టి పదార్థము విషమును విరిచి రోగిని అపాయస్థితి నుండి తప్పించును. ఉదా. ఘాటైన ఆసిడుకు సుద్ద లేక మెగ్నీషియం రసము విరుగుడు. కొన్ని విషములకు ప్రత్యేక విరుగుళ్ళు ఉన్నవి. కొన్ని యంత్రాగారాలలో ప్రత్యేక ప్రమాదములు సంభవించవచ్చును. వాటి విరుగుళ్ళు జాగ్రత్తపెట్టి యుంచుకొనవలెను. అవి ఉపయోగించవలసిన విధానమును బాగా కనబడు స్థలములో పెట్టవలెను.

పిదప ఎక్కువ నీళ్ళు త్రాగించి విషము యొక్క బలమును తగ్గించాలి అలా చేయటంవలన హాని తగ్గును, వాంతియగుటవలన పోయిన ద్రవము వల్ల కలిగిన నష్టమును నీళ్ళు తీర్చును.

అటుపిమ్మట వ్యాధిని తగ్గించు పానీయములను ఇవ్వాలి. ఒక గ్లాసెడు పాలు, బార్లీ నీళ్ళు, పచ్చిగ్రుడ్లు, నీటిలో కలిపిన పిండి, రోగికి యిచ్చినచో రోగము కొంత నయమగును.

## కుక్క కరిస్తే చికిత్స

- పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా నిర్ణీత వ్యవధిలో ఏంటీ రేబీస్ టీకాలు వేయించండి. దానివల్ల మీకు, ఇతరులకు కూడా ప్రమాదం తప్పుతుంది.
- పాముకాటులా కుక్కకాటుకు తక్షణమే చికిత్స అవసరంలేదు. పిచ్చికుక్కని అనుమానముంటే T.T. ఇంజెక్షన్, గాయానికి కట్టు వంటి ప్రాథమిక చికిత్స చేయించుకొని ఒకటి రెండు రోజుల్లో చికిత్స ప్రారంభించవచ్చు.
- కుక్కకాటుకు అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో ఉచిత చికిత్స లభిస్తుంది.
- స్థానికసంస్థల సహకారంతో జనావాసాల్లో తిరిగే వీధికుక్కలకు టీకాలు వేయించడం వల్ల రేబీస్ వ్యాధిని అదుపులో ఉంచొచ్చు.

**పరుగే ప్రమాదం**

- కుక్కను చూసి పరుగెత్తవద్దు, దానివల్ల అది మీ వెంటబడి కరిచే ప్రమాదముంది.
- కొందరు పిల్లలు సరదాకోసం నిద్రపోతున్న కుక్కలమీద రాళ్ళు రువ్వి ప్రమాదం కొనితెచ్చుకుంటారు.

**కుక్కకాటు**

కుక్క విశ్వాసపాత్రమైన జంతువు అని విశ్వసించడంలో తప్పులేదు. అయితే రేబీస్ సోకిన పిచ్చికుక్కను మాత్రం ఖచ్చితంగా విశ్వసించకండి. వీధికుక్క కరిచినా, వ్యాక్సిన్ వేయించని పెంపుడుకుక్క కరిచినా – అది రేబీస్ సోకిన కుక్కయితే అత్యంత ప్రమాదం అని గుర్తించండి.

వీధికుక్కలు భయపడితే కరుస్తాయి. ఇంట్లోని కుక్కలతో పిల్లలు ఆటలాడుతూ కరిపించుకుంటారు. అప్పుడే ఈనిన కుక్క తన పిల్లల దగ్గరకు ఎవరు వెళ్ళినా కరుస్తుంది. కుక్కకాటు సాధ్యమైనంత వరకు తప్పించుకోవడం – పిచ్చికుక్కకాటు అని అనుమానం వస్తే, విధిగా సమీప ఆసుపత్రిలో యాంటీ ర్యాబీస్ వేక్సిన్ చేయించుకోవడం మరవద్దు.

**కుక్కలందు పిచ్చికుక్క వేరయా...**

- పిల్లలు పెంపుడు కుక్కలతో ప్రమాదకరమైన ఆటలాడకుండా జాగ్రత్త వహించండి. ఆటలాడి బిస్కట్‌లు తినిపిస్తూ చేయి కొరికించుకునేవారు, కుక్కపిల్లతో పరుగు పెట్టించి లేదా దాగుడు మూతలాడుతూ ప్రమాదం తెచ్చుకునేవారెందరో.
- కుక్కలన్నీ పిచ్చికుక్కలు కావు. వీధికుక్క కరవగానే వీలయితే దాన్ని కొంతకాలం గమనించండి. సాధారణంగా పదిరోజుల వరకు కుక్క మామూలుగానే తిరుగాడుతుంటే అది ప్రమాదం లేనిదని గుర్తించండి.
- గతంలో మాదిరిగా పిచ్చికుక్క కాటుకు బొడ్డుచుట్టూ సూదులు వేయించుకునే బాధ ఇపుడు లేదు. 0-3-7-28 రోజులకు కేవలం నాలుగు డోసులు నొప్పిలేని సాధారణ ఇంజక్షన్ రూపంలో తీసుకుంటే చాలు.

## విద్యుత్‌ఘాతము & నీటిలో మునిగిపోవడం

**విద్యుద్ఘాతము**

ఈవిధమైన ఘాతాన్ని గుర్తించడం తేలిక. ఎందుకంటే రోగి కరెంట్ తీగల ప్రక్కన లేదా విద్యుత్పరికరాల ప్రక్కన పడిఉంటారు.

**చికిత్స**

- రోగిని ముట్టుకునే ముందు విద్యుత్ సరఫరా నిలిపివేసే విషయం మరచిపోకూడదు.
- రోగికి శ్వాస ఆడుతుంటే కోలుకునే స్థితిలో పడుకోబెట్టాలి.
- రోగికి శ్వాస ఆగిపోయినట్లైతే వెంటనే నోటిద్వారా కృత్రిమశ్వాస అందిస్తూ గుండె మర్దన మొదలు పెట్టాలి. రోగికి అప్పుడే స్పృహ తప్పినట్లయితే నీటినుంచి తొలగించి కోలుకునేటట్టు పడుకోబెట్టాలి. (కాళ్ళు పైకి తల కాళ్ళకన్నా క్రిందకు వుండేవిధంగా చూడాలి)
- వైద్యుని, కొరకు అంబులెన్స్ ప్రయత్నాలు మొదలుపెట్టాలి.

**నీటిలో మునిగిపోవడం - చికిత్స**

- శ్వాస మార్గాన్ని శుభ్రం చేయాలి. రోగికి శ్వాస ఆడుతున్నదా లేదా గమనించాలి గుండె కొట్టుకుంటుందా లేదా పరీక్షించాలి.
- శ్వాస ఆగిపోతే నోటి ద్వారా కృత్రిమ శ్వాస అందించడం మొదలుపెట్టి అదే సమయంలో గుండె మర్దన కూడా చేయాలి.
- రోగికి అప్పుడే స్పృహ తప్పినట్లైతే నీటి నుంచి బయటకు తీసినవెంటనే కాళ్ళకంటే తల కొంచెం క్రిందకు వుండేవిధంగా పడుకోబెట్టాలి.
- వైద్యునికొరకు లేదా అంబులెన్స్ కొరకు వెంటనే కబురు చేయాలి.

# పాము కాటుకు చికిత్స

**పాములన్నీ విషసర్పాలు కావు**

పాముల్లో చాలావాటికి విషం ఉండదు. త్రాచు, కట్లపాము వంటి 15 శాతం ప్రమాదకరమైన సర్పజాతులతోనే ప్రమాదముంటుంది. అన్ని పాముకాట్లు ప్రమాదకరమైనవి కాకపోవచ్చు. సాధారణంగా 50 శాతం పాముకాట్లు విషం లేని, ప్రమాదంలేని మామూలు గాయాలే (Dry Bites). సాధారణచికిత్స తీసుకుంటే ఈ గాయాలు నయమవుతాయి. పాము విషంకన్నా చాలామందికి షాక్‌తోనే ప్రాణంమీదకి తెచుఉష్టుకుంటారు. ఇంట్లోనివారు, ఇరుగుపొరుగువారు ధైర్యం చెప్పడానికిబదులు ఏడుపులు ప్రారంభిస్తే వీరు భయాందోళనకు గురై పరిస్థితి ప్రమాదకరంగా తయారవుతుంది.

**పాము కరవగానే...**

- భయాందోళనలకు గురికావద్దు. దానివల్ల రక్తప్రసరణ పెరిగి విషం త్వరగా వ్యాపించే ప్రమాదముంది. బంధుమిత్రులు రోగికి ధైర్యం చెప్పాలి.
- ప్రక్కనున్నవారు పాము విషసర్పమో కాదో గుర్తించే ప్రయత్నం చేయండి. దానివల్ల చికిత్స మరింత ఖచ్చితంగా అందజేయవచ్చు.
- నాటువైద్యం, మంత్రతంత్రాలు అని ఆలస్యం చేయకుండా సాధ్యమైనంత తొందరగా దగ్గరలోని ఆసుపత్రికి రోగిని తీసుకువెళ్ళండి. ఆటో, అంబులెన్సు, స్కూటర్ కనీసం మంచం సాయంతోనైనా ఆసుపత్రికి తరలించండి. రోగిని నడిపించవద్దు.
- అన్ని గ్రామాలకు ఇపుడు 108 ఉచిత అంబులెన్స్ సౌకర్యం ఉంది. కాబట్టి దాన్ని సద్వినియోగం చేసుకోండి.
- పాముకాటు వేయగానే కొందరు ఆ గాయాన్ని మరింత కోస్తే రక్తంతోపాటు విషంకూడా వచ్చేస్తుందని కత్తితో, బ్లేడుతో గాటుపడతారు. అలా చేయవద్దు, ఒక్కోసారి పాముకాటుకన్నా ఈ గాయం ప్రమాదకరంగా మారవచ్చు. శాస్త్రీయమైన చికిత్స సాధ్యమైనంత త్వరగా అందించడమే ఉత్తమం.
- మరికొందరు సినిమా హీరోలా పాము కరచిన ప్రదేశంలో గాటుపెట్టి నోటితో విషం పీల్చేస్తామంటారు. పాము కాటు వేయగానే విషం రక్తంద్వారా శరీరంలోని అన్ని భాగాలకు, గుండెకు చేరుకుంటుంది. కాబట్టి దీనివల్ల ప్రయోజనం ఉండదు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పాముకాటుకు ఉచిత చికిత్స లభిస్తుంది. వైద్యునికి రోగి గురించిన సమాచారాన్ని ముందే అందజేస్తే త్వరగా మెరుగైన చికిత్స అందే వీలుంది.

# విష ప్రభావం

విష ప్రభావం వల్ల చాలామంది అస్వస్థులవడం, కొందరు ప్రాణాలు కోల్పోవడం జరుగుతుంది. గాలి ద్వారా, నీటి ద్వారా ఏ రూపంలోనైనా విషప్రభావం ప్రమాదకరమే. కాబట్టి తక్షణమే చికిత్స అవసరం. రైతులు సస్యరక్షణ మందులు వాడినపుడు తగు జాగ్రత్తలు పాటించాలి. పారిశ్రామిక వ్యర్థాలు, విషవాయువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఆహారకల్తీ, విషాహారం పట్ల కూడా జాగ్రత్తలు ఉండాలి. ముఖ్యంగా కల్తీకల్లు, సారాయి మరీ ప్రమాదకరం కాబట్టి వాటికి దూరంగా ఉండాలి.

**విషసంబంధ సమస్యలు**

- రైతులు క్రిమిసంహారక మందులు పిచికారీ చేసినపుడు తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదం, ఘాటైన విషవాయువు పీల్చుకోవడం వలన లేదా శరీరంపై గాయాలుండి, ఆ మందు శరీరంలోకి ప్రవేశించడం వల్ల ప్రమాదం జరగవచ్చు.
- ఇంట్లో వాడే టాయిలెట్ క్లీనర్‌లు కూడా ప్రమాదకరమైనవే. ముఖ్యంగా పిల్లలకు ఇవి అందకుండా జాగ్రత్త పడాలి.
- గన్నేరుకాయలు వంటివి, కొన్ని రకాల పసర్లు విషపూరితమైనవి. గ్రామీణులు వీటిపట్ల అప్రమత్తంగా ఉండాలి.
- కల్తీ సారాయి, కల్తీ కల్లు అత్యంత ప్రమాదకరమైనవి. ఒక్కోసారి పేదప్రజలు గుంపుగా వీటి విషానికి బలయిపోయే ప్రమాదముంది.
- కల్లు, సారాయి మామూలుగానే ఆరోగ్యానికి హానికరం. కల్తీకల్లు, సారాయి వల్ల చాలామంది ఒకేసారి ప్రాణాలు కోల్పోతుంటారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి.
- రైతులు ఎండ్రిన్, మలాథియాన్ వంటి పురుగుమందులు స్ప్రే చేసేటపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. గాలికెదురుగా పిచికారి చేసే సమయాల్లో కంట్లోకి, నోట్లోకి పడకుండా జాగ్రత్త వహించాలి. మందు కలిపేటపుడు చేతికి తొడుగు వేసుకోవాలి.
- ఖాళీడబ్బాలు, సీసాలు ఆరుబయట పడవేయకుండా గొయ్యిలో వేసి మట్టి కప్పడం మంచిది. సగం మిగిలిన పురుగుమందు ఇంట్లో దాచినపుడు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- పిల్లల పరీక్షా ఫలితాలు, గృహకలహాలు, ఆవేశకావేశాల్లో, మరీ అప్రమత్తంగా ఉండాలి.
- చాలాకాలం నిల్వఉంచిన, పాచిపట్టిన, కుళ్ళిపోయిన ఆహారపదార్థాలు విషాహారంగా పరిగణించాలి. పెద్దలకన్నా, పిల్లలకు ఇవి మరీ ఎక్కువ హాని కలిగిస్తాయి.

**విషం ఏరూపంలో తీసుకున్నా...**

- ఈ ప్రాథమిక చికిత్స చేసి తక్షణమే ఆసుపత్రికి చేర్చాలి.
- శరీరంపై విషాన్ని కలగడం, విషంతో తడిసిన బట్టలు మార్చడం, రోగికి ధైర్యం చెప్పడం, నడిపించడం, వంటివి కాకుండా విశ్రాంతిగా పడుకోబెట్టి హాస్పిటల్‌కు తరలించండి.
- 108, 104 అత్యవసర వైద్యసేవలు ఉపయోగించుకోవాలి.

# 8 వసుధైక కుటుంబం

**I. ప్రధాన విలువ**

సంస్కృతి సంప్రదాయాల పట్ల గౌరవం

**II. ఉప విలువ**

వసుధైకకుటుంబభావన

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- ప్రపంచంలోని మానవులంతా తన కుటుంబమేనని భావించగల్గడం.
- నేను-నాది అనేది సంకుచిత భావననుండి మనము-మనది అనే భావనను పెంపొందించుకొనగల్గడం.

**IV. ఉపోద్ఘాతం**

**అయంనిజః పరోవేత్తి**
**వికల్పో లఘుచేతసామ్**
**ఉదార చరితానాం తు**
**వసుధైవ కుటంబకమ్**

వీడు నావాడు, వాడు పరాయివాడు అనే భేదభావం అల్పబుద్ధిగలవారికి మాత్రమే ఉంటుంది. విశాలమైన దృక్పథంగలవారు, ప్రపంచంలోని మానవులంతా తన కుటుంబమేనని భావిస్తారు. అనగా మానవులందరియందు సమభావం కలిగి, అందరినీ సమదృష్టితో చూస్తారు ఉత్తములైన సాధుపుంగవులు. అల్పబుద్ధిగలవారికి, విశాల దృక్పథంగలవారికి వ్యత్యాసము ఈ శ్లోకంలో చెప్పబడింది. అల్పుల ఆలోచన ఎల్లప్పుడూ సంకుచితం గానే ఉంటుంది. విశాల స్వభావం గలవారి ఆలోచన ఉన్నతంగా ఉంటుంది. అల్పదృష్టిగలవారి పరిధి అల్పంగానే ఉంటుంది. 'వీడు నావాడు, నా కులంవాడు, నా దగ్గర బంధువు' అని ఆలోచిస్తుంటాడేగాని సమాజమును గురించి ఏమాత్రం పట్టించుకోడు. మానవులంతా ఒకే కుటుంబానికి చెందినవారనే భావన, విశాలదృక్పథంగల వారిలో ఉంటుంది. ఇట్టి భావన ఈనాడు ప్రతిఒక్కరిలో ఉండాలి. పిల్లలూ! ఇటువంటి వసుదైకకుటుంబభావన గురించి వివరంగా తెలుసుకుందాం.

## V. విషయం

★ అణ్వాయుధాల వల్ల ప్రపంచానికి కీడు వాటిల్లుతుంది. ప్రపంచ వినాశనం జరుగుతుంది. కనుక అణ్వాయుధ నిర్మూలనకు ప్రపంచదేశాలు పూనుకుంటున్నాయి.

★ సోమాలియా ఒక చిన్న దేశం ఈ దేశంలోని ప్రజలు ఆహార సమస్యతో తల్లడిల్లుతున్నారు. ప్రపంచదేశాలు ఈ దేశాన్ని ఆదుకోవడానికి ముందుకు వస్తున్నాయి. మనదేశం కూడా హితోధికంగా సహాయం అందించింది.

★ తుఫాన్లు, వరదలు, భూకంపాలు మొ॥నవి వివిధ దేశాలలో సంభవిస్తున్నాయి. ఆయాదేశాలలో సంభవించే ప్రకృతి వైపరీత్యాల విపత్తుల నుండి ప్రజలను కాపాడటానికి వివిధ దేశాలు సహాయాన్ని అందజేస్తున్నాయి.

★ ప్రపంచంలోని పర్యావరణ పరిస్థితులలో వచ్చిన మార్పుల వల్ల వృక్ష జంతు జాలాలు క్రమంగా అంతరిస్తున్నాయి. దీని వల్ల ప్రపంచ పర్యావరణ శాస్త్రవేత్తలు అందరూ ఆందోళన చెందుతున్నారు. జీవజాలాలను కాపాడుకోవాలని అన్ని దేశాల శాస్త్రవేత్తలు పిలుపు నిచ్చారు. దీని కొరకు జీవవైవిధ్య సదస్సు హైదరాబాదులో 2012 సం॥లో అక్టోబర్ 1 నుండి 19 వరకు జరిగింది. ఈ సమావేశం ద్వారా జీవవైవిధ్యాన్ని కాపాడాలని అందరూ నిర్ణయించారు.

★ ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల్లో ఉగ్రవాదం ఒకటి. ఉగ్రవాదాన్ని రూపుమాపడానికి వివిధ దేశాలు కలసి పనిచేస్తున్నాయి. హైదరాబాద్ లుంబినీపార్క్‌లో, గోకుల్ చాట్ వద్ద, దిల్‌షుక్ నగర్‌లో జరిగిన బాంబు పేలుళ్ళు, అమెరికాలో W.T.C సెంటర్ పైన తాలిబన్ల దాడి ముంబాయిలో తాజ్ హోటల్‌లో తీవ్రవాదుల దాడి దీనికి ఉదాహరణలు.

దీనివల్ల ప్రపంచ దేశాలలోని, ప్రజలు, అంశాంతికి భయభ్రాంతులకు లోనవడం జరుగుతుంది. ఉగ్రవాదాన్ని నిర్మూలించి ప్రపంచ శాంతిని నెలకొల్పడానికి ప్రపంచదేశాలన్నీ కృషిచేస్తున్నాయి.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పైన తెలుసుకున్న అంశాల ద్వారా మీరేమి గ్రహించారు?
2. ఒక దేశంలో జరిగే మంచి చెడ్డల గురించి వివిధ దేశాలు ఎందుకు స్పందించాలి?
3. ప్రపంచాన్నంతా ఒక కుటుంబంగా భావించి ప్రజలందరూ శాంతిగా సంతోషంగా ఉండాలనుకోవడాన్ని "వసుధైక కుటుంబ భావన" అంటారు. ఈరోజుల్లో వసుధైక కుటుంబ భావనను అందరూ కలిగిఉండాలి. దీన్ని మీరు ఎలా సమర్థిస్తారు.

4. "వసుధైక కుటుంబ భావనను" దెబ్బతీసే అంశాలు ప్రపంచవ్యాప్తంగా ఏమేమి ఉన్నాయి? ఇలా ఎందుకు జరుగుతుంది?

5. వసుధైక కుటుంబ భావన మనలో పెంపొందడానికి మనం ఏఏ లక్షణాలను అలవరచుకోవాలో ఒక జాబితా తయారుచేయండి.

## (అ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- ప్రపంచ మానవాళి క్షేమంకోరి వసుధైక కుటుంబ భావనతో పనిచేసే సంస్థలు, వ్యక్తుల గురించి వివరాలు సేకరించి చెప్పండి.

### తెలుసుకోండి

'నేను-నాది' అనే సంకుచిత జీవితం గడపరాదు. 'మనము' అనే విశాల హృదయమును పెంచుకోవాలి. విశాలమైన ప్రేమను అభివృద్ధి పరచుకోవాలి. అట్టివారే సజ్జనులు. "సర్వేజనాః సుఖినో భవంతు" - ఇది భారతీయ మహాధర్మం. అంటే విశ్వంలోని ప్రతిఒక్కరూ సుఖంగా జీవించాలని కోరుకునేది భారతీయధర్మం. ప్రపంచక్షేమం, ప్రపంచశాంతి, ప్రపంచహితం కోరుతుంది భారత హృదయం. భారతీయ ధర్మానికి మూలం వేదాలు, ఉపనిషత్తులు, ధర్మశాస్త్రాలు, రామాయణ భారత భాగవతాది గ్రంథాలు మొదలైనవి. వీటిలో దానం, ధర్మం, దయ, క్షమ, ఓర్పు, ప్రేమ, సేవ వంటి పవిత్ర ఆశయాలతో స్పందించే భారతీయ ఋషి హృదయం ప్రతిబింబిస్తుంది.

అనాదిగా వస్తున్న మన ఆచారాలు, విధులు, కర్తవ్యాలు, సంప్రదాయబద్ధమైన అలవాట్లు, ఆచరణ ఇదంతా మన అపారమైన సంపద. కుటుంబ బాధ్యతలు, స్నేహసంబంధాలు ఎలాఉండాలి? మనుషులమధ్య, మానవ సంఘాల మధ్య, దేశాలమధ్య అవగాహన, పరస్పర సహకార భావనలు ఎలా వృద్ధిపొందాలి? - ఇవన్నీ స్పష్టంచేసింది మన ధర్మం. వ్యక్తులు వారి వారి స్థానము, స్థాయిననుసరించి కర్తవ్య నిర్వహణలో ఎలా కృతార్థులు కాగలరో స్పష్టంచేసింది మన ధర్మం.

ఇంకా మన జీవనక్రమంలో పండుగలు, కట్టుబాట్లు, పుణ్యక్షేత్ర సందర్శనలు ఒకటేమిటి. అన్ని అంశాలు ప్రకృతిలాగా శాశ్వతమైనవే. వీటిని సంరక్షించుకోవటం, తర్వాతి తరాలవారికి భద్రంగా అందించటం మన మహనీయతను చాటుతుంది.

భారతీయధర్మం ఒక మహాసాగరం. ప్రపంచంలో ఏ సిద్ధాంతమైనా పదార్థందాకా వెళ్లి ఆగిపోతుంది. వాస్తవందాకా వెళ్ళి చూడగల్గింది మన భారతీయ ధర్మమే. మానవ జీవన పద్ధతిని వివరించిందీ మన ధర్మమే. వ్యక్తి వికాసం, సంఘశ్రేయస్సులను ఈ ధర్మం నిర్దేశిస్తుంది. మన మార్గం ఎప్పుడూ లోకకళ్యాణమే. ప్రపంచంలో విశ్వసౌభ్రాతృత్వాన్ని కోరేది, విశాల మార్గాన్ని చాటేది భారతీయ ధర్మాన్ని మించి మరొకటి

లేదు. ఈ వసుధైక కుటుంబ భావనను గల జాతి భారతజాతి. విశ్వమంతా ఒకే కుటుంబం అని అన్ని దేశాలలోని విజ్ఞానాన్ని అందరూ అందిపుచ్చుకోవాలని కోరుకునే జాతి భారతజాతి. విశ్వమానవ కళ్యాణానికి ఉపకరించే ఏ విజ్ఞానాన్నైనా అందరూ స్వీకరించి అందరూ ఒకే స్థాయిలో ఎదగాలి. మనకు లభించని జ్ఞానాన్ని మనం స్వీకరిస్తూ మనం ఈ విశ్వమానవాళికి అందించదగు జ్ఞానాన్ని అందరికి పంచుతూ మనమందరం ఒకే కుటుంబం అనే భావనతో ముందడుగు వేయాలి. ఒకరికొకరు అన్నదమ్ములవలె సోదరభావంతో మెలగుతూ ఎటువంటి సమస్యలు ఉద్భవించినా చర్చల ద్వారా పరిష్కరించుకొంటూ సమైక్యతారాగాన్ని ఆలపించాలి.

సంగీత, సాహిత్యాంశాలను ఒకరునొకరు పంచుకోవడం ద్వారా వసుధైక కుటుంబ భావన బలపడుతుంది అనడంలో సందేహం లేదు. ఈ భావన విశ్వంలోని అన్ని జాతుల, మతాల మధ్య అడ్డుగోడలను తొలగిస్తుంది. ఏ కులము, ఏ మతము, ఏ జాతి అనే భావము లేకుండా మానవులందరూ సమానమనే భావనను పెంపొందించుకోవాలి. మనమందరిదీ ఒకటే వాదం మానవతావాదం అనే భావనను కల్గిఉన్నప్పుడు వసుధైక కుటుంబకం అన్న భావనకు బలం చేకూరుతుంది. విశ్వంలోని అన్ని జాతుల సంస్కృతులను సంప్రదాయాలను గౌరవిస్తూ, అన్ని మతాలను ఆదరిస్తూ విశ్వంలోని మానవులందరూ ఒకటేనన్న భావనను జాగృతం చేయాలి. సర్వేజనాః సుఖినోభవంతు అన్న ఆర్యోక్తి ఆచరణలో పెడుతూ విశ్వమానవ కళ్యాణానికి అందరూ సహకరించుకోవాలి. తద్వారా వసుధైక కుటుంబ భావనను కల్గి ఆచరిద్దాం.

భారతదేశం ప్రపంచంలోనే ప్రత్యేక స్థానాన్ని పొందిన దేశం. మన సంస్కృతి సంప్రదాయాలు ఎన్నో దేశాలు పాటించడానికి ముందుకు వస్తున్నాయంటే మనదేశ ఔన్నత్యాన్ని మనం గుర్తించాలి. ఇతరులను గౌరవించడం, కుటుంబవ్యవస్థను, వివాహవ్యవస్థను కాపాడుకోవడం మన సంస్కృతిని చాటిచెప్పే అంశాలు. అంతేకాదు ప్రపంచమంతా ఒక కుటుంబం. ప్రపంచంలోని మానవులంతా అన్నదమ్ములం అనే భావంతో మెలగడమనేది వసుధైక కుటుంబ భావన. నేను, నాదేశం అనే పరిమిత భావననుంచి నా ప్రపంచం, నా ప్రపంచ సహోదరులు అనే విశాల దృక్పథం కలిగిఉండడమే వసుధైక కుటుంబ భావనకు పునాదులు. ఈ వసుధైక కుటుంబ భావన పెంపొందించు కోవడం. అందరిపట్ల ప్రేమ, సౌజన్యం, సహకారం, సహజీవనం అనే ధోరణి కలిగి జీవించడం అనేది అత్యంత ఆవశ్యకరం.

మనిషి మనుగడ 'నేను' నుండి 'మనం' లోకి కదలాలి. మనిషి గమ్యం తన కుటుంబానికే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తం కావాలి. నేను ఎవరికొరకు జీవిస్తున్నాను? ఎందుకు జీవిస్తున్నాను అనే ప్రశ్నకు ప్రతిఒక్కరూ జవాబు నిర్ణయించుకోవడంలో దేశం యొక్క అనేక సమస్యలు ముడిపడియున్నాయి.

దారినపోయే పెద్దమనిషిని, మీరు ఎవరికోసం జీవిస్తున్నారు? మీ గమ్యస్థానం ఏమిటి? అని అడిగితే అతను నవ్వుతూ... నేనేగాదు ఎవరైనా ఎవరికోసం వాళ్ళే జీవిస్తున్నారు. నేను నాకోసం అన్నం తింటున్నా, నీరు తాగుతున్నా, గాలి పీలుస్తున్నా" అన్నాడు. మంచిది... మీరు ఈరోజులో చేసిన పనులన్నీ ఎవరికొరకు చేస్తారు? అని అడిగితే నేను సాయంకాలం ఇంటికిపోతూ మా ఆవిడకోసం చీర గాజులు కొన్నాను అన్నాడు. పిల్లలకోసం పండ్లు కొన్నాను అన్నాడు. వీరంతా ఎవరు? అతని 'కుటుంబం'.

ఆ పెద్దమనిషి మొదట చెప్పినట్లు తనకొరకు మాత్రమే జీవించడంలేదు. తన కుటుంబంకోసం కూడా జీవిస్తున్నాడు. అంటే అతని ప్రయాణం నేను నుండి నా కుటుంబం వైపుకు నడిచింది.

ఈ సంఘటనను చూడండి.

అదొక పల్లెటూరు. పంట ఇంటికి వచ్చిన పిదప రైతుల చేతుల్లో డబ్బులు ఉంటాయి. మార్చినెల వచ్చింది. ఊళ్ళో దొంగలు పడడం ప్రారంభించారు. ఊళ్ళో యువకులు, వృద్ధులు అందరూ సమావేశం పెట్టుకుని రాత్రిళ్ళు కాపలా కాయాలని తీర్మానించారు. బాట్యరీలైట్లు, చేతికర్రలు కొనడానికి మనిషిని పంపించారు. నలుగురు నలుగురు మనుషుల వంతున జట్లుచేసి రాత్రిళ్ళు వీధుల్లో పహారా కాయాలని నిర్ణయించారు.

ఒకరోజు ఓ నలుగురు యువకులవంతు వచ్చింది. అందులో ముగ్గురు వచ్చారు. ఒకరు రాలేదు. ఎదుకు రాలేదు అని అడిగితే నాకు ఇంట్లోపని ఉంది. నన్ను వదిలేయండి, మీరు వెళ్ళండి అన్నాడు.

ఊరందరికీ ఒక విపత్తు వచ్చినప్పుడు ఊరు క్షేమంగా ఉంటేనే నాఇల్లు క్షేమంగా ఉంటుంది అని అతను అనుకోవాలి. నేను నా సమాజం కొరకు కూడా జీవిస్తున్నాను అని గ్రహించాలి.

ఇంకో సంఘటన చూడండి.

ఢిల్లీలో ఒక సైనికాధికారి ఒక విదేశీయుడితో స్నేహం చేశాడనుకుందాం. ఒకనాడు విదేశీయుడు సైనికాధికారితో 'మీకు తెలిసిన ఒక రహస్య సైనికసమాచారం ఉన్నది. దాన్ని మీరు నాకు తెలిపితే కోటి రూపాయలు మీకిస్తాను' అన్నాడు. "నేను నాకోసమే జీవిస్తున్నాను" అనుకుంటే సైనికాధికారి ఆపని చేస్తాడు. 'నేను నా దేశం కోసం, నా ప్రజలకోసం జీవిస్తున్నాను" అనుకుంటే వెంటనే ఆ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకువెడతాడు.

ప్రపంచమంతా నా కుటుంబం అని భావించినవారు కోట్లకొలది లాభం కోసం కల్తీలు జరపరు, ప్రజలను పరిపాలించే నాయకులు అవినీతి కుంభకోణాలు చేయరు. ప్రజల సౌకర్యాలకు నష్టం కలిగించే పనులు ఏవీ చేయరు.

అందుకే వసుదైక కుటుంబ భావన ప్రజల ప్రశాంత జీవనానికి దోహదపడుతుంది.

**సూక్తి**

**జీవితంలో ప్రతినిమిషం భగవద్దత్తం మానవసేవ కొరకు అది ఇవ్వబడింది.**
**- గాంధీజీ.**

# 9 జీవవైవిధ్యం

**I. ప్రధాన విలువ**

పర్యావరణ పరిరక్షణ

**II. ఉప విలువ**

జీవవైవిధ్య సమతుల్యతను కాపాడడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- జీవవైవిధ్య సమతుల్యతను అవగాహన చేసుకోగలుగుతారు.
- తమ వంతుగా జీవవైవిధ్య సమతుల్యతను కాపాడడంలో కృషిచేయగలుగుతారు.

## IV. ఉపోద్ఘాతం

సృష్టిలోని ప్రతి జీవికి జీవించే హక్కు ఉంది. నేడు శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం పెరిగిన పరిస్థితుల్లో మానవుల అనాలోచిత చర్యలవల్ల వేలజీవులు నశిస్తున్నాయి. ప్రకృతిలో ప్రతిజీవి ప్రకృతి సమతుల్యతను కాపాడడానికి తోడ్పడుతుంది. ఇవి నశించడం వల్ల ప్రకృతి సమతుల్యత దెబ్బతిని ప్రకృతిలో విపరీత పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. భవిష్యత్తులో మానవుల ఉనికికే ప్రమాదం వాటిల్లే అవకాశాలు ఉన్నాయి. వీటిని అరికట్టడానికి జీవవైవిధ్యంపైన, వాటిని రక్షించుకోవడంపైన విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

## V. విషయం

### సంఘటన - 1

అది ఒక మారుమూల పల్లెటూరు. ఆ ఊరికి రవాణాసౌకర్యం లేదు. ఆ ఊరినుండి మరో ఊరికి వెళ్ళాలంటే అడవిగుండా వెళ్ళాలి. విద్యార్థులు హైస్కూల్‌కు వెళ్ళాలన్నా, రోగులు వైద్యశాలకు వెళ్ళాలన్నా ఈ అడవిగుండా ప్రయాణంచేసి పట్టణానికి వెళ్ళాల్సిందే. దీనివల్ల ఆ పల్లెలోని ప్రజలు చాలా ఇబ్బందిపడుతున్నారు. వారు చాలా కృషిచేసి ఆ ఊరి సర్పంచ్ సహకారంతో ప్రభుత్వంతో మాట్లాడి ఆ ఊరికి రోడ్డు మంజూరు చేయించారు. ఆ ఊరికి కొత్తరోడ్డు వచ్చింది. వారి సమస్యలు తీరాయి. కాని అడవిగుండా రోడ్డు వేయాల్సి రావడం వల్ల అడవిలోని చాలా చెట్లు నాశనమయ్యాయి.

### సంఘటన - 2

శాస్త్ర సాంకేతిక రంగంలో జరిగిన అభివృద్ధి వల్ల 'సెల్‌ఫోన్లు' మనిషికి నిత్యావసర వస్తువుగా మారిపోయాయి. ఈ ఫోన్లు పనిచేయడం కోసం ప్రతిచోట సెల్‌టవర్లు నిర్మించారు. వీటినుండి వెలువడే రేడియేషన్ మూలంగా ఊరపిచ్చుకలు కనుమరుగై పోయాయి.

### సంఘటన - 3

నగర పారిశ్రామికీకరణలో భాగంగా ఒక నగరానికి 2 పరిశ్రమలు మంజూరయ్యాయి. ఆ పరిశ్రమల మూలంగా కొంత నిరుద్యోగసమస్య తీరుతుందని అందరూ సంతోషపడ్డారు. ఆ పరిశ్రమలను నెలకొల్పడానికి ఆ నగర పొలిమేరల్లోని స్థలాన్ని ఎన్నుకున్నారు. ఆ స్థలంలోని మొక్కలను, చెట్లను నరికివేయాల్సి వచ్చింది. పరిశ్రమలు ప్రారంభమైన తర్వాత ఆ పరిశ్రమల్లో నుంచి వచ్చే వ్యర్థాలను దగ్గరలోని చెరువులోకి వదలటం వల్ల చెరువులోని నీరు విషతుల్యమయింది.

### సంఘటన - 4

రంగాపురం అనే గ్రామంలో కొంత కాలంగా పొలాల దగ్గర పాములు ఎక్కువగా కనిపిస్తున్నాయి. వాటిని చూసి పిల్లలు భయభ్రాంతులవుతున్నారు. అందుకని ఆ ఊరిప్రజలు పాములు కనపడగానే వాటిని చంపడం మొదలుపెట్టారు. ఆ సంవత్సరం వారి పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. కారణాలు పరిశీలించగా పాములు లేకపోవడం వల్ల ఎలుకల సంఖ్య పెరిగిపోయిందని అవి పంటను నాశనం చేశాయని తెలిసింది.

## సంఘటన - 5

ఒకప్పుడు మన దేశం నుంచి కప్పకాళ్ళను ఐరోపా, ఉత్తర అమెరికా దేశాలకు ఎగుమతి చేసేవారు. 1983 లో అమెరికా, ఫ్రాన్సు, ఐరోపా దేశాలకు టన్నులకొద్దీ కప్పకాళ్ళు ఎగుమతయ్యాయి. కప్పలను చంపడం వల్ల వాటి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. దీంతో కప్పలు తినే కీటకాలు, చీడపురుగుల సంఖ్య అత్యధికంగా పెరిగి వాటివల్ల నష్టం వాటిల్లుతున్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. దాంతో 1987 సం॥లో కేంద్ర సర్కారు కప్పల ఎగుమతులపై నిషేధం విధించింది.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పై విషయాల ద్వారా మీరు ఏమి గ్రహించారు?
2. జీవవైవిధ్యం అంటే మీకేమి అర్థమయింది? దీనిని కాపాడటానికి మీరు చేపట్టే చర్యలేవి?
3. "మానవునితోపాటు ఇతర జీవులూ సహజీవనం సాగించాలి" ఇది ఎంతవరకు సమర్థనీయమో చర్చించండి.
4. ఏదైనా జీవజాతి అంతరించి పోవడానికి గల కారణాలేమిటి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ ప్రాంతంలో జంతు, వృక్ష, పక్షిజాతులు పూర్వం ఏమేమి ఉండేవి. ఇప్పుడు ఏఏ జాతులు నశించిపోయాయి. వాటి వివరాలు సేకరించండి. ఎందుకు అంతరించి పోయాయో తెలుసుకోండి. మీ అనుభవాలు చెప్పండి.

### తెలుసుకోండి

## మానవాళి మహాపరాధం!

సృష్టిలో సర్వప్రాణులు జీవవైవిధ్యంలో భాగం. సూక్ష్మజీవులనుంచి క్రిమికీటకాల వరకు, వృక్షాల నుంచి జంతు జలచరాలవరకు ప్రకృతిలోని ప్రాణులన్నీ పరస్పరాధారిత జీవనాన్ని గడుపుతున్నాయి. అయినా ప్రకృతినే కబళించే విధంగా మనిషి ఆలోచనలు అహేతుకంగా సాగిపోతున్నాయి. ఫలితంగా జీవవైవిధ్య సమతుల్యత దెబ్బతింటోంది. వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు పెచ్చరిల్లుతున్నాయి. ఇలాంటి విపరిణామాలవల్ల జీవకోటి జాతుల్లో మూడింట రెండొంతులు అంతరించిపోయే పెనుప్రమాదం పొంచి ఉంది.

**మేలుకోకుంటే ముప్పే**

ఐక్యరాజ్యసమితి 1993 లో చేసిన తీర్మానం మేరకు ప్రపంచంలోని అన్ని దేశాల ప్రభుత్వాలు జీవవైవిధ్య పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని చెబుతున్నాయి. ఆచరణలో అనేక దేశాలు ఆ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నాయి. ఈ విషయంలో భారతదేశం ఏమీ తక్కువ తినలేదు. అభివృద్ధి పథకాల పేరిట సముద్రాలు, నదులు, చిత్తడి నేలలు, గెడ్డలు, సరస్సులోని అరుదైన జాతుల ఆవాసాలను నాశనం చేస్తున్నారు. అడవుల కోత, వన్యప్రాణుల వేట, సముద్రంలోని జలచరాల వధ పరిస్థితుల్ని మరింతగా దిగజారుస్తున్నాయి. చిత్తడి నేలలు, మడ అడవుల విధ్వంసంవల్ల అరుదైన జీవజాతుల ఉనికికి ముప్పు ఏర్పడింది. ప్రపంచ జనాభా ఆరు వందలకోట్లు మించిపోయింది. పెరుగుతున్న మానవాళి అవసరాలతోపాటే అడవులూ హరించుకు పోతున్నాయి. ఒకప్పుడు భూమిపై 3.4 కోట్ల చదరపు కిలోమీటర్ల అడవులు విస్తరించి ఉండేవి. వాటి విస్తీర్ణం సగానికిపైగా కోసుకుపోయింది. అమెరికాకు చెందిన ప్రఖ్యాత పరిశోధనసంస్థ 'ది వరల్డ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్' పరిశోధనలు మరింత ప్రమాదకర ఘంటికలు మోగిస్తున్నాయి. దాని ప్రకారం భూమిపై 22 శాతం అడవులే మిగిలిఉన్నాయి. ఏటా 1.6 కోట్ల హెక్టార్లలో అడవులు కోతకు గురవుతున్నాయి. ఫలితంగా అడవులతో ముడిపడిన జీవవైవిధ్య సంపద కనుమరుగైపోతోంది. గడచిన వందేళ్లలో ప్రపంచవ్యాప్తంగా ఏటా 20 వేల జాతులు చొప్పున అంతరించిపోయాయన్నది పర్యావరణ నిపుణుల ఆందోళన. 75 శాతం మేర జన్యువైవిధ్య పంటలూ కనుమరుగై పోయాయి. 24 శాతం మేర క్షీరదాలు, 12 శాతం పక్షుల జాతులు అంతరించిపోయే దశలో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా అడవుల విధ్వంసంవల్ల భూతాపం పెరిగిపోతుండటంతో అత్యంత సున్నితమైన కీటక, వృక్ష, మత్స్య జాతుల మనుగడ కష్టంగా ఉంది. భూతాపం పెరుగుదలవల్ల 2050 నాటికి భూభాగంపై నాలుగింట ఒకవంతు సున్నితమైన జీవరాశులు అంతరించిపోతాయన్నది అధ్యయనాల సారాంశం.

ప్రపంచ జీవవైవిధ్యంలో 70 శాతం మేర ఉన్న 12 దేశాల్లో భారత్ ఒకటి. ప్రపంచ భూభాగంలో మనదేశం వంతు 2.4 శాతమే అయినా జీవవైవిధ్య వాటా 8.1 శాతం కొన్నేళ్ల క్రితంవరకు పిచ్చుకలు, గబ్బిలాలు, తేనెటీగలు, రాబందులు విస్తృతంగా కనిపించేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. పేదదేశాల్లోని విలువైన జీవవైవిధ్య సంపదపై పేటెంటు హక్కులు పొందుతున్న ధనిక దేశాలు లాభార్జనకు దారులు వేసుకోవడం ఆందోళనకర పరిణామం. భారత సమాజంలో వేప, పసుపు వంటి విశిష్ట జాతులను ఔషధాలు, ఆహార పదార్థాల్లో వినియోగించడం పరిపాటి. వాటిలో ఔషధగుణాలను తామే కనిపెట్టామంటూ అమెరికా వంటి సంపన్నదేశాల కంపెనీలు పేటెంటు హక్కులు పొందడం గతంలో వివాదాస్పదమైంది. సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులపైనా మార్కెట్ ప్రభావం పెచ్చుమీరి ఆహారభద్రతకు భంగం వాటిల్లేలా చేస్తుంది. సమృద్ధిగా

పోషకాహార, ఔషధ విలువలు ఉన్న సంప్రదాయ పంటలకు భారతదేశం పుట్టిల్లు, వరి, గోధుమ, జొన్న, మామిడి తదితర పంటల్లో అనాదిగా రైతులు వృద్ధిచేసిన వంగడాలు అనేకం ఉన్నాయి. వీటిపై మేధోసంపత్తి హక్కులు లేకపోవడంతో బడా కంపెనీలు మార్కెట్ సరుకుగా మార్చేస్తున్నాయి. కొద్దిపాటి మార్పులతో అధిక దిగుబడుల నిచ్చే విత్తనాలుగా మార్చి సొమ్ముచేసుకుంటున్నాయి. రసాయన ఎరువులు, క్రిమిసంహారకాల వాడకం పెరిగింది. వీటివల్ల తాత్కాలిక ప్రయోజనాలు లభిస్తున్నా దీర్ఘకాలంగా నేలలపై చూపించే దుష్పరిణామాలూ, విలువైన జీవసంపదకు తెస్తున్న చేటును పట్టించుకోవడం లేదు. ప్రపంచదేశాల్లో అత్యధికంగా కీటక నాశినులను ఉత్పత్తిచేసే దేశంగా భారత్ అప్రతిష్ఠ మూటకట్టుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

భారతదేశంలో జీవవైవిధ్య చట్ట నిబంధనలను 2004లో తీసుకొచ్చారు. చెన్నై కేంద్రంగా జాతీయస్థాయి జీవవైవిధ్య సంస్థను ఏర్పాటుచేశారు. ఆ చట్టం ప్రకారం రాష్ట్రాల స్థాయిల్లోనూ జీవవైవిధ్య పరిరక్షణకు బోర్డులు ఏర్పాటుచేశారు. అయితే చట్టం అమలు విషయంలో ఎవరి ఇష్టం వారిదన్న తీరు ఉంది. అవసరమైన యంత్రాంగాలు కొరవడ్డాయి. ఫలితంగా రాష్ట్రస్థాయి బోర్డులు స్వతంత్రంగా పనిచేయలేని నిస్సహాయ స్థితిలో కూరుకుపోయాయి. 14 రాష్ట్రాలు మాత్రమే తమ స్థాయిలో నిబంధనలను అమలులోకి తీసుకొచ్చాయి. గ్రామస్థాయిలో జీవవైవిధ్య యాజమాన్య కమిటీలు ఏర్పాటుచేసి జీవవైవిధ్య పరిరక్షణకు బాటలు వేయడం చట్టంలో ప్రధాన అంశం. గ్రామ సర్పంచ్, మండలాధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ అధ్యక్షులుగా వివిధ స్థాయిల్లో ఈ కమిటీలు ఏర్పాటుచేయాలి. ఇందులో పంచాయితీస్థాయిలో ఏడుగురు సభ్యులుంటారు. వనరుల ఉనికి గల ప్రదేశాలను పరిరక్షించడం ఈ కమిటీల కర్తవ్యం. క్షేత్రస్థాయిలో చట్ట నిబంధనలు అమలైతే విచ్చలవిడి విధ్వంసాన్ని అరికట్టి జీవవైవిధ్య వనరుల సమతుల్యతను కాపాడవచ్చు. అయితే, ఈ కమిటీల ఏర్పాటు ముందుకు సాగని దుస్థితి నెలకొంది. రాష్ట్రాల్లో బోర్డులు యాజమాన్య కమిటీ ఏర్పాటుకు దరఖాస్తు వస్తేనే స్పందించే పరిస్థితి నెలకొంది. చట్టం ముఖ్యోద్దేశాలపై ఆశించిన స్థాయిలో ప్రచారం కొరవడటంతో చట్టం నియమాలూ అటకెక్కాయి. కల్పవృక్ష్ సంస్థ అధ్యయనం ప్రకారం సెప్టెంబరు 2012 నాటికి 23 రాష్ట్రాల్లో 33,077 గ్రామస్థాయి జీవవైవిధ్య కమిటీలు ఏర్పాటయ్యాయి. వాటిలో 27,712 కమిటీలను ఒక్క మధ్యప్రదేశ్‌లోనే స్థాపించారు. స్థానిక సంస్థల ప్రతినిధులకు అవగాహన కొరవడటంతోపాటు, వీటివల్ల ప్రత్యక్ష లాభాలు వచ్చే అవకాశాలు లేకపోవడంతో ఈ విధుల్ని అదనపు భారంగా భావించే పరిస్థితి నెలకొంది. జాతీయస్థాయి, రాష్ట్రస్థాయి జీవవైవిధ్య బోర్డుల్లో సభ్యుల నియామకాలకు సైతం పైరవీల జాడ్యం సోకింది. ఫలితంగా చట్టం అమలులో ప్రతిబంధకాలు ఎదురై, ఆశించినస్థాయిలో జీవవైవిధ్య ప్రదేశాల గుర్తింపు, ప్రకటన జరగలేదు.

**ముందుచూపు అవసరం**

అభివృద్ధి ప్రాజెక్టుల పేరిట విశిష్ట జీవవైవిధ్య వనరులున్న ప్రాంతాలను ధ్వంసంచేసే పరిస్థితి అంతకంతకూ తీవ్రతరమవుతోంది. ప్రభుత్వం తరపున క్షేత్రస్థాయి పరిశీలన లేకపోవడంతో కంపెనీలు తప్పుడు నివేదికలతో పర్యావరణ పరంగా సున్నితమైన ప్రదేశాలను ఎందుకూ పనికిరాని ప్రదేశాలుగా చూపిస్తున్నాయి. పర్యావరణ, అటవీ అనుమతులు తెచ్చుకుంటున్నాయి. జీవవైవిధ్య బోర్డుల్ని అసలు సంప్రతించడమేలేదు. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. అనివార్య పరిస్థితుల్లో సున్నిత ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సి వచ్చినప్పుడు నష్టం అపారంగా ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకోసం ముందుగానే జీవవైవిధ్య విశిష్ట ప్రాంతాల గుర్తింపు జరగాలి. దేశంలో అటవీ, తీర ప్రాంతాల్లో విశిష్ట జీవవైవిధ్య సంపద సమృద్ధిగా ఉంది. అక్కడి అటవీ, సముద్రతీర వనరులపై గిరిజనులు, మత్స్యకారులు సాంప్రదాయకంగా ఆధారపడి ఉన్నారు. అడవుల్లోని గిరిజనుల్లో అధికశాతం సేంద్రియ వ్యవసాయ పద్ధతులను వినియోగిస్తున్నారు. పాత విత్తనాల వినియోగంపై ఇప్పటికీ శ్రద్ధ కనబరుస్తున్నారు. సాంప్రదాయ మత్స్యకారులు తమ వేటలో సూక్ష్మజలచరాలకు హాని కలిగించదు. జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం ఆదివాసులు, మత్స్యకార సమూహాల సంస్కృతిలో భాగం. అంతర్జాతీయ, జాతీయస్థాయిలో జీవవైవిధ్య ఒప్పందాల్లో ఈ సమూహాల నిరంతర జీవన స్రవంతిలో అనుసరించే శైలి స్పష్టంగా కనిపిస్తుంది. జీవవైవిధ్య సంరక్షణ చట్టం కింద యాజమాన్య కమిటీల్లో వీరి భాగస్వామ్యం పెంచేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి. జీవవైవిధ్య వనరుల పరిరక్షణలో ప్రతీ ఒక్కరినీ భాగస్వాములను చేసేలా నూతన ప్రభుత్వాలు కార్యక్రమాలు రూపకల్పన చేయాలి. అందుకోసం అందరినీ చైతన్యవంతం చేసేందుకు నడుంబిగించాలి.

**సూక్తి**

జంతువులకన్నా మనం మేధావులం, సమర్థులం.
కనుకనే వాటి క్షేమానికి మనం కర్తలం.

– అనిబిసెంట్

# 10 సమాజం - శాస్త్రీయాభివృద్ధి

**I. ప్రధాన విలువ**

శాస్త్రీయదృక్పథం

**II. ఉప విలువ**

విజ్ఞానశాస్త్రానికి సామాజిక బాధ్యత ఉంటుందని గుర్తించడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- శాస్త్రీయ పరిశోధనలు సమాజ నిర్మాణానికి ఏవిధంగా ఉపయోగపడ్డాయో తెలుసుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

విజ్ఞానశాస్త్రం సమాజానికి ఎంతో ఉపయోగపడుతూ ఉంటుంది. శాస్త్రజ్ఞులు ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణల ద్వారా ప్రజలను మరింత సౌకర్యవంతమైన జీవితాన్ని గడిపేటట్లు చేస్తారు. ఉదయం లేచింది మొదలు పడుకునేంతవరకు మనం ప్రతి సందర్భంలో సైన్స్ అభివృద్ధిపరిచిన వాటితోనే కాలం గడుపుతుంటాం. అలాంటి వైజ్ఞానిక ఆవిష్కరణ వల్ల జరిగిన మేలు గురించి తెలుసుకుందాం.

## V. విషయం

### సంఘటన - 1

మామయ్యతో కలిసి వివేక్ పొలానికి వెళ్ళాడు. అక్కడ పొలంలో ట్రాక్టర్‌తో పనిచేస్తున్నారు. అది చూసి వివేక్ "ట్రాక్టర్‌తో ఏం చేస్తున్నారు మామయ్యా!" అని అడిగాడు. "ట్రాక్టర్ ద్వారా పొలాన్ని దున్ని, చదును చేసి పంట వేయడానికి సిద్ధం చేస్తున్నారు - అని మామయ్య చెప్పారు. "మరీ! ట్రాక్టర్‌తోనే ఎందుకు చేయాలి?" అని మళ్ళీ వివేక్ ప్రశ్నించాడు. అపుడు మామయ్య "ట్రాక్టర్ వినియోగించడం వల్ల పనులన్నీ

తొందరగా సకాలంలో పూర్తిచేసుకునే వీలుంటుందని" చెప్పాడు. "ట్రాక్టర్లు రాకముందు ఎలా పనులు చేసుకునేవారు" అని అడిగినపుడు... "ట్రాక్టర్లు రాకముందు ఎద్దులు, నాగలితో దున్నేవారు. ఇలా వీటితో ఒక పొలాన్ని దున్నాలంటే ఎన్నోరోజులు పట్టేది. దీంతో కొన్ని సందర్భాలలో పంటలు వేయడం కూడా ఆలస్యమయ్యేది. అది పంట దిగుబడిపై ప్రభావం చూపేది. ట్రాక్టర్ ద్వారా అయితే కొన్ని గంటలలోనే పొలం పనులను పూర్తిచేయగలుగు తున్నాము. దీనిద్వారా రైతులకెంతో ప్రయోజనం చేకూరింది. నిజంగా ట్రాక్టరుని కనుగొన్న శాస్త్రవేత్తకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నానని వివరించాడు.

**సంఘటన - 2**

తరగతిలో ప్రకృతి వైపరీత్యాల గురించి ఉపాధ్యాయుడు విద్యార్థులకు వివరిస్తున్నాడు. ఈ సందర్భంగా అభిలాష్ అనే విద్యార్థి లేచి "సార్ తుఫాన్, భారీ వర్షం వస్తుందని ముందుగానే మన వాతావరణశాఖవారు ఎలా చెప్పగల్గుతున్నారో చెప్పండి?" అని అడిగాడు. మంచి ప్రశ్న వేశావు అంటూ ఉపాధ్యాయుడు ఇలా వివరించసాగాడు. "విజ్ఞానశాస్త్రం అభివృద్ధి చెందాక సమాజంలో అనేక మార్పులు వచ్చాయి. శాస్త్రవేత్తలు వారి పరిశోధనల ఫలితంగా అనేక కొత్త కొత్త విషయాలను కనుగొనడం జరిగింది. అవన్నీ సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. అందులో భాగంగా రోదసిలోకి ఉపగ్రహాలను పంపడం చాలా ముఖ్యమైనది. వీటినే శాటిలైట్స్ అంటారు. ఒక్కో ప్రయోజనాన్ని ఆశించి ఒక్కో శాటిలైట్‌ని పంపుతూ ఉంటారు. అయితే వాతావరణంలో జరుగుతున్న పరిణామాలను ఇవి ఎప్పటికప్పుడు భూమికి (వాతావరణ కేంద్రానికి) సమాచారాన్ని అందిస్తాయి. ఉదాహరణకు సముద్రంలో అల్పపీడనం ఏర్పడినపుడు, తుఫానులు వచ్చినపుడు ముందుగానే మనకు ఉపగ్రహం ద్వారా ఛాయాచిత్రాలు అందుతాయి. అవి తీరానికి ఎంతదూరంలో ఉన్నాయి, ఎటువైపు కదులుతున్నాయి అనేది ముందుగానే తెలుసుకోవచ్చు. దీంతో తీరప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసి ఈ తుఫాను ప్రభావంనుండి రక్షించడానికి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారు. చేపలు పట్టటమే ప్రధాన వృత్తిగా ఉన్న మత్స్యకారులకు కూడా హెచ్చరికలు జారీచేసి వీరిని సముద్రంలోకి వెళ్ళకుండా చేయవచ్చు. దీంతో ఎన్నో వేలమంది ప్రాణాలను మనం రక్షించవచ్చు. ఇలా సైన్సు మనకు ఎన్నో విధాలుగా నిత్యజీవితంలో ఉపయోగపడుతూ ఉంది.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. వ్యవసాయ రంగంలో ట్రాక్టర్ రావడం వల్ల అనేక విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలుసుకున్నారు కదా! ఇంకా వ్యవసాయరంగంలో ఎలాంటి సాంకేతిక మార్పులు వచ్చాయి?
2. విజ్ఞానశాస్త్రం అభివృద్ధి వల్ల మనిషికి అనేక ఉపయోగాలు జరిగాయి. చిన్నప్పటికీ, ఇప్పటికీ మీ నిత్యజీవితంలో అనేక సాంకేతిక పరిణామాలు గమనించి ఉంటారు. అవేమిటో తెలియజేయండి.

3. శాటిలైట్స్ ద్వారా మనకు సంభవించే విపత్తులను ముందే పసిగడ్తున్నామని అర్థం చేసుకున్నారు. కదా! అలాంటి ప్రకృతి విపత్తులు ఏమేమి సంభవిస్తున్నాయి? వాటిని ఎదుర్కోవడంలో మన బాధ్యత లేమిటి?

4. వైజ్ఞానిక పరిశోధనలతో మన శాస్త్రవేత్తలు అనేక అంశాలను కనుగొన్నారు. వాటిని సమాజహితం కోసం వినియోగించుకుంటున్నాంకూడా! అయితే వాటిని కొంతమంది దుర్వినియోగం చేసి ప్రజలకు కష్టాలు కలిగిస్తున్నారు. మీరు గమనించిన అలాంటి సందర్భాలను తెలియజేయండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- సమాజానికి ఉపయోగపడే అనేక ఆవిష్కరణలు మన శాస్త్రవేత్తలు చేశారు. ఎవరెవరు ఎలాంటి ఆవిష్కరణలు చేశారు. అవి సమాజానికి ఎలా తోడ్పడుతున్నాయి. వివరాలు సేకరించండి. చెప్పండి.

### తెలుసుకోండి

సమకాలీన ప్రపంచంలో ఏ దేశ అభివృద్ధినైనా కొలవడానికి ఇతర అంశాలతోపాటు ఆ దేశంలో ఉన్న సైన్సు, సాంకేతిక స్థాయిని ఒక ప్రధాన గీటురాయిగా ఉపయోగిస్తారు. నాలుగువేల సంవత్సరాల క్రితం మొహంజదారో, హరప్పాలలో ఉన్న మానవ నాగరికత గొప్పదిగా ఇప్పటికీ చెప్పుకుంటున్నామంటే ఆనాటికి ఉన్న శాస్త్ర సాంకేతిక రంగాలలో ఆ ప్రాంతం ముందంజలో ఉండటమే కారణం.

వ్యక్తులు, వ్యక్తుల సమూహాలు, తిండి, గుడ్డ, ఇల్లు తదితర నిత్యజీవిత అవసరాలను తయారు చేసుకోవడానికి చుట్టూఉన్న ప్రకృతిని తమకు అనుకూలంగా మార్చుకుంటూ, పోగుపరిచిన అనుభవాలలోనుంచి పుట్టి పెరిగినవే శాస్త్రసాంకేతాలు. విజ్ఞానంలో భాగంగా నూతన ఆవిష్కరణలను కనుక్కోవడం సాంకేతికాన్ని అభివృద్ధి చేయడం శాస్త్రజ్ఞులపని దాన్ని సామాన్యులకు అందేట్లు చేయడం సామాజిక శాస్త్రవేత్తల పని.

తల నుండి కాళ్ళదాకా ఎక్కడ చూసినా రోజులో ఏ క్షణం చూసినా మనమీద, మనచుట్టూ శాస్త్ర విజ్ఞానం వలన సాధ్యమైన ఫలితాలే కనబడతాయి. విజ్ఞానశాస్త్రం జనం ఆలోచనలో అంతగా అంతర్భాగమైంది. మారుతున్న కాలం మనిషి అవసరాల దృష్ట్యా ఆవిష్కరణలో అనేక మార్పులు కలిగాయి.

యాభైయేళ్ళ క్రిందట విద్యార్థులు కలము సిరాబుడ్డి బళ్ళోకి తీసుకువెళ్ళేవారు. పుల్లకలంతో సిరాబుడ్డిలో ముంచి రాసేవాళ్ళు. కొంతకాలానికి "వాటర్‌మెన్" ఆవిష్కరణతో ఫౌంటెన్ పెన్ వచ్చింది. ఇక సిరాబుడ్డి అవసరం రాలేదు. కాళ్ళతో నడిచేబదులు గాలితో నింపబడిన టైర్ల సహాయంతో నడిచే రెండు చక్రాల సైకిల్ "స్టార్‌లే" కనుగొనడం వల్ల, ఈనాడు సైకిల్ యావత్ ప్రపంచంలో సామాన్య వ్యక్తియొక్క వాహనం అయిపోయింది. పూర్వం ఒక వార్తను కొన్ని వందల మైళ్ళ దూరం చేరవేయడానికి గుర్రాలను, పావురాలను

ఉపయోగించేవారు. దానికి ఐదారు రోజులు పట్టేవి. కానీ, "మార్కోని" కనిపెట్టిన వైర్‌లెస్, "గ్రాహంబెల్" కనిపెట్టిన టెలిఫోన్‌తో క్షణాల్లో సమాచారాన్ని చేరవేస్తున్నాం. "స్టీవెన్‌సన్" రైలు ఇంజనును, "రైటు సోదరులు" విమానాన్ని, "గెలీలియో" దూరదర్శన్‌ను ఇలా అనేకమంది శాస్త్రవేత్తలు తమ అనేక పరిశోధనల ద్వారా అనేకం కనుక్కొని ప్రజల జీవితాలను సుఖమయం చేశారు. తద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడ్డారు.

విజ్ఞానశాస్త్రం మానవాళికి ఎంత మేలు చేసిందో అంతే కీడును కూడా చేస్తుంది. అనేక అవసరాల కోసం తయారుచేసుకున్న కత్తిని ఈరోజు చంపడానికి ఉపయోగిస్తున్నారు. న్యూటన్ కనిపెట్టిన భూమ్యాకర్షణ సూత్రాన్ని నేడు నిక్కచ్చిగా సుదూరంలో ఉన్న శత్రుస్థావరాలను తుడిచిపెట్టడానికి ఖండాంతర రాకెట్లను నిర్మించడానికి ఉపయోగిస్తున్నారు. అదే మాదిరిగా దేశ రక్షణకోసం ఉపయోగపడుతుందని తయారుచేసిన అణ్వాయుధాలు నేడు శత్రువుల/ ఉగ్రవాదుల చేతిలో పడి తీవ్రవాద ముప్పుతో ప్రపంచంలోని దేశాలన్నీ వణికిపోతున్నాయి. అధిక ఉత్పత్తికోసం రసాయనాలను పంటలకు వినియోగించడంవల్ల అవి తినే అనేకమంది ప్రజలు అనేక వ్యాధుల బారిన పడి మరణిస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ వెళితే కొన్ని ఆవిష్కరణలు సమాజానికి ఎంత దోహదం చేస్తాయో... అంతటి నాశనానికి కూడా హేతువౌతాయి. కావున వాటిని శాస్త్రవేత్తలు ఏ సదుద్దేశంతో కనుక్కొన్నారో విచక్షణతో ఆలోచించి వాటిని వినియోగించాలి.

**సూక్తి**

**విద్య ద్వారా స్వేచ్ఛ, సంఘటితం కావడం ద్వారా శక్తి, పరిశ్రమించడం ద్వారా ప్రగతి సాధ్యపడతాయి.**

# 11 చట్టాలు

**I. ప్రధాన విలువ**

న్యాయం

**II. ఉప విలువ**

చట్టాల గురించిన కనీస పరిజ్ఞానం కలిగిఉండటం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- ప్రజలకు న్యాయం అందించడానికి రూపొందించిన చట్టాల పట్ల కనీస పరిజ్ఞానాన్ని తెలుసుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

సామాన్య ప్రజానీకానికి న్యాయమైన పరిపాలన, న్యాయమైన జీవన విధానాలు అందించడానికి అనువుగా చట్టాలు రూపొందించబడ్డాయి. మన కోసం రూపుదిద్దుకున్న చట్టాలపట్ల కనీస పరిజ్ఞానం ప్రతి ఒక్కరికి ఉండాల్సిన అవసరం ఉంది. న్యాయాన్ని కాపాడుకోవడం, మానవ హక్కులను సాధించుకోవడంలో చట్టాల పాత్ర ఎంతైనా ఉంది. కొన్ని చట్టాలు ఎలా రూపుదిద్దుకున్నాయి. వాటి ప్రయోజనాలేంటో ఇపుడు తెలుసుకుందాం...

## V. విషయం

### విద్యాహక్కు చట్టం - 2009

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో విద్యకు ఉన్న ప్రాముఖ్యతను గుర్తించిన రాజ్యాంగ రూపకర్తలు ఆదేశ సూత్రాల్లోని ఆర్టికల్ 45 ప్రకారం 5-14 సం॥ లోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించాలని నిర్ణయించారు. దీనిని ఒక హక్కుగా కల్పించాలని విద్యావేత్తలు, మేధావులు, పౌరసమాజ సభ్యులు డిమాండ్ చేయడంతో 2002 లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 21 (ఏ) ఆర్టికల్‌లో ఉచిత నిర్బంధవిద్యను

ప్రాథమిక హక్కుగా పొందుపర్చారు. దీనిని అమలు పర్చుడానికి "ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం - 2009" ను పార్లమెంటు 2009 ఆగష్టు 27న ఆమోదించింది. ఇది ఏప్రిల్ - 1, 2010నుండి జమ్మూకాశ్మీర్ మినహా దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో అమలవుతోంది.

ఈ విద్యాహక్కు చట్టం ప్రకారం...

- 6-14 సం॥ లోపు చిన్నారులకు విద్య ప్రాథమిక హక్కు అయ్యింది.
- పాఠశాలల్లో కనీస ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది.
- అన్ని ప్రయివేటు పాఠశాలల్లో పేదకుటుంబాల పిల్లలకు 25% సీట్లు రిజర్వు చేయాల్సి ఉంటుంది.
- పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం డొనేషన్లు, క్యాపిటేషన్ ఫీజులు, ఇంటర్వ్యూలు మరియు ప్రవేశపరీక్షలు నిబంధనలకు విరుద్ధం.
- డ్రాపౌట్లను వారి సమాన తరగతి విద్యార్థుల స్థాయికి తెచ్చేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి.
- విద్యార్థి నిష్పత్తికి అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలి.

## సమాచార హక్కు చట్టం

భారత ప్రభుత్వం 2005 లో సమాచార హక్కుచట్టం రూపొందించింది. ఇది నిజంగా వినియోగదారుని చేతులో రామబాణం. అడిగిన సమాచారాన్ని ఇవ్వాల్సిందేనని నిర్దేశిస్తుంది. ఇది అవినీతిని అంతంచేసే ఒక ప్రక్రియ.

ప్రతి అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడం కోసం, అధికార యంత్రాంగం యొక్క సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు, పౌరులకున్న సమాచార హక్కును చట్టబద్ధం చేయడం కోసం, కేంద్ర సమాచార కమీషన్‌ను నెలకొల్పడం కోసం, సంబంధిత ఇతర అంశాల కోసం ఉద్దేశించినది ఈ చట్టం. ఈ చట్టం ద్వారా మనకు కావలసిన సమాచారాన్ని పొందవచ్చు. కింద పేర్కొన్న విధంగా మనం ఏ సంస్థనుండైనా సమాచారాన్ని అడగవచ్చు.

"సమాచార చట్టం-2005" ప్రకారం సమాచారం కోసం...;

1. సమాచార చట్టం 2005 ప్రకారం మీరు ఏ పబ్లిక్ అథారిటీ నుండి అయినా సమాచారం కోరవచ్చు. (పబ్లిక్ అథారిటీ అంటే ప్రభుత్వసంస్థ లేదా ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచే సంస్థ)
2. దరఖాస్తు ఫారాన్ని ఏ భాషలోనైనా రాయవచ్చు.
3. దరఖాస్తులో కింది సమాచారాన్ని తెలియజేయండి.
   (a) సహాయ పౌరసమాచార అధికారి / పౌరసమాచార అధికారి పేరు :
   (b) కార్యాలయం చిరునామా :
   (c) విషయం :
   (దరఖాస్తు సమాచార చట్టం 2005 సెక్షన్ 6(1) ప్రకారం)
   (d) మీకు కావలసిన సమాచారం వివరాలు :

(e) దరఖాస్తుదారు పేరు :

(f) తండ్రి / భర్త పేరు :

(g) కేటగిరి (SC/ST/OBC) :

(h) దరఖాస్తు రుసుము :

(i) మీరు పేద (బి.పి.యల్) కుటుంబానికి చెందినవారా? (అవును/కాదు)

(j) మీ పోస్టల్ చిరునామా :

(k) మొబైల్ నం :

(l) తేది, ఊరు :

(m) దరఖాస్తుదారు సంతకం :

(n) జతపరుస్తున్న పత్రాల జాబితా :

4. దరఖాస్తును దాఖలు చేసేముందు పౌరసమాచార అధికారి / సహాయ పౌరసమాచార అధికారి పేర నిర్దేశించిన సుంకం, చెల్లించవలసిన తీరు సక్రమంగా వున్నది లేనిది సరిచూసుకోండి. (SC, ST, OBC వారికి రుసుము మినహాయింపు ఉంది, అయితే వారు కులధృవీకరణ పత్రాలను జతపర్చాలి).
5. దరఖాస్తును స్వయంగా లేదా పోస్టుద్వారా పంపవచ్చు.
6. పంపిన దరఖాస్తుకు సంబంధించిన రసీదు తీసుకోండి, దానిపై తేది, కార్యాలయపు ముద్ర స్పష్టంగా ఉండేలా చూడాలి.
7. దరఖాస్తు ఇచ్చిన నాటినుండి రోజులు లెక్కిస్తారు.

మనం దరఖాస్తు సమర్పించాక ఎన్నిరోజుల వరకు సమాచారాన్ని పొందవచ్చో కింది పట్టికద్వారా తెలుసుకోవచ్చు.

| క్ర.సం. | పరిస్థితి | సమాచారం అందజేయడానికి గడువు |
|---|---|---|
| 1. | సాధారణ పరిస్థితిలో | 30 రోజులు |
| 2. | వ్యక్తి జీవితానికి, స్వేచ్ఛకు సంబంధించినట్లయితే | 30 రోజులు |

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. చట్టాలు ఎందుకోసం? వాటి ప్రయోజనాలేమిటి?
2. మీకు తెలిసిన చట్టాల గురించి చెప్పండి?
3. చట్టాల అమలు వల్ల కలిగే లాభాలు ఏమిటి? ఒకవేళ చట్టాలు అమలుకాకపోతే జరిగే నష్టం ఏమిటి?
4. సమాచార చట్టం గురించి తెలుసుకున్నారు కదా! ఆ చట్టం గురించి మీకేమి అర్థం అయ్యింది? ఆ చట్టం ద్వారా మీరెలాంటి సమాచారాన్ని పొందాలనుకున్నారు.

## (అ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- సమాచార హక్కు చట్టం ద్వారా మీరు 2, 3 సమాచారాలను ఎలా పొందాలనుకుంటున్నారో మాదిరి దరఖాస్తులను పూరించి తీసుకురండి.
- వార్తాపత్రికలు, టి.వి.లలో మీరు చదివిన విన్న ప్రజల సమస్యలకు సంబంధించిన వార్తలను సేకరించండి. వాటిని ఎలా పరిష్కరించవచ్చో రాయండి.

## తెలుసుకోండి

### సమాచార హక్కు చట్టం అద్భుతమైన ఫలితాలను సాధిస్తుందని మీకు తెలుసా?

ప్రజలలో ఏదో ఒక విషయానికి సంబంధించిన అసమానతలు ఉన్నప్పుడు అశాంతి రేగుతుంది. న్యాయం కోసం సమాజం గొంతెత్తి అరుస్తుంది. ఉద్యమాలు చేపడుతుంది. ఫలితంగా కొన్ని చట్టాలు రూపొందించుకోవడం అమలులోకి రావడం జరుగుతుంది. ప్రజాస్వామ్య దేశంలో అందరికీ స్వేచ్ఛగా సమానత్వంలో బతికే అవకాశం హక్కు ఉంది. ఈ హక్కులను కాపాడుకోవాలంటే చట్టాలు ఉండాలి. చట్టం సాయంతో అన్యాయాలు జరిగినపుడు ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రశ్నించే హక్కు, తప్పుచేసిన వారిని నిలదీసే హక్కు సామాన్యులకు లభిస్తుంది. ఇక్కడ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు వాళ్ళ సమస్యలను ఎలా పరిష్కరించుకున్నారో ఒక సంఘటనను తెలుసుకుందాం.

**పేరు : ఖాశీంబీ, వృత్తి : చేనేత, జిల్లా : అనంతపురం**

కుటుంబమంతా రోజల్లా కష్టపడితేగానీ... నాలుగువేళ్ళు లోపలికెళ్ళని పరిస్థితి. ఆ నేపథ్యంలో ఓ ప్రమాదంలో భర్త మరణంతో ఖాశీంబీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది. ఏం చేయాలో ఎలా బతకాలో తెలియదు. తెలిసినవారి సలహాతో ఆపద్బంధు పథకం కింద ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆర్నెల్లపాటు తహశీల్దారు కార్యాలయంచుట్టూ తిరిగారు. పట్టించుకున్నవారు లేరు. ఆ సమయంలో ఆమెకు సమాచార హక్కు చట్టం గురించి తెలిసింది. తన వినతిపత్రాన్ని ఏం చేశారంటూ దరఖాస్తు చేశారు. దరఖాస్తు గడువు సమీపిస్తుండగానే అధికారుల్లో చలనం వచ్చింది. ఖాశీంబీకి కలెక్టర్ చేతులమీదుగా 50 వేల రూ|| చెక్కును అందజేశారు. ఆ డబ్బులతో చేతిమగ్గం కొనుక్కొని బతుకుతున్నాం. స.హ. చట్టం లేకపోతే మాగతి ఏమయ్యేదో అంటారు ఖాశీంబీ.

**పేరు : రాజ్‌కుమార్, ఓంకార్, వృత్తి : విద్యార్థులు, జిల్లా : వరంగల్**

గ్రామంలో అభివృద్ధిపనుల జాడ కనిపించట్లేదు. వస్తున్న నిధులేమవుతున్నాయో ఎవరికీ తెలియదు. దీనిపై ఉన్నతాధికారులకు గ్రామస్తులు ఫిర్యాదుచేశారు. ఫలితం లేదు. ఈ దశలో సమాచారహక్కు చట్టం ప్రయోగించారు. రాజ్‌కుమార్, ఓంకార్ నిధులు, వాటి ఖర్చుల వివరాలపై కార్యదర్శికి దరఖాస్తు చేశారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

మొత్తం 4.50 లక్షలను సర్పంచి స్వాహా చేసినట్లు తేలింది. దాంతో ఉన్నతాధికారులకు ఆ యువకులు మళ్ళీ ఫిర్యాదుచేశారు. ఈసారి పక్కాగా సాక్ష్యాలు సమర్పించారు. విచారణానంతరం సర్పంచి చెక్‌పవర్ రద్దయింది.

**పేరు : శ్రీనివాసరావు, వృత్తి : వ్యవసాయం, ఊరు : బోడిపాలెం, గుంటూరు**

గుంటలు పడి... రాళ్ళు తేలిన రహదారిలో నడవడమే కష్టం. ఇక వాహనాలపై అయితే ఒళ్ళు హూనమే. బోడిపాలెం గ్రామస్థుల కష్టాలివే. 20 లక్షల రూ. జెడ్పీరోడ్డు వేసిన రెండేళ్ళకే కొట్టుకుపోయింది. బాగుచేయించండి సారూ అంటూ అధికారులను ఎన్నిసార్లు కలిసినా పట్టించుకున్నవారు లేరు. రహదారి నిర్మాణం మరమ్మత్తుల ఖర్చు చేపట్టిన పనుల వివరాలు అడుగుతూ సహ. దరఖాస్తు చేశారు. వచ్చిన సమాచారంతో కలెక్టకరును కలిసారు. తెల్లారేసరికి అధికారులు వచ్చి రోడ్డును పరిశీలించి నిధులు మంజూరు చేశారు. కొత్త రహదారి నిర్మించారు.

**పేరు : రమణ, వృత్తి : వ్యవసాయం, జిల్లా : జలమూరు**

పారిశుధ్యం, రహదారులు, వీధిదీపాలు... ఆ ఊరికి అన్నీ సమస్యలే వెంకటరమణ. వాటిని ప్రజాపథంలో అధికారుల దృష్టికి తీసికెళ్ళినా, 4 సార్లు కలెక్టరుకు వినతిపత్రం ఇచ్చినా స్పందన లేకుండా పోయింది. ఇంతలో కొత్త కలెక్టరు వచ్చారు. ఆయన్ని కలిసినా ఫలితం శూన్యం. అంతలో రమణకు స.హ.చట్టం గురించి తెలిసింది. ఆర్జీలపై ఏం చర్యలు తీసుకుంటున్నారంటూ కలెక్టరు కార్యాలయానికి దరఖాస్తు పంపాడు. కలెక్టరు స్పందించి పి.ఎల్‌పిఓకు ఆదేశాలిచ్చారు. వెంటనే వీధి దీపాలు, కుళాయిలు ఏర్పాటయ్యాయి. ఒకే ఒక స.హ. దరఖాస్తు ఆ ఊరి తలరాతను మార్చేసింది.

సమాచార హక్కు చట్టం అనే ఒకే చట్టం ద్వారా ప్రజలు వాళ్ళ సమస్యలను ఎలా పరిష్కరించారో తెలుసుకున్నాడుకదా! ఇలా ఎన్నో చట్టాలు మన హక్కులను కాపాడడానికి మన సమస్యలను పరిష్కరించుకోవడానికి ఉన్నాయి. వాటి గురించి తెలుసుకొని మన హక్కులను కాపాడుకోవడంలో మన వంతు బాధ్యతను నిర్వర్తిద్దాం.

**సూక్తి**

**ఆవేశం ఆత్మవంచనకు గురిచేసి అనర్థాలకు దారితీస్తుంది. శాంతి ఆత్మపరిశీలనకు మార్గం చూపి ప్రశాంతతకు దోహదపడుతుంది. పరిస్థితులను శాంతియుతంగా ఎదుర్కోవడం వలన మనోబలం పెరుగుతుంది.**

**- స్వామి వివేకానంద.**

# 12 శాంతి

**I. ప్రధాన విలువ**

శాంతి, అహింస, సౌందర్యాత్మక స్పృహ

**II. ఉప విలువ**

ప్రపంచశాంతి

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- శాంతి లక్షణాలు అలవర్చుకుంటారు. ప్రపంచ శాంతికై కృషిచేస్తారు.

## IV. ఉపోద్ఘాతం

మనకు ఎన్ని సౌకర్యాలు ఉన్నా, ధనంఉన్నా, సంపద ఉన్నా, బంధుమిత్రులు, స్నేహితులు ఉన్నా శాంతి లేకపోతే సుఖం ఉండదు. సమాజంలో బతుకుతున్న మనం సమాజంలో శాంతి ఉన్నప్పుడే ప్రశాంతంగా జీవనం సాగించగలం. శాంతి, దయ, కరుణ, ప్రేమ మనుషుల మధ్య ప్రేమను, మంచి సంబంధాలను పెంచుతుంది. సమాజ శ్రేయస్సుకై తోటివారితో సత్సంబంధాలు కలిగి కలిసిమెలిసి సంతోషంగా జీవించే వాతావరణాన్ని కలిగి ఉన్నప్పుడే సమాజశాంతి, దేశశాంతి, ప్రపంచశాంతి పొందగలం. శాంతిభంగం వల్ల వాటిల్లే దౌర్జన్యాలు, హింసాత్మక సంఘటనలు, యుద్ధవాతావరణాలు వంటివి సమూలంగా నాశనం చేయకపోతే ప్రజలు క్షేమంగా ఉండడం జరగదు. ప్రపంచశాంతి కాంక్షించే వారందరూ శాంతియుత భావాలు కలిగి ఉన్నప్పుడే అది సాధ్యపడుతుంది.

## V. విషయం

### సన్నివేశం-1

అందరూ బస్‌స్టాండ్‌లో బస్‌కోసం ఎదురుచూస్తున్నారు. అది అత్యంత రద్దీప్రదేశం. సాయంత్రం అవడంతో షాపింగ్‌లకు వచ్చిన జనం, మార్కెట్‌కు వచ్చిన జనం బస్‌దిగి ఇంటికి వెళుతున్న జనం ఇలా జనంతో కిక్కిరిసి ఉంది. ఇంతలో హఠాత్తుగా ఒక టిఫిన్ సెంటర్‌లో పెద్ద బాంబు పేలింది. క్షణంలో వాతావరణం అంతా భీభత్సం అయిపోయింది. ఎటుచూసినా శవాలు, కొంతమంది కాలు విరిగి, రక్తం కారిపోతూ రక్షించమని బాధతో హాహాకారాలు చేస్తున్నారు. తమ కుటుంబసభ్యులు ఏమయ్యారో అని ఆత్రుతగా వెతుక్కునేవారు కొందరు. తల పగిలి కొందరు, ఒళ్ళు కాలి కొందరు, చూడడానికి ఆ ప్రాంతం అంతా భయానకంగా తయారయ్యింది.

### సన్నివేశం-2

రెండవ ప్రపంచయుద్ధం జరిగింది. అమెరికా జపాన్‌దేశంలోని హీరోషిమా, నాగసాకీలపై అణుబాంబులు వేసింది. అణుబాంబులు అత్యంత ప్రమాదకరమైనవి. దాని ప్రభావంవల్ల హీరోషిమా, నాగసాకీలో కుప్పలు కుప్పలుగా ఎక్కడపడితే అక్కడ మనుషుల శవాలు, జంతువులన్నీ చచ్చిపడి ఉన్నాయి. పంటలు, నీరు అన్నీ అణుధార్మికతవల్ల కలుషితమైపోయింది. ఎక్కడ చూసినా స్మశానంలాగా ఉంది. కొంతమంది బతికినా వాళ్ళు బతికినంతకాలం వాళ్ళపై అణుధార్మికత ప్రభావం ఉంటుంది.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పై రెండు సన్నివేశాలు విన్నారుకదా! సన్నివేశాలు జరగడానికి కారణాలు ఏమైఉంటాయి?
2. ఇటువంటి సంఘటనలవల్ల ఎవరెవరికి నష్టం కలుగుతుంది?
3. ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే ఏమి జరగాలి?
4. అహింస, మానవత్వం, సహనం ఇవన్నీ శాంతిని పెంచే లక్షణాలు - దీనితో ఏకీభవిస్తారా? ఎలా?
5. మనిషికి ఉన్న రెండుచేతులు ఆప్యాయంగా పలకరించడానికి, వండిపెట్టడానికి, ఆటలాడడానికి, ఇతరులకు సహాయపడడానికి ఉపయోగపడతాయి. అలాగే అవే చేతులు కొట్టడానికి, తోయడానికి, ఆయుధాలు తయారుచేయడానికి, తుపాకీ పేల్చడానికి ఉపయోగపడతాయి. దీన్నిబట్టి మీకేమి అర్థమైంది. తేడా ఎక్కడుంది?
6. యుద్ధానికి, గొడవలకు దారితీసే అంశాలు ఏమైఉంటాయో చర్చించండి.
7. యుద్ధం జరిగినపుడు అక్కడ నివసిస్తున్న ప్రజలు, జంతువుల పరిస్థితి ఎలాఉంటుందో ఊహించండి.
8. ప్రపంచశాంతి నెలకోవాలంటే ఎటువంటి పరిస్థితులు ఉండాలి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మన చుట్టుపక్కల చిన్న చిన్న గొడవలు చూస్తుంటాం, అలాగే పాఠశాలలో కూడా గొడవలు పడుతుంటారు. ఆ గొడవలు సద్దుమణగాలంటే మనం చొరవతీసుకొని శాంతియుతంగా పరిష్కరించాలి. అందుకోసం గొడవపడ్డవాళ్ళతో మాట్లాడాలి.
  - ★ అసలు గొడవకు కారణం ఏమిటి?
  - ★ ఈ గొడవ జరిగినందువల్ల మీకెలా అనిపించింది?
  - ★ గొడవ జరగకుండా ఉండాలంటే నువ్వు ఏం చేసి ఉండవచ్చు?
  - ★ ఈ గొడవ వల్ల ఎవరికి లాభం, ఎవరికి నష్టం. దీని ఫలితంవల్ల ఏం జరుగుతుందో తెలుసా?
  - ★ మీ ఎదురుగా గొడవ జరగుతుంటే ఆపే ప్రయత్నం ఎలా చేస్తారు?

### తెలుసుకోండి

**తన శాంతమే తనకు రక్ష**

శాంతము లేక సౌఖ్యము లేదు సారసదళనయనా
ధాంతునికైనా వేదాంతునికైనా
దార సుతులు ధనధాన్యములుండిన
సారెకు జపతప స్సంపద గలిగిన
యాగాది కర్మము లన్నియు చేసిన
బాగుగ సకల హృద్భావము తెలిసిన
ఆగమ శాస్త్రము లన్నియు చదివిన
భాగవతులను బాగుగ పేరేని ॥శాంతము॥

**భావం :** ఇది త్యాగరాజస్వామి వారి సుప్రసిద్ధ కీర్తన. మానవజీవితంలో శాంతం ఎంత ముఖ్యమో తెలియజెప్పే కీర్తన. సామాన్య మానవునడికే కాదు తపస్వికైనా, వేదాంతికైనా శాంతం ఎంతో ముఖ్యమని, భార్యాబిడ్డలున్నా, ధనధాన్యాలున్నా, జడతపస్సంపదలున్నా, యజ్ఞయాగాది కర్మలన్నీ చేసినా, హృదయ భావాలన్నీ తెలుసుకొన్నా, ఆగమశాస్త్రాలన్నీ చదివినా, భాగవతులన్న పేరున్నా శాంతం లేకుంటే సుఖం లేదట.

మానవుడు ఈ లోకంలో ఏది చేసినా, ఎంత సంపాదించినా సుఖంగా జీవించడానికే కదా. అతనికి అన్నీ ఉన్నా శాంతంలేకుంటే జీవించగలడా? ఎందుకంటే ప్రశాంతత పదార్థాలనుండి లభించేది కాదు. అది మనసుకు సంబంధించినది.

అసంతృప్తి వల్ల మనిషికి అశాంతి, రాగద్వేషాల వల్ల మనిషికి అశాంతి, రోషావేశాల వల్ల, కోపం వల్ల కొండంత అశాంతి. కొందరు చీటికీ మాటికీ చిర్రుబుర్రు లాడుతుంటారు. కొందరు అయినదానికి, కానిదానికి కోప్పడుతూ ఉంటారు. మరికొందరు చిన్న పొరపాటు జరిగినా చిటపటలాడుతుంటారు. ఇలాంటి వాళ్ళు తమకు ఎంతమందిఉన్నా, ఎన్నిఉన్నా సుఖంగా ఉండగలరా.

భగవంతుడు మనిషికి మంచి ముఖాన్ని, అందమైన చిరునవ్వును ఇస్తే, కొందరు తమ ముఖాలను ముళ్ళపొదల్లా, సెగలు, పొగలు గ్రక్కే కొలుముల్లా, అరసోలెడు ఆముదం త్రాగినట్లుగా ఉంచుకుంటారు. మచ్చుకైనా ఒక చిరునవ్వు నవ్వరు. ఇట్లాంటి ముఖాలు మనిషి ఆరోగ్యాన్ని చెడగొట్టావా?

శాంతం లేకుంటే వ్యక్తికి సుఖముండదు. వ్యక్తికే కాదు కుటుంబానికి, సమాజానికి కూడా సుఖం ఉండదు. ప్రశాంతత లోపిస్తే సుఖమే కాదు అభివృద్ధికూడా ఉండదు. అందుకే వ్యక్తి సమాజం అభివృద్ధి చెందాలంటే శాంతి నెలకొల్పబడాలి.

శాంతి మనసుకు ప్రశాంతతను చేకూరుస్తుంది. ప్రశాంతంగా ఉన్న మనస్సు సృజనాత్మకంగా ఆలోచించ గల్గుతుంది. మంచి ఆలోచనల వల్ల మంచి పనులు జరుగుతాయి. మంచిపనులు చేయడం వల్ల సమాజానికి మేలు జరుగుతుంది. దేశం కూడా ప్రగతి పథంలో నడుస్తుంది. అందుకే అరాచకాలు, ద్వేషాలు మానేయాలి. ఆ ఆలోచనలు కూడా దరికి రానీయకూడదు. సమాజంలో ఒకరమైన మనం సమాజ హితాన్ని కోరి శాంతితో సమస్యలను పరిష్కరించుకోవాలి శాంతిమార్గాన నడుస్తూ శాంతిని సాధించాలి.

శాంతిమార్గాన నడిచిన బుద్ధుడు, గాంధీ, మదర్‌థెరిస్సా వంటి గొప్ప నాయకులు మనకు ఆదర్శమూర్తులు.

కత్తి చూపించి మనుషుల మనసులు మార్చలేము. అహింసాయుధంతో శాంతిమార్గంలో పయనిస్తూ సర్వులనూ జయించగలము.

శాంతియుత జీవనం గడపడానికి మనలో మనం ముందు ఆ స్వభావాన్ని అలవరచుకోవాలి. సహనం, ఓర్పు, ఆత్మనిగ్రహం కలిగిఉండడం, అన్ని జీవులపట్ల ప్రేమతో మెలగడం ధర్మాన్ని ఆచరించడం ఉద్రేకాలను లోనుకాకుండా చిరునవ్వుతో సమస్యలను పరిష్కరించడం సత్యం పలకడం, స్వార్థబుద్ధి లేకుండడం, పరులకు కష్టాలను కలిగించకుండా వారి కష్టాలను తమ కష్టాలుగా భావించి సహకరించడం, ఆదుకోవడం వంటి లక్షణాలను ఎప్పుడైతే కలిగిఉంటామో అవి శాంతి స్థాపనకు కావలసిన ఆత్మస్థైర్యాన్ని మనకు అందిస్తాయి. మనలను నడిపిస్తాయి.

తన కోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష

అని భావించి శాంత స్వరూపులై చేసే పనులు జగమంతా శాంతిని నింపుతాయి.

**సూక్తి**

జీవితానికి గొప్ప అర్థం భూతదయను కలిగి ఉండటమే
- అబ్రహం లింకన్

# 13 శ్రమ విజయం

**I. ప్రధాన విలువ**

శ్రమ విలువ

**II. ఉప విలువ**

శ్రమతోనే విజయం లభిస్తుందని తెలుసుకోవడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- కష్టించి పనిచేయడం ద్వారానే విజయం లభిస్తుందని గుర్తించగల్గడం.
- కష్టించి పనిచేసే తత్వాన్ని పెంపొందించుకొనగల్గడం.

## IV. ఉపోద్ఘాతం

శ్రమపడి సంపాదించుకున్నది ఏదైనా ఆరోగ్యాన్ని, ఆనందాన్ని ఇస్తుంది. పెద్దైన తర్వాత రోగాలు పోగొట్టు కోవటం కోసం వ్యాయామం చేసి శ్రమపడేది కొందరైతే, చిన్నప్పటినుండే పూట గడవక శ్రమపడేవాళ్ళు మరికొందరు. ఏదిఏమైనా శ్రమదే గెలుపు. కష్టమైన ప్రారంభం సుఖమైన ముగింపును ఇస్తుంది. కష్టమైన పనంటూ ఉండదు. కష్టం అనే ఆలోచన మన మనస్సులోనే ఉంటుంది. పనిలో సులువు, మెళకువలు తెలుసుకో గలిగి శ్రద్ధతో చేస్తే అది ఎప్పటికీ కష్టంకాదు. నిట్టనిలువుగా వున్న కొండను కేవలం కాళ్ళ సహాయంతో ఎక్కడం చాలాకష్టం. కానీ 'ఆత్మవిశ్వాసం' అనే ఆక్సిజన్‌తో ఎక్కడం ప్రారంభిస్తే అనంతకాలాన్ని అందుకోవచ్చు. అలాగే విజయం సాధించి ఆనందం మన సొంతం చేసుకోవాలన్నా ముందుగా కష్టపడాలి. అదే విజయతీరం చేరడానికి సరైన సులువైన దారి. కష్టించి పనిచేయడం ఒక్కటే విజయానికి మార్గం అని గుర్తుంచుకోవాలి.

పిల్లలూ! కష్టించి పనిచేయడంద్వారా విజయం పొందినవారి పేర్లు కొన్ని చెప్పండి.

వీరంతా తమ కృషిద్వారా విజయతీరాలను చేరినవారే. అయితే శ్రమద్వారా విజయం పొందిన మరికొందరి గురించి తెలుసుకుందాం.

## V. విషయం

నిరంతరం శ్రమించడం ద్వారా, అకుంఠిత దీక్ష వలన అనంతమైన ఫలాన్ని పొంది జీవితంలో ఉన్నత స్థితిని పొందవచ్చును.

1. ఐన్‌స్టీన్ బాల్యంలో చదివేటప్పుడు అందరూ అతనిని బద్ధూ (మొద్దూ) అని పిలిచి ఏడిపించేవారు. ఉపాధ్యాయులు అడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పలేకపోయేవాడు. గణిత ఉపాధ్యాయుడైతే "ఏడుజన్మలు ఎత్తినా నీకు లెక్కలు రావు పో" అనేవారు. ఆ మాటలు ఐన్‌స్టీన్‌కు బాధను కలిగించాయి. "నేను ఎలాగైనా గణితంలో మంచి ప్రావీణ్యం సంపాదిస్తాను." అంటూ నిరంతరం పరిశ్రమించారు. అతడు పెరిగి పెద్దవాడై శ్రేష్ఠ గణితశాస్త్రజ్ఞునిగా, విజ్ఞానవేత్తగా పేరుపొందాడు.

2. హెన్రీఫోర్డు అమెరికాలో ఒక చిన్న గ్రామంలో గ్రీస్‌లో పుట్టాడు. ఇంట్లో ఆర్థికపరిస్థితి అధ్వాన్నంగా ఉంది. 12వ ఏట ఫోర్డు ఉద్యోగంలో చేరాడు. రాత్రిపూట చదువుకునేవాడు. మిషన్లు తయారుచేయడం, మరమ్మత్తులు చెయ్యడం ఇదే అతని పని. మనస్సులో ఎప్పుడూ ఇదే పట్టుదలవల్ల పరిశ్రమవల్ల హెన్రీ ఒక మెకానిక్ అయ్యాడు. తన కాళ్ళపై తాను నిలబడ్డాడు. తరువాత అతను మోటారుకార్లను తయారుచేసే పనిని చేపట్టాడు. ఇందులో ఎంతో నైపుణ్యాన్ని సంపాదించాడు. ఆ పనిలో ముందుకు సాగిపోయాడు. ఈనాడు అమెరికాలో ఫోర్డు కంపెనీదే అగ్రస్థానం. అతని ఫ్యాక్టరీలో 50,000 మంది కార్మికుల పని చేస్తున్నారు. నిముషానికి ఒక మోటారు కారు తయారవుతుంది అక్కడ.

3. 1865 లో బెంగాల్‌లో ఘోరమైన కరువు తాండవిస్తోంది. ఈశ్వర చంద్ర విద్యాసాగర్ పనిమీద బర్ద్వాన్ వెళ్లాడు. అక్కడ ఒక బాలుడు "బాబూజీ! ఒకపైసా ఇప్పించండి" అని అడిగాడు. విద్యాసాగర్ కరుణాసాగరుడు. "అబ్బాయ్! పైసాతో ఏం చేస్తావ్" అడిగాడు. ఆకలిగా ఉంది. ఏదైనా కొనుక్కొని తింటా" అన్నాడు. 'నాలుగు పైసలిస్తే ఏమిచేస్తావ్! ఈశ్వర చంద్ర అతనిని అడిగారు. రెండు పైసలు నాతల్లికిచ్చి, రెండు పైసలతో ఏదైనా కొనుక్కుంటాను' జవాబిచ్చాడు బాలుడు. 'ఎనిమిది పైసలిస్తే' నాలుగు పైసలుపెట్టి కొనుక్కొని తింటాను. నాలుగుపైసలు తల్లికిస్తాను. 'మరి పదహారు పైసలిస్తే' – "ఎనిమిదిపైసలతో నాకూ నాతల్లికి రెండ్రోజులకు ఆహారం కొనుక్కొని, మిగిలిన ఎనిమిది పైసలతో మామిడికాయలు కొని అమ్ముతాను. కొంత ఆదాయం వస్తుంది" అన్నాడు. వెంటనే ఈశ్వర చంద్రవిద్యాసాగర్ అతని చేతిలో పదహారుపైసలు పెట్టాడు.

కొన్నేళ్ళు గడిచాయి. ఆ బాలుడు యువకుడయ్యాడు. విద్యాసాగర్ మళ్లీ బర్ద్వాన్ వెళితే, బజారులో ఆ యువకుడు చూశాడు. పరిగెత్తుకుంటూ వచ్చి ఆయన పాదాలకు నమస్కరించి తన దుకాణానికి తీసుకు పోయాడు. విద్యాసాగర్ అతనిని గుర్తుపట్టలేదు. అప్పుడు ఆ బాలుడు 'నాకు ఆనాడు 16 పైసలు ఇచ్చారు. దాని సహాయంతో పైకి వచ్చాను. ఇప్పుడు చిన్నదుకాణం పెట్టుకున్నాను అంటూ విషయమంతా చెప్పాడు. అతని శ్రమ నిష్ఠకు ఈశ్వరచంద్ర విద్యాసాగర్ ఆశ్చర్యపోయారు.

ప్రయత్నం – పరిశ్రమ ద్వారా మనం ఎంతో ఉన్నత స్థితికి చేరుకోగలుగుతాము. నిరంతర పరిశ్రమ సత్ఫలితాలకు ఆధారమవుతుంది.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. 'శ్రమతోనే విజయం' అన్నారుకదా! దీన్ని మీరెలా సమర్థిస్తారు?
2. మీ ప్రాంతాలలో కష్టించి పనిచేయడం ద్వారా విజయం పొందిన వ్యక్తుల గురించి చెప్పండి.
3. మీరు ఏపనినైనా సాధించడానికి కష్టపడ్డారా? ఆ పనిలో విజయం సాధించనపుడు మీకు ఎలా అనిపించింది?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ జీవిత లక్ష్యం ఏమిటి? (మీరు జీవితంలో ఏమి కావాలనుకుంటున్నారు?) దానిని సాధించడానికి మీరు ఎలా శ్రమిస్తారో చెప్పండి? అలా శ్రమతో ప్రయత్నించడం మొదలు పెట్టండి.

### తెలుసుకోండి

ప్రతి కష్టంలోనూ అనిర్వచనీయమైన ఆనందం ఉంది. ఉదాహరణకు ప్రపంచ ప్రసిద్ధిచెందిన చిత్రకారుడు పికాసో తన 'మోనాలిసా' చిత్రాన్ని ఆరేళ్ళు కష్టపడి చిత్రించాడు. పదేళ్ళు కష్టపడి ఓ శిల్పి రాయిని జీవం ఉట్టిపడేలా మలుస్తాడు. వేలమంది ఏళ్ళతరబడి శ్రమతో చైనాగోడ నిర్మితమైంది. ఎంతో శ్రద్ధగా శ్రమపడి ఒక మొక్కను రక్షిస్తే పెద్దచెట్టుగా ఎదిగి నీడనిస్తుంది. ఈ పనులన్నీ చేసినవారు ఎంతో కష్టపడ్డారు. ప్రతి నిముషం, ప్రతి దశలో స్వేదాన్ని చిందించారు. కానీ వారి కష్టానికి ఫలితం అంతిమంగా ఆనందమే. ఇష్టంతో చేస్తే, ప్రతి కష్టంలోనూ ఆనందముంటుంది.

ఫలానా టైముకల్లా ఇంత అమ్మకాలు జరపాలి అని సేల్స్‌పర్సన్ ఎదురుగా ఓ టార్గెట్ ఉంటుంది. వెంటనే అతను ఒక ప్రణాళికను తయారుచేసుకుంటాడు. ఎవరెవరిని ఎప్పుడు కలవాలి. ఎలా ఆర్డర్ సంపాదించాలి అనేది నిర్ణయించుకుంటాడు. అనుకున్న ప్రకారం ఒక్కొక్కరుగా కస్టమర్స్‌ను కలుస్తాడు. వారిని తన వాక్ చాతుర్యంతో ఒప్పించి సేల్స్ చేస్తాడు. ఒకవేళ వినియోగదారుడు స్పందించకపోతే రెండు, మూడు, నాలుగుసార్లు వెళతాడు. చివరికి అనుకున్నట్లుగా ఆర్డర్ సంపాదించి తన టార్గెట్ సాధిస్తాడు. పదేపదే తిరగడం, కస్టమర్‌ని ఒప్పించడం కష్టసాధ్యం కావచ్చు. కానీ ఫలితంవల్ల పొందే ఆనందాన్ని అనుభవంలోకి తెచ్చుకోడానికి ఆ సేల్స్ పర్సన్ ఆనందంగా కష్టపడతాడు. ఎప్పుడైనా పనిచేసేవాడు నేర్చుకుంటాడు. ఏమీ తెలియనపుడుకన్నా కష్టపడి పని నేర్చుకున్నప్పుడు కలిగే ఆనందం అనిర్వచనీయం.

పట్టుదలతో శ్రమించడం ద్వారా భారతదేశానికి కీర్తిని సంపాదించిపెట్టిన సచిన్ టెండూల్కర్, విశ్వనాధన్ ఆనంద్ వంటి ఎందరో క్రీడాకారులు మన దేశానికి గర్వకారణం. అలాగే ప్రతి ప్రాంతంలో ఎందరో వ్యక్తులు తమ శ్రమద్వారా విజయం పొందిన అసామాన్యులు మనచుట్టూనే ఉంటారు. అలాంటివారిలో ఒకరు ఉదయభాస్కర్. ఉదయభాస్కర్ జీవితం గురించి తెలుసుకున్నవారెవరైనా జీవితంలో తమకంటూ ఒక

లక్ష్యాన్ని ఏర్పరచుకొని దాన్ని సాధించాలనే నిర్ణయానికి వస్తారు. ఆ యువకుడు తన జీవితంలో ఏర్పడిన ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అయ్యాడు. ప్రఖ్యాతిపొందిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో సిస్టమ్స్ ఇంజనీరుగా ఉద్యోగం సంపాదించాడు. ఒక ఆటోడ్రైవర్‌గా తన జీవితం ప్రారంభించి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఎదగడంలో అతని కృషి అద్వితీయం. అందుకే అంటారు కొందరు భగవంతుడు కూడా కష్టపడేవారి విజయాన్ని అడ్డుకోలేరని. ఈ కథ వింటే మీకూ అర్థమవుతుంది.

పార్వతీపరమేశ్వరులు ఆకాశమార్గాన వెళ్తుండగా ఒకరైతు తన పొలంలో విత్తనాలు చల్లుతూ కన్పించాడు. వెంటనే వాళ్ళిద్దరూ భూమిమీదకొచ్చారు. "వర్షం వచ్చే అవకాశం లేదు. మరి విత్తనాలు ఎలా మొలకెత్తుతాయి?" అన్నాడు శివుడు. ఈ రాత్రికి వర్షం వస్తుందన్నాడు రైతు. ఆ విషయంలో వాదన కల్గింది. ఎవరిమాట నిజమవుతుందో ఈ రాత్రికి తెలుస్తుంది అన్నాడు రైతు.

శివుడు వర్షాధిపతి అయిన ఇంద్రుడివద్దకెళ్ళి వర్షం రాకుండా చూడమన్నాడు. "అది నావల్ల కాదు. కప్పలు బెకబెకలాడితే మాత్రం వర్షం పడేట్లు చూడాల్సిందే" అన్నాడు. శివుడు కప్పలదగ్గరకెళ్ళి వాటిని బెకబెకలాడవద్దన్నాడు. 'అది మావల్ల కాదు, మిణుగురు పురుగులు గనుక ఎగిరితే మేం బెకబెకలాడాల్సి వస్తుంది' అన్నాయి కప్పలు. శివుడు మిణుగురుపురుగుల దగ్గరకెళ్ళి వాటిని ఎగురవద్దని కోరాడు. అవి సరేనన్నాయి.

రాత్రి కాగానే వర్షం మొదలైంది. శివుడికి కోపంవచ్చింది. సంగతి కనుక్కోవడానికి బయల్దేరాడు. ఇంద్రుడిని కలవగానే 'కప్పలు బెకబెకలాడాయి, దాంతో నేను వర్షం కురిపించాల్సి వచ్చింది" అన్నాడు. శివుడు కప్పల దగ్గరికి వెళ్ళాడు. "మిణుగురు పురుగులు ఎగిరాయి, దాంతో మేం బెకబెకమనాల్సి వచ్చింది" అన్నాయవి. శివుడు మిణుగురు పురుగులను కలవగా అవి ఎగరలేదన్నాయి. చివరికి సంగతేమిటో పరిశీలిద్దామని శివుడు పొలం దగ్గరికెళ్ళాడు.

అక్కడ పొలంలోని చెట్టుకింద మినుకు మినుకు మంటూ వెలుతురు కన్పించింది.. మరింత దగ్గరగా వెళ్ళి చూస్తే రైతు ఒక మండుతున్న చిన్న పుల్లను పట్టుకొని విత్తనాలు చల్లుతున్నాడు. అంటే మండుతున్న పుల్లను చూసి కప్పలు మిణుగురు పురుగులు అనుకొని బెకబెక లాడాయన్నమాట.

శివుడు తన ఓటమిని రైతుముందు అంగీకరించి కైలాసం వెళ్ళిపోయాడు. కష్టపడి పనిచేసే వ్యక్తికి విజయం లభించకుండా చివరికి దేవుడు కూడా అడ్డుకోలేడు.

కాబట్టి 'కష్టేఫలి' కష్టపడినవారికి విజయం తథ్యం. విజయానికి అడ్డదారులు లేవు. కష్టించి పనిచేయడం ఒక్కటే సరైన మార్గమని గుర్తించి ఆచరణలో పెట్టండి. మీ లక్ష్యాలను చేరుకోడానికి మీ ప్రణాళికలు సిద్ధం చేసుకోండి. కార్యరంగంలోకి దూకి విజయాన్ని మీ సొంతం చేసుకోండి.

**సూక్తి**

శ్రమ నీ ఆయుధమైతే, విజయం నీ బానిస అవుతుంది

– గాంధీజీ

# 14 సమాజ సేవ

**I. ప్రధాన విలువ**

సేవాభావం

**II. ఉప విలువ**

సామాన్యులు అసామాన్య సేవలు చేయడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- సమాజానికి సేవ చేయడానికి డబ్బుతో సంబంధం లేకుండా మంచి మనసు కల్గిఉండాలని తెలుసుకోగలగాలి.
- విద్యార్థులలో సమాజానికి సేవచేసే ఆలోచనను కల్గింప చేయడం.

## IV. ఉపోద్ఘాతం

సమాజంలో రకరకాల వ్యక్తులు ఉంటారు. సమూహాలు ఉంటాయి. జాతులు ఉన్నాయి. డబ్బున్న వాళ్ళు, పేదవాళ్ళుంటారు. వాళ్ళందరివి వేరువేరు ఉద్దేశ్యాలన్నట్లు కనిపిస్తాయి. డబ్బున్నవాళ్ళలో కొంతమంది అవసరాలకు మించి ఆడంబరాలకు, విలాసాలకు డబ్బును ఖర్చు చేస్తుంటారు. సామాన్యులలో కొంతమందికి సమాజసేవ చేయాలనే దృక్పథం ఉంటుంది. సమాజం నుండి ఏమి ఆశించక నిస్వార్థసేవ చేయాలనుకునే వారుంటారు. ఎలాంటి స్వార్థం లేకుండా సమాజానికి సేవచేస్తుంటారు. అలాంటి వారి కృషిని గుర్తించాలి. సేవ చేయడానికి డబ్బు ముఖ్యంకాదు. మంచి మనసుండాలి. మానవత్వం కల్గిఉండాలి. అలాంటివారి గురించి కింది విషయాల ద్వారా తెలుసుకుందాం!

## V. విషయం

### సంఘటన-1

ఆరో తరగతి విద్యార్థిగా ఉన్న దరిపల్లి రామయ్య తమ మాస్టారు మల్లేశం చెప్పే పాఠం శ్రద్ధగా వింటున్నాడు. మొక్కల వల్ల ఇన్ని ప్రయోజనాలున్నాయా? అడిగాడు రామయ్య, ఉండబట్టలేక. అవును బిడ్డా, ఉన్నాయి చెప్పాడు మాస్టారు. అంతే తరగతి గదినుంచి లేచి వెళ్ళాడంతే మళ్ళీ బడికి రాలేదు రామయ్య. నేటికీ చెట్లు నాటుతూనే ఉన్నాడు. ఈయన మన రాష్ట్రానికి సంబంధించినవాడే. ఖమ్మం జిల్లా వాసులకు మాత్రం సుపరిచితుడు.

ఖమ్మంజిల్లా రెడ్డిపల్లి వాస్తవ్యుడైన రామన్నను కలుసుకోవాలంటే రమారమి నాలుగుకిలోమీటర్ల పొడవునా రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన వృక్షాలకిందుగా వెళ్లాలి. రెడ్డిపల్లి గ్రామంలోని అతడి ఇల్లు ఆకుపచ్చగా ఉంటుంది. కన్నులకు హాయిగా ఉంటుంది. ఇంటివెనకాల అతడికి మూడెకరాల పెరడు ఉన్నది. అందులో అడవివలె అలుముకున్న చెట్లు ఉన్నాయి. ఇంటికి నాలుగు కిలోమీటర్ల దూరంలో అతడికి ఏడెకరాల తోట ఉన్నది. అది దట్టమైన అడవిని పోలిఉన్నది. ఇదంతా ఆయన పెంచిన చెట్లే. ఇన్నిఉన్నా అతడు అసహనంతోనే తిరుగుతాడు.

రామయ్య పొద్దున సైకిల్‌పై మొక్కలు పెట్టుకుని ఉదయాన్నే బయలుదేరతాడు. చుట్టుముట్టు ఉన్న ఊళ్లను చుట్టివస్తుంటాడు. ఉదయంపూట బడిలోని విద్యార్థులకు మొక్కలు పంచుతాడు. మధ్యాహ్నంలోగా ఇటింటా గృహిణులకు వనకానుకలు అందజేస్తాడు. సాయంత్రందాకా దారిపొడవునా చెట్లకింద రాలిన విత్తనాలను సేకరిస్తాడు ఆ విత్తనాలను కొండలపై, గుట్టలపై కూడా చల్లుతాడు. అతడు వారానికి రెండుసార్లు ఖమ్మం లైబ్రరీకి వెళ్ళి పర్యావరణ సమాచారం గురించిన నోట్సు రాసుకుంటాడు. వృక్షచరిత్రలు అధ్యయనం చేస్తాడు. వాటిగురించి తాను కట్టిన పాటలకు తుదిమెరుగులు దిద్దుతాడు.

అంతెందుకు అతడు కాలు విరిగినా ప్రచారం ఆపలేదు. తాను తిన్న బత్తాయిపళ్ల విత్తనాలు వేరుచేసి పెట్టుకున్నాడు. 'వృక్షో రక్షతి రక్షితః' అన్న పర్యావరణ నినాదాన్ని పతాకంగా చెక్కి వాటిని పర్యావరణ ఫలకాలుగా మార్చాడు. అతడి చేతిపై పచ్చబొట్టుకూడా పర్యావరణ నినాదం. ఇక ఇంటి గోడలపై పచ్చటి రాతలు, గోడలేకాదు, పచ్చడి జాడీని కూడా వదలకుండా ఆయన పర్యావరణ నినాదాలు రాశాడు. తానూ స్వయానా తన వాహనాన్ని పర్యావరణ శకటంగా అలంకరించుకుంటాడు. ట్రాక్టర్ చక్రాల తాలూకు గుండ్రటి వాచర్లపై రంగుడబ్బీలు కొని ఆకుపచ్చటి అక్షరాలను ముద్దుగా రాస్తాడు. తెలుగు అక్షరాల్లో కొమ్ములుంటాయికదా. వాటిని ఆయన ఆకులుగా చిత్రించడం విశేషం.

ఓరోజు చేతినిండా, భుజంపైనా మొక్కలతో ఖమ్మం బస్సు ఎక్కాడు రామయ్య. ఆరోజే ప్రతి మనిషికి 50 కేజీల లగేజీ ఉచితం అని మొదటిసారి చదివాడు. అంతే వెంటనే బస్సు దిగి మళ్ళీ వెనక్కి వెళ్ళి, 50

కేజీలకు తగినన్ని మొక్కలు పట్టుకుని మళ్ళీ బస్సెక్కాడు. నలభై రెండేళ్లుగా అతడు చెట్లు నాటుతూనే ఉన్నాడు. ఎందుకంటే చెట్టుపుట్టా, అడవీ తన పరం కాదు. సమాజం పరం కావాలని పేరుపేరుగా మనిషివద్దకు వెళ్ళే సహనం అతడి సుగుణం మరి!

కాలచక్రం ఆగుతుందేమోగానీ రామయ్య సైకిల్ వీధిలోకి రావడం జరగదంటే జరగదన్నదీ అక్కడి జనం ఉవాచ.

### సంఘటన-2

రామకృష్ణ తల్లిదండ్రులది హైదరాబాదు, ఆయన మద్రాసీ. రామకృష్ణ పుట్టింది హైదరాబాదులోనే అయినా చిన్నపుడే మద్రాసు వెళ్ళి చదువుకొని అక్కడ మార్కెటింగ్ విభాగాల్లో కొంతకాలం ఉద్యోగం చేశాడు. ఎమర్జెన్సీ సమయంలో ఉద్యోగం పోయింది. దాంతో అక్కడినుంచి ఓ సూటుకేసు తీసుకొని అందులో టెన్త్ సర్టిఫికెట్ పెట్టుకొని ఏదైనా మంచి ఉద్యోగం వెతుక్కుందామని ముంబాయి వచ్చాడు. రైలు దిగేసరికి సూట్‌కేసు పోయింది. దిగాలుపడి ఏదో ఒక ఉద్యోగం అనుకుని పోర్ట్‌లో లోడింగ్ అన్‌లోడింగ్ కూలిపనిలో చేరాడు. ఒక లోడ్‌లోంచి ఇనుపరాడ్లు జలజలా దొర్లిపడ్డాయి. వాటికింద అతడి కాలు చితికిపోయింది. స్పృహతప్పిపడిపోయిన ఆయన ఆస్పత్రిలోంచి బయటకు వచ్చేటప్పటికి ఒకే కాలు కనిపించింది. అప్పట్నుంచీ జైపూర్ ఫుట్ అతడికి ఆసరా!

ఆతర్వాత ఒక కంపెనీలో ఉత్తరాల సార్టింగ్ చేసే పనిలో కొంతకాలం పనిచేశాడు. ఆ కంపెనీ దివాళా తీయడంతో చివరకు తన తల్లిగారి ఊరు హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌కి పెట్టుడుకాలితోనే చేరుకున్నాడు. రెండు దశాబ్దాల తర్వాతకదా! హైదరాబాద్ రూపురేఖలు మారిపోయాయి. తను బంధువులు ఎవరు కనిపించలేదు. ఏం చేయాలో తోచక, నిరాశకు లోనై తిరిగి తిరిగి బడలికతో గణేష్ టెంపుల్ దగ్గరే ఆరాత్రి నిద్రించాడు. మరునాడు అక్కడే కూర్చుని ఉండడం వల్ల ఎవరో అక్కడ పాదరక్షలు విడిచారు. విడిచిన పాదరక్షలు తీసుకుని చేతిలో అర్ధరూపాయి పెట్టిపోయారు. ఆరోజు గడిచింది. అలాగే రెండు దశాబ్దాలు గడిచాయి. ఇరవై ఏళ్ళుగా ఇదే దృశ్యం.

ఒక సంవత్సరం తనవద్ద వేయి రూపాయలు ఉన్నాయికదా అని వాటితో కొన్ని జతల సాక్స్ కొన్నాడు, రెండుచేతులకు సాక్స్ తొడుక్కొని రోజూ కూచుండే స్థలానికి కొంచెం అవతల కూర్చున్నాడు. ఆయనను చూసి టెంపుల్ వాచ్‌మన్ ఎగాదిగా చూశాడు. మరికొందరు చిరు వ్యాపారులు కన్నెర్రజేశారట. తమను మించిపోతాడనే బాధ, దిగులు, ఆవేశం, కోపాన్ని వారి చూపుల్లో అర్థంచేసుకొని ఒకసారి నిమ్నస్థాయి జీవితం గడిపాక దాన్ని అధిగమించి బతికితే సమాజం ఓర్వలేదేమో అనుకున్నాడు. వాళ్ళని ఎదుర్కొని నిలవాలని అనిపించలేదు అతడికి. ఆ సాక్సులు వొదిలేసి చెప్పులు చూసుకుంటూ ఉండిపోయాడు.

తన చేతిలో పెట్టే రూపాయిని అతడు దుర్వినియోగం చేయకుండా వాటితో ఆయన కనీస అవసరాలు తీర్చుకుని మిగిలిన డబ్బులను ప్రతి సంవత్సరం జైపూర్‌లో తనకు పెట్టుడుకాలు ఇచ్చిన సంస్థలకు విరాళంగా పంపుతాడట. ఇదేకాకుండా ఏ అనాథాశ్రమానికో లేదా ఆర్థిక సహకారం అవసరమైన బాధితులకో ఎం.ఓ. చేస్తాడట. నావద్ద ఉన్న డబ్బు నాదికాదు. ఎవరో మీవంటివారే ఇచ్చారు. వాటితో రోజుకు రెండుపూటలా భోజనం చేస్తాను. ఈ ఫుట్‌పాత్‌పై పడుకుంటాను. ఇరవైఏళ్ళుగా ఇదే జీవితం. నాకేమైనా పిల్లలా, జల్లలా? అని చెబుతాడు.

మరేం లేదు - నావంటివారికి నేనున్నానని భరోసా అందిస్తాను. వారివద్దనుండి నా క్షేమాన్ని కోరుతూ దీవెనలు అందితే సంతోషిస్తాను అని చెప్తాడు.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పై రెండు సంఘటనల గురించి విన్నారుకదా! వీటి ద్వారా మీకేమర్థమయ్యింది.
2. సామాన్యులే ఇంత గొప్ప పనులు చేస్తున్నారుకదా! వీరి గురించి నీవేమనుకుంటున్నావు?
3. సేవ చేయడానికి డబ్బులు కావాలా? మానవత్వం కావాలా? ఎందుకో చర్చించండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- ఈ వారమంతా మీరు ఏదైనా చిన్న చిన్న సేవలు చేయండి. ఎప్పుడూ, ఎక్కడ, ఎలా చేసారో ఒక లిస్టు తయారుచేయండి. మీ అనుభవాలు చెప్పండి.

### తెలుసుకోండి

ఆదర్శాలను బోధించేవాళ్ళు కొంతమంది ఆదర్శాలను వల్లెవేసేవాళ్ళు కొంతమంది ఆదర్శాలను ఎలుగెత్తి చాటిచెప్పేవాళ్ల కొంతమంది ఆదర్శాల ముసుగులో స్వలాభం కోసం, సొంత ప్రచారం కోసం పాకులాడే వాళ్లు మరి కొంతమంది మరి ఎవరు నిజమైన ఆదర్శవంతులు? మన సమాజంలో చాలామందికి ఆదర్శాలు చెప్పినవాళ్ళమీద ఉన్న భక్తి, వారు బోధించిన ఆదర్శాలు ఆచరించడంలో ఉండదు. ఉదాహరణకి గాంధీగారిమీద ఉన్న భక్తి గాంధీగారు చెప్పిన, పాటించిన ఆదర్శాలమీద ఉండదు. అన్నమయ్య కీర్తనలు పాడడంలో ఉన్న ఆసక్తి ఆయన కీర్తనల్లో చెప్పిన సామాజిక సేవాదృక్పథాలను అమలుపరచడంలో ఉండదు. అలానే ఇతర ప్రవక్తలూ, నేతల విషయంలో కూడా వీళ్లెప్పుడూ వార్తల్లో వ్యక్తులుగా కనిపిస్తూ ఉంటారు. వ్యక్తిగత

ప్రచారాలు ఏమాత్రం కుంటుపడకుండా జాగ్రత్త పడుతుంటారు కూడా. వీళ్ళకి పూర్తి విరుద్ధంగా కొంతమంది ఉంటారు. వాళ్లెప్పుడూ వేదికలెక్కరు. ఉపన్యాసాలివ్వరు. పత్రికా ప్రకటనల్లో చోటు చేసుకోరు. వారు అతిసామాన్యంగా కనిపిస్తారు. వాళ్ళకి తెలిసిందల్లా తమకి వీలైనంతలో ఎదుటివారికి సహాయం చేయడం. ఆ సహాయాలు ఏ ఆదర్శాల జాబితా కిందికి వస్తాయో, ఎవరు బోధించిన సూత్రాల పరిధికి చెందుతాయో వాళ్లకి అనవసరం. అసలు అలాంటివి వున్నాయని కూడా వాళ్లకి తెలియదు. వీళ్ళకి ప్రచారం అవసరంలేదు. T.V. చానెళ్లు తమ గురించి ఎపిసోడ్స్ చూపిస్తాయా అన్న ఆలోచన అస్సలు ఉండదు. వీళ్ళు ధనవంతులు కానవసరం లేదు. పదవులూ, హోదాలు ఉండాల్సిన అవసరం లేదు. వాళ్లకున్న ఒకేఒక్క అర్హత మానవత్వం! అంతే.

వీళ్ళలో సికింద్రాబాద్ మెండా మార్కెట్‌లో చెరుకురసం అమ్ముకుంటూ పేదవాళ్ళకి పెళ్ళిళ్ళు చేసే నూర్‌బాయ్ లాంటివాళ్ళు, గుడిబయట చెప్పులకు కాపలాకాసి వచ్చిన డబ్బుల్లో కొంతభాగాన్ని తనకి పెట్టుడుకాలునిచ్చిన జైపూర్ సంస్థకి పంపించే రామకృష్ణలాంటివాళ్ళు, గత నలభైఏళ్లుగా సైకిల్‌మీద పచ్చని చెట్లు పెట్టుకుని ఊరూరా తిరుగుతూ వాటిని అందరికీ ఉచితంగా పంచుతున్న రామయ్యలాంటివాళ్ళు! వీరందరూ 'అ'సామాన్యులు. అన్నీఉండీ ఇంకా ఏదో లేదనుకునేవాళ్ళకి, వీళ్లు స్ఫూర్తిదాతలు. జీవితంలో ఆశావహదృక్పథానికి నిలువెత్తు సాక్ష్యాలు, మూర్తీభవించిన మానవత్వానికి సజీవ తార్కాణాలు. 'దేహముంది, ప్రాణముంది, నెత్తురుంది, సత్తువుంది... ఇంతకంటే సైన్యముండునా' అనుకునే ఏకవ్యక్తి సేవలు! సామాన్యుల్లో సామాన్యులు!!!

ఎవరికి ఎటువంటి సాయం చేయాలన్నా సంపన్నులే అయిఉండాలన్న నియమమేమీ లేదు. ఎంత బీదవారైనా, దురదృష్టవంతుడైనా, ఎదుటివానికి ఏదోవిధముగా, ఎంతో కొంత సాయం చేయవచ్చు. ఈ సహాయము ధనరూపంలోనే ఉండనక్కరలేదు. మాటసహాయం కావచ్చు, నైతిక సహాయం కావచ్చు, పని సహాయం కావచ్చు. మనం ఎదుటి వారికి ఎలాంటి సహాయం చేయవచ్చు అని ఆలోచించడమే అత్యంత ముఖ్యమైనది. మనం చేసే చిన్న చిన్న సాయాల వల్ల ఆత్మబంధువులను పొందడమే కాకుండా ఆత్మతృప్తిని పొందుతాము. మానవసేవయే మాధవసేవగా భావించి సేవాదృక్పథాన్ని పెంచుకుందాం.

**సూక్తి**

ఒక చిన్న దీపం ఈ ప్రపంచానికి ఇవ్వలేనంత వెలుగును
ఓ మంచి పని ఇస్తుంది.

– షేక్‌స్పియర్

# 15 స్త్రీ గౌరవం

**I. ప్రధాన విలువ**

సమానత్వం, సోదరభావం, స్త్రీల పట్ల గౌరవం.

**II. ఉప విలువ**

స్త్రీల పట్ల గౌరవభావం కలిగి ఉండడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- స్త్రీలను ఎలా గౌరవించాలో అవగాహన కల్గియుంటారు.
- సమాజంలో స్త్రీలను గౌరవిస్తారు.

## IV. ఉపోద్ఘాతం

మన సమాజానికి కుటుంబం కేంద్రబిందువు. కుటుంబంలో ప్రముఖమైన వ్యక్తి స్త్రీ. ఇలాంటి స్త్రీని మన ఇంటిలో, సమాజంలో గుర్తించి, గౌరవించాలి. స్త్రీలకు అన్నింటిలో సమానత్వహక్కుల్ని కల్గించాలి. వారిపై సోదరభావాన్ని కల్గియుండాలి. స్త్రీలను అగౌరవపరచడం, అణగద్రొక్కడం వంటివి చేయరాదు. మహిళను సాటి మనిషిగా గుర్తించి ఆమెకు సమాజంలో దక్కవలసిన స్థానాన్ని కల్పించి, ఆమెకు రక్షణనిస్తూ, ప్రోత్సహిస్తూ ఆమె అన్ని రంగాల్లో ఎదిగేలా కృషిచేయాలి.

## V. విషయం

**ఈ సామెతలు విన్నారా?**

- 'ఎప్పటికైన ఆడపిల్ల ఆడపిల్లేగాని ఈడపిల్ల కాదు కదా'
- ఉద్యోగం పురుష లక్షణం
- ఉద్యోగం చేయాలా? ఊళ్లేలా?
- ఆడవాళ్ళ నవ్వు నాల్గురకాలుగా చేటు
- నవ్వే ఆడదాన్ని ఏడ్చే మగాడిని నమ్మకూడదు
- "ఆడదిగా పుట్టడం కంటే అడవిలో మానుగ పుట్టడం మేలు"
- ఆడది తిరిగి చెడిందని, మగాడు తిరగక చెడ్డాడని"

**సంబోధన ఎలా?**

- ఒక ఇంటిలో భర్త భార్యను నీచమైన మాటలు మాట్లాడుతాడు. అలాగే పిలుస్తాడు. భార్య మాత్రం భర్తను గౌరవప్రదమైన మాటలతో పిలుస్తుంది, మాట్లాడుతుంది.
- ఒక ఇంటి యజమాని పనిమనిషిని కూడా కించపరిచేలా, అసభ్యపదాలు వాడుతూ కుంగిపోయేలా మాట్లాడుతాడు.

**అడ్వర్టైజ్‌మెంట్స్**

- సినిమా వాల్‌పోస్టర్స్‌లో స్త్రీలయొక్క ఫోటోలను అసభ్యకరంగా ప్రదర్శించడం.
- వారపత్రికల ముఖచిత్రాల్లో ఆడవాళ్ళ ఫోటోలనే, సరైన వస్త్రధారణలేని ఫోటోలనే ప్రచురిస్తారు కాని, మగ వాళ్ళు ఫోటోలను ప్రచురించరు.
- ప్రతి సినిమాలలో కూడా ఐటామ్ సాంగ్స్‌లో ఆడవాళ్ళని అసభ్యకరంగా చూపించడం.
- T.V. లో వచ్చే అడ్వర్టైజ్‌మెంట్‌లలో అవసరం లేకున్నా ఆడవాళ్ళనే అసభ్యంగానే చూపిస్తారు.
- సినిమాలలోని పాత్రలుకూడా ఆడవాళ్ళను కించపరచేవిగా, ఆడవాళ్ళను హింసించేటట్లుగా ఉండటం ద్వంద్వార్థాల సంబోధనలు చేయడం, కించపరిచే సన్నివేశాలను చిత్రీకరించడం చేస్తున్నారు.

**తిట్లు**

ఇంట్లో ఆడపిల్లల్ని, మహిళలను రకరకాల మాటలతో తిట్లు (బూతులు) తిడుతున్నారు. ఎవరిని తిట్టినా స్త్రీలను ఆధారంచేసుకొని తిడుతున్నారు. ద్వంద్వార్థాలతో మాట్లాడటం, బెదిరించడం, ఏడ్పించడం వంటివి చేస్తారు.

### ప్రవర్తించే విధం

ఒక గ్రామంలో ఒక సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఆ సమావేశానికి గ్రామంలో ఆడ, మగ అందరూ వచ్చారు. సమావేశ నిర్వాహకులు మగవారిని కుర్చీలో కూర్చోమన్నారు. ఆడవారిని కింద కూర్చోమన్నారు.

### మాటకు విలువ ఇవ్వకపోవడం

- ఒక కుటుంబంలో అమ్మాయి పెళ్ళి విషయంలో లేదా ఇంట్లో ఏదో కార్యక్రమం జరిగే విషయంలో భార్య చెప్పే మాటలు భర్త వినకుండా, ఆమె మాటలకు విలువ ఇవ్వకుండా తన ఆలోచనల ప్రకారమే ఆ పనులు పూర్తిచేస్తాడు.
- ఒక గ్రామంలో గ్రామపంచాయితీ సమావేశం జరుగుతున్నది. ఆ సమావేశంలో ఆడవారు కూడా సభ్యులుగా ఉన్నారు. గ్రామ సమస్యల పరిష్కారంపై చర్చ జరుగుతోంది. అందరూ మాట్లాడుతున్నారు. కాని సమస్యల పరిష్కార నిర్ణయంపై మహిళల సలహాలు తీసుకోలేదు వాళ్ళు చెప్పబోతే వారికి అవకాశం ఇవ్వలేదు. ఆఖరికి మగవారి నిర్ణయంపైనే ఆ సమావేశం ముగిసింది.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పై సామెతలను విన్నారు కదా! మీకేమర్థమయ్యింది?
2. మీ ఇంట్లో అమ్మను మీనాన్న ఎలా గౌరవిస్తాడు?
3. స్త్రీలను అగౌరవపరిచే సంఘటనలు T.V. ల్లో, సినిమాల్లో చూపిస్తున్నారుకదా! మహిళలను ఎలా చూస్తున్నారు?
4. మీ గ్రామంలో మహిళలను ఎలా చూస్తున్నారు?
5. ఇంట్లో, బయట స్త్రీలను అగౌరవపరిచే, గౌరవపరిచే సంఘటనలు ఏవి?
6. స్త్రీలను అగౌరవపరచడం అంటే ఏమిటి?
7. స్త్రీలను ఎలా గౌరవించాలి?
8. ఇంట్లో, బయట ఆడపిల్లలకు, మగపిల్లలకు ఏఏ విషయాల్లో తేడాలుంటాయి? ఎందుకు?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- ఈ వారమంతా మీ ఇంట్లోవారితో, బయటివారితో (స్త్రీలతో) గౌరవప్రదంగా మాట్లాడడానికి ప్రయత్నించండి. మీ అనుభవాలు చెప్పండి.

### తెలుసుకోండి

సమాజంలో అనేక రకాల అసమానతలున్నాయి. అసమానతకు గురయ్యే వర్గాలన్నింటిలోనూ స్త్రీలు మరింత అసమానతకు గురిఅవుతున్నారు. మన సమాజానికి కుటుంబం కేంద్రబిందువు. కుటుంబంలో ప్రధానవ్యక్తికి భార్యలనీ, కుమార్తెఅని, చెల్లెలని, తల్లిఅని ఇప్పటికీ గ్రామాల్లో పిలవడం కద్దు. స్త్రీకి తనకంటూ గుర్తింపులేదనడానికి ఇదో నిదర్శనం. ఆడపిల్ల పుట్టిందంటే చాలు చాకిరీ కోసమే అనే భావన సమాజంలో నెలకొని ఉన్నది. అబ్బాయి వంశోద్ధారకుడు కాబట్టి కుటుంబంలో మగపిల్లవానిపై శ్రద్ధచూపుతున్నారు. మగపిల్లవాని పెంపకంలో చూపించినంత శ్రద్ధ ఆడపిల్ల పెంపకంలో చూపలేకపోతున్నారు. 'ఎప్పటికైనా ఆడపిల్ల ఆడపిల్లేగాని ఈడపిల్ల కాదుకదా' అనే నానుడి బలంగా నాటుకుపోయింది.

సమాజంలో ఆడవారిపట్ల ఉన్న ఇలాంటి చిన్నచూపువల్లనే పుట్టినప్పటినుండి వారిని పెంచడంలోను తేడా చూపిస్తున్నారు. చదువు నైపుణ్యాలు పెంచుకోవడం, వృత్తులలో ఎన్నో అవకాశాలు ఆడపిల్లలకు కాకుండా పోతున్నాయి. అంతేకాకుండా వారు మాట్లాడడంపై, వారి ప్రవర్తనపై ఎన్నో కట్టుబాట్లు, ఆంక్షలు ఉన్నాయి. ఇందువల్లే చాలామంది ఆడపిల్లలు కనీస లోకజ్ఞానం లేకుండా పెరుగుతున్నారు. తిండిపెట్టడం, పనులు చెప్పడం వంటి అన్ని విషయాల్లో తేడా చూపుతున్నారు. పెళ్ళిచూపులలో ఆడపిల్లను చూడటానికి, మగపిల్లవాడికే ప్రాధాన్యత ఇస్తారు.

- పిల్లలు కలగకుంటే భార్యను/ఆడవాళ్ళనే కించపరచడం, కారణాలు చూపడం.
- స్త్రీ ఇంటిపేర్లు మారడం
- ఆస్తులన్నీ మగపిల్లల పేర్లమీదే రాయడం ఇలాంటివి మన సమాజంలో జరుగుతున్నాయి.

ఇలా తరతరాలుగా స్త్రీలు, బాలికలు వివక్షకు లోనై ఇంటా బయటా పనిభారం మోస్తున్నారు. పగలనక, రేయనక, ఎండైనా, వానైనా కొన్నిపనులు ఇంట్లో మహిళలు, బాలికలే చేస్తున్నారు. స్త్రీ పురుషుల మధ్య పని విభజన ఓ ఆనవాయితీగా వస్తున్నది. ఉద్యోగం పురుషలక్షణమని చెప్తూ, ఉద్యోగాలు పురుషులు చేయాలంటూ ఇంటిపనులు స్త్రీలకు అప్పగించారు. మహిళలు ఇంతకంటే ముందుకు పోకూడదంటూ ఆంక్షలు విధించారు. "ఆడది తిరిగి చెడిందని, మగాడు తిరగక చెడ్డాడని రకరకాల సామెతలు తీసుకువచ్చి

ఆడవారిని గౌరవించడం లేదు. ఎవరైనా స్త్రీలు పదిమందిలో మాట్లాడినా, పురుషులు చెప్పినదానికి భిన్నంగా గట్టిగా మాట్లాడినా గయ్యాళి అంటారు. తిట్లు, బూతులైనా స్త్రీలనే కించపరిచేలా ఉంటాయి. స్త్రీల పనులకు సమాన విలువ ఇచ్చి గౌరవించడం లేదు.

ఇంట్లోకాని, బయటకాని మహిళలకు సతాయింపులు, వేధింపులు సమాజంలో ఎక్కువగా ఉంటున్నాయి. మహిళలకు ఎక్కడా రక్షణలేదు. అలాగే సినిమాలు, T.V. ల్లో వచ్చే కార్యక్రమాలు, పత్రికల్లోని ప్రచురణలు... కూడా స్త్రీలను కించపరిచేవిగా ఉంటున్నాయి. ఇవన్నీ స్త్రీలను హింసకు గురిచేస్తున్నాయి.

మహిళలు ఎన్నో రంగాల్లో పనిచేసినా, స్త్రీల పనిమాత్రం లెక్కకు రావడం లేదు. వారి శ్రమను గుర్తించడం లేదు. సమాజంలో స్త్రీలు పురోగమించకుండా ఎన్నో ఆంక్షలు విధిస్తున్నారు. స్త్రీల మానసిక శారీరక, సామాజిక శక్తులను, ఎదుగుదలను అణచివేస్తున్నారు.

సమాజంలో ఆడవారి పట్ల ఇలాంటి చిన్నచూపు ఉండకూడదు. స్త్రీలకు రక్షణ కల్పించాలి. వారిని గౌరవించాలి. మహిళా అభివృద్ధితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందన్న వాస్తవాన్ని గుర్తించాలి.

ఉదాహరణకు సంసార రథచక్రాలు చక్కగా నడవాలంటే ఆలుమగల మధ్య అన్యోన్యత, అవగాహన అవసరం. పరస్పర ప్రేమ, గౌరవం ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. అదేవిధంగా సమాజ ప్రగతి రథచక్రాలు ముందుకు సాగాలంటే పురుషులతోపాటు స్త్రీలను గౌరవించడం, హక్కులు, అవకాశాలు కల్పించడం చేయాలి. తగిన పద్ధతుల్లో ప్రోత్సహించాలి. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా, నగరాల్లోని వివిధ కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో పాఠశాలల్లో స్త్రీలను సాటిమనిషిగా గుర్తించి, ఓ చెల్లిగా, తల్లిగా గౌరవించే ఉన్నత సంస్కారంవైపు యువసమాజాన్ని నడిపించేందుకు ప్రతిఒక్కరూ తమతమ స్థాయిలో కృషిచేయవలసిందే.

స్త్రీలను గౌరవించి మన సమాజాన్ని, దేశాన్ని అభివృద్ధిచేసుకుందాం!

**సూక్తి**

**ధైర్యసాహసాలు మానవ జీవన మనుగడకు విజయ సాధకాలు.**

# 16 భారతదేశ ఔన్నత్యం

**I. ప్రధాన విలువ**

జాతీయభావన - దేశభక్తి

**II. ఉప విలువ**

దేశ ఔన్నత్యాన్ని కీర్తిప్రతిష్ఠలను చాటడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- దేశ ఔన్నత్యాన్ని గుర్తిస్తారు.
- దేశానికి కీర్తిప్రతిష్ఠలు తీసుకొచ్చిన వారిని ప్రశంసిస్తారు. స్ఫూర్తి పొందుతారు.

## IV. ఉపోద్ఘాతం

మన దేశం భారతదేశం. భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచమంతా చాటినవాళ్ళు ఎందరో ఉన్నారు. ఎందరో మహానుభావులు ఎన్నో రంగాలలో కృషిచేసి ప్రపంచానికే దిశానిర్దేశం చేసిన ఘనత భారతదేశానిది. వేదకాలం నుండి నేటి ఆధునిక కాలం వరకు ఎన్నో ఆవిష్కరణలకుగానీ, సంస్కరణలకు గాని, విద్య, వైద్యరంగాలలోగాని కృషిచేయడమే కాకుండా ముందు తరాలవారికి స్ఫూర్తిగా నిలిచారు. భారతదేశాన్ని అగ్రగామిగా నిలబెట్టిన సంస్థలు, వ్యక్తులు, కళలు, సంస్కృతులు అడుగడుగునా మనకు స్ఫూర్తిదాయకం.

## V. విషయం

### వార్త - 1

ప్రపంచ క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. భారతదేశం క్రికెట్‌లో ప్రపంచకప్పు సాధించింది. ప్రపంచ దేశాలన్నీ భారతదేశాన్ని పొగిడాయి. క్రీడాప్రపంచంలో భారతకీర్తి సువర్ణాక్షరాలతో లిఖించిన క్షణమది.

### వార్త - 2

ప్రపంచంలోనే అతిపెద్ద కంప్యూటర్ సంస్థ అయిన మైక్రోసాఫ్ట్ (సి.ఇ.ఓ) కార్యనిర్వహణాధికారిగా భారతీయుడైన నాదెళ్ళ సత్య ఎంపికయ్యారు. ఎందరినో కాదని ఆ పదవి నాదెళ్ళను వరించడం భారతదేశానికే గర్వకారణం.

### వ్యాఖ్య - 1

మనం భారతీయులకు ఎంతో ఋణపడి ఉన్నాం. భారతీయులే ప్రపంచానికి గణితంలో సులభంగా లెక్కించే 'దశాంస పద్ధతిని' కనుగొన్నారు. అదే లేకపోతే ఎన్నో వైజ్ఞానిక పరిశోధనలు ఈరోజు సాధింపబడేవి కావు.

– అల్బర్ట్ ఐన్‌స్టీన్, శాస్త్రవేత్త

### వ్యాఖ్య - 2

"నేటి ఖగోళశాస్త్రం, గణితం, జ్యోతిష్యం, తత్త్వశాస్త్రం, తర్కశాస్త్రం మొదలైన విజ్ఞానం సర్వస్వం గంగానది ఒడ్డునుండి మనకు సంప్రాప్తించినదేనని నేను సంపూర్ణంగా విశ్వసిస్తున్నాను. మనం ముఖ్యంగా గమనించదగ్గ విషయమేమిటంటే కనీసం 2,500 ఏళ్ళక్రితం పైథాగరస్, గ్రీకులోని సామూస్ నుండి గంగ ఒడ్డుకు వెళ్ళి రేఖాగణితాన్ని అభ్యసించాడు."

– వాల్టేర్ ఫ్రాంకిస్, ఫ్రెంచి దేశపు గొప్ప రచయిత, తత్వవేత్త

### వ్యాఖ్య - 3

ప్రప్రథమ శస్త్రవైద్యులను అందించింది భారతీయులే... ఈ దేశం ఆధునిక వైద్యశాస్త్రానికి ఎంతో మేలు చేసింది. ఎన్నో రసాయనాలు కనుగొనడం ద్వారా, తెగిన ముక్కులు, చెవులు సరిదిద్దే ప్రక్రియ తెల్పడం ద్వారా ప్రపంచానికి ఎంతో సాయం చేసింది. ఇంతకంటే ఎక్కువగా, గణితంలో భారతీయ ప్రతిభ కనిపిస్తుంది. బీజగణితం, రేఖాగణితం, ఖగోళశాస్త్రం, ఆధునిక విజ్ఞానశాస్త్ర పురోగతికి సహాయపడే ఇవి భారతదేశంలో కనుగొనబడినవే".

– స్వామి వివేకానంద

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. దేశ గొప్పతనం ఎప్పుడెప్పుడు ప్రజలకు తెలుస్తుంది?
2. భారతదేశానికి గర్వకారణమైన మీకు తెలిసిన వ్యక్తుల గురించి చెప్పండి.
3. ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ వ్యాఖ్యలనుబట్టి మీకు ఏమి అర్థం అయ్యింది
4. మన భారతదేశం గొప్పగా కీర్తించబడాలంటే భావిపౌరులైన మీరు ఏం చేయాలి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- భారతదేశ కీర్తిప్రతిష్టలు చాటడంలో ఎన్నో రంగాలలో ఎందరో వ్యక్తులు కృషిచేశారు. అలాంటి వారి గురించిన వివరాలు సేకరించి మీ అభిప్రాయాలను చెప్పండి.

### తెలుసుకోండి

మంచిని ఆదరించడం, ఆచరించడం అనేవి భారతీయుల ప్రత్యేకత. భిన్నత్వంలో ఏకత్వం మనదేశ విశిష్ఠత. భిన్నజాతులు, విభిన్న భాషలు, మతాలు, కులాలవారు ఈదేశంలో కలిసిమెలిసి జీవిస్తున్నారు. ప్రపంచ దేశాలలో ఇలాంటి వైవిధ్యం ఎక్కడా మనకు కన్పించదు. క్రైస్తవ, మహ్మదీయ, బౌద్ధ, జైన, సిక్కు, హిందూ వంటి అనేక మతాలు ఇక్కడ ఆదరింపబడుతున్నాయి. అంతేకాదు ఆంగ్ల, అరబ్బీ, పారశీకం వంటి విదేశీభాషలు ఇక్కడ విశేష ప్రచారం పొందాయి. "అతిథి దేవోభవ" అంటూ అతిథులను దేవతలుగా భావించడం మన సంప్రదాయం, మన సంస్కృతి. అతిథులను గౌరవించి వారితో స్నేహపూర్వకంగా మెలగడం మన భారతీయుల ఔన్నత్యం. సత్యం, ధర్మం, న్యాయం, నిజాయితీ, దయ, దానం, సహనం, క్షమ భారతీయుల సొత్తు. ఈ గడ్డపై పుట్టిన వారికివి పెట్టని ఆభరణాలు. ఈ సుగుణాలవల్లే భారతదేశ ఔన్నత్యం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది.

భారతదేశ కీర్తిప్రతిష్ఠలను పెంచడంలో ఔన్నత్యాన్ని చాటడంలో దోహదపడే అంశాలు ఎన్నో ఉన్నాయి. ఈ భారతదేశంలోనే తొలిగా లిపి ఒక రూపాన్ని దాల్చింది. మహోన్నతమై సాహితీ సంస్కృతులు, నాగరికతా సాంప్రదాయాలు, నైతిక, సామాజిక విలువలు పాటించడం వల్ల ప్రపంచంలోనే ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కుంది.

భారతీయులకు గర్వకారణమైన సంప్రదాయాలు ఎన్నో ఉన్నాయి. ఈ దేశ ప్రజలు ఎంతో దుర్భరదారిద్ర్యం లోనూ సంతోషంగా ఉండగలగడానికి కారణం సంతృప్తికీ, మనశ్శాంతికీ ప్రాధాన్యమివ్వడమే.

స్త్రీని ఎలా గౌరవించాలో భారతీయ సంప్రదాయం చెప్పినట్లు ప్రపంచంలో ఎక్కడా చెప్పలేదు. పెద్దలను, వృద్ధులను గౌరవించడం వారి మార్గాన్ని అనుసరించడం మన సంప్రదాయంలో భాగం. అలాగే కుటుంబవ్యవస్థ మన భారతదేశానికే సొంతం. మంచి ఎక్కడున్నా స్వీకరించు. అది మన పెద్దలు చూపిన మార్గాన్ని అనుసరించి కుటుంబ సంస్కృతి తరతరాలుగా మరో జాతికి అందిస్తోంది. ఉమ్మడి కుటుంబం కలసిమెలసి జీవించడాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది మనదేశం.

అలాగే మనదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరొందింది. ఒకప్పుడు పాశ్చాత్య పండితులంతా ఒక అధికారిక భాషంటూ లేని జాతి, ఒకే ఒక మతమంటూ లేని జాతి నిలబడదన్నారు. భారత జాతిని సమైక్యంగా ఉంచే శక్తి భారతీయులకు లేదన్నారు. పైగా పేదరికం తాండవించే ప్రాంతంలో ప్రజాస్వామ్యం నిలవలేదన్నారు. కానీ మనదేశం వారికి ఒక సవాల్‌లా నిలబడింది. జనమే బలమని, వైవిధ్యాన్నీ, భిన్నత్వాన్నీ మించిన ఐకమత్యం మనమధ్య ఉందని ఎలుగెత్తి చాటింది.

ఇవేకాదు మనదేశ కీర్తిని ప్రపంచ నలుదిశలా వ్యాపింపజేసిన మహోన్నత నాయకులకు పుట్టినిల్లు మన భారతదేశం. ఆయుధం పట్టకుండా అహింసామార్గాన బానిస శృంఖలాలనుండి దేశానికి స్వేచ్ఛను తీసుకొచ్చిన గాంధీ ఎందరికో ఆదర్శంగా నిలిచారు. వేదకాలంనుండి భారతీయ విజ్ఞానం అన్నిరంగాలలో పురోగమనానికి తోడ్పడిందంటే అతిశయోక్తి కాదు. ఆర్థిక, శాస్త్ర, క్రీడా, విద్య, వైద్యం ఇలా ఎన్నోరంగాలలో కృషిచేసిన మన దేశ ప్రజలు ఈరోజుకీ ప్రపంచంలో తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపుతో భారతదేశ కీర్తిని చాటుతున్నారు. ఈ కీర్తిప్రతిష్టలను కాపాడుకోవాల్సిన బాధ్యత భారతదేశ పౌరులుగా మన అందరిమీదా ఉంది.

ప్రస్తుత భారతదేశ ఔన్నత్యాన్ని దెబ్బతీసేవిధంగా కొన్ని సంఘటనలు, అంశాలు చోటుచేసుకోవడం బాధాకర విషయం. ప్రపంచీకరణ మానవజీవితంలోని అన్నరంగాల్లోనూ విజృంభిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పాశ్చాత్య నాగరికత మన సంప్రదాయంపైనేగాక మానవ జీవనసరళిని ప్రభావితం చేస్తోంది. అంతేకాకుండా రోజురోజుకు పెరగుతున్న అవినీతి, పన్నులు, ధరలు సామాన్యుని జీవితాన్ని దుర్భరంగా మారుస్తున్నాయి. ఈ అవినీతివల్ల స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా మనదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగానే మిగిలిపోయింది. దీనివల్ల పేదవాళ్ళు పేదవాళ్ళుగానే ఉంటున్నారు. ధనవంతులు మరింత ధనవంతులౌతున్నారు. ఈ అసమానతలవల్ల శాంతికి భంగం వాటిల్లే పరిస్థితులు ఎదురౌతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో దేశ కీర్తి ఏమౌతుందో ఆలోచించండి. ఈ పరిస్థితులను చక్కదిద్దటానికి, అధిగమించడానికి భారతదేశ కీర్తిప్రతిష్ఠలు, గౌరవమర్యాదలు నిలపడానికి దేశ పౌరులుగా మనం ఏంచేయాలని ఆలోచించాలి.

## మీకు తెలుసా

### సి.వి. రామన్ (1888-1970)

భారతదేశంలో భౌతికశాస్త్రంలో మొట్టమొదటి 'నోబెల్ బహుమతి విజేత; విశ్వవిఖ్యాత భౌతిక శాస్త్రవేత్త సర్ సి.వి.రామన్. రామన్‌కు 1930 లో నోబెల్ బహుమతి లభించింది. "రామన్ ఎఫెక్ట్" అనే పరిశోధన ఈ బహుమతి వీరిని వరించేలా చేసింది. రామన్ ఎఫెక్ట్ అనగా కాంతి కిరణం ఒక పారదర్శక పదార్థం గుండా ప్రయాణించినప్పుడు, దానిలో కలిగే మార్పులను వివరిస్తుంది. దీనిద్వారా 2000 రసాయన మిశ్రమాల నిర్మాణం కనుగొనగలిగారు. చివరకు "లేజర్" కిరణాల ఆవిష్కరణ తరువాత ఈ "రామన్ ఎఫెక్ట్" ప్రాముఖ్యత, అవసరం మరింత పెరిగింది.

ఈయన "ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్" బెంగళూరునందు డైరెక్టరు పదవిలో దాదాపు పది సంవత్సరాలు పనిచేశారు. ఈ దశలో ఎందరికో ప్రోత్సాహం కలిగించారు. దేశ విదేశాలలో వీరికి ఎన్నో పురస్కారాలు లభించాయి. భారతప్రభుత్వం వీరిని 'భారతరత్న'తో సత్కరించింది.

### యమ్. విశ్వేశ్వరయ్య (1861-1962)

భారతదేశపు ప్రముఖ ఇంజనీరు. వీరు తెలుగువారు. వీరి పూర్వులు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలోని మోక్షగుండం గ్రామానికి చెందినవారు. విశ్వేశ్వరయ్య మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ. పూణే సైన్స్ కాలేజి నుంచి సివిల్ ఇంజనీరింగులో ఉత్తీర్ణులయ్యారు.

బొంబాయి ప్రజాపనుల శాఖలో చేరి ఆతరువాత, విశ్వేశ్వరయ్య భారత నీటిపారుదల కమిషన్‌లో చేరారు. ఈయన దక్కన్ ప్రాంతంలో చక్కని నీటిపారుదల వ్యవస్థను రూపొందించాడు. ఆనకట్టలలో ఏర్పరచడానికి ఆటోమేటిక్ వరదగేట్లను ఈయన రూపకల్పన చేశారు. వీటిని 1903 లో మొదటిసారిగా 'పూణె' సమీపంలోని "ఖడక్‌వాస్లా" వద్ద ఏర్పరిచారు. ఆతరువాత ఇటువంటి గేట్లనే గ్వాలియర్, మైసూరు వద్ద గల 'కృష్ణరాజసాగర్' ఆనకట్టలలో కూడా నిర్మించారు.

హైదరాబాదు నగరాన్ని వరదల నుంచి రక్షించే నీటిపారుదల వ్యవస్థను నిర్మించటంతో ఆయనకు గొప్ప పేరుప్రతిష్ఠలు లభించాయి. విశాఖపట్టణంలోని ఓడరేవు నిర్మాణంలో కూడా ఈయన పాత్ర ఉంది. 1908 లో స్వచ్ఛంద పదవీ విరమణ తరువాత ఈయన మైసూరు సంస్థానంలో 'దివాన్' గా బాధ్యతలు చేపట్టారు. 1917 లో బెంగళూరులో ఇంజనీరింగ్ కాలేజి స్థాపనలో వీరు ప్రముఖపాత్ర వహించారు.

బ్రిటీష్ ప్రభుత్వం వీరికి 'సర్' బిరుదు ప్రధానం చేసింది. భారత ప్రభుత్వం 1955 లో "భారతరత్న" తో సత్కరించింది.

### ఆర్ నారాయణమూర్తి

పారిశ్రామికవేత్త సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, 'ఇన్‌ఫోసిస్' వ్యవస్థాపకుడు. వీరి శ్రీమతి సుధామూర్తి.

1981 లో మరో ఆరుగురితో కలిసి 'ఇన్‌ఫోసిస్'ను స్థాపించారు. 2006 నాటికి నారాయణమూర్తి

ఆస్తి 1.1 బిలియన్ డాలర్లు. వీరికి 2000 లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' అవార్డును బహూకరించింది.

అనేక దేశాలకు అధికారిక సలహాదారుగా, అనేక దేశ, విదేశీయ సంస్థలకు సలహాదారుగా, రిజర్వు బ్యాంకు బోర్డు సభ్యునిగా, వ్యాపార, వాణిజ్యాలకు సంబంధించి ప్రధానమంత్రి సలహామండలి సభ్యుడుగా 'మూర్తి' గారు పనిచేసారు.

2005 లో ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణగల 8వ వ్యాపారవేత్తగా గుర్తింపబడ్డాడు. వ్యాపారంతోపాటు ఎన్నో సేవాకార్యక్రమాలు తమ సంస్థ ద్వారా శ్రీమతి సుధామూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. మూర్తిని 'ఆసియా బిల్‌గేట్స్' అంటూ ఉంటారు. ఈమధ్య కాలంలో తన అధికార పగ్గాలను సహచరుడు 'వెలికని' కి అప్పజెప్పారు. "FORBES" పత్రిక ఎన్నికచేసిన 'బిలియనీర్ల' లో ఒకరు.

భారతదేశంలో తొలితరం సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించి, అప్పటి ఆర్థిక, రాజకీయ పరిస్థితులలో దానిని సమర్థవంతంగా నడిపించి విజయం సాధించారు.

## అజిమ్ ప్రేమ్‌జీ

అజిమ్ హెజ్‌షిమ్ ప్రేమ్‌జీ ఓ సాధారణ వ్యాపార కుటుంబం నుంచి వచ్చాడు. 21 ఏళ్ళ వయసులో ఇంకా చదువుకూడా పూర్తికాకుండానే తన తండ్రి మరణించటంతో కుటుంబం నిర్వహిస్తున్న 'ఆయిల్' వ్యాపారంలో అడుగుపెట్టాడు.

అలా సంప్రదాయ వంటనూనెల వ్యాపారం నుండి ప్రేమ్‌జీ 'కంప్యూటర్ సాఫ్ట్‌వేర్' రంగంలో అడుగుపెట్టి ప్రపంచంలోని అతిపెద్ద వంద కంపెనీలలో ఒకటిగా "విప్రో" ను తీర్చిదిద్ది ప్రపంచంలోని ధనవంతులలో ఒకడైనాడు.

ప్రధానమంత్రి ఐటి బృందంలో సభ్యుడు ప్రేమ్‌జీ ఇవ్వాళ ప్రపంచంలో సాఫ్ట్‌వేర్ రంగంలో అతిపెద్ద మానవవనరులు H/R అందిస్తున్న సంస్థ "విప్రో".

## స్వామి వివేకానంద (1863-1902)

ఈ భారత యువ సన్యాసి ప్రపంచానికి భారతదేశం తన ఉనికిని కోల్పోలేదని తాత్కాలిక నిద్రలో ఉందని తెలిపారు. భారతజాతిని ఒక బాంబు విస్ఫోటనంలా మేల్కొలిపాడు.

1863 లో కలకత్తాలో జన్మించిన 'నరేంద్రనాధదత్త' చాలా చురుకైనవాడు. బాల్యంలోనే ఏదీ సులభంగా నమ్మేవాడు కాదు. ఆచారాల వెనుక అర్థం అవగతం కానిదే ఆచరించేవాడు కాదు. అతనిలోని ఈ లక్షణమే చివరకు భగవంతుని అస్తిత్వాన్ని ప్రశ్నించగలిగింది. అలా భగవంతుని దర్శించిన మనిషి కోసం అతని యాత్ర ప్రారంభమైంది. తన ఆధ్యాత్మిక దాహార్తి తీర్చిన రామకృష్ణ పరమహంస పరిచయంతో అది ముగిసింది.

రామకృష్ణ పరమహంస మరణం తరువాత "నరేంద్ర" సన్యాసం స్వీకరించి 'వివేకానందునిగా' మారాడు. భారతదేశం నలుమూలలా పర్యటించాడు.

చికాగో నగరంలో జరిగిన ప్రపంచ మత మహాసభలలో పాల్గొనటానికి అమెరికా వచ్చిన అనామకుడైన వివేకానందుడు తన తొలి ఉపన్యాసంలో "అమెరికా సోదర సోదరీమణులారా" అన్న పలుకులతో యావత్ ప్రపంచాన్ని తనవైపు తిప్పుతున్నాడు. నాలుగు సంవత్సరాల తరువాత భారతదేశం తిరిగివచ్చిన స్వామి భారతజాతి సముద్ధరణకు పూనుకున్నాడు. ఇతని ఆశలన్నీ యువతరం మీదనే ఉండేవి. ఒకసారి కొందరు విదేశీయులు మీకు గురుదక్షిణ ఏమికావాలి అంటే "నా దేశాన్ని ప్రేమించండి" అంటాడు వివేకానంద. 39 ఏళ్ళ చిరుప్రాయంలో 1902 లో పరమపదించినా, "వివేకవాణి" ఇంకా ఎందరో వ్యక్తులను ఉత్తేజితులను చేస్తూనే ఉంది.

స్వామి వివేకానంద స్థాపించిన రామకృష్ణ మఠం మరియు సంస్థ నేటికీ ప్రపంచ వ్యాప్తంగా తన అమూల్య సేవలు అందిస్తూ ఉంది. ఆధ్యాత్మిక రంగంలోనూ, భారతీయ విలువల ప్రచారం, వ్యక్తి నిర్మాణంలోనూ గత వందేళ్ళుగా, నిరంతరంగా స్వదేశీయులను, విదేశీయులనూ ఆకర్షిస్తూ ముందుకుపోతూ ఉంది. వివేకానందుని స్ఫూర్తి ఆనాటి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న మహామహులపై ఉండేది. గాంధీ, బోస్, అరబిందో, నెహ్రూ వంటి నేతలు, గురు గోల్వాల్కర్, జంషెడ్జీ టాటా, రాక్‌ఫెల్లర్, ఫోర్డు వంటి వారు వివేకానందుని ఆదర్శంగా తీసుకొని ముందంజ వేశారు.

## మహాత్మాగాంధీ (1869-1948)

కొన్ని శతాబ్దాలు గడిస్తే ఇటువంటి వ్యక్తి భూమిమీద నడయాడాడు అంటే... భావితరాలు ఆశ్చర్యపోతాయి." ఈ మాటలు మహాత్మాగాంధీ గురించి ఈ శతాబ్దపు సుప్రసిద్ధ శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అన్న మాటలు. మనకు బాపూజీ జాతిపితగానే తెలుసు. కానీ ప్రపంచం గాంధీ సిద్ధాంతాలను నేటికీ ఆచరిస్తూ ఉంది. గొప్ప నాయకులుగా ప్రసిద్ధిగాంచిన నెల్సన్ మండేలా, అమెరికా స్వేచ్ఛామారుతం మార్టిన్ లూథర్ కింగ్ గాంధీ మార్గం అనుసరించి విజయం సాధించారు.

సత్యం, ధర్మం, అహింస వంటి సమున్నత మానవ లక్షణాలను ఆచరించి, భారతమాత బానిస శృంఖలాలు తెంచిన స్వాతంత్ర్య సమర రథసారధి గాంధీజీ.

## సుబ్రహ్మణ్యం చంద్రశేఖర్

స్వతంత్రం పూర్వం భారతదేశంలో 1910, అక్టోబర్ 19న లాహోర్ నగరంలో జన్మించాడు. ఇతనికి 1983 లో భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది.

చికాగో విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా పనిచేశాడు. "ది స్ట్రక్చర్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ స్టార్స్" అనే ఇతని పరిశోధనకుగాను ఇతనికి నోబెల్ బహుమతి వచ్చింది.

1999 లో "నాసా" తన నాలుగు ఖగోళ పరిశోధనా కేంద్రాలలో ఒక్కదానికి "చంద్రశేఖర్" పేరు పెట్టింది. 1958 లో ఒక "ఆస్టాయిడ్"కి ఈయన జ్ఞాపకార్థం చంద్ర అని పేరుపెట్టారు. (ఆస్టాయిడ్ - నక్షత్రం చుట్టూ తిరిగే గ్రహశకలాలు) చంద్రశేఖర్ ప్రప్రథమంగా బ్రిటన్‌కు వెళుతున్న సమయంలో నౌకలో

ప్రయాణిస్తూ రూపొందించిన నక్షత్రాల వయసును కొలువగలిగే ప్రమాణానికి "చంద్రశేఖర్ లిమిట్" అని పేరుపెట్టారు. ఇది అతి చిన్నవయస్సు లోనే ఇతను చేసిన గొప్ప పరిశోధనకు నిదర్శనం. ఇతను ప్రఖ్యాత శాస్త్రవేత్త సి.వి.రామన్‌కి దగ్గర బంధువు కూడా. అనేక అంతర్జాతీయ స్థాయి బహుమతులు పొందాడు. చివరకు 1995 లో అమెరికాలో మరణించాడు.

### "అమర్త్యసేన్"

అమర్త్యసేన్ 1933 లో బెంగాల్‌లో శాంతినికేతన్‌లో జన్మించారు. ఇతనో గొప్ప ఆర్థికశాస్త్రవేత్త. కేంబ్రిడ్స్ విశ్వవిద్యాలయంలోని ట్రినిటీ కాలేజిలో అధ్యాపకునిగా పనిచేశారు. వీరికి, 1998 లో ఆర్థికశాస్త్రంలో నోబుల్ బహుమతి లభించింది. ఇతను ఆర్థికశాస్త్రాన్ని "వెల్త్ మేగ్జిమైజేషన్" నుంచీ "వెల్ఫేర్ ఎకనిమిక్స్" వైపు మళ్ళించి, మనిషికి ఆర్థిక స్వేచ్ఛ ఉండాలని "ఆర్థిక సూచికలను" తయారుచేశాడు. "దీనినే హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్" (Human Development Index) అంటారు.

### భారతీయ శాస్త్రీయ నృత్యాలు

1. **భరతనాట్యం :** దక్షిణ భారతదేశపు నాట్యరూపంగా ప్రసిద్ధిగాంచింది. భరతముని నాట్యశాస్త్రం ఆధారంగా రూపొందింది. ఇందులో అలరింపు, వర్ణం, పదం, తిల్లాన వంటి అంశాలుంటాయి. దీనిని దేవాలయాలలో ఎక్కువగా ప్రదర్శించేవారు. ప్రముఖ భరతనాట్య కళాకారులు రుక్మిణీ అరెండేల్, బాలసరస్వతి, యామినీ కృష్ణమూర్తి, మృణాళినీ సారాబాయి, పద్మా సుబ్రహ్మణ్యం, వైజయంతీమాల మొదలైనవారు.
2. **కూచిపూడి :** ఇది ఆంధ్రుల సంస్కృతిక వైభవానికి చిహ్నం. దీనిని సిద్ధేంద్రయోగి ప్రాచుర్యంలోకి తీసుకు వచ్చాడు. దీనిలో అభినయం, భావప్రకటనకు ప్రాధాన్యం ఇస్తారు. ఇది సంగీతపరమైన నాటక కళ. ఆంధ్రప్రదేశ్‌లోని 'కూచిపూడి' గ్రామం నుండి ఆవిర్భవించింది. ఎక్కువగా పురుషులే దీనిని ప్రదర్శించేవారు. ఇప్పుడు స్త్రీలు కూడా ఈ నాట్యరీతిని ప్రదర్శిస్తున్నారు. వీరిలో ప్రముఖులు – వేదాంతం సత్యనారాయణ, వెంపటి చిన సత్యం, రాధా రాజారెడ్డి, శోభానాయుడు, యామినీ కృష్ణమూర్తి మొదలైనవారు.
3. **కథాకళి :** ఇది కేరళ రాష్ట్రానికి చెందిన నాట్యరూపం. ఇందులో నేత్ర చలనాలు – ఆహార్యం ప్రధానంగా నర్తిస్తారు. ఈ రంగంలో ప్రముఖులు గురుగోపీచంద్, చంపకులం పరమ పిళ్ళై, వళ్ళత్తోల్ నారాయణన్ మీనన్ మొదలైనవారు.

**సూక్తి**

**దేశాభిమానము జాతీయతా భావానికి తొలిమెట్టు**

# 17 పరమత సహనం

**I. ప్రధాన విలువ**

లౌకికతత్వం - మత సామరస్యం

**II. ఉప విలువ**

పరమతసహన భావనలు కలిగిఉండడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- ఇతర మతస్థులకు సహకరిస్తూ, సహన భావనలు పెంపొందించుకోవడం.

## IV. ఉపోద్ఘాతం

మత ప్రసక్తి లేని రాజ్యాన్ని లౌకికరాజ్యం అంటాం. అనేక మతాలు మన దేశంలో కనబడుతున్న పెండ్లి, పేరంటం, ఇతర వేడుకల్లో అన్ని మతస్థులు భాగస్వాములు అవుతుంటారు. అలా ఇతరులకు సహకరిస్తూ, గౌరవించడం అనేది మన దేశ చరిత్రలో ఉంది. అతడు వేరే మతస్థుడు అతనికి నేనెందుకు సహకరించాలనే భావన ఉండకూడదు. అలా కలిసి మెలిసి ఉంటేనే అందరి పండుగలు, వేడుకలు బాగా జరుగుతాయి. ముఖ్యంగా శాంతియుత సహజీవనం ఏర్పడుతుంది.

## V. విషయం

మనమంతా మనుషులం. మానవత్వమే మన మతం. ప్రతి మతంలో కొన్ని సుగుణాలుంటాయి. అలాగే కొన్ని నచ్చని అంశాలూ ఉంటాయి. మంచితనం, మానవత్వం అనే సద్గుణాలు లేని మతం ఏదైనా సంస్కరించబడాల్సిందే. "మంచి చెడ్డలు రెండే మతములు" అనే సూక్తికి తిరుగులేదు. మంచి ఏ మతంలో ఉన్నా స్వీకరించుదాం. మంచికి వాడని మతం నిరుపయోగం. ఓర్పు, సహనం, శాంతి, క్షమ, దయ మనలో ఉంటే మతకలహాలు జరగవు. స్వర్గం ఇక్కడే ఉంటుంది. పరస్పర ప్రేమకోసం కృషిచేద్దాం. హిందూ ముస్లిం

భాయీ భాయీ సహించడమే గొప్ప స్వర్గ ద్వారం. ఎదుటి వారిని నొప్పించేది నిజం అయినా అది చెప్పకుండా మౌనం వహించడం మంచిది. శాంతియుత జీవనం గడుపుతున్న భరతమాత ముద్దుబిడ్డలం మనం. ఈ దేశంలో పుట్టడమే ఏ మతస్థుడికైనా ఎన్నో జన్మల పుణ్యఫలం. అందరికీ సగౌరవంగా బతికే దారికావాలి. మన మతంతో పాటు ఇతరుల మతాలను కూడా గౌరవించాలి. వ్యక్తులు చేసే పనులకు మతాన్ని నిందించకూడదు.

అన్ని మతాలలోను శాశ్వత మానవ విలువలు చోటుచేసుకొని ఉన్నాయి. సత్యనిష్ఠ, ధర్మనిరతి, దైవభక్తి, తోటిమానవుని ఎడ కరుణ, సానుభూతి, సర్వమతాలకు గల సామాన్య ధర్మాలు. మన దేశంలో మనుషులు ఏ మతంలో ఉన్నా సరే ముందు మనుషులుగా ప్రవర్తించగల అవగాహన, సహనం, అభిప్రాయ భేదాన్ని గౌరవించడం చాలా అవసరం. దీనికొరకు మన మానసిక వైఖరులలో మార్పురావాలి. అవి.

1) మతాలలో నిండి ఉన్న శాశ్వత మానవ విలువలను వెలికి తీయటం

2) వాటిని ప్రధానాంశాలుగా పరిగణించటం

3) మానవజాతి అంతా ఒక్కటే అనే భావనను పెంపొందించు కోవడం.

4) మానవులంతా సమానులు అనే సూత్రాన్ని అంగీకరించడం.

5) పూజా విధానంలో, ప్రార్థనా రీతిలో అంటే దేవునికీ మానవునికీ ఉన్న సంబంధాల విషయంగా విభిన్న ధోరణులను గుర్తించటం.

6) అన్నింటికన్న మిన్న పరస్పర సోదరభావాన్ని పెంచుకోవడం.

7) సహన మనస్తత్వాన్ని అలవరచుకోవడం.

అన్ని మతాల వారి కర్తవ్యం.

అప్పుడే మత సామరస్యం వాస్తవరూపం దాలుస్తుంది.

కడివెడు పాలను ఒక ఉప్పు కల్లు పాడు చేసినట్లు అమృతమయమైన మతాన్ని 'ఛాందసం' ఉన్మాదం కింద మార్చివేయగలదు. నేడు మత ఛాందసం, మత దుర్వినియోగం, మతోన్మాదం సమాజశ్రేయాన్ని చిందర వందర చేస్తున్నాయి. ఛిద్రం చేస్తున్నాయి. ఒకే పునాది మీద లేచిన అనేక భవనాల్లా మతాలు గోచరిస్తాయి. రామకృష్ణపరమహంస 'గమ్యం ఒక్కటే దానికి ఎన్ని మార్గాలో అన్నిమతాలు' అన్నారు. మతంలో మనం అమృతపానం చేయకుండా దాన్ని గరళంగా మార్చుకుంటున్నాం. ఇది కాదు మతం ఉద్దేశ్యం. ఇది కాదు మతప్రవక్తల త్యాగాలకు అర్థం. విశ్వాసాల పేరిట వినాశనాన్ని ప్రేరేపించడం కాదు. ఏ మతం వారిని ఆ మతాన్ని అనుసరించనిద్దాం. ఇతర మతాల వారిని, వారి సాంప్రదాయాలను గౌరవిద్దాం. ఇతర మతావలంబకుల హక్కుల్ని విశ్వాసాల్ని కాలరాయకుండా మన మతానికి గౌరవాన్ని తెద్దాం.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పై విషయం ద్వారా మీరు ఏమి గ్రహించారు?
2. పరమత సహనం ఎందుకు చూపాలి? సహనం చూపకుంటే ఏమవుతుంది?
3. మీరెప్పుడైనా ఇతర మతస్తులకి సహాయం చేశారా? వారి వేడుకల్లో పాల్గొన్నారా? దానిని గూర్చి చెప్పండి.
4. మన మతాన్ని గౌరవించాలి. ఇతర మతాలనూ గౌరవించాలి ఎందుకో చర్చించండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- ఇతర మతస్థులతో కలిసి వేడుకల్లో పాల్గొనండి. మీకేమి అనిపించిందో చెప్పండి.
- మీరు జరుపుకొనే వేడుకల్లో ఇతర మతస్థులను భాగస్వాములను చేయండి. అప్పుడు మీకు కలిగిన అనుభూతిని చెప్పండి.

### తెలుసుకోండి

మన దేశంలో పరమతసహనం కలిగి, ఇతర మతస్థుల వేడుకల్లో ఏదోవిధంగా పాల్గొంటూ సహకరిస్తున్న వారు చాలామంది ఉన్నారు. గ్రామీణప్రాంతాల్లో జరిగే పెళ్ళిళ్ళు, సీమంతాలకు, పేరంటాళ్ళకు ఇతర మతస్థుల సహకారం తప్పకుండా ఉంటుంది. పీర్లపండుగను (మొహర్రం) హిందూ, ముస్లింలు కలిసి ఘనంగా జరుపుకుంటారు. మొహర్రం పండుగలో హిందువులు ఉత్సాహంగా పాల్గొంటారు. పీర్లు ఎత్తుకోవడం, దట్టీలు కట్టడం, నిప్పుగుండాలు తొక్కడం, పులివేషాలు వేయడం ఎక్కువగా హిందువులే చేసేవారు. ముస్లింలు పోచమ్మగుడికి, నరసింహస్వామి ఆలయాలకు పోవడం అక్కడక్కడా కనిపిస్తుంది.

కడపలోని పీర్ అమీన్ దర్గా, హైదరాబాదు నగరం వెలుపల జహంగీరు పీర్ల దర్గా, ఉర్సు, కాజీపేట దర్గా మొదలైన అనేక దర్గాలకు పోయి మొక్కులు చెల్లించుకొనేవారు అత్యధికులు హిందువులే. ఈవిధమైన పరస్పర దైవారాధన భావం ప్రజల మధ్య ప్రేమలు సహకారం, సద్భావనలు కలిగేటట్లుగా చేస్తుంది.

గణేషు ఉత్సవమూర్తుల తయారీలో ముస్లింలు పాల్గొని చక్కని మూర్తిని తయారుచేస్తున్నారు. ఊరేగింపులో పాల్గొన్న హిందూభక్తులకు మంచినీరు అందిస్తూ సహకరిస్తున్నారు. చరిత్రలో రాజులకాలంలో ఇలా పరస్పర సహకారంతో వేడుకలు జరిగేవి. అప్పట్లో ఉన్న వైష్ణవ, శైవమతాలవారు, జైన, బౌద్ధ మతాలవారు, హిందూ ముస్లిం మతాలు ఒకరినొకరు సహకరించుకొనేవారు. మతం వ్యక్తి వికాసానికి దోహదపడి, విశాల భావాలను కలిగిస్తే విశ్వకల్యాణమే జరుగుతుంది. సర్వజనులకు శ్రేయస్సు కలుగుతుంది.

## ఆదర్శనీయులు

షహనాయి విద్వాంసుడు బిస్మిల్లా ఖాన్, నేపథ్య గాయకుడు మొహమ్మద్ రఫీ, సంగీత దర్శకుడు నోషాద్ ఎన్నో హిందూ భక్తిగీతాలతో దేశప్రజలను అలరించారు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అన్ని మతాలవారి ఆదరణను పొందారు.

తమిళనాడులోని శ్రీరంగం దేవాలయం, భద్రాచలం రాములవారి దేవాలయంలో సన్నాయి వాయించేది తెలుగు ముస్లింలే,

సుబ్రహ్మణ్యస్వామి భక్తుడు శ్రీరంగం దేవస్థానంలో స్వర్గీయ షేక్ చినమౌలానా నాదస్వర సేవ చేశాడు. ఆయన మనమడు నేటికీ సేవిస్తున్నాడు.

పలు దేవాలయాల్లో పూలదండలు సరఫరా చేసేది, మంచి గంధం సప్లై చేసేది ముస్లిములే.

కేరళలోని మాతా అమృతానందమాయి దేశంలో పలుచోట్ల నిర్మించిన ఆలయాల వాస్తుశిల్పి ముస్లిం.

భద్రాచలంలోని రాములవారి కళ్యాణానికి ఆదినుండి ముత్యాలు నిజాం వంశీయుల నుండి వస్తాయి.

బీబీ నాంచారమ్మ (వేంకటేశ్వరుని రెండవ భార్య) ముస్లిం స్త్రీ. తిరుమలలో ఆమె దేవాలయం ఉంది.

షిర్డీ సాయిబాబా ముస్లిం. అతని మసీదుపేరు ద్వారకామాయి. శ్రీరామనవమి పండుగ జరిపేవాడు.

అక్బర్ చక్రవర్తి మీరా బాయి భజనలు వినడానికి వెళ్ళేవాడు.

శబరిమలైలో అయ్యప్పస్వామి భక్తులు దానికి దగ్గరలోని దర్గాకు కూడా వెళతాడు.

నిజామాబాద్ జిల్లా మాక్లూర్‌లో అయ్యప్ప, షిరిడీసాయి ఆలయాలకు స్థానిక ముస్లింలు తరలివస్తారు. భజనలు చేసి తీర్థప్రసాదాలను స్వీకరిస్తారు.

జోధా అక్బర్, మణిరత్నం “బొంబాయి”, కృష్ణవంశీ ‘ఖడ్గం’ చిత్రాలు కూడా హిందూ ముస్లింలు ఐక్యతగా ఉండాలని చాటిచెప్పేవే.

చార్మినార్‌లోని దర్గా శుభ్రతలో చేయూత నిస్తోంది హిందువులు పాతనగరంలో పలుచోట్ల తమలపాకులు, పువ్వులు, అరటిపళ్ళు ముస్లింల నుండి కొనుగోలు చేస్తారు. చార్మినార్ ప్రక్కనే ఆలయం ఉంటుంది.

పశ్చిమగోదావరి జిల్లా కాళ్ళలో మీరాసాహెబ్ దుర్గామాతకు గుడికట్టి నిష్టతో పూజారిగా ఇప్పటికీ పనిచేస్తున్నాడు.

నిజామాబాద్ జిల్లాలోని భైంసాలో మతకల్లోలాలు జరిగినప్పుడు ఓ సాధారణ హిందూ వనిత దాడికి లోనైన కొందరు ముస్లింలకు ఆశ్రయం ఇచ్చింది.

సికింద్రాబాద్‌లోని టకార్ బస్తీవాసి షేక్ ఇమ్రానుద్దీన్, హనుమాన్ జయంతిని ఎంతో భక్తితో జరుపుకుంటాడు.

హైదరాబాద్‌లో బాలాజీ దేవాలయం సమీపంలోనే హనుమంతుని ఆలయం. స్థానికంగా ఓ ముస్లిం మరణిస్తే, గౌరవ సూచకంగా హనుమజ్జయంతి రోజున హనుమంతుని ఆలయాన్ని మూసివేశారు.

పాతబస్తీలోని గొల్లా ఖిడ్కీ కాలనీలో ఇతేషామ్ ఆలీఖాన్ స్థానిక ముస్లింలతో, హిందువులపై దాడిని వారించారు. సుబోధ్ కుమార్, తన హిందూమిత్రులతో కలిసి హిందూ ఆందోళనకారులనుండి ముస్లిం సోదరులను కాపాడాడు.

గత 25 సంవత్సరాలుగా బేగంబజారులోని మొహ్మద్ ఇస్మాయిల్ తన దుకాణం 'హషామ్ అండ్ సన్స్' తలుపులపై హిందువుల దేవతాచిత్రాల బొమ్మలకు అగరుబత్తీలు వెలిగిస్తున్నాడు.

ఒక ముస్లిం మహిళ పెళ్ళికోసం భాగవత్ జిల్లాలోని సున్వారా గ్రామంలోని హిందువులంతా కలిసి చందాలు వసూలుచేశారు.

హుస్సేన్ సాహెబ్ మరియు హైదరాబాదుకు చెందిన సయ్యద్ మీర్జా అనే ముస్లిములు సమర్పించిన 108 బంగారు పుష్పాలతో బాలాజీ 108 నామాలు ఉచ్చరిస్తూ "స్వర్ణపుష్పార్చన" లేదా "అష్టదళ పాదపద్మారాధన" చేస్తారు. ఉత్సవదేవతలైన శ్రీదేవి, భూదేవిలకు సయ్యద్ మీర్జా సమర్పించిన రెండు మంగళసూత్రాలనే నేటికీ వేంకటేశ్వర కళ్యాణోత్సవంలో ఉపయోగిస్తున్నారు. ఆనాటి బ్రిటీష్ అధికారి సర్ థామస్ మన్రో సమర్పించిన మన్రో గంగాళంలోనే నేటికీ నైవేద్యం తెస్తున్నారు. (సాక్షి ఆదివారం అనుబంధం 25-9-2011).

"ప్రస్థాన త్రయం అంటే "భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు". అంతేకాదు "భగవద్గీత, బైబిల్, ఖురాను కూడా". వివేకానందుడు అన్ని మతముల సారమొకటే అని తెలిపాడు.

"ఏది హిందూ ఏది ముస్లిం
ఏది క్రైస్తవమూ?
ఎల్లమతముల సారమొకటే
తోటకెల్ల వసంతుడొకడే"
కృష్ణుడో క్రీస్తో ముహమ్మదో
గీతయో బైబిలు ఖురానో
ప్రేమనే బోధించలేదా?
ద్వేషమును నిరసించె కాదా?
తూర్పు పడమర భేదమేలా?
తోటకెల్ల వసంతుడొకడే
కరములెవరెటు మోడ్చి పిలిచిన
ఖంగుమని గుడిగంట ఒకటే ... బోయి భీమన్న

**సూక్తి**

మతవాదంకన్నా - జాతీయవాదం గొప్పది.

- గాంధీజీ

# 18 అవినీతి నిర్మూలనం

**I. ప్రధాన విలువ**

ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం

**II. ఉప విలువ**

అవినీతిరహితసమాజాన్ని నిర్మించడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- అవినీతిరహితసమాజాన్ని నిర్మించడంలో తమ బాధ్యతలను గుర్తిస్తారు. తన బాధ్యతను తెలుసుకొని ప్రవర్తిస్తారు.

## IV. ఉపోద్ఘాతం

సమాజాభివృద్ధి సక్రమంగా జరగాలంటే నిజాయితీ, సన్మార్గంలో నడిచే పౌరులుండాలి. మంచి పరిపాలన అందించే ప్రభుత్వ యంత్రాంగం ఉండాలి. వివక్షత చూపని వ్యవస్థ ఉండాలి. అంకితభావంతో పనిచేసేవాళ్ళు, నిజాయితీతో వ్యవహరించేవాళ్ళు, నీతినియమాలను పాటించేవాళ్ళు, నిబద్ధత కలిగి వున్నవాళ్ళు పనిచేసినపుడే నిధుల సక్రమ వినియోగం జరిగి ప్రజలకు మేలు చేకూరుతుంది. కానీ దీనికి భిన్నంగా లంచాలు మరిగి అవినీతి ప్రబలిననాడు దేశ అభివృద్ధి కుంటుపడడమేగాక అశాంతి, అసమానతలు పెరిగి మానవజీవనం అల్లకల్లోల మౌతుంది. వివిధ పత్రికలలో వచ్చిన కింది వార్తలను వినండి.

## V. వార్తలు

### వార్త - 1

**2011 :** 2జీ కుంభకోణం... లక్షా 76 వేల కోట్ల నష్టం. 2001 లో కేవలం 40 లక్షలమంది మొబైల్ వినియోగదారులుంటె 2008 కల్లా ఆ సంఖ్య 3.5 కోట్లకు చేరింది. అయినా స్పెక్ట్రమ్ లైసెన్స్‌లు పొందడానికి ఎంట్రీ ఫీజును 2001 ప్రకారమే నిర్ణయించారు. దీని ఫలితంగా ఖజానాకు లక్షా 76 వేల కోట్ల రూపాయల నష్టం. నిందితులు టెలికాం మంత్రి అప్పటి అధికారులు. వీళ్ళ ఖాతాల్లోకి కోట్ల డబ్బులు చేరాయి.

### వార్త - 2

దేశప్రతిష్ఠ ఇనుమడింపజేయాల్సిన కామన్‌వెల్త్ క్రీడా నిర్వహణకు సంబంధించి పరికరాల కొనుగోళు ౄ, నాసిరకం పనులు చేశారు. ఒక్క వానకే పైకప్పులు, కొన్ని నిర్మాణాలు కూలిపోయాయి. కాంట్రాక్టర్లనుండి నిర్వాహణకమిటీ ఛైర్మన్‌కు 95 కోట్ల లంచం అందింది. ఈ అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఆయన్ని అరెస్ట్ చేశారు. 10 నెలలు జైల్లో వేశారు. ఈ కుంభకోణంలో 70,000 కోట్లకు పైగా స్వాహా అయింది.

### వార్త - 3

ప్రభుత్వం ఒడిసా, ఛత్తీస్‌గడ్, కర్ణాటక రాష్ట్రాలలో 73 ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చింది. అదీ 20 రోజుల వ్యవధిలో పర్యావరణమంత్రి ఘనకార్యమిది. ఈ కుంభకోణంలో అవినీతి విలువ 1.8 లక్షల కోట్లు.

### వార్త - 4

చెమటోడ్చి, కడుపు కట్టుకొని పన్నులు కట్టి ప్రభుత్వ ఖజానాను నింపేది ప్రజలు. ప్రజలు వేసిన ఓట్లతో ప్రభుత్వ పగ్గాలు చేతపట్టి అవినీతి, అక్రమాల్లో మునిగితేలుతూ విచ్చలవిడిగా దండుకుంటూవుంటే పౌరులుగా మనం చూస్తూఉంటామా? ఓటరుగా మన శక్తి చూపిస్తామా?

### వార్త - 5

ఒక జిల్లాలో ప్యాకేజి పనిని మహారాష్ట్రకు చెందిన ఓ గుత్తేదారు సంస్థ దక్కించుకుంది. ఈ పనికి 18% లంచం ఇచ్చి ముఖ్యమంత్రి బంధువు తీసుకున్నాడు. ఈ సంస్థ పనులు దక్కించుకొని ఎక్కడా గంపెడు మట్టికూడా తీయకుండానే పర్సెంటేజీల రూపంలో భారీగా డబ్బు వసూలుచేసుకొంది. ఇందులో ప్రభుత్వ పెద్దలతోసహా ఎవరి వాటాలు వారికి ముట్టజెప్పింది. ఇందులో వేలకోట్ల రూపాయలు పక్కదారిపట్టేశాయి. అవినీతి నిరోధకశాఖ వీరిపై కేసులు కూడా నమోదుచేసింది.

## VI. ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. లక్షలున్నవాడు కోట్లు సంపాదించాలని అవినీతిని పెంచుతున్నాడు. ఇలా చేయడం వల్ల ఎవరు నష్టపోతారు? ఎలా నష్టపోతారు?
2. ఎన్నికల సమయంలో వివిధ పార్టీలవాళ్ళ ఓట్లను కొనడానికి ఖర్చుపెట్టి డబ్బంతా అవినీతితో సంపాదించిన డబ్బే? దీని గురించి మీ అభిప్రాయం ఏంటి?
3. లంచాలు తీసుకోవడం ఎంత నేరమో లంచాలు ఇవ్వడం కూడా అంతే నేరం. దీన్ని ఏవిధంగా సమర్థిస్తారు?
4. ప్రభుత్వ పనుల్లో గ్రామస్థాయిల నుండి ప్రపంచస్థాయి వరకూ అడుగడుగునా అవినీతే. దీని పరిణామం దేశప్రజలపై ఎలాఉంటుంది?
5. అవినీతిసొమ్ము అంతా ప్రజలు పన్నులరూపంలో కట్టిన ప్రజాధనం ప్రజాసంక్షేమం కోసం కేటాయించిన ధనం... అవినీతిని అంతమొందించాలంటే పౌరులుగా మనం ఏం చేయాలి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మన చుట్టూ ఉన్న సమాజంలో కింది స్థాయిలలో కూడా పలుచోట్ల అవినీతి ఉంది. ఒక ఫైలు కదలాలంటే లంచం ఇవ్వడం, డబ్బు ఇస్తేనే పనులు చేస్తామనడం వంటివి చూస్తుంటాం. ఇలాంటివి మీ దృష్టిలోకి వచ్చినవి లేదా వార్తాపత్రికల్లో వచ్చినవి సేకరించి చర్చించండి. మీరెలా వీటిని ఎదుర్కొంటారో రాయండి.

### తెలుసుకోండి

## అవినీతి నిర్మూలన

చట్టబద్ధమైన ప్రవర్తన నీతి. చట్ట విరుద్ధమైన ప్రవర్తన అవినీతి. సర్వజనుల సుఖం కోసం ఉపయోగించాల్సిన అధికారాన్ని వ్యక్తిగత లాభంకోసం ఉపయోగించుకోవడమే అవినీతి. అవినీతి వలన ప్రభుత్వం నిర్వీర్యమైపోతుంది. ప్రజలు కడగండ్లపాలవుతారు. ఈ అవినీతి ఒక అంటువ్యాధి. ఇటువంటి అవినీతిని వ్యతిరేకించి ప్రజాసంక్షేమానికి కృషిచేయడమే అవినీతి నిర్మూలనం.

ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన సర్వే ప్రకారం అతితక్కువ అవినీతిగల దేశాలుగా ఐర్లాండ్, ఫిన్‌లాండ్ ఘనత వహించగా, భారత్ 88వ స్థానంలోవుంది. అవినీతి ఏ ఏటికాయేడు పెరగడమేకాని, తరగడంలేదని ప్రజలు ఘోషిస్తున్నారు. ఇక రాష్ట్రాలవారీగా అవినీతి లెక్కలకొస్తే కేరళలో అతితక్కువగాను, బీహారులో అతి ఎక్కువగాను ఉంది. ఆంధ్రప్రదేశ్ అవినీతిలో నాల్గవస్థానంలో వుంది.

అవినీతిని నిర్మూలించాలి అనే ఉద్దేశ్యంతో " అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం ప్రతిసంవత్సరం డిశంబరు 9న జరుపుకుంటారు. దీనిని 2003 అక్టోబరు 31న ఐక్యరాజ్యసమిన నిర్వహించిన "అవినీతి వ్యతిరేక సదస్సు" ద్వారా నిర్ణయించారు.

**అవినీతికి గల కారణాలు**

1. అవిద్య.
2. సమాచారలోపం.
3. ఎన్నికలు సజావుగా జరగక పోవడం.
4. కఠిన శిక్షలు లేకపోవడం.
5. చట్టసభల సభ్యులలో అవినీతిపరులుండడం..... మొదలైనవి.

**అవినీతి నిర్మూలనకు చేపట్టవలసిన కార్యక్రమాలు**

1. **విద్య :** దేశంలో అక్షరాస్యతాశాతాన్ని పెంచాలి. ప్రజలు విద్యావంతులైనప్పుడే అవినీతిని ఎదుర్కోగలుగుతారు. ఉదాహరణకు కేరళరాష్ట్రం.

2. **సమాచార హక్కు చట్టం అమలు :** ప్రభుత్వం, మంత్రులు, అధికారులు సమాచారాన్ని పూర్తిగా ప్రజలకందించే పరిస్థితి ఏర్పడాలి. అప్పుడే అవినీతి నిర్మూలనం జరుగుతుంది. అంటే సమాచార హక్కు చట్టం చక్కగా అమలుకావాలి.

3. **ఎన్నికలు సజావుగా నిర్వహించడం :** ఎన్నికల సమయంలో విచ్చలవిడిగా ధనం ఖర్చుచేసి, మద్యాన్ని ఏరుల్లా పారించి ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు. ప్రజాస్వామ్యదేశంలో ఓటు విలువ, ఎన్నికల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, వారిలో చైతన్యస్ఫూర్తిని కలిగించాలి.

4. **కఠిన శిక్షలు అమలు జరపటం :** అవినీతి పరులకు కఠినమైన శిక్షలు సత్వరం అమలుజరగాలి. అప్పుడే అవినీతి నిర్మూలనం జరుగుతుంది. అలాగే శిక్షలు ప్రజలు సమక్షంలో, బహిరంగంగా జరగాలి. అప్పుడే అవినీతి నిర్మూలనం జరుగుతుంది. అలాగే శిక్షలు ప్రజల సమక్షంలో, బహిరంగంగా జరగాలి. అప్పుడే ప్రజలకు భయం వుంటుంది. కావున ఆ దిశగా శిక్షలు అమలు చేయడానికి ప్రయత్నించాలి.

5. **నీతిపరులను నాయకులుగా ఎన్నుకోవడం :** చటసభల్లో సభ్యులు నీతిపరులై ఉండాలి. అప్పుడే అవినీతిని పారద్రోలవచ్చు. "కంచే చేను మేసినట్లు" మన నాయకులు, చట్టాలను తయారుచేసే సభ్యులే అవినీతిలో కూరుకుపోతే ఇక ప్రజలకు దిక్కెవరు. ప్రస్తుతం మన రాష్ట్రంలో పాలకులు ఎన్నో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇది చాలా దురదృష్టకరం.

## అవినీతి ప్రభావం

అవినీతి కారణంగా పేద ప్రజల జీవన ప్రమాణాలు మరింతగా దిగజారుతాయి. దారిద్ర్యం, వివిధ రంగాల్లో అస్థిరత పెరిగిపోతాయి. అంతిమంగా అది మౌలిక వసతుల వైఫల్యానికి, రాజ్య వైఫల్యానికి దారి తీస్తుంది. ప్రభుత్వాలు, ప్రయివేటు సంస్థలు, ఎన్జీవోలు, మీడియా, వ్యక్తులు కలసికట్టుగా అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాలుపంచుకోవాల్సి ఉంది. అవినీతి వల్ల మానవ హక్కుల ఉల్లంఘనలు, మార్కెట్ అనిశ్చితి, జీవన ప్రమాణాలు నాణ్యంలో క్షీణత లాంటివి చోటు చేసుకుంటాయి. వ్యవస్థీకృత నేరాలు పెరిగిపోతాయి.

## అవినీతిని అరికట్టగలిగే మార్గాలు

కోర్టుల్లో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేయడం, హక్కుల కమిషన్లను ఆశ్రయించడం, ఇంటర్నెట్, టీవీ, ప్రింట్ మీడియాను ఆశ్రయించడం, సమాచార హక్కు చట్టం కింద సమాచారం కోరడం వాటి ద్వారా అవినీతిని కొంతమేరకైనా తగ్గించవచ్చు. యాంటీ కరెప్షన్ సంస్థలు ఏర్పాటు చేయడం, రాజకీయ పక్షాలకు నిధులు అందించడంలో, పాలనావ్యవహారాల్లో పారదర్శకత పెంచడం, ప్రతిభ, సామర్థ్యం లాంటి అంశాల కారణంగా నియామకాలు, ప్రమోషన్లు చేపట్టడం లాంటి చర్యలు తీసుకోవాలని ఈ రంగంలో నిపుణులు సూచిస్తున్నారు. అనుమానాస్పద లావా దేవీలను గుర్తించడం, వివిధ దేశాలు పరస్పరం సహకరించు కోవడం, అన్ని రంగాల్లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం లాంటి వాటి ద్వారా అవినీతిని కొంతమేరకు తగ్గించవచ్చు.

ఎన్నికల రాజకీయ వ్యవస్థలో అవినీతి తొలగించేందుకు సంస్కరణలు చేపట్టాలి. ప్రతీ కార్యాలయంలో సేవల వివరాలు అవి పొందే విధి విధానాలను ఏపని ఎన్ని రోజుల్లో చేస్తారో వివరించే ఫిజికల్ చార్టర్‌లు చాలా శాఖల్లో ప్రకటించారు. వీటిని సక్రమంగా అమలుజరిగేలా కార్యాచరణ ఉండాలి. పారదర్శకత కోసం సమాచార హక్కు చట్టం ద్వారా పూర్తి సమాచారం ప్రజలకు తెలుసుకునే వీలు కలిగింది. దీన్ని సక్షేమంగా వినియోగించుకుంటే అవినీతి దూరమవుతుంది. కేంద్రీకృత పాలన అవినీతికి మూలమైంది. దీనికి విరుగుడుగా అధికార వికేంద్రీకరణ జరగాల్సి ఉంది. జవాబుదారీతనంతో స్థానిక ప్రభుత్వాలు సాధించాలి. మనదేశాన్ని మనమే రక్షించుకునే దిశగా ప్రతీ ఒక్కరూ అవినీతికి వ్యతిరేకంగా ప్రతిన బూనాల్సిన ఆవసరం ఎంతైనా ఉంది.

అవినీతి నిర్మూనలో ప్రతియొక్కరు భాగస్వాములుకావాలి. బాధ్యతగల పౌరులుగా ప్రతియొక్కరు వ్యవహరించాలి. ముఖ్యంగా యువత, విద్యార్థులు నడుంబిగించాలి. ప్రజల్లో చైతన్యం కలిగించాలి. అవినీతి రహిత సమాజస్థాపనకు విద్యార్థులమైన మనందరం కృషిచేద్దాం...!

"బాధ్యతగా వ్యవహరిద్దాం! అవినీతి నిర్మూలనకు నడుం బిగిద్దాం!!"

## అవినీతిని ప్రశ్నించడానికి ఏర్పడిన చట్టాలు :

### సమాచార హక్కు చట్టం

రేషన్ దుకాణానికి మంజూరైన బియ్యం, వంతెన నిర్మాణానికి కేటాయించిన నిధులు... రకరకాల సమస్యలకు సంబంధించి సమాచారహక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించవచ్చు. ఆ అంకెల ఆయుధంతో అవినీతిని ప్రశ్నించవచ్చు.

### ప్రజాప్రయోజన వ్యాజ్యం

సామాన్యుల సమస్యలతో ముడిపడిన అనేకానేక అంశాల్ని ప్రజాప్రయోజన వ్యాజ్యాల ద్వారా అత్యున్నత న్యాయవ్యవస్థ దృష్టికి తీసుకెళ్ళవచ్చు.

### మానవ హక్కుల కమీషన్

వివక్ష, దోపిడి, హింస ఏరూపంలో హక్కుల ఉల్లంఘన జరుగుతున్నా మానవహక్కుల కమీషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

### పౌర ప్రాతికేయం

ఐపెయిడ్ ఎబ్రైబ్.కామ్ వంటి వెబ్‌సైట్లు ప్రజల్లో ఆలోచన రేకెత్తిస్తున్నాయి. అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఆన్‌లైన్ వేదికలమీద ప్రజాసమస్యలపై గళం విప్పవచ్చు. ఛేంజ్.ఆర్గ్ వంటి వెబ్‌సైట్ల ద్వారా వివిధ సమస్యలపై ఇ-పిటిషన్లు దాఖలు చేయవచ్చు. అవినీతి అక్రమాలపై మీడియాకు ఉప్పందించవచ్చు.

### అవినీతి వ్యతిరేక పోరాటం

రాష్ట్రస్థాయిలో అవినీతి నిరోధకశాఖ, లోకాయుక్త కేంద్రస్థాయిలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ తదితర సంస్థలకు వ్యక్తులూ వ్యవస్థల అవినీతిపై ఫిర్యాదులు అందించవచ్చు.

### పరోక్షసాయం

మనం ఐటీ నిపుణులు అయితే వివిధ సంఘాల వెబ్‌సైట్ రూపకల్పనలో సహకరించవచ్చు. సాధారణ కార్యకర్తలుగా... వారాంతాల్లో అంత సమయాన్ని కేటాయించవచ్చు. సంపాదనలో కొంతశాతాన్ని పారదర్శకంగా పనిచేస్తున్న సంఘాలకు విరాళంగా అందించవచ్చు.

**సూక్తి**

**అవినీతిని నిర్మూలిద్దాం - దేశ ప్రగతికి తోడ్పడుదాం!**

# అనుబంధం

1. శ్లోకాలు
2. పద్యాలు
3. పాటలు, గేయాలు
4. కథలు
5. స్ఫూర్తిదాతలు

## శ్లోకాలు

**1 శ్లో॥ క్షమయా దయయా ప్రేమా, సూనృతే నార్జవేవ చ ।**
**వశీకుర్యాత్ జగత్ సర్వం, వినయేన చ సేవయా ॥**

**భావం :** క్షమ, ఇంద్రియ నిగ్రహము, ప్రేమ, సత్యవచనములు, ఋజు ప్రవర్తనము, వినయము, సేవ, వీటిచేతనే సమస్త లోకమును వశీ భూత మొనర్చుకొనుము.

**2 శ్లో॥ న పాణి పాదచపలో, న నేత్ర చపలోఽనృజుః ।**
**నస్యాత్ వాక్చపలశ్చైవ, న పరద్రోహ కర్మధీః ॥**

**భావం :** ఊరక కాలు చేతులాడించుట, కండ్లు త్రిప్పుట, వికార చేష్టలు, అధిక ప్రసంగములు చేయుట, పరులకు కష్టనష్టములు కలిగించే పనులలో బుద్దిని పోనిచ్చుట. ఇవి బుద్ధిమంతుడైనవాడు చేయరాదు.

**3 శ్లో॥ న చ విద్యా సమో బంధుః న చ వ్యాధి సమో రిపుః ।**
**నచఽపత్య సమః స్నేహో, నచ దైవాత్పరం బలమ్. ॥**

**భావం :** విద్యతో సమానమైన బంధువు, అనారోగ్యమునకు సమానమైన శత్రువు. సంతానమునకు సమానమైన స్నేహితులు, దైవమునకు సమానమైన బలము లేవు.

**4 శ్లో॥ పురాణ మిత్యేవ న సాధు సర్వం, నచాఽపి కావ్యం నవ మిత్య వద్యమ్ ।**
**సంతః పరీక్ష్యాన్యతరద్ భజంతే, మూఢః పర ప్రత్యయనేయ బుద్ధిః ॥**

**భావం :** పురాతనమైనది అని ప్రతీదీ మంచిదికాదు. కొత్తదని దేన్నీ దోషముగా పరిగణించరాదు. పండితులైనవారు ప్రతివిషయమునూ గుణ దోష పరీక్ష గావించి మరీ స్వీకరిస్తారు. మంచి చెడ్డలాలోచించక ఒకరు చెప్పిన దాన్నే విశ్వసించుట మూర్ఖత్వము.

**5 శ్లో॥ అల్పాక్షర రమణీయం యః కథయతి నిశ్చితం స ఖలు వాగ్మీ ।**
**బహు వచన మల్పసారం యః కథయతి విప్రలాపీ సః ॥**

**భావం :** కొద్ది మాటలలోనే మనోహరముగా యెవడు మహా విషయమును చెప్పగలడో వాడే గదా వాగ్మియన బడుటకర్హుడు. అట్లుగాక అల్ప విషయము పలు మాటలలో చెప్పి విసుగెత్తించువాడు. వట్టి ప్రేలుడుగాడు అని చెప్పబడును.

**6 శ్లో॥ పుస్తకేషు చ యా విద్యా, పరహస్తే చ యద్ధనమ్ ।**
**సమయే తు పరిప్రాప్తే, న సా విద్యా న తద్ధనమ్. ॥**

**భావం :** పుస్తకములందున్న జ్ఞానము, ఇతరుల వద్ద నుంచిన ధనము యివి సమయానికి అక్కరకు రావు.

**7 శ్లో॥ యథా ఖరశ్చందన భారవాహీ, భారస్య వేత్తా న తు చందనస్య ।**
**ఏవం హి శాస్త్రాణి బహున్యధీత్య, చార్థేషు మూఢాః ఖరవద్వహంతి ॥**

**భావం :** మంచి గంధపు కట్టెలను మోస్తూన్నా గాడిదకు వాటి పరిమళము తెలియదు గదా. అట్లే యెన్నో శాస్త్రములను చదివినా వాటిలోని అర్థవిశేషముల నెరుగనివారు కేవలం గార్దభముల వంటి వారే అవుతున్నారు.

**8 శ్లో॥ ఆత్మవత్ సర్వ భూతేషు, యో హితాయ శుభాయ చ ।**
**వర్తతే సతతం హృష్టః క్రియాహ్యేషా దయా స్మృతా ॥**

**భావం :** ఎవ్వరైతే సర్వజీవులను తనవలెనే చూచుకొనుచు, లోక హితమునకూ, లోకకల్యాణమునకూ యత్నించుచు, సంతృప్తులై ఉందురో అట్టి వారి చర్యనే 'దయ' యని శాస్త్రములు చెప్పినవి.

**9 శ్లో॥ అనిత్యాని శరీరాణి, విభవోనైవ శాశ్వతః ।**
**నిత్యం సన్నిహితో మృత్యుః కర్తవ్యో ధర్మ సంగ్రహః ॥**

**భావం :** శరీరములు అశాశ్వతములు, సంపదలు అస్థిరములు. చావు ఎల్లప్పుడూ దగ్గరలో పొంచి కూర్చునే ఉంటుంది. అందుచేత నిరంతరమూ ధర్మమునే మానవుడు సంపాదించుకుంటుండాలి.

**10 శ్లో॥ అన భిధ్యా పరస్వేషు, సర్వ సత్త్వేషు సౌహృదం ।**
**కర్మణాం ఫలమస్తీతి, మనసా త్రితయం చరేత్ ॥**

**భావం :** పరుల సొత్తునందు ఆశ లేకుండుట, సర్వజీవుల యందు కరుణ, కర్మలకు ఫలముండి తీరునన్న భావము. ఈ మూడింటిని మనసునందుంచుకొని ప్రవర్తించ వలయును.

# పద్యాలు

1. సులభమైన బ్రతుకు సుఖమైన గమనము
మేధకు యోగించు సాధనాలు
మహనీయ నాదర్శమయ జీవితాలన్ని
అనుసరణీయాలు యంచితాలు
ముఖ్య సిద్ధాంతాలు మూర్తి మత్వాలున్ను
నిరతము యోగించు తోరణాలు
కష్టాలు బాధలు కల కాల ముందవు
బ్రతుకంటె సాధక బాధకాలె
మంచి చెడుల నొకె విధంగా యెంచి చూసి
లోభ మోహకామాదుల లోనుకాక
మానసిక ప్రశాంత తలిట మాన్యమైన
సరియగు బ్రతుకు నిలుపొంద సాధ్యమగును.

2. ఆలోచనలు మరి అభిప్రాయములు కూడ
మనమున్న చోటనే మాటువేయు
పట్టింపుటూహలు గట్టి నిర్ణయములు
మనమున్న చోటనే మాటువేయు
గమ్యము లేకుండ గట్టి యోచనలేక
మనమున్న చోటనే మాటువేయు
మనమది వీనిని మరినియంత్రించును
నదిలో దిగితేనె నిజము తెలియు
మంచి చెడులన్ని యిచ్చొట మసలు చుందు
మనిషి యున్నట్టి చోటనే మార్పులన్ని
ప్రాణులున్నచోటున మరీ ప్రాపకాలు
స్థిరపు చిత్తముల్ సిద్ధించ సిద్ధమగును.

3. ఆత్మ జ్ఞానంబిల యచిన వానికి
మనసు వశమునందు మనునతనికి
సంతృప్తి మించిన సౌఖ్యము లేదని
విశ్వాస ముందని వినెడి వాన్కి
వాంఛల తగ్గిస్తు వాస్తవాల పయిన
శ్రద్ధను పెట్టెడి శుద్ధ మదికి
పారదర్శిత పయిన పట్టున్న వానికి
మనుగడ సుఖముగ మనగలుగును
బతుకు పై యవగాహన బాగనున్న
లేత యాశల్ని పేరాశ లేపకున్న
సంస్కృతీ సంప్రదాయాల సంపదున్న
సుఖతరమయిన జీవితం సులభమగును.

4. అత్యాశతోడను అతివాంఛలు కలిగి
అడ్డదారులు ద్రొక్క చెడ్డదగును
సంతానమునకెంతో సంపదివ్వను వచ్చు
సద్గుణాలను, నేర్పు, సర్దలేము
సిరి సంపదలతోనె జీవితం సాగదు
ఆధ్యాత్మికత కూడ యవసరంబు
ఆధ్యాత్మిక చింతన అసహజజముగ వద్దు
ఎగ్జిబిషనులాగ నెంచవద్దు
సంపదలు నెల్ల కావిల శాశ్వతంబు
పుణ్య ఫలమును లెక్కతో పులుమ వలదు
సంస్కృతీ సంప్రదాయాలు సంస్కరించి
భారతీయత చాటుము పలుతెరగుల

5. సహనము లేనిచో సర్వము పోవును
ఓర్పుతోనే గెలుపోపినంత
ఓర్పుతోను తిరిగి నేర్పు ప్రదర్శించి
ఫలియించు ఫలితాలు వలసినంత
అసహనము వలన నావేశము వలన
క్షణములో నష్టంబు జరుగుచాల
సహనము లేనిచో సంఘములో మరి
కలిసి జీవించుట కష్టమగును
క్షణికమావేశమునిల రాక్షసుని జేయు
దిద్దుకోలేని తప్పుల పద్దు మిగులు
సహన గుణమనర్థాలను జరుగనీదు
ఓర్పు నేర్పులే మనుగడ కూత మిచ్చు.

6. మనిషి కులము నాది, మంచియే కులవృత్తి
మానవత్వ మనెడు మతము నాది
సకల జనుల సుఖ శాంతులే కాంక్ష
విశ్వజ్ఞాన జ్యోతి వేదవ్యాస

**– తిరునగరి జగన్మోహనరావు (వేదవ్యాస శతకం)**

7. సీ. తల్లి గర్భము నుండి ధనము దేడెవ్వడు
వెళ్ళి పోయెడినాడు వెంటరాదు.
లక్షాధికారైన లవణమన్నమె కాని,
మెఱుగు బంగారంబు మ్రింగబోడు
విత్తమార్జనజేసి విఱ్ఱ వీగుటె గాని,
కూడబెట్టిన సొమ్ము గుడువ బోడు
పొందుగా మఱుగైన భూమి లోపల బెట్టి
దాన ధర్మము లేక దాచి దాచి

తే. తుదకు దొంగలకిత్తురో? దొరలకవునొ ?
తేనె జుంటీగ లియ్యవా తెరువరులకు ?
భూషణ వికాస! శ్రీ ధర్మపుర నివాస
దుష్ట సంహార ! నరసింహ దురితదూర !

8. సీ. భోగియై, ప్రతిదిన త్యాగియై, పుణ్య సంయోగియై, సుజనాను రాగియగుచు
దాతయై, బుధజన త్రాతయై, నిఖిల విజ్ఞాతయై, కుశల సంధాత యగుచు
ధీరుడై, రణరంగవీరుడై, నిర్మలాచారుడై, నిరుపమోదారుడగుచు
శాంతుడై, సదమల స్వాంతుడై, కీర్తి దిగంతుడై, పటుబలవంతుడగుచు

తే. రాజ్యమేలంగ గలవాడు రాజుగాక
హీనమతియై చరించు వాడేటి రాజు?
భూనుత విలాస! పీఠికాపుర నివాస!
కుముదహితకోటి సంకాశ! కుక్కుటేశ!

**– కూచిమంచితిమ్మకవి (కుక్కుటేశ్వర శతకం)**

9. త్యాగధనమ్మె లోక శుభద ప్రద భవ్య ధనమ్ము, స్వార్థ సం
త్యాగమె శోభన ప్రద మహాధ్వర ధర్మము, సర్వలోక భా
గ్యాగమన క్రమంబుఁ, బ్రథిలాగమ సంచయ సమ్మతంబునై
బాగొనగూర్చు, దద్రతి విభాహ్యత లొప్పెను మామహేశ్వరా!

**– మొలగర రంగారావు (శ్రీ ఉమామహేశ్వర శతకం)**

10. మతముల బద్ధముల్ కులము మాటలు వట్టివి, లేమి కల్మి సం
గతియును కృత్రిమంబవని కత్తిని కుత్తుక నుత్తరించి గె
ల్చితినను మాట బూటకము, రేడని ఒంటని వింత నామముల్
వెతకుట వట్టినాటకమె లెమ్ము, నిజమ్మొక రాగ బంధమే.

**– డా॥ దాశరథి.**

పట్టుదలతో యత్నించినచో
ఎట్టి కార్యము నైనను సాధించవచ్చు.

## పాటలు

# తల్లీ నా పల్లెనేలా...!!

తల్లీ, నా పల్లెనేలా .... నీకున్నది చరిత్ర చాలా
నల్లాని రేగల్ల ఎర్రాని మల్లెలు - నెత్తురోసుకున్న నేలా.... ॥తల్లీ॥

తూరుపు దిక్కున మోదుగు మొక్కల్ల
దిక్కుల్ని సాధించె శక్తుల్ని కన్నావు
ఉయ్యాలలూపావు - జంపాలలూపావు
ఉద్యమాల ఉగ్గు బువ్వను పెట్టావు
ఎండినా ఆకుల వెన్నుపూసల నుండి
ఆయుధాలు తీసి పోరాడమన్నావు ॥తల్లీ॥

పడమటి కొండల్ల వాలేటి పొద్దును
వేలెత్తి చూపావు ఉదయించమన్నావు
అన్యాయమన్నది ఎదిరించమన్నావు
న్యాయాన్ని నీ చేత రక్షించమన్నావు
ధీరుల కండ్లల్ల పేదోల్ల ఇండ్లల్ల
దీపాలు మీరైన చాలు బిడ్డన్నాము ॥తల్లీ॥

పచ్చాని పైరుల్లా వెచ్చాని నెత్తురు
చల్లినా నీకంట్లొ కన్నీళ్లు దాచావు
తడియారి పోనట్టి మరకల్ని చూపెట్టి
పోరులో త్యాగాలు తొలిమెట్టు అన్నావు
గెలుసుకోమన్నావు తెలుసుకోమన్నావు
పేదోల్ల రాజ్యాన్ని సాధించమన్నావు ॥తల్లీ॥

దేశాన్ని కాపాడె సైనిక బిడ్డల
బతుకు దెరువులేక బార్డర్‌కు పంపావు
అరిచేత పెంచావు ఆయుధాలిచ్చావు
సరిహద్దు సేవలొ సాగిపోమన్నావు
చెట్లు ఎక్కేనాడు తలవంచకన్నావు
కన్నందుకూ తలవంపుదేకన్నావు ॥తల్లీ॥

# ఆకుపచ్చ... చందమామ!!

ఆకుపచ్చా చందామ నువ్వేలే.... నువ్వేలే
నీకు మచ్చా ఏడా లేనే లేదులే.... లేదులే
నింగిలున్న చందమామయ్య చేతిలో మహిమ ఏమున్నది
మన్నుల నుంచి అన్నం తీసే మహిమ నీకున్నది
అయినా నింగి చుక్కలల్లో వాడు
చెమట చుక్కలల్లో నువ్వు ॥నింగి॥ ॥ఆకుపచ్చ॥

వానకాలమసై మబ్బు కప్పుకొని మరుగాయె జాబిలమ్మ నవ్వు
వానల్లో వరదల్లో బురదజల్లి ఉన్న మనసున్న జాబిల్లి నువ్వు
మేఘాల సొగసు వాడు
మాగాణి తేజస్సు నువ్వు ॥ఆకుపచ్చ॥

రోజుకొక్క రంగు మారిపోతుంటాది పున్నమి వెన్నెల దీపం
పూటకొక్క తీరు వంగి పోతుంటాది పుట్టెడు కష్టాల రూపం
అమవాస నెలవంక వాడు
ఉపవాస నెలవంక నువ్వు ॥ఆకుపచ్చ॥

కష్టజీవులయ్య భూమి ఆకాశాలు సాగుచేస్తున్నారు మీరు
ఫలము చేతికందకున్న లేని కర్మ యోగులయ్య మీరు
నింగి వెన్నపూస వాడు
నేల వెన్నుపూస నువ్వు ॥ఆకుపచ్చ॥

# మాతృభూమి

పుడమి చేడియకు గొప్పున మల్లెపూదండ
పోలుపుగల మా జన్మభూమి భారతధాత్రి
ఎంత చక్కనితల్లివే! రాణివే! ఎల్ల భూములకు నీవు
ముక్కారు పంటచేలు మితిలేని
రొక్కములు మూల్గు నిధులు
చక్కనగు పూదోటలు – మా తల్లి! సౌభాగ్యవతిని, నీవు
దిక్కులన్నీ వెదకినా – నీవంటి దేశమేదీ! పుడమిపై
ఎంత చక్కటి తల్లివే, రాణివే! యెల్ల భూములకు.
ఇంత చక్కని చంద్రుడూ! చుక్కలూ,
ఇంత వెచ్చని సూర్యుడూ,
కారు క్రమ్మిన మిన్నులూ – తొలకు క్రొ
క్కారు మెఱుపుందీవలూ!
పులుగు పాటల జోలలూ, కలకలని
పులుగులా మేల్కొలుపులూ॥ ఎంత చక్కని ...
ఒరగబండిన చేలకు – గిలిగింత
గరవు తెమ్మెర బాలుడు
పులక కెరటాలతో పొందు – భరతక్షితీ ॥। ఎంత ....
పూలు విరిసిన తీవలూ – తీవల్లు
పొదవికొన్న నికుంజబుల్
కుంజ కుంజమున భృంగీ కులములెత్తెడి పరువులూ
పరువు పరువున పాటలూ – సోనలై
పారు పూవుందేనెలూ
తేనెలానియ యళుల సొక్కులందే లేవు॥ ఎంత చక్కని....
తల్లి బిడ్డల ప్రేమలూ, అక్కచెల్లెళ్ళకమ్మని వలపులూ
చల్లనైన నరాగమూ అన్నద
మ్ముల్ల కింకెచట గలదూ!
అందిమ్ము చరణ యుగము, తల్లిరో!
అద్దుకొందును కన్నులా
నీకు పుట్టిన పున్నెమూ, ఫలయించు
నీలోన లయమందినా
ఎంత చక్కని తల్లివే, రాణివే, ఎల్లభూములకు నీవు ॥

# నేలమ్మా....!!

నేలమ్మ నేలమ్మ నేలమ్మా....
నీకు వేల వేల వందనాలమ్మా
నేలమ్మ నేలమ్మ నేలమ్మా... నేలమ్మ నేలమ్మ నేలమ్మ ॥నేలమ్మ॥

సాలేటి వాళ్లకు తుల్లింతా... సాలు సాలుకి నీవు బాలింత
గాలినీ ఉయ్యాలగ... నీటినే చనుబాలుగ
రెక్కల్ల బొక్కల్ల పక్కల్లా ... నీవు సక్కంగ చూసేవు మొక్కల్లా
పరువమొచ్చీ సేను పొంగీ... పైరు కాపు మేను పొంగీ
పంట బిడ్డలు బండి మీది కెక్కినంక
పగిలిపోతుందమ్మ నీకన్న కడుపింక ॥నేలమ్మ॥

తల్లి నువు నవ్వితే మాగాణి ఎద తలుపు తీవావంటె సింగరేణి
తనువునే తవ్వి తీసినా... మనసునే తొల్లిచేసినా
పొట్ట తిప్పలాకు బిడ్డలు - నీ పొట్టాన పడుతున్న తిప్పలు
ఏ రోజు కారోజు తిరిగీ... నూరేళ్ల అయుషు కోరీ
కడుపుల తిరిగేటి బిడ్డల కొరకయ్యి
తిరుగుతున్నావేమో సూర్యుని గుడిచుట్టూ ॥నేలమ్మ॥

తైలాలు పూసింది నైలునది
నీకు తలస్నానమయ్యింది గంగానది
గంగమ్మే పూసిందహొ... పొందుగొ హొయంగహొ
కొండలలో రంగు రంగు పూలు... గండు కోయిలాల నైటింగులు
కొలువైనదా వెండి కొండ.. నీ దారి గుండెల నిండా
ఇన్ని ఉన్న మనిషి కన్నీళ్ల రక్తాలు
కన్నుల్ల కనలేక కంపించిపోతారు ॥నేలమ్మ॥

మా తల్లిని మట్టి బంగారం
అది మానవాళికి నొదుట సింధూరం
అమ్మ నీ అనురాగమే... కమ్మనీ సమభావమే
గొప్పోల్ల తప్పులు చూడక... నీవు ఎప్పుదు మమ్మేడబాయక
జన్మించినారా... రాజులై పేరొందిరా నిరుపేదలై
నీ వొంటిపై సుతులు చితులు గాల్చుతున్న
నీ వంటి తల్లింక దేవుల్లకే లేదు ॥నేలమ్మ॥

# దానిపేరు దప్పురా...

మాదిగయ్యల మేద నుండీ పురుడుపోసూకున్నది
మానవా జాతులను ఎపుడూ నిదుర లేపూతున్నదీ
నీతి నియమము దప్పకుండా – ఖ్యాతిగా వర్ధిల్లె జగమున
ఎంచి చూడగ పంచమాశృతి – పంచెజన సంగీతమయ్యా
దాని పేరే దప్పురా – అది మ్రోగె దరువుల నిప్పురా ॥మాది॥

ఆదిమాకాలాన ఎండకు అడవులెన్నో తగులబడగా
కాలిన జంతువుల మాంసం – కమ్మగా తింటున్నవేళ
కెవ్వుమని ఆ కొండగాలి – కొవ్వు పొరలకు దాగినప్పుడు
నాదమై నవ్వింది దిశలా – నరుల జీవనదారులల్లో
దాని పేనే దప్పురా – అది మ్రోగె దరువుల నిప్పురా ॥మాది॥

కారుకొచ్చిన మేక మరకల – కన్ను మూసిన లేగదూడల
లేత చర్మం ఒలిచి తిన్నగ – చేతనత్వం చరిత రాయగ
నెత్తురూ చెల్లంతదీసీ – ఉప్పుసున్నం పాతరేసి
చింత అంబలి మాష్టి కుదురు – చితికిపోయిన బతుకు చిత్రం
దాని పేరే దప్పురా – అది మ్రోగె దరువుల నిప్పురా ॥మాది॥

పెళ్లి సందడిలోన – ప్రేమ జతలు బాడూతుంటదీ
చిన్న పెద్దల బిలి చిందులేసీ ఆడామంటది
అప్పగింతలు అయ్యేదాకా – అన్నినేనే నంటదీ
పెళ్లి జంటల సాగనంపీ – ఇల్లు జేరకుంటదీ
దాని పేరే దప్పురా – అది మ్రోగె దరువుల నిప్పురా ॥మాది॥

ఊరిలో ఏ సావుకైనా ముందె ఉంటానంటదీ
సావుసప్పుడు జేసి కాటికి – సాగనంపూతుంటది
దారి పొడవున ఎన్నొ వింతలు – దరువు గుండ బరువు దించగ
ఏడు పెందుకు లోకమందున – ఎవరు బతుకుతరంటదీ
దాని పేరే దప్పురా – అది మ్రోగె దరువుల నిప్పురా ॥మాది॥

## తెలుగు యువకుల్లారా !

ఇది వైకుంఠము, వేంకటేశ్వరుడు ల
క్ష్మీ శుండు కొల్వుండుటన్ః
ఇది కైలాసము, మల్లికార్జునుడి ఆ
ర్యే శుండు చెల్వొందుటన్ః
ఇది బ్రహ్మోర్వి, సరస్వతీ చరణ పం
కే జాతిమై యొప్పుటన్ః
ఇది మా ఆంధ్రము నీకు పీఠము త్రిశ
క్తీః పూజ గై కోగదేః
వాణియ తీర వాటిక, భ
వానియె రాయలసీమ, శ్రీ తెలం
గాణము పూర్ణ రాజ్యరమ
గా ముగురమ్మల మూర్తిదాల్చి, గీ
ర్వాణ పథమ్ములనే గదలి
వచ్చితివేః జగమేలు కొమ్మకన్
రాజ దలిర్ప మాగవతి
రంజిల, ఆంధ్రమః భాగ్యసాంద్రమా!
దేశము జుట్ట బెట్టి తల
దిండుగ బెట్టుక నిద్రపోవు ఆ
వేశము తెల్గువానిదిః ప్ర
వేశము తక్కువ కార్య నైపుణిన్ః
ఏ శిఖరాల వెంబడి గ
మించునొ, ఏ శశిపై భ్రమించునోః
ఆవల కళ్ళెముల్ వదలి
అభ్రవు టంచుట స్వారి చేయునోః
పరమ కవిత్వ మందు ప్రతి

వారును బమ్మెర పోతరాజెః సుం
దర తమ గాన మందు ప్రతి
తమ్ముడు తానొక త్యాగరాజెః స
త్వర వరదాన మందు, ప్రతి
వాడును అచ్చపు భోజరాజే; నీ
డరయ నవాంధ్ర మందు ప్రజ
లందరు రాజులె.రాజ తేజులే,
కలిసి ఉంటే గెలుపు కొస్తాం
చీలిపోతే, కూలిపోతాం
భీముడూ గొప్పవాడే
అర్జునుడూ గొప్పవాడే -
దర్మరాజు కూడా గొప్పవాడే -
కలిసి ఉన్నపుడు!
సుందోప సుందులు కాకండ్రా!
ఓ తెలుగు యువకుల్లారా!
మిమ్మల్ని భ్రమింప జేస్తున్న రంభ
వట్టి వయాముఖ విషకుంభ!

- బోయ భీమన్న

జ్ఞానము పెన్నిధి వంటిది. దీనిని పోలిన మరొక ధనము ఏదీ లేదు. లోభము ఒక శత్రువు. అట్టి శత్రువు మానవునికి మరొకటి లేదు. శీలము మనుష్యునికి అలంకారము వంటిది. సంతోషము ధనము వంటిది. సంతోషము మానవునికెంతో బలాన్నిస్తుంది.

# స్నేహం

పూసిన పూవుల్లా రాలేటి మంచులా
చల్లని నీడలాగ - చెలిమలనీడలా
తోడు నీతోడురా స్నేహమూ
తేనెలా తీపిరా నేస్తమూ......

1. చిన్ననాడు వీథుల్లో ఆడుకున్న ఆటల్లో
చింతకాయలన్ని నీవు రాయితోని రాలగొట్టి
కాకి ఎంగిలానినీవు కొరికి పంచిపెడతావు
తెలియని భావమురా స్నేహమూ
తల్లి దండ్రి కలుపనీ నేస్తమూ ॥పూసిన॥

2. బంధువులు బలగాలు తిండిలేనోళ్ళకు దూరం
దేవుళ్ళు తీర్థాలు ధనము ఉన్నోళ్ళకు సొంతం
బిక్షగాడి నుండి మొదలు లక్షలున్నాడిదాకా
అందరికి దొరికేటీ స్నేహమూ
ఆత్మగల ఆలయమురా నేస్తమూ ॥పూసిన॥

3. కష్టాల్లో ఉన్నపుడు చేరదీసేను నిన్ను
ఆపదలూ ఉన్నపుడు ఆదుకునేను నిన్ను
చిక్కుల్లో నీబ్రతుకు దిక్కుతోచని నాడు
దగ్గరుంటె ధైర్యమురా స్నేహమూ
వద్దకొచ్చి ఓదార్చురా స్నేహము ॥పూసిన॥

# విజ్ఞానంతోనే వికసించు జగత్తు

విజ్ఞానం తోనే వికసించు జగత్తు
పసిపిల్లల చదువే దానికి విత్తు
లేగదూడ గంతులు పసిడిపూలకాంతులు
గాలి తరగ పిలుపులు సెలయేటి అలల మెరుపులు
ప్రకృతిలో అణువణువు పసిపిల్లల అమ్మఒడి
ఆ ప్రేమను పంచాలి పిల్లలకు చదువులబడి

1. ఎక్కాలు గుణింతాలు చిక్కుముడులుగా
   గురువులకు పాసాలు చింత బెత్తాలుగా
   పసి పిల్లల మనసులో గాయాలే రేగితే
   భావి భారతి ఆశల బాల్యమింకెక్కడిదీ.

2. దేశమేదైనా కాలమేదైనా
   చెప్పే చదువేదైనా బాల్యమొక్కటే
   పూవు వంటి పసిప్రాణం వసివాడిపోకుండా
   కాపాడే బాధ్యత అందరిదీ మనదందరిదీ

3. పాఠమే పాటగా చదువే ఒక ఆటగా
   గురువే విద్యార్థికి చక్కని నేస్తంగా
   మనసును మురిపిస్తే బాధను మరిపిస్తే
   తరగతి గదులే రేపటి తరగతి నిధులు ॥విజ్ఞాన॥

# పండుగ రోజు

ఏడు కోట్ల పూలువిరిసి మురిసిన పండుగరోజు
విరుల తావు లచ్చరలై వియచ్చరలైన రోజు
నెల బాలుడు మిన్నులు దిగి నేలకు వచ్చినరోజు
కొమ్మల్లో కోయిలనై కుహూ కుహూ అన్నను
నదుల మతులు పులకరించి నాట్యం చేసిన రోజు
గట్లు త్రెంచి సముద్రాలు కౌగలించుకున్న రోజు
ప్రభాత ప్రదోషాలు పసుపు కుంకుమలు చల్లిన రోజు
భావాలు రంగుల తోరణాలై ద్యోహ వృద్ధుల మధ్య ఎగిరిన రోజు
మమత విశాల మానవతకు కర్పూర నీరాజన మిచ్చిన రోజు
ఉల్లిపొర కాగితాన్నై ఊదా రంగు పులముకొని
ఒక ఉజ్జ్వల పతంగాన్నై అనంత నీలిమలో విహరించాను
ధరిత్రి తిరిగెను చరిత్రలో ఒక పేజీ పెరిగెను
చైత్రం విరిసిన తోటకు ఝంఝా మరుత్తు వచ్చెను
పూల గుండెలను హాలాహల పూరితాలు చేశారు
వెన్నెలలు వెలార్చుచోట విషజ్వాల రగిల్చారు
విరులు రాలి తరులు కూలి ఝరుల నీరు జారిపోయి
జీవకాంత లారిపోయి సుందర వందర లైతే
ఏ కొమ్మలు చేరి నేను ఏ గీతిక పాడతాను
ప్రపంచ వివంచి పంచమ స్థాయి నెట్లు చేరుతాను?
రెండు యెదలు కలియు మాట, రెండు యెదలు కలుపు చేత
పాదలించుము సోదరుడా చదలందున నీ చరిత్ర
రాహువు పట్టిన పట్టొక సెకండు అఖండమైనా
లోక బాంధవుడు అసలే లేకుండా పోతాడా?
మూర్ఖుడు గడియారంలో ముల్లు కదల నీకుంటే
ధరాగమన మంతటితో తలకిందై పోతుందా?
కుటిలాత్ముల కూటమి కొక త్రుటికాలం జయముస్తే
విశ్వసృష్టి పరిణామం విచ్ఛిన్నం అవుతుందా?
దనుజలోక మేకంగా దారినడ్డు నిల్చుంటే
నరజాతి ప్రస్థానం పరిసమాప్త మవుతుందా?

– గుంటూరు శేషేంద్రశర్మ

# మాయమై పోతున్నడమ్మా

పల్లవి : మాయమైపోతున్నడమ్మా
మనిషన్నవాడు ఓ...ఓ...ఓ...
మచ్చుకైనా లేడు చూడూ
మానవత్వం వున్నవాడూ
నూటికో కోటికో ఒక్కడె ఒక్కడు
యాడవున్నడో కాని కంటికి కనరాడు ॥మాయమై॥

చరణం-1: నిలువెత్తుస్వార్థము నీడలాగొస్తుంటే
చెడిపోక ఏమైతడమ్మా
ఆత్మీయ బంధాల ప్రేమ సంబంధాల
దిగజారు తున్నడోయమ్మా
అవినీతి పెను ఆశ అంధకారములోన
చిక్కిపోయి రోజు శిథిలమౌతున్నాడు ॥మాయమై॥

చరణం-2: కుక్కనక్కల దైవరూపాలుగా కొలిసి
పంది నందిని జూస్తే పడి మొక్కుతుంటాడు
చీమలకు చక్కెర పాములకు పాలోసి
జీవకారుణ్యమే జీవితము అంటాడు.
తోడబుట్టిన వాళ్ల ఊరవతలికి నెట్టి
కులమంటు ఇల మీద కలహాల గిరిగీసి ॥మాయమై॥

చరణం-3: ఆధ్యాత్మికత కన్న అర్థమె తెలియక
అంధుడై పోతున్నడమ్మా
హిందు ముస్లిం క్రీస్తు సిక్కుపార్శీనంటూ
తనను తా మరిచెనోయమ్మ
మతము లోకహితము అన్నమాటా మరిచి
మత ఘర్షణల మధ్య మనిషి కనుమరుగౌతు ॥మాయమై॥

చరణం-4: ఇరవై ఐదు పైసల గరు వత్తులుగాల్చి
అరవై ఐదు కోట్ల వరములడుగూతాడు
దైవాల పేరుతో చందాలకై దండ
భక్తి ముసుగూ తొడిగి భలే ఫోజు బెడతాడు
ముక్తి పేరా నరుడు రక్తిలో రాజయ్య
రాకాసి రూపాన రంజిల్లుతున్నాడు. ॥మాయమై॥

చరణం-5: అవసరాలకు మనిషి సృష్టించిన రూపాయి
చుట్టూ దిరుగూతున్నడమ్మా
రూపాయి కొరకు ఏ పాపానికైతేమి
ఒడిగట్టి నదిగో చూడమ్మా
కోటి విద్యలు కూటి కోసమన్నది బోయి
కోట్లకూ పరుగెత్తా కోరికలు చెలరేగి ॥మాయమై॥

చరణం-6: కండ్ల పొరలగమ్మి కామముతో ఊరేగి
వెకిలి చేష్టల తోటి వేధిస్తు వున్నాడు
కన్న వాళ్లకు రోజు కన్నీల్లె మిగిలించి
కౌగిలె స్వర్గమని కలలు గంటున్నాడు
చీకటైతె చాలు చిత్తుగా తాగేసి
వావి వరసలు కాస్త మరచి పోతూ నరుడు ॥మాయమై॥

చరణం-7: పార్టీ సిద్ధాంతాల పరగణాలా
గొడవలోన పడి చస్తున్నడమ్మా
ఆధిపత్యపు పోరు అలజడె చిరునామ
అంటు జైకొడుతున్నడమ్మా
రాజకీయాలల్లో రాటు దేలి తుదకు
మానవతా విలువల్ని మంట గలుపుకుంట ॥మాయమై॥

చరణం-8: ఇనుప రెక్కల దేగ విసిరినా పంజాకు
కోడిపిల్లై చిక్కి కొట్టు కుంటున్నాడు
ఉట్టికి స్వర్గాని కంద కుండగ తుదకు
అస్తి పంజరమయ్యి అగు పించమన్నాడు
కదిలె విశ్వం తనా కనుసన్నలో నడువా
కనుబొమ్మ లెగరేసి కాలగమనం లోనా ॥మాయమై॥

– డా॥ అందెశ్రీ

## కథలు

# 1. సాహసంతో సమున్నత స్థానం

ఇది మనదేశంలో జరిగిన ఓ నిజమైన సాహసగాథ! మేజర్ సోమనాథ్ శర్మ భారతసైన్యంలో ఉన్నతాధికారిగా పనిచేసేవారు. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత, 1947 అక్టోబరు 22న జమ్ముకాశ్మీర్‌పై కొందరు ఆటవికులు దురాక్రమణకు పాల్పడే ప్రయత్నం చేశారు. నాలుగు రోజుల తరువాత జమ్మూకాశ్మీర్ రాష్ట్రం. భారతదేశంలోకి విలీనమైంది. దాంతో ఆ మరుసటి రోజే భారతసైన్యం శ్రీనగర్‌లోకి హుటాహుటిన ప్రవేశించి, శత్రుసైన్యాన్ని నగర శివారులోనే అడ్డగించింది.

ఆ సమయంలో మేజర్ సామనాథ్ అక్కడి సైనిక విభాగానికి కమాండర్‌గా ఉన్నారు. ఆ విభాగానికి శ్రీనగర్ శివారులో శత్రువులతో పోరాడమనే ఆదేశాలు వచ్చాయి. అయితే కొన్ని రోజుల ముందే హాకీ ఆడుతుండగా, మేజర్ సోమనాథ్ చేతికి గాయమై ఎముకలు చిట్లాయి. దాంతో చేతికట్టు కూడా విప్పలేదు; వైద్యులు కొన్నిరోజులు విశ్రాంతి తీసుకొమ్మని సలహా ఇచ్చారు. కాని మేజర్ శర్మ ఎలాగైనా యుద్ధభూమికి వెళ్ళాల్సిందేనని పట్టుబట్టారు. 'శత్రువు, నా మాతృభూమిపై దాడి చేశాడు. రక్షంచుకోవలసిన బాధ్యత, నాపై ఉంది. నా సైనికులకు నా మార్గదర్శకత్వం అవసరం. ఇలాంటి కఠినసమయంలో, నేను విశ్రాంతి ఎలా తీసుకోగలను? అంటూ మేజర్ శర్మ ముందుకు కదిలారు.

'నవంబరు 3, 1947న శ్రీనగర్‌లో ఉత్తర దిశ నుంచి శత్రుసైన్యం ఏమైనా దాడి చేయనుందా? పరిశీలించమని మేజర్ శర్మ బృందానికి ఆదేశాలు అందాయి. దాంతో కాశ్మీర్ లోయలోని బాగ్దామ్ అనే ప్రాంతంలో మేజర్ శర్మ సైనికబృందం ప్రతిఘటనకు సిద్ధమై ఉంది.

కొంత సమయానికి పెద్దసంఖ్యలో శత్రుమూక మేజర్ శర్మ బృందంపై విరుచుకుపడింది. సంఖ్యాబలంలోనే కాకుండా, ఆయుధసామర్థ్యంలో కూడా తమ శక్తి ఎక్కువగా ఉండటంతో, మూడువైపుల నుంచి మేజర్ బృందాన్ని శత్రువుల మూక చుట్టుముట్టారు. ఆ దాడిలో మన సైనికులోల కొందరు వీరమరణం పొందారు; మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. మేజర్ శర్మ పరిస్థితి తీవ్రతను పసిగట్టారు. శత్రుమూకని దేశంలోకి అడుగుపెట్టకుండా ఆపగలిగే ఒకే ఒక్క అవకాశం తమ బృందానికి ఉందని అర్థమైంది. ఒకవేళ వాళ్ళను ఇక్కడ అడ్డుకొనక పోతే, నేరుగా వాళ్ళు శ్రీనగర్‌లోకి ప్రవేశించి దాడికి పాల్పడతారు. నిరాయుధులైన నగర పౌరులపై విరుచుకుపడతారు. వాళ్ళను రక్షించాల్సిన బాధ్యత తమపై ఉంది. శ్రీనగర్ విమానాశ్రయం కూడా దూరం కావటంతో, భారతదేశ ప్రధానభూభాగం నుంచి కాశ్మీర్‌కి మన వాయు సేవ చేరుకోవటానికి చాలా సమయం పడుతుంది. ఇదంతా ఆలోచించి మేజర్ శర్మ చావో, రేవో అనుకొని శత్రువులతో తలపడుతున్నాడు. ఎట్టి పరిస్థితుల్లోనూ మేజర్ శర్మ బృందమే, శత్రుసమూహాన్ని అడ్డగించాలి.

మేజర్ శర్మ తన సైనికబృందాన్ని ఎన్నో విభాగాలుగా విభజించారు. అన్ని వైపుల నుంచి శత్రువులను ఎదుర్కొనేందుకు సంసిద్ధులను చేశారు. ఎలాంటి భీతికి తావివ్వకుండా మేజర్ శర్మ తన బృందం విస్తరించిన అన్ని విభాగాలకు వెళుతూ వాళ్ళకు ఆదేశాలిస్తూనే ఉన్నారు. 'మిత్రులారా! ఒక శత్రువును కూడా ముందుకు

వెళ్ళనీయకూడదు. వాళ్ళను ఎదుర్కోండి! మీరు సాహసవంతులైన సైనికులు. మాతృభూమి కోసం పోరాడుదాం.' అంటూ శర్మ ఉత్తేజ పరుస్తూనే ఉన్నారు.

ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి వెళ్ళే క్రమంలో మేజర్‌శర్మ, శత్రువుల కాల్పులకు గాయపడుతూనే ఉన్నారు. అయినా మొక్కవోని ధైర్యంతో అన్ని వైపులకు పరుగులు తీస్తూనే ఉన్నారు. తన నైపుణ్యంతో శత్రువులపై ఎదురుదాడులు కొనసాగింపచేస్తూనే ఉన్నారు. పెద్దసంఖ్యలో ఉన్న శత్రుసైన్యాన్ని ఎదుర్కునేందుకు వాయుసేన అవసరం తప్పదని మేజర్‌శర్మకు అర్థమైంది. దాంతో వెంటనే శత్రువులకు ఎదురుపడతానన్న భీతి కూడా లేకుండా, విశాలమైదానం లోకివచ్చి, భారతవాయుసేనకు కొన్ని సంకేతాలను చూపుతూ, శత్రుసేన ఉన్న ప్రాంతాల జాడను తెలియజేశాడు.

కొంత సేపటికి మేజర్‌శర్మకు తన మెషిన్‌గన్ ప్రభావం శత్రువులపై అంత ప్రభావాన్ని చూపటం లేదని తెలిసి, ప్రత్యామ్నాయం కోసం పరుగులు తీశారు. ఓవైపు గాయపడి కట్టుకట్టి చేతితో బాధపడుతూనే మరో మెషిన్‌గన్‌తో కాల్పులు జరిపే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. కొన్నిగంటల తీవ్ర ప్రతిఘటన అనంతరం శత్రుసేన తమకు దగ్గరవుతుందని మేజర్‌శర్మకు అర్థమైపోయింది. వెంటనే పరిస్థితిని రేడియోలో ఉన్నతాధికారులకు తెలియచేశారు.

'శత్రువులు తమకు యాభై గజాల దూరంలోనే ఉన్నారు. మన సైనికబలం కూడా చాలా తక్కువైపోయింది. ప్రాణాలకు తెగించి పోరాడుతూ ఉన్నాం. అయినా ఒక్క అడుగుకూడా వెనక్కి తగ్గే ప్రసక్తేలేదు. ఆఖరి బుల్లెట్ వరకు, చివరి శ్వాస వరకూ మా శాయశక్తులా పోరాడుతూనే ఉంటాం' అంటూ సమాచారాన్ని హెడ్‌క్వార్టర్స్‌కు తెలియజేశారు మేజర్‌శర్మ.

ఈ సమాచారం ఇచ్చిన వెంటనే తిరిగి ఆ ఆయన మళ్ళీ కాల్పులకు ఉపక్రమించాడు. కాని కొన్ని క్షణాల్లోనే శత్రువుల తుపాకి గుండ్లు మేజర్‌శర్మపై వర్షంలా కురిశాయి. పక్కనే పెద్ద విస్ఫోటనం మేజర్ సోమనాథ్ శర్మను విగతజీవుడిని చేశాయి; దాంతో వారు అమరవీరుడయ్యారు.

తమ నాయకుడు ఒరిగిపోయినా, ఆయన అనుయాయులు పోరాడుతూనే ఉన్నారు. చివరకు దాదాపు అందరూ, అసువులు బాసి, అమరులయ్యారు. శత్రుసైన్యం సంఖ్యలో ఎక్కువగా ఉండటంతో మేజర్‌శర్మ బృందాన్ని ఎదుర్కోగలిగారు. కాని మేజర్‌శర్మ బృందం తీవ్ర ప్రతిఘటన వల్ల శత్రుసైన్య కాశ్మీర్ భూభాగంలోకి అడుగు పెట్టటం దాదాపు ఆరు గంటలు ఆలస్యమైంది; అన్ని గంటలపాటు మేజర్‌శర్మ సైనికసభ్యులు వీరోచితంగా శత్రువులను నిలువరించగలిగారు. ఫలితంగా భారతసైన్యం అప్రమత్తమై, యుద్ధసామగ్రిని సంసిద్ధం చేసుకోగలిగింది. అనంతరం సమర్థంగా శత్రువులను మట్టిగరిపించగలిగింది. శ్రీనగర్ నుంచి ఆటవిక శత్రుమూకను తిరుగుముఖం పట్టించగలిగింది.

ఇంతలో శ్రీరామ్ ఏదో చెప్పబోతుండగా, శ్యామ్ అడ్డుకొని 'కథ ఇక్కడితో అయిపోలేదు. మేజర్ సోమనాథ్‌శర్మ వీరోచిత నీయకత్వ పటిమకు, త్యాగానికి మరణానంతరం భారతప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన 'పరమవీరచక్ర' పురస్కారాన్ని ప్రకటించింది. ఈ పురస్కారాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టాక, ప్రప్రథమ గ్రహీత మేజర్ సోమనాథ్‌శర్మ కావటం విశేషం. ఈ పురస్కారాన్ని వారి తరపున ఎవరు అందుకున్నారో తెలుసా? మేజర్ శర్మ తండ్రి మేజర్ జనరల్ అమర్‌నాథ్‌శర్మ.

# 2. అతిపెద్ద అప్పు పత్రం

భీమయ్య లబోదిబోమన్నాడు - తన పన్నాగం ఫలించక పోవడమే కాక డబ్బుకూడా పోయినందుకు తలవంచుకుని సభలోంచి వెళ్ళిపోయాడు. ప్రజలు రామన్న తీర్పునెంతో పొగిడారు. “న్యాయదేవతే దిగివచ్చింది” అని పలువిధాల ప్రశంసించారు. రామయ్య, అతని స్నేహితుడూ మర్యాదరామన్నకు కృతజ్ఞతలు తెలుపుకుని సెలవు తీసుకున్నారు.

ఆవేళ మర్యాదరామన్న న్యాయసభలో ఉండగా - యిద్దరు మనుషులు తగవు తీర్చమని వచ్చారు.

“విషయం చెప్పండి అన్నాడు రామన్న వారిద్దరిలోనూ ఒకరి వేపు చూస్తూ.అతను రెండోవాడిని వేలితో చూపిస్తూ-” అయ్యా! నేను ఇతనికి కొన్నాళ్ళ కిందట ఐదువందల వరహాలు అప్పిచ్చాను” అన్నాడు.

“అప్పుపత్రం రాయించుకున్నావా?”

రాయించుకున్నాను”. “ఏదీ చూపించవేం?” అడిగాడు రామన్న?.

“లేదు”

ఏమయింది? పోయిందా?

“పోవడంకాదు”

మరేమిటి?”

ఇతను బాకీ తేర్చేస్తాను, పత్రం తీసుకురా. అన్నాడు నేను అప్పు వసూలవుతూందన్న ఆనందంలో పత్రం తీసికొని వెళ్ళాను. ఇతను దానిని చూస్తున్నట్టు నటిస్తూ లాగుకొని చింపివేసి - నేను నీకేమీ బాకీ లేను ఫో! అని నన్ను గెంటేవాడు.” అని చెప్పాడు.

రామన్న నువ్వేం చెబుతావన్నట్లు రెండో వాడివేపు చూశాడు.

“రామన్నగారూ! ఇతను చెప్పినదంతా అబద్ధం ఋణమూ చెయ్యలేదు, పత్రమూ చింపలేదు. ఇతను చెప్పేదంతా” అన్నాడు.

ఇద్దరిలో ఎవరు నిజం చెబుతున్నారో గ్రహించడానికి అప్పటికప్పుడు ఏ ఆధారాలూ కనిపించక-” ఇప్పటికి మీరు యిళ్ళకు వెళ్ళండి. వచ్చేవారం రండి. అప్పుడు తీర్పు చెబుతాను.” అని వాళ్ళిద్దరినీ పంపించేశాడు మర్యాదరామన్న తరువాత గూఢచారులని ఆ గ్రామానికి పంపి ఆ యిద్దరి గురించీ వీలయినన్ని వివరాలు సేకరించుకురమ్మన్నాడు.

వాళ్ళు ఆ యిద్దరి గురించి ఆ వూరిలో ఆరాలు తీసికొచ్చారు. “ఋణదాత మంచివాడే అని తెలిసింది. అతను పొదుపరి కూడా. అవసరమన్న వారికి తనదగ్గరుండాలేకాని అప్పిస్తాడట. ఇక రుణం తీసుకున్నవాడు

మోసగాడట. ఎదుటి వారి సొమ్ముకాశపడే తత్వమట. వీలైతే మోసం చేసే రకమట. సులభంగా డబ్బు వస్తుందంటే ఎంతటి నీచానికయినా దిగజారుతాడట–" అని చెప్పారు.

దోషి ఎవరో తేలినట్లే. కాకపోతే నేరం నిరూపించగలగాలని అనుకున్నాడు రామన్న. తీవ్రంగా ఆలోచించాడు. అతనికొక ఉపాయం స్ఫురించింది. ఋణదాతకి రహస్యంగా కబురంపి తనవద్దకు రప్పించాడు. "నువ్వు ఋణమిచ్చానన్నావు. అతను ఋణం తీసుకున్నాడన్నావు. ఋణపత్రం రాశాడన్నావు. మరి ఆ ఋణపత్రం ఎంత పొడవుంటుంది?" అడిగాడు రామన్న. అతను తెల్లబోయి–" ఇదేం ప్రశ్నబాబూ! ఋణపత్రం ఎంత పొడవుంటుంది? ఆరు అంగుళాలుంటుంది. అంతేకదా?" అన్నాడు.

'నేను ఇదే ప్రశ్న నిన్ను అతని ముందడుగుతాను విచారణ సమయంలో నువ్వు ఋణపత్రం పొడవు ఆరుంగుళాలు అని చెప్పకు.' మరెంతని చెప్పమంటారూ?" ఆశ్చర్యంగా చూశాడతను రామన్నవేపు.

"ఆరడుగలని చెప్పు," అన్నాడు రామన్న.

"ఆరడుగులా! ఆరడుగుల ఋణపత్రముండదే ఎక్కడా కూడా.." ఆశ్చర్యపోయాడతను. "ఉండదుకనుకనే చెప్పమనడం. నీకు న్యాయం జరగాలంటే అలాగే చెప్పు."

"సరే" అన్నాడతను సెలవు తీసుకుంటూ..

తీర్పు రోజు వచ్చింది. ముందుగా విచారణ ప్రారంభించాడు మర్యాదరామన్న "నువ్వు అతని చేత రాయించుకున్న ఋణపత్రం ఎంత పొడవుంటుందీ?" అడిగాడు రామన్న. "ఆరు అడుగులు బాబూ–" అన్నాడతను. రెండోవాడు ఆ జవాబుకి నవ్వాపుకోలేక పోయాడు." ఆరుడుగుల ఋణపత్రమా! ఐతే నాకసలే సంబంధంలేదు. నేనుచింపింది ఆరు అంగుళాల ఋణపత్రం మాత్రమే. ఆ ఆరు అడుగుల ఋణపత్రం గురించి నాకేమీ తెలియదు." అన్నాడు. వెంటనే మర్యాదరామన్న నవ్వాడు. "ఐతే ఆరు అంగుళాల ఋణ పత్రం ప్రకారం ముందు అప్పు తీర్చెయి. ఆరు అడగుల రుణపత్రం గురించి తరవాత చూద్దాం." అన్నాడు.

అప్పటికా మోసగాడికి తన పొరపాటూ, తొందరపాటూ తెలిసి వచ్చాయి. కాని చెయ్యగలిగేదేముంది? తన నోటితోనే పత్రం చింపానని ఒప్పేసుకున్నాడుగా? గత్యంతరంలేక. బాకీ చెల్లించి. దుఃఖిస్తూ అతను అక్కడినుంచి నిష్క్రమించాడు.

ఋణదాత రామన్నకి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. సభలోని ప్రజలు మర్యాదరామన్న తెలివితేటలని మరో మారభినందించారు.

# 3. విద్యార్థి విధేయత

ఒకానొక కాలంలో మగధ అనే రాజ్యంలో దౌమ్యుడు అనే ఒక గొప్ప మహర్షి ఉండేవారు. వారు సంస్కృత వ్యాకరణంతో పాటు తర్క, గణిత శాస్త్రాల్లో మహావిద్వాంసులు. ఆ రాజ్యంలోని దూరదూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి ఎంతో మంది శిష్యులు ఆయన దగ్గర విద్యను అభ్యసించేవారు. పాటలీపుత్ర ఆయన దగ్గర విద్యను అభ్యసించేవారు. పాటలీపుత్ర నగర శివారులోని గ్రామంలో ఆ మహర్షి గురుకులం ఉండేది. గురుకుల విద్యార్థులకు భోజన వసతిలో ఏడాదంతా ఎలాంటి ఇబ్బంది ఉండకుండా, దౌమ్యుడు ఆశ్రమ సమీపంలో వరిపోలాన్ని కూడా సాగేచేయించేవారు.

ఆ మహర్షి ప్రియశిష్యుడే ఆరుణి. అతిచిన్న వయసులోనే గురుకులంలో చేరి, అనతికాలంలోనే తన ప్రవర్తనతో, సౌమ్యస్వభావంతో, చక్కని విద్యాభ్యాసంతో గురువుగారి ఆదరాభిమానాలను చూరగొన్నాడు.

గురుకులానికి చెందిన వరిపొలం ఒక ఏడాది వర్షాకాలం యథావిధిగా వరినాట్లు వేశారు. ఒకరోజు ఆకాశాన్ని నల్లనిమేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి.

ఉరుములు, మెరుపులతో ప్రకృతి భయావహంగా మారిపోయింది. మేఘాల నాదాలకు అడవిలోని జంతువులే కాదు, గురుకులంలోని యువ శిష్యుల భయభ్రాంతులకు గురయ్యారు. ఉధృతంగా వీచిన పెనుగాలులకు గురుకుల కుటీరాలు కూడా కంపించాయి. కుంభవృష్టిలా వర్షం ప్రారంభమైంది. వర్షం తాకిడికి పొలాల గట్లు కూడా తెగిపోయి, నీరు పొంగి ప్రవహిస్తోంది.

వెంటనే దౌమ్య మహర్షి శిష్యుడు ఆరుణిని పిలిచి, 'శిష్యా! నువ్వు మన వరిపొలానికి వెంటనే వెళ్ళు. మన పొలం గట్టుకు ఏమైనా ప్రమాదముందేమో పరిశీలించు ఒకవేళ, అతి తెగిపోతే మరమ్మతులు చేసిరా!' అన్నారు.

ఆరుణి గురువుగారి మాటను శిరసావహించి వెంటనే పొలం వైపునకు పరుగెత్తాడు. ఇంకా భోరున వర్షం కురుస్తూనే ఉంది. తీరా వెళ్ళి చూసేసరికి, పొలానికి సంబంధించి, ఓ వైపు గట్టు తెగిపోయింది. నీరు వడిగా పొలంలోకి ప్రవహిస్తూనే ఉంది. వెంటనే ఆరుణి, స్పందించి మట్టితో గట్టును సరిదిద్దే ప్రయత్నం చేశాడు. కాని ప్రవాహవేగానికి అది క్షణాల్లో కొట్టుకుపోయింది. పాపం! ఆరుణి ఎన్నిసార్లు మట్టితో ఆనకట్ట కట్టినా అది నిలవటం లేదు. దీంతో ఆయన తీవ్ర ఆందోళనకు గురయ్యాడు.

గురువుగారు తనను నమ్మి, ఇక్కడకు పంపితే ఇలా అవుతుందేమిటని? ఆరుణి బాధపడసాగాడు. తనపై పెట్టిన బాధ్యతను సక్రమంగా పూర్తిచేయలేకపోతున్నాని మథనపడసాగాడు. ఇలా అడ్డుకట్ట వేయటం అసాధ్యమని ఆరుణికి అర్థమైంది. వెనక్కి వెళ్ళి వేరే ఏర్పాట్లు చేసుకొని వచ్చేసరికి వరిపొలమంతా నాశనమవుతుందని ఆలోచించాడు. అప్పుడు అతడు ఏంచేశాడు? గురువు ఆజ్ఞను ఎలా నెరవేర్చాడు?

వెంటనే ఆరుణికి ఒక ఆలోచన తట్టింది. 'నేను శారీరకంగా దృఢంగా, బలంగానే ఉన్నాను. నేనే ఈ పొలం గట్టుపై పడుకుంటాను. నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటాను. అప్పుడే గురువుగారి కోరిక నెరవేరుతుంది' అనుకొని, దృఢదీక్షతో ఆరుణి పొలానికి తెగిన కట్ట ప్రాంతంలో అడ్డంగా పడుకున్నాడు. నీటవేగానికి ఎదురొడ్డి, పొలంలోకి వెళ్ళకుండా అడ్డుకున్నాడు. ప్రవాహతీవ్రత ఆరుణికి విద్యుద్ఘాతంలా తగులుతోంది. అయినా దానినేమీ పట్టించుకోకుండా, పడుకునే ఉన్నాడు. ఇంతలో వర్షం తగ్గుముఖం పట్టింది. అయినా ఏమాత్రం నీరు పొలంలోకి వెళ్ళకుండా ఉండేందుకు  ఆరుణి అక్కడే  పడుకొని ఉన్నాడు. అతని శరీరం బలహీనమైపోయింది.

సాయంత్రం పొద్దుపోయింది; వాతావరణం కూడా పొడిగా మారింది. అప్పుడు గురువుగారికి, ఆరుణి ఇంకా ఆశ్రమానికి రాలేదన్న సంగతి గుర్తొచ్చింది. ఆయన ఆందోళనతో, ఇతర శిష్యులతో కలసి పొలం వైపునకు పరుగెత్తారు. దీపాల వెలుగులో ఆరుణి కోసం పొలాలన్నీ వెతికారు. 'బాబు ఆరుణి! బాబు ఆరుణి! ఎక్కడున్నావు నాయనా?' అంటూ దౌమ్యమహర్షి ఆందోళనగా పిలవసాగారు.

'ఆరుణి, ఎక్కడున్నావు?' అంటూ సోదరశిష్యులు కూడా తెతకసాగారు.

అప్పుడు మెల్లగా దూరంగా వరిపొలం గట్టు నుంచి 'గురుదేవా! నేను ఇక్కడున్నాను!' అన్న ఆరుణి మాటలు వినిపించాయి.

'దౌమ్యుడు, శిష్యబృందమంతా ఆ వైపునకు పరుగెత్తారు. ఆరుణి పరిస్థితి చూసి, అందరికీ ఆశ్చర్యమేసింది. వెంటనే ఆరుణిని లేపి, అక్కడ మట్టితో గట్టు కట్టారు. దౌమ్యుడు, ఆరుణిని ప్రేమగా ఆలింగనం చేసుకొని 'బాబు! నీ గురుభక్తికి నేను ప్రసన్నుడనయ్యాను. నీకు నా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయి. నీవు ఉత్తమ శిష్యుడిగా లోకంలో పేరుపొందుతావు' అన్నారు.

ఎప్పుడు మనం నేను, నాది అనే భావన లేకుండా పనిచేస్తామో,
అప్పుడే అత్యుత్తమంగా పని చేస్తాము. ఇతరుల మీద అంత ఎక్కువ ప్రభావాన్ని
చూపగలుగుతాము. ప్రపంచం చూపిన గొప్ప గొప్ప మేధావులందరూ
ఈ నిజాన్ని గ్రహించి పనిచేశారు.

# 4. ఏదీ మనవెంటరాదు

"దిన దిన గండం నూరేళ్ళాయుష్షు" అని మా నాయనమ్మ అంటుండేది. మృత్యువుకి వాడు వీడు అన్నభేదం లేదుట. మనిషిని నీడలా ఎప్పుడూ వెంటాడుతునే వుంటుందిట, అందుకని ఏరోజుకారోజు మృత్యుముఖంనుంచి తప్పించుకోగలిగితేనే మనిషి నూరేళ్ళూ బతికేదని చెబుతుండేది. అయినా తెలీకడుగుతాను – ఏవి తప్పించుకోగలం? ముంచుకొస్తున్న ముసలితనాన్ని తప్పించుకోగలమా? ముసురుకొస్తున్న రోగాల్ని తప్పించుకోగలమా? గుండెకు తగిలే గాయాల్ని అడ్డుకోగలమా? ఈ మూడింటిలో ఏ ఒక్కటొచ్చి మీద పడ్డా చాలు మన జీవితం బుగ్గికావటానికి! అందుచేత బతికిన నాలుగు రోజులూ హాయిగా బతక్కుండా ఎందుకీ కక్షలూ కార్పణ్యాలు?

విదురుడు ధృతరాష్ట్రుడితో అంటాడు:

**గజ తురగాది సంపదలు గాంతలతోడి విహారి లీలలున్**
**బ్రజకనురాగ మొంద బరిపాలన సేయు క్రమంబు చోరులున్**
**విజయము బొంది పేర్చుటయు విస్ఫురితాబరణానులేప వ**
**స్త్ర జనిత వైభవంబుగల రాజులు బోయిరికాక నిల్చిరే?**

"మహారాజా! ఈ లోకంలో ఇంతకుమునుపు కూడా ఎందరో రాజులు జన్మించారు. వాళ్ళంతా విక్రమ పరాక్రమాలతో ఈ భూమిని పాలించారు. మహదైశ్వర్యాన్ని అనుభవించారు. సుందరీమణులు, యౌవన వతులు, విలాసినులు అయిన కాముక స్త్రీలతో శృంగార వీధుల్లో విహరించారు. ప్రజానురంజకంగా పాలన చేశారు. యుద్ధాలు చేశారు. రాజ్యాలను విస్తరించారు. ఎందరినో సామంతుల్ని చేసుకున్నారు. ధనకనక వస్తువాహనాలతో తులతూగారు. కస్తూరి, కర్పూరం, శ్రీచందనం వంటి సుగంధ ద్రవ్యాలను శరీరాలకు పై పూతగా పూసుకున్నారు. మేలిమి వస్త్రాలు ధరించారు. రంగ రంగ వైభవంగా ప్రకాశించారు. కాని, ఇప్పుడా రాజులేరి? వాళ్ళ సారమాజ్యాలేవి? నేను చెప్పేది ఇప్పుడైనా విను. ఈ శరీరం శాశ్వతం కాదు. డబ్బు శాశ్వతం కాదు, యౌవనం శాశ్వతం కాదు, ప్రాణాలు శాశ్వతం కాదు, రాజ్యాలు శాశ్వతం కాదు, రాజ్యాలు శాశ్వతం కాదు. ధర్మమొక్కటే శాశ్వతమైనది. అదే నిశ్చలమైనదీ, స్థిరమైనదీ. నీకొడుకులకూ, మంత్రులకూ గట్టిగా చెప్పి పాండవుల రాజ్యభాగం పాండవులకిచ్చెయి" అని హితవు చెప్పాడు. మనం కూడా ఈ సత్యాన్ని తెలుసుకుని బతికిన నాలుగురోజులూ అందరితో మంచిగా వుంటూ అందరినీ గౌరవిస్తూ ఒకరికొకరం చేదోడువాదోడుగా వుంటూ జీవితాల్ని పండించుకోవాలి. మన సంపదలకు మనం ధర్మకర్తలమే గాని, యజమానులం కాదని గ్రహించాలి. ఎంత సంపాదించినా ఏదీ మన వెంట రాదన్న జ్ఞానంతో మెలగాలి. నాకో కథ గుర్తకొస్తోంది. అనగనగా ఒక రాజు. పరమ కర్కోటకుడు. ప్రజలను పీడించి పన్నులు వసూలు చేసేవాడు. వాళ్ళ సిరి సంపదలను బలవంతాన లాక్కునేవాడు. వాటితో విలాసవంతమైన జీవితం గడిపేవాడు. దానాలు, ధర్మాలు చెయ్యాలన్న బుద్ధే పుట్టేది కాదాయనకు. మా ఇంటికొస్తే మాకేం తెస్తావు. మీఇంటికొస్తే

మాకేమిస్తావు – అనే చందాన జీవించేవాడు. నడిమి వయసుదాటి వార్ధక్యంలోకి వచ్చాడు. అప్పుడు తెలిసొచ్చింది చేసుకున్న పుణ్యం తప్ప ఏదీ మన వెంట రాదని! ఆ రాజుగారి వంశాచారం ప్రకారం మరణానంతరం ఆయనను ఒక చక్కని చెక్క పెట్టెలో వుంచి ఖననం చెయ్యాలి. రాజుగారు మరణించాక మంత్రులూ కుటుంబ సభ్యులూ అందరూ కలిసి నగిషీలు చెక్కిన ఒక అందాల పెట్టె తెచ్చి దానికి అటూ ఇటూ రెండు రంధ్రాలుచేసి అందులో ఆయనను పడుకోబెట్టారు. ఆయన రెండు చేతుల్నీ రెండు రంధ్రాల్లోంచి బయటకు కనపడేటట్టు పెట్టారు. శవ పేటికను శ్మశానానికి తరలిస్తుండగా అది చూసిన కొందరు రాజోద్యోగులు "పాపం, రాజుగారు ఇంత బతుకూ బతికి, చివరకు అంతిమ ప్రస్థానానికి ఒక మంచి పెట్టెనైనా సంపాదించుకోలేక పోయారు. చిల్లుల పెట్టె గతి అయింది' అని వాపోయారు.

అంతిమ యాత్రను చూసిన ఇంకొందరు ప్రజలైతే "సంపాదించింది చాల్లేదా నాయనా? పోయేటప్పుడు కూడా రెండుచేతులూ చాచావు" అని ఈసడింపుగా అన్నారు. ఈ వ్యాఖ్యలన్నీ మంత్రులు విన్నారు.

శవ పేటికను కిందకు దింపించి "అయ్యలారా! రాజాజ్ఞ ప్రకారమే ఇలా చేశాం. 'నేను ప్రజలను పీడించాను, వేధించాను, బాధించాను. నేనొక్కణ్ణే బతికినన్నాళ్ళూ అన్ని సుఖాలూ అనుభవించాను. అందమైనవన్నీ నాకే చెందాలని భావించాను. వయస్సు మీద పడింది. యౌవనం సడలింది. రోగాలు చుట్టుముట్టాయి. ఇప్పుడు నన్ను ప్రేమతో పలకరించేనాథుడే లేడు. రేపోమాపో పోవల్సిందే. పోయేటప్పుడు నేనేమీ పట్టుకుని పోవడం లేదనీ, వట్టి చేతులతో పోతున్నాననీ లోకానికి చాటి చెప్పేందుకు నన్ను చెక్కల పెట్టెలో పెట్టిన నా చేతులు రెండూ బయటకు కనిపించేలా ఏర్పాటుచెయ్యండి' అని చెప్పారు. ఆయన ఇష్టప్రకారమే చేశాం" అన్నారు. ప్రజలు మెచ్చుకున్నారు.

తరువాత శవ యాత్ర సాగింది.

కాబట్టి గొడవలొద్దు. ఘర్షణలు వద్దు. వైరుధ్యాలు వద్దు. ఒకసారి ఇవన్నీ వద్దనుకుంటే వాటివల్ల కలిగే కష్టనష్టాలు మనకు వుండవు. జీవితం హాయిగా సాగుతుంది. నూరేళ్ళూ బతికేందుకు అవకాశం కలుగుతుంది. రాగద్వేషాలతో, కామంతో, ఈర్ష్యతో రగిలిపోయేవారు, సత్కర్మలాచరించాలన్న సద్బుద్ధి లేనివారు, తల్లిదండ్రుల్ని ప్రేమించనివారు, పెద్దల్నీ గురువునీ గౌరవించనివారు, అతిథి సేవనం చెయ్యనివారు నూరేళ్ళూ బతికి మాత్రం ప్రయోజనమేమిటి అని ఆర్యుల ప్రశ్న.

అయ్యా! మనం మానవులం. ఈ జన్మ దుర్లభమని పెద్దలు చెబుతున్నారు. మనిషిగా పుట్టాలంటే ఎన్నో వేల వేల జన్మలలో పుణ్యం సంపాదించుకుంటే, ఎప్పుడో ఒక సారి ప్రాణికి ఆ అవకాశం లభిస్తుందిట. కనుక ఈ అవకాశాన్ని వదులుకోవద్దు. విజ్ఞతతో బతుకుదాం. సలక్షణంగా బతుకుదాం.

# 5. నడవడే అలంకారం

రామరావణ యుద్ధం ముగిసింది. రావణుడు హతుడయ్యాడు. విభీషణుడు లంకా రాజ్యానికి ప్రభువయ్యాడు. సీతకీ విషయం చెప్పిరమ్మని రాముడు హనుమంతుడిని అశోకవనానికి పంపించాడు. సీత చాలా సంతోషించి అంజనీపుత్రుడ్ని ప్రశంసించింది. ఆ తరువాత సీతమ్మ చుట్టూ వున్న రాక్షస స్త్రీలను చూస్తూ, "అమ్మా! ఇన్నాళ్ళూ వీళ్ళు నిన్ను అనేక విధాల అవమానించి బాధించారు. నానా మాటలూ అన్నారు. వీళ్ళు రాక్షసులు కూడా కాదు. అంతకంటే భయంకరమైనవాళ్ళు! నువ్వు అనుమతిస్తే వీళ్ళను పిడికిళ్ళతో గుద్దుతాను. మోకాళ్ళతో పొడుస్తాను, నోరూ ముక్కూ మూసి ఊపిరి సలపనీకుండా మాట తోచనీకుండా చేస్తాను. తలలు తెగ నరుకుతాను" అన్నాడు మారుతి.

సీతాదేవికి కరుణ, క్షమ, ఓర్పు అన్నీ ఎక్కువే! క్షణకాలం ఆలోచించి, "వానరోత్తమా! వీళ్ళంతా ప్రభుసేవా పరాయణులు. ఎవరు అధికారంలో వుంటే వాళ్ళు చెప్పినట్టు చేస్తారు.దాసీజనానికి అంతకంటే స్వతంత్రతేముంటుంది? వాళ్ళ మీద కోపం తెచ్చుకుని ఏం ప్రయోజనం? అయినా, నా అదృష్టం తిన్నగా వుంటే ఎవరినైనా అనాల్సిన పనేముంది? పతివియోగంతో బాధపడమని భగవంతుడు నా మొహానరాశాడు. బాధపడ్డాను. అంతే, దానికి ఈ దాసీలను హింసించడమేమిటి? నేను వీళ్ళను క్షమిస్తున్నాను. వీళ్ళ జోలికి పోవద్దు" అని ఒక కథ చెప్పింది.

"అదో అడవి. ఒకరోజు ఒక వేటగాడిని ఓ పులి తరుముకుంటూ వెళ్ళింది. వాడు భయపడి ఎదురుగా వున్న చెట్టెక్కాడు. ఆ చెట్టు మీద అప్పటికే ఒక ఎలుగుబంటి వుంది. పులి చెట్టు కింద నిలబడి 'వాడు వేటగాడు. మనిద్దరికీ విరోధే. కిందకు తోసెయ్! వాడి సంగతి నేను చూసుకుంటాను' అంది ఎలుగుబంటితో.

'వాడు ప్రాణభీతితో చెట్టెక్కాడు. తెలిసైనా తెలియకైనా వాడు నేనున్న చెట్టు ఏక్కాడంటే వాడు నన్ను శరణుకోరుతున్నట్టన్న మాట. అందుకని నేను వాడిని కిందకు తోసెయ్యను' అంది ఎలుగుబంటి.

పులికి ఏమి చెయ్యాలో తోచలేదు. అలాగే చెట్టు కింద నిరీక్షిస్తూ నిలబడింది. ఈలోగా ఎలుగుబంటి నిద్రపోయింది. అప్పుడు పులి వేటగాడితో మాటలు కలిపింది. 'ఆ ఎలుగును కిందకు తోసెయ్. దానితో ఎప్పటికైనా ప్రమాదమే నీకు' అంది. వాడు ఎలుగును కిందకు తోసేశాడు. ఉలికిపడి లేచిన భల్లూకం చాకచాక్యంగా మరొక కొమ్మ పట్టుకుని ఆగింది. 'నేను నెత్తీనోరూ బాదుకుని చెబితే విన్నావు కాదు. చూశావా, ఇప్పుడేమైందో! ఆ కృతఘ్నుడిని ఇప్పుడైనా కిందకు తోసెయ్' అంది పులి.

'చెడ్డ వాళ్ళ పాపాలలో మంచివాళ్ళు పాలుపంచుకోరు. ప్రాణసంకటం కలిగినా దుష్కార్యాలు చేయరు. ఏ ప్రాణికీ ద్రోహం తలపెట్టరు. ఇతరులకు నచ్చనిదేదీ చేయరు. చేసిన ప్రతిజ్ఞ ఆరునూరైనా చెల్లించుకుంటారు. వాళ్ళ నడవడే వాళ్ళకు అలంకారం' అని సమాధానమిచ్చింది. ఎలుగు."

ఈ కథ చెప్పి, "నాయనా! ఎదుటి వాళ్ళు పాపాత్ములు కానీ, పుణ్యాత్ములు కానీ, చంపదగిన వారే కానీ – ఉత్తములు కారుణ్యమే చూపించాలి! అయినా, ఏ తప్పూ చేయని వాళ్ళెవరుంటారు? తప్పు చేసిన

వాళ్ళని పెద్దమనసుతో మన్నించడమే గొప్ప. కొందరు ఇతరులను అదే పనిగా హింసిస్తూ వుంటారు. కొందరు పరుషాలే పలుకుతారు, అప్రియాలే పలుకుతారు. కొందరు క్రూరాలు, కుటిలాలే చేస్తుంటారు. ఇంకొందరు అలవోకగా అవినీతి పనులు చేస్తుంటారు. దుశ్చింతలు నెరపుతూంటారు. పాపపు పనులు చేస్తుంటారు. చాడీలు చెబుతుంటారు. అయినా, వారికి మనం మాత్రం అశుభం కలిగించకూడదు" అని హితవు పలికింది సీత.

ఆ మాటలకు హనుమంతుడు చేతులు జోడించి సీతమ్మతల్లికి వినయంగా నమస్కరించాడు.

దయవిషయం ప్రస్తావనకు వచ్చింది గనుక నాకింకోకథ గుర్తుకొస్తోంది. మార్కండేయ పురాణంలో వుందీ కథ. విపశ్చిత్తు అనే రాజు ఎన్నో పుణ్యాలు చేసాడు.కాని తెలిసీ తెలియక ఒకటి రెండు పాపాలు కూడా చేసాడు. ఫలితంగా నరకం చూడాల్సొచ్చింది. నరకం గుండా ఆయన వెళ్తుంటే అక్కడి వారికి హాయి కలిగింది. దానతో ఆయనను మరికొంతసేపు తమ చెంతనే వుండమని వాళ్ళు వేడుకున్నారు. ఆయన వారి మీద జాలిపడి సరేనన్నాడు. కాని, యమ భటులు ఒప్పుకోలేదు. స్వర్గానికి వెళ్ళేందుకు విమానం సిద్ధంగా వుందని తొందరచేశారు. అయినా సరే విపశ్చిత్తు రానన్నాడు. ఇంతలో యమధర్మరాజు వచ్చి "ఎన్నో పుణ్యాలు చేశావు. ధర్మాన్ని సేవించావు. నరకంలో వుండాల్సిన కర్మ నీకేమిటి? పదపద నిన్ను త్వరగా స్వర్గానికి చేరుస్తాను" అన్నాడు. "ఇక్కడ వేలాదిమంది నరకంలో బాధలు పడుతున్నారు. నేనిక్కడ వుండడం వలన వాళ్ళకు ఉపశమనం కలుగుతోందిట. అలాంటప్పుడు వాళ్ళను విడిచి నేనెలా వస్తాను. అన్నాడు విపశ్చిత్తు. "మహారాజా! నీకు తెలయందేముంది? చేసుకున్న వారికి చేసుకున్నంత, ఎవరు చేసుకున్న కర్మ వారు అనుభవించాల్సిందే" అన్నాడు యముడు. దానికి విపశ్చిత్తు "ధర్మదేవా! నేనెంత పుణ్యం చేశానో చెప్పగలవా?" అని అడిగాడు.

"సముద్రంలోని నీటి బిందువుల్ని లెక్కించడం, ఆకాశంలోని నక్షత్రాలను లెక్కించడం, గంగలోని ఇసుక రేణువులను లెక్కించడం ఎంత కష్టమో నువ్వు చేసిన పుణ్యాలను లెక్కించడం కూడా అంతే కష్టం. అందుకే ఆ పుణ్య ఫలాన్ని అనుభవించేందుకు త్వరగా స్వర్గానికి వెళ్ళమంటున్నాను" అన్నాడు యమధర్మరాజు.

"అయితే నాదో విన్నపం. మీరన్నట్టు నేను నిజంగా అన్ని పుణ్యాలు చేసి సంపాదించుకున్న సుకృత మేదైనా వుంటే దాన్ని వెచ్చించి ఈ నరకంలోని పాపాత్ములందరికీ విముక్తి కల్పించండి. స్వర్గవాసం కంటే అది నాకు ఎక్కువ తృప్తినిస్తుంది" అన్నాడు విపశ్చిత్తు. వెంటనే ఇంద్రుడు ప్రత్యక్షమై, "రాజా! నువ్వు చూపిస్తున్న ఈ దయవల్ల నీకిదివరకు లభించిన దానికంటే ఎక్కువ పుణ్యం కలిగింది. పరమపదం లభించబోతోంది. నువ్వు కోరినట్టే నరకంనుంచి ఈ పాపులు విముక్తులవుతున్నారు. చూడు" అన్నాడు. విపశ్చిత్తు మీద పూలవాన కురిసింది.

అయ్యా! తెలుసుకోండి.

ఒడ్డునున్నవారు నీటిలో మునిగిపోతున్న వారికి చేయి అందివ్వాలి. సుఖసంపదలతో, భోగభాగ్యాలతో తులతూగుతున్నవారు లేనివారిమీద జాలి చూపించాలి. సిరికి తగిన సత్కృతి చేయాలి. అలా చేయడం వలన మన సొమ్మేం తరగదు. పైగా పెరుగుతుంది.

# ౬. గోరంత సాయం

మనం ఎందుకు ఉన్నాం? ఇతరులకు సాయం చేసేందుకు! ఇతరులంటే ఎవరు? ఆర్తులు, అన్నార్తులు, పతితులు, భ్రష్టులు, దగాపడిన తమ్ముళ్ళు, స్నేహం కోసం చేతులు చాచి ఆ చేతుల్నే కాల్చుకున్నవాళ్ళు, పడ్డవాళ్ళు, లోబడ్డవాళ్ళు, చెడ్డవాళ్ళు.

వాళ్ళకేం కావాలి?

మీ మడులూ మాన్యాలూ పూసా పుట్రా నగా నట్రా ఏమీ అక్కర్లేదు. గోరంత సాయం కావాలి. అంతే!

కుంతీదేవి కుమారులు ఐదుగురూ కౌరవుల కుట్రకు బలై అరణ్య, అజ్ఞాతవాసాలు చెయ్యవలసి వచ్చింది. ఆ సమయంలో వాళ్ళంతా ఏకచక్రపురంలో భిక్షాటనంతో జీవిస్తూ వున్నారు. అదే ఊరి పొలిమేరల్లో బకాసురుడనే రాక్షసుండేవాడు. ఊరుమీద పడి అందర్నీ చంపుకుతింటుండేవాడు. అది భరించలేక ఆ ఊరి ప్రజలందరూ వాడితో ఒక ఒప్పందానికి వచ్చారు. ప్రతి రోజూ రెండెడ్ల బండి నిండా అన్నాన్నీ తీసుకుని ఒక మనిషి ఊరి బయట బకాసురుడుండే చోటుకు వెళ్తే అప్పుడు వాడు ఆ అన్నాన్నీ, ఎడ్లనీ, బండి తోలుకు వెళ్ళిన మనిషినీ భక్షిస్తాడు. అదీ ఒప్పందం.

రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు ఓ నిరుపేద కుటుంబం వంతు వచ్చింది. వాళ్ళకే సరిగా తినడానికి తిండి లేదు. బండెడన్నం ఎక్కడ నుంచి తేవాలి? పైగా ఆ ఇంటి వాళ్ళు ఇద్దరూ ముసలివాళ్ళు. వాళ్ళకున్న ఒకే ఒక ఆధారం వాళ్ళ కన్నకొడుకు. వాళ్ళ కంటి వెలుగల్లా వాడే! వాణ్ణి చంపుకోడం ఇష్టం లేక ముసలి దంపతులిద్దరూ రాక్షసుడికి నేను ఆహారంగా వెళ్తానని సిద్ధమవుతున్నారు. ఒకరినొకరు విడిచి వెళ్ళలేక ఇద్దరూ గుండెలవిసిపోయేలా ఏడుస్తున్నారు. ఇంతలో వాళ్ళ కొడుకు వచ్చాడు. తల్లిదండ్రులిద్దర్నీ వారించి ఓదార్చి అతను బండెక్కాడు. అది చూసి ఆ ముసలి దంపతులు పెద్దగా రోదిస్తూ మూర్ఛపోయారు. ఇదంతా కుంతీదేవి చూసింది పరుగున వెళ్ళి కథంతా తెలుసుకుంది. క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా బండి మీద కూర్చున్న ఆ పిల్లవాణ్ణి కిందకు దింపి తన కొడుకు భీమసేనుణ్ణి ఎక్కించింది.

ఆ క్షణాన కుంతీదేవి భీముడు బకాసురుణ్ణి గెలుస్తాడనే అనుకుందో, బకుడికి ఆహారమే అవుతాడనుకుందో లేదా ముసిలి దంపతులకున్న ఒక్కగానొక్క కొడుకును రక్షించేందుకు తనకున్న ఐదుగురు బిడ్డల్లో ఒకరిని పణంగా పెడదామనుకుందో ఎవరికెరుక?

కాని ఒకటి మాత్రం నిజం.

వృద్ధ దంపతుల కడుపుకోత చల్లార్చి వాళ్ళ బిడ్డను వాళ్ళకు అప్పగించిన క్షణంలో వాళ్ళ మొహాల్లో పూచిన వెలుగుచూసి కుంతీదేవి మహదానందాన్ని పొంది వుంటుంది. మనిషి జీవితంలో మూడు విషయాలు చాలా ముఖ్యమైనవని చెబుతారు. ఒకటి దయ కలిగి వుండడం రెండోది దయ కలిగి వుండడం – మూడోది కూడా దయ కలిగి వుండడమే! సాయంకోసం చేతుల చాస్తూ కొండంత ఆశతో మన దగ్గరకు వచ్చే వాళ్ళకు మనం బాసటగా నిలవాలి. మన బతుకు కేవలం మనం బటకటంతోనే చరితార్థం కాదు. మనం బతికి పది మందిని బతికించాలి. మన చేయూత వాళ్ళకు శ్రేయస్సును కలిగించాలి. వాళ్ళ మనసుల నిండా సంతోషాన్ని నింపగలగాలి. అప్పుడు చూడండి – అసలైన ఆనందమంతా మన చుట్టూరానే వుంటుంది. భగవద్గీత కూడా

ఇదే చెబుతోంది. తోటివారి బాగుకోసం పాటుపడటం ప్రతి ఒక్కరి జీవితంలో ఒక ప్రధానమైన వ్యాపకం కావాలిట. మీమాంస పండితునిగా కీర్తింపబడ్డ సుందర పాండ్యుడయితే తన 'ఆర్యావళి' అనే నీతి గ్రంథంలో

**యస్మిన్ జీవతి జీవతి**
**మహాజనః తస్య జీవితం నామ**
**జీవన్నపి న స జీవతి**
**న జీవతి యమాశ్రితః పురుషః॥**

పదిమందికి తోడు నీడగా నిలిచినవాని బతుకే బతుకు. ఆశ్రయించిన వారిని దరిచేర్చలేని వాడు చచ్చినట్టే లెక్క - అన్నాడు.

మన చదువు, తెలివితేటలు, ఆస్తిపాస్తులు, సాధనసంపత్తి, అధికారం, డబ్బు, బలపరాక్రమాలు, అంతెందుకు అసలీ జీవితమే భగవంతుడు మనకు మంజూరుచేసిన పెద్ద సాయం. మనకంటే ఎక్కువ అవసరం వున్న వారికి అందులోంచి మళ్ళీ కొంత మనం అందచేయాలి. అదీ న్యాయం. ఎక్కడో చదివాను – ముంబైలోనో ఢిల్లీలోనో డబ్బు దండిగా వున్న ఓ ఆసామి తన పుట్టినరోజును అయినవాళ్ళ మధ్యగాకుండా ఆర్తుల మధ్య, ఆకలిగొన్న వాళ్ళ మధ్య జరుపుకునే వాడట. నగరం నడిమధ్యలో సువిశాలమై పార్క్‌కు చుట్టూ తెరలు కట్టించి లోపల మందీ మార్బలాన్నీ వంటవాళ్ళనీ దింపి, లోపలేం జరుగుతోందీ ఎవరికీ తెలియకుండా రకరకాల వంటలు, మధుర పదార్థాలు, తీపి ద్రావకాలు చేయించేవాడు. పిల్లలు అమితంగా ఇష్టపడే బిస్కట్లు, చాక్లెట్లు, కేకులు, ఐస్‌క్రాములు సరేసరి. వాటికి కొదవే వేండేది కాదు. పిల్లలు ఇష్టపడతారనుకునే కొత్త అయటమ్ ఒకటి ప్రతి ఏడూ మెనూలో చేరుతుండేది. సాయంకాలం అవుతూ అవుతూ వుండగా ఆయన, ఆయన పరివారం నగరమంతా చుట్టి ఎక్కడెక్కడో వున్న వీధి పిల్లలందర్నీ కార్లల్లో బస్సుల్లో పోగేసుకొచ్చేవారు, కొత్తలో అయితే తమనెందుకు అక్కడకు తీసుకువచ్చారో తెలీక పిల్లలంతా భయం భయంగా వుండేవారు. తరువాత తరువాత తెలిసిపోయింది. తెలిసాక ఆనందంతో కేరింతలుకొట్టారు.

బస్సులు దిగిన పిల్లలందరూ శుభ్రంగా కాళ్ళూ చేతులూ ముఖాలూ కడుక్కోవాలి. ఒంటినున్న బట్టలు విప్పేసి అసామిచ్చే కొత్త బట్టలు కట్టుకోవాలి. అప్పుడు ఆ పిల్లల్ని చూస్తే రాజహంసలన్నీ మానససరోవరానికి చేరినట్టుగా వుంటుంది. ఆ దృశ్యం మనసు మీద ముద్రితమవుతూ వుండగానే పార్కు ప్రధాన ద్వారం బార్లా తెరుచుకుంటుంది. పిల్లలందరికీ స్వాగతం పలుకుతారు. వాళ్ళు తుమ్మెదల్లా లోపలికి పరుగెడతారు. తలుపులు మూసుకుంటాయి. ఇక లోపల ఒకటే కోలాహలం. ఆనందం అర్ణవమైతే పిల్లలందరూ అంబరాన్ని చుట్టి వస్తారు. రాత్రి పదింటికి మళ్ళీ తలుపులు తెరుచుకుంటాయి. పూలలోని తేనెను స్వీకరించాక తుమ్మెదలు ఝుంకార గీతాలాలపించినట్ల పిల్లలు ఆనందాతిశయంతో నవ్వుకుంటూ తుళ్ళుకుంటూ బయటకు వస్తారు. కృతజ్ఞతగా అందరి వంకా చూస్తారు.

చప్పుడు చెయ్యకుండా తేనె విందునివ్వడం పద్మాల అలవాటు. విందు స్వీకరించాక కృతజ్ఞతను ప్రకటించడం తుమ్మెదల అలవాటు. బస్సు లెక్కి వెళ్ళిపోతున్న తుమ్మెదల్నా, వాళ్ళ మొహాల్లో మెరిసిన తృప్తినీ చూస్తూ పుట్టినరోజు జరుపుకున్న పెద్దమనిషి మళ్ళీ ఆరోజుకోసం వీధి పిల్లల్లా తనూ ఎదురు చూస్తాడు.

# 7. అతిథుల తరువాతే మనం

ఎవరైనా ఎదురైతే ఏమివ్వాల్సి వస్తుందోనని ముఖం పక్కకు తిప్పుకు పోయేవారే ఎక్కువ ఈ రోజుల్లో. పెట్టనిదే పుట్టదని మా అమ్మమ్మ అంటూ వుండేది. అంటే ఏమిటి అని వెర్రి నాగన్నలా అడిగితే చెప్పింది: కిందటి జన్మలో తృప్తిగా ఎవరికైనా ఇంత పెట్టి వుంటేనే ఈ జన్మలో భోగం భాగ్యంతో పుడతారట.

"ఇతరులకు పెట్టాకే మనం తినాలి. బయటి వాళ్ళకు పెట్టగా మిగిలింది మనం తినడం భావ్యం కానీ, మనం తినగా మిగిలింది ఇతరులకు పెట్టటం ఉచితం కాదు" అనేది.

"అదేమిటి అమ్మమ్మా! తనకుమాలిన ధర్మం తగదని మా బళ్ళో మాస్టారు చెప్పారే అంటే "అన్నపానాల విషయంలో మాత్రం అది సరికాదు" అని కొట్టి పారేసేది మన పొట్ట నింపుకోవడం, మన ప్రాణాలు నిలబెట్టుకోవడం అన్నవి ముఖ్యం కాదు. ఒకరికి పెట్టాక అది తృప్తిగా వారు అనుభవిస్తూ వుంటే కళ్ళారా చూసి ఆనందించేవారి అదృష్టమే అదృష్టం! అమ్మమ్మ చెప్పిన ఆ కథ మళ్ళీ మీకోసం.

వారణాసిలో ఒక బ్రాహ్మణుడు వుండేవాడు. అతని భార్య సంసారాన్ని వదిలేసి కాలి నడకన తీర్థయాత్రలకు బయలుదేరింది. అప్పటికి ఆమె నిండుగర్భిణి. యాత్రలో వున్నప్పుడే ఒక అర్ధరాత్రి ఆమె మగబిడ్డను ప్రసవించింది. భర్తనూ, ఇంటినీ కాదనుకుని వచ్చేసింది. గనుక పేగుబంధం కూడా తెంపేసుకుని పుట్టిన పసివాణ్ణి అక్కడే వదిలేసింది. పసివాడు ఏడుపు మొదలు పెట్టాడు. అది ఒక ఆవు విన్నది. వెళ్ళి పసివాడి ఒళ్ళంతా నాలుకతో నాకి శుభ్రం చేసింది. పొదుగును వాడి నోటికందించి ఆకలి తీర్చింది. అలా వరుసగా ఏడు రోజులు వాణ్ణి సాకింది. అందుకని వాడికి 'ఆపుత్రన్' అని పేరొచ్చింది.

ఆపుత్రన్ అంటే గోకుమారుడని అర్థం.

ఏడోరోజున వాణ్ణి ఒక బాటసారి చూసి తనతో పాటు ఇంటికి తీసుకుపోయారు. బాటసారి దంపతులకు పిల్లలు లేరు. అందుకని ఆపుత్రన్‌ని అల్లారుముద్దుగా పెంచుతూ వచ్చారు. వాడు వేదవిద్యలు అన్నీ నేర్చాడు. ఇలా వుండగా అనుకోని సంఘటన ఒకటి జరిగింది. ఒకరోజు ఒక ఆవు విషయమై కొందరు పిల్లలు తగాదాపడ్డారు. వాళ్ళలో ఆపుత్రన్ కూడా ఉన్నాడు. అతనేదో కల్పించుకోబోయేసరికి "వీడేమిటి చెప్పేది? వీణ్ణి కన్నతల్లే వీధిన వదిలేసి పోయింది. ఎవరి దయాదాక్షిణ్యాల మీదో బతుకుతున్నాడు" అని అక్కడి వాళ్ళెవరో తక్కువ చేసి మాట్లాడారు.

ఆ మాటలతో ఆపుత్రన్ మనసు చీరుకుపోయినట్టయింది. ఇల్లు వదిలి దేశాటనకు బయలుదేరాడు. తిరిగి తిరిగి చివరకు మదురైలోని చింతాదేవి ఆలయానికి చేరుకున్నాడు. అక్కడే ఆ గుడి ప్రాంగణంలోనే వుంటూ మధూకరవృత్తితో జీవిస్తూ వచ్చాడు. అయితే, యాచించి తెచ్చుకున్న అన్నమైనా సరే, తోటి భిక్షుకులకు, నిస్సహాయులకూ పెట్టకుండా తినేవాడు కాదు.

ఇలా వుండగా, ఒక రాత్రివేళ గుడి దగ్గరకు ఎక్కడో దూరప్రాంతం నుంచి ముగ్గురు వ్యక్తులు వచ్చారు. ముగ్గురూ బాగా అలసిపోయి వున్నారు. ఆకలిదప్పులతో దప్పి కొన్నారు. ఆపుత్రన్‌కి వాళ్ళను చూస్తే జాలేసింది.

కాని ఏమిటి చేయడం? తనదే నాలుగిళ్ళలోనూ నాలుగింతలు తెచ్చుకుని తినే ముష్టి బతుకాయె. అలాంటప్పుడు అర్ధరాత్రివేళ వచ్చిన అతిథులకు పెట్టేందుకు తన దగ్గరేముంటుంది?

ఆపుత్రన్ దుఃఖపడ్డాడు. చింతాదేవి అతని బాధను చూసి, తనే అతని ఎదుట ప్రత్యక్షమై అతనికో అక్షయ పాత్రను ప్రసాదించింది. "లోకంలో కరువుకాటకాలు కలిగి ఎవరికీ ఎక్కడా తినటానికి మెతుకు లేకపోయినా నీ అక్షయ పాత్రలో మాత్రం సమృద్ధిగా అన్నం వుంటుంది" అని అభయమిచ్చింది.

ఆపుత్రన్ సంతోషంగా ఆ పాత్రను స్వీకరించి అర్ధరాత్రి వచ్చిన అతిథులకు సుష్టుగా భోజనం పెట్టాడు. అప్పటినుంచీ కనుచూపు మేరలో ఎక్కడా ఆకటి అన్నది లేకుండా చేసాడు. ముష్టివాళ్ళు, అవిటివాళ్ళు, నోరులేని జీవాలు – ఒకరేమిటి అందరూ అతన్ని ఆశ్రయించి పొట్ట నింపుకునేవారు. "నీవు చిరకాలం పది మందికి పెట్టగలవాడవుగా వర్ధిల్లు నాయానా" అని వాళ్ళంతా దీవిస్తుండేవారు.

ఇది చూసి ఇంద్రుడు ఓర్వలేక పోయాడు. అసూయతో కుమిలిపోయాడు. కపటవేషంలో వచ్చి "నీకేం కావాలో కోరుకో, నువ్వడిగినవన్నీ ఇస్తాను" అన్నాడు.

ఆపుత్రన్ నవ్వుతూ, "ఇదిగో ఇది మా అమ్మ చింతాదేవి నన్ను అనుగ్రహించి నాకిచ్చిన అక్షయ పాత్ర. ఇది అందరి ఆకలీ తీరుస్తోంది. అందరిచింతలూ పోగొడుతోంది. ఇంతకంటే నాకేం కావాలి?" అన్నాడు.

ఇంద్రుడు ఈర్ష్యతో మరింత రగిలిపోయాడు. ఆపుత్రన్ దానధర్మాలను నిలువరించేందుకు లోకంలో ఎక్కడా ఆకలి, దారిద్ర్యం అన్నవి లేకుండా చేయాలనుకున్నాడు. వర్షాలు కురిపించాడు. నేల తల్లి కడుపు పండేలా చేశాడు. పుష్కలంగా పంటలు చేతికి అందడంతో ప్రజలు ఆకలి దప్పులకు దూరమయ్యారు. ఆపుత్రన్‌ని మరచిపోయారు. అతనితో అన్నాన్ని పంచుకునే వాళ్ళే లేకుండా పోయారు.

ఆపుత్రన్ తన అక్షయపాత్ర తీసుకుని ఇంటింటికీ వెళ్ళాడు. అన్నం పెడతాను రమ్మనమంటే పుచ్చుకునే వాళ్ళే కరువయ్యారు.

ఇలా వుండగా, సముద్రం ఆవలి వైపునుంచి వచ్చిన కొందరు నావికులు ఆపుత్రన్‌కి ఎదురై తమ దేశంలో ప్రజలు క్షుద్బాధతో విలవిలలాడుతున్నారని చెప్పారు. అలా చెప్పిందే తడవు ఆపుత్రన్ అక్షయపాత్ర తీసుకుని నౌక ఎక్కాడు. కొంత దూరం వెళ్ళేసరికి వాతావరణంలో మార్పు వచ్చింది. నౌకను ఒక దీవిలో నిలుపు చేశారు. ఆపుత్రన్ నౌక దిగి అన్నంకోసం అలమటిస్తున్న వారెవరైనా అక్కడ వున్నారేమోనని ఆ రాత్రివేళ దీవి అంతా గాలించడం మొదలు పెట్టాడు. అసలక్కడ మనుషులే లేరు ఈ లోగా వాతావరణం చక్కబడింది. ఆపుత్రన్ నౌకలోనే వున్నాడనుకుని నావికులు నౌకను పోనిచ్చారు. ఆపుత్రన్ ఒక్కడే ఆ నిర్జన ప్రదేశంలో వుండిపోయాడు. అతనికి తోడుగా అతని అక్షయపాత్ర వుందికానీ, ఏమిటి ప్రయోజనం? ఒకరికి పెట్టకుండా అతను తినడు. తన సంపద పలువురికి ఉపయోగపడినప్పుడే దానికి సార్ధకత. లేకపోతే ఏముంది? ఆ అక్షయపాత్ర ఇంక నాకనవసరం' అనుకున్నాడు.

అనుకున్నదే తడవు – సముద్రంలోకి దాన్ని విసిరేసి నిరాహారంగా నిశ్చింతగా ఉండి అక్కడే ప్రాణాలు వదిలాడు.

# 8. కలలో అప్పు

మదనపురానికి దగ్గరలోని గ్రామంలో వేమన్న అనే వాడుండేవాడు. అతనెంత అమాయకుడంటే ఊరివారతన్ని వెర్రివేమన్న అనేవారు. అతని తెలివి తక్కువ తనానికి హద్దుండేది కాదు. అతన్నందరూ – 'వెర్రి వేమన్నా' అని పిలిచినా అతనేమీ అనుకునే వాడు కాదు సరికదా – "ఓయ్!" అని పలికేవాడు.

అదే ఊళ్ళో గవరయ్య అనే వాడుండేవాడు. వాడు గడుసువాడేకాకుండా అతి లుబ్ధుడూ పరమ నీచుడూ కూడా. డబ్బుకోసం ఎంత అన్యాయానికైనా నీచానికైనా వడికడతాడు. అతనిది వడ్డీ వ్యాపారం. ఒకసారివేమన్న కెందుకో డబ్బవసరం వచ్చింది. సమయానికి భార్య ఊళ్లో లేకపోయింది. పుట్టింటికెళ్ళింది. డబ్బుకోసం ఏం చేయ్యాలా అని మధనపడసాగాడు వేమన్న. అతను అప్పుచేద్దామా అని ఆలోచించాడు.

పగలంతా అదే ఆలోచనలో ఉండడంవల్ల ఆ రాత్రి వేమన్నకు ఒక కల వచ్చింది. కలలో – అతను గవరయ్య దగ్గరకు వెళ్ళాడు. అప్పిమ్మని కాళ్ళా వేళ్ళా పడ్డాడు. ఎట్టకేలకు గవరయ్య కరుణించి అతనికి అప్పిచ్చాడు. తొందరగా తీర్చెయ్యమని హెచ్చరిక కూడా చేశాడు. డబ్బు పట్టుకుని యింటికి వచ్చి వేమన్న భద్రంగా పెట్టిలో పెట్టాడు.

ఉదయం మెలకువ రాగానే కలలో తెచ్చిన డబ్బుకోసం అతను తెగవెతికేశాడు. పెట్టి తిరగదోడాడు. ఇల్లాంతా వెదికాడు. అయినా డబ్బు కనిపించలేదు. వందవరహాలూ ఏమైపోయాయో అని బెంగెట్టేసుకున్నాడు.

ముఖం పీక్కుపోయి. దిగాలుగా కనపడుతున్న వేమన్నని – "అలా ఉన్నావేం?" అని అడిగారు ఇరుగుపొరుగు వాళ్ళు. జరిగిందంతా వారికి చెప్పాడతను.

"కలలో తీసుకున్న డబ్బుని మెలకువలో వెతకడమేమిటోయ్ వెర్రివాడా!" అని వాళ్లు ఎగతాళి చేశారు.

అయినా ఆ వెర్రివాడు చింతపడడం మానలేదు. "నేను గవరయ్యకి వందవరహాలు కలలో అప్పు పడిపోయాను" అని అందరికీ చెప్పుకుని విచారించసాగాడు. ఈ విషయం ఎవరికి తెలయికూడదో వాళ్లకే తెలిసింది. తెలియడమేమిటి, గవరయ్య వేమన్న దగ్గరికి వచ్చేశాడు. "పదిరోజుల్లో తీర్చేస్తానని నా దగ్గరనుంచి అప్పు తీసుకున్న వందవరహాలూ వెంటనే కక్కు" అంటూ అతన్ని పీడించసాగాడు.

"అవే వెదుకుతున్నానండి. కనిపించడంలేదు. దొరగ్గానే యిచ్చేస్తాను" అని మొరపెట్టుకున్నాడు వేమన్న మరి నాల్రోజులు పోయాక గవరయ్య అతన్ని పిలిపించి" డబ్బైనా యివ్వు. పత్రమేనా రాయి." అన్నాడు.

"మరోసారిల్లంతా వెదికి అలాగేరాస్తాను" అని వచ్చేశాడు వేమన్న అంతలో యీ విషయం వేమన్న భార్యకి తెలిసింది. ఆమె హడావిడిగా పుట్టింటి నుంచి పరుగెత్తుకొచ్చింది. పత్రం రాయకుండా భర్త కడ్డుపడింది. ధర్మం చేప్పేరామన్న దగ్గరకి తీసుకెళ్ళింది. గవరయ్యకూడా రామన్న దగ్గరకి వచ్చాడు.

"అయ్యా! అప్పుడే నెలయిపోతూంది. బయటయితే యీ పాటికి వడ్డీకూడా వచ్చేది. కాని. వేమన్న కూడా కష్టజీవే కనక నేను వడ్డీ ఆశించడంలేదు. నా అసలు నాకిప్పించేస్తే చాలు." అన్నాడు గవరయ్య. "నిజమేనా? నువ్వు అతని దగ్గర వందవరహాలు అప్పు తీసుకున్నావా?" వేమన్నను అడిగాడు రామన్న. "నిజమే గవరయ్య నాకలలో కొచ్చి మరీ యిచ్చాడు వందవరహాలూ. నేనే మాట నిలుపుకో లేకపోయాను." అన్నాడు వెర్రివేమన్న.

"కలలో కొచ్చియివ్వడమేమిటి?" ఆరాతీశాడు రామన్న.

వేమన్న అంతా వివరంగా చెప్పాడు. అదివిని – రామన్న గవరయ్య వేపు తిరిగి – 'కలలో యిచ్చిన వందవరహాలు గురించేనా మీరడుగుతున్నది?' అని ప్రశ్నించాడు "ఔను" అన్నాడతను

రామన్న వెంటనే పళ్ళెంలో వందవరహాలూ, ఒక అద్దమూ తెప్పించాడు. వందవరహాలనీ వేమన్న చేతిలో పెట్టాడు. ఎదురుగా అద్దం పెట్టాడు. వరహాలు అద్దంలో కనిపిస్తున్నాయి

'గవరయ్యగారూ! అవిగో మీ వంద వరహాలూ. తీసుకోండి.' అన్నాడు. అద్దంలోకి చూపిస్తూ. గవరయ్య తుళ్ళిపడ్డాడు. "అద్దంలోవి ఎలా అందుకోగలను? ఇది సాధ్యమేనా?" అన్నాడు.

"మర్యాదస్తులయిన మీరు వేమన్న కలలోకి వెళ్లి అప్పిచ్చారు! కలలోకెళ్ళి అప్పివ్వగల పెద్దమనుషులకి అద్దంలోంచి అప్పు వసూలు చేసుకోగలగటం అసాధ్యమా?" అని చిరునవ్వు నవ్వాడు.

తనకి బుద్ధి చెప్పడానికే రామన్న యిలా చేశాడని గ్రహించిన గవరయ్య సిగ్గుపడుతూ తలవంచుకుని అక్కడినుంచి వెళ్ళిపోయాడు. ప్రజలు రామన్న తీర్పుని ప్రశంసించారు.

*విధేయత, సంసిద్ధత, కర్తవ్యం మీద ప్రేమ –*
*ఈ మూడు మీలో ఉంటే, మిమ్మల్ని ఏవీ అడ్డుకోలేదు.*

# ౨. ధర్మరాజు దయాగుణం

మనం చాలాసార్లు మూగజీవాలను అంతగా పట్టించుకోం. చాలామంది తమ పెంపుడు కుక్క ముసలిదైపోగానే, లేదా ఏదో జబ్బు చేయగానే ఏం చేస్తారు? దూరంగా ఎక్కడికో తీసుకెళ్ళి వదిలేస్తారు. పాపం అది క్రూరమైన పనికాదా? కాని మహారాజు యుధిష్ఠిరుడిలాగా మనం కుక్క పట్ల విధేయంగా ఉండాలి.

యుధిష్ఠిరుడు అంటే ధర్మరాజని మనందరికీ తెలిసిందే కదా! ఆయనెలా కుక్కకు విధేయంగా ఉన్నారా? అని ఆశ్చర్యపోతున్నారు కదూ!

దీనికి సంబంధించిన కథ మన మహాభారతంలో ఉంది. కురుక్షేత్ర సంగ్రామంలో పంచపాండవులు కౌరవులను ఓడించిన విషయం మనందరికీ తెలిసిందే. ఆ తరువాత చక్రవర్తిగా ధర్మరాజు తన తమ్ముల సహకారంతో ఎన్నో ఏళ్ళపాటు రాజ్యాన్ని ధర్మబద్ధంగా పరిపాలించాడు. అలా ముప్ఫైఆరేళ్ళ విజయవంతమైన పాలన తరువాత వాళ్లకు షరాఘాతం లాంటి విషాదవార్త వారికి తెలిసింది. తమ మార్గదర్శి, ఆత్మీయుడు అయిన శ్రీకృష్ణపరమాత్ముడు తన భౌతికదేహాన్ని విడిచి, స్వర్గానికి పయనమైపోయాడన్న సమాచారం పాండవులను కుంగదీసింది. ఆ బాధ నుంచి బయటపడ్డాక తమ తక్షణకర్తవ్యం స్ఫురించింది. అందుకే వెంటనే తామూ, ఆ శ్రీకృష్ణభగవానుడిని అనుసరించాలని నిర్ణయించుకున్నారు. ఆ పరంపరలో అర్జునుడి మనవడైన పరీక్షిత్తుకు పట్టాభిషేకం చేసి, హిమాలయాల్లో దేవనిలయమైన మేరుపర్వతం వైపునకు పాండవులు పయనమయ్యారు.

భారతదేశ సంప్రదాయంలో మనిషి వృద్ధాప్యానికి వచ్చాక, అన్నింటినీ వదిలేసి భగవంతుడి ప్రార్థనలోనే కాలం గడపాలి. రాజులైనా అలాగే చేసేవారు. ఇక ఈ జీవితం చాలు అనుకున్నప్పుడు, దేవుడి గురించే ఆలోచిస్తూ, అన్నపానీయాలు మానివేసి హిమాలయాల వైపునకు సాగిపోతూ ఉంటారు. అక్కడి చేరుకున్నాక, అక్కడే ప్రాణాలు వదిలేస్తారు. పాండవులు కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ హిమాలయాలకు చేరుకున్నారు. వారు ఆ హిమగిరులను అధిరోహించటం ప్రారంభించగానే, వారిని ఒక కుక్క అనుసరించసాగింది. అప్పుడు యుధిష్ఠిరుడు ఆ కుక్కతో 'మేము చాలా దూరం వెళుతున్నాం. ఆ మార్గం కూడా చాలా కఠినమైంది. ఎవ్వరూ నడవలేరు. నువ్వు ఇంటికెళ్లు' అన్నాడు. కాని ఆ శునకం ఆ రాజు మాట వినకుండా, తోక ఊపుకుంటూ వారినే అనుసరిస్తూ ఉంది. దయాశాలి అయిన ధర్మరాజు దానిని బాధపెట్టడం ఇష్టం లేక, తోడుగానే తీసుకువెళ్ళసాగాడు.

మార్గమంతా దుర్భేధ్యంగా ఉంది. మంచు, చలి ఒళ్ళంతా గడ్డకట్టుకొనిపోతూవుంది. మానవమాత్రులు

బతికే అవకాశమే లేదు. ప్రకృతి ప్రభావంతో యుధిష్ఠిరుడి తమ్ములు భీమసేనుడు, అర్జునుడు, నకులసహదేవులు, ధర్మపత్ని ద్రౌపది ఒక్కొక్కరుగా ప్రాణాలు వదిలేశారు. కాని ధర్మరాజు ఒక్కడే హిమాలయాలను అధిరోహిస్తూనే ఉన్నాడు.

చివరకు ఆయన మేరుపర్వతానికి చేరుకున్నాడు. ఆ పర్వతమంతా సుమధుర నాదాలతో, సుమపరిమళాలతో నిండుకొని ఉంది. ఆకాశం నుంచి పూలవాన పడుతోంది. ఒక దివ్యమైన రథం ధర్మరాజు ముందు వాలింది. ఆయనను స్వర్గానికి తీసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉంది. అందులో స్వర్గాధీశుడు దేవేంద్రుడు దిగాడు. 'ఓ ధర్మరాజా! స్వర్గలోకానికి స్వాగతం. ధర్మబద్ధమైన జీవితాన్ని గడిపి, ఆదర్శమైన చక్రవర్తిగా పేరుతెచ్చుకొని స్వర్గప్రవేశానికి అర్హత సాధించావు. అందుకే నీవు ఈ భౌతికశరీరంతోనే స్వర్గంలోకి ప్రవేశించే, అవకాశాన్ని పొందావు రా! ఈ రథాన్ని అదిరోహించు' అన్నాడు.

ధర్మరాజు సమాధానమిస్తూ 'ఇలాంటి అరుదైన అదృష్టాన్ని నాకు కలిగించినందుకు ధన్యుడిని. కాని నా సోదరులు, మహారాణి ద్రౌపది లేకుండా నేను స్వర్గంలో అడుగుపెట్టలేను' అన్నాడు. అప్పుడు దేవేంద్రుడు 'ఓ ధర్మరాజా! అదృశ్యరూపంలో ఇప్పటికే వారందరూ స్వర్గానికి చేరిపోయి, నీ కోసం ఎదురుచూస్తూ ఉన్నారు' అన్నాడు.

వెంటనే యుధిష్ఠిరుడు, తన వెంటే వస్తున్న కుక్క వంక చూసి, తిరిగి దేవేంద్రుడి వైపు తిరిగి 'రాజా! దీనిని కూడా రథం ఎక్కించు' అన్నాడు. ఇంద్రుడు ఆశ్చర్యంగా 'ఏంటి దీనినా? నీకేమైనా పిచ్చా? నీకు ఒక్కడికే స్వర్గంలోకి అడుగుపెట్టే అర్హత ఉంది. నీవు చాలా గొప్పవాడివి; మంచివాడివి. దీనికి ఆ భాగ్యం లేదు; దానిని వదిలేయ్' అన్నాడు. కాని ఆ ధర్మరాజు 'ఈ కుక్క నన్నే నమ్ముకుంది. పైగా ఎన్నో కష్టాలకు ఓర్చి. నా వెంటే నడచి వచ్చింది. శరణార్థిగా నన్నే అనుసరించిన దీనిని, వదిలి నేను రాలేను. నేను ఈ ధర్మనిష్టను తప్పలేను. స్వర్గంలోకి అడుగుపెట్టలేను' అన్నాడు.

అప్పుడు దేవేంద్రుడు 'ఇతర జీవులను చంపి తినే ఈ కుక్క పాపజీవి. ఇది నరకానికి పోతగినది. కాని దీని స్థానంలో వేరెవరైనా, నరకానికివెళితే, అప్పుడు, ఈశునకానికి స్వర్గానికి వెళ్ళే అదృష్టం దక్కుతుంది' అనేషరతు విధించాడు.

'ధర్మరాజు వెంటనే స్పందిస్తూ 'సరే! నేను అంగీకరిస్తున్నాను. దాని బదులు, నేను నరకానికి వెళతాను. నాస్థానంలో ఈ కుక్కని స్వర్గానికి పంపండి' అనగానే, ఒక్కసారిగా ఆ కుక్క స్థానంలో ఓ ప్రకాశవంతమైన వెలుగు దర్శనమిచ్చి, యమధర్మరాజు దర్శనమిచ్చాడు. ఆయన మారువేషంలో ధర్మరాజును వెంబడించి, పరీక్షించాడు. ఆయన నిస్వార్థ గుణాన్ని, ఆశ్రితుల పట్ల ఉన్న విధేయతను శ్లాఘించి, స్వర్గానికి సాగనంపాడు.'

# 10. పరీక్ష

పూర్వకాలంలో విద్యాభ్యాసం చెయ్యాలనుకొనే శిష్యులకు విద్య అంత సులభంగా లభించేది కాదు. పుస్తకాలుచూసి, ఎవరో, ఎవరికో చెబుతూంటేనో, రహస్యంగా వినికానీ నేర్చేవి విద్యలు కానేకావు. జిజ్ఞాసువులైన విద్యార్థులను ఎంతో పరీక్షిస్తేతప్ప గురువులు విద్యనేర్పేవారు కాదు. గురువుపెట్టిన పరీక్షలు నెగ్గాలి. గురువుకు సంతోషం కలిగించాలి. అంతవరకూ గురువుకు సేవచేస్తూనే ఉండాలి. ఇలా శిష్యులు గురుకులాల్లో ఎన్నో సంవత్సరాలు గడపవలసి వస్తూండేది.

చదువుకునే రోజుల్లో అహంకారం, అభిమానం లాంటి దోషాలు తొలగటానికి శిష్యుడు మధూకరము చేసేవాడు. మధూకరం అంటే భిక్షాటన చేయడం. అలా లభించిన ద్రవ్యాన్నంతా గురువుగారికి అర్పిస్తూండేవాడు. దానితోటే గురువుగారి పోషణ, ఆ గురువు పెట్టిన ఆహారంవల్ల శిష్యుడి పోషణా జరుగుతూ ఉండేది. అంతేతప్ప గురువులకు చెల్లించే వేరే మూల్యమంటూ ఏదీ ఉండేది కాదు.

గురువుగారు ఏది, ఎంత పెడితే దానితోటే తృప్తిచెంది, ఉన్నంతకాలమూ విద్యాభ్యాసము చేసేవారు. గురువు పెట్టిన పరీక్షలలో ఉత్తీర్ణుడైన విద్యార్థి ఉత్తమవిద్యతోపాటు, ఉత్తమ కీర్తినికూడా లోకంలో పొందగలిగేవాడు.

అలాంటి ఒక ఉత్తమ విద్యార్థియే ఉపమన్యు. ధౌమ్యమహర్షి ఆశ్రమానికి ఇతను విద్యాభ్యాసానికై వెళ్ళాడు. విద్య చెప్పేలోపు తన పశువులను పాలించే బాధ్యతను గురువుగారు ఉపమన్యుకు అప్పగించారు. 'నేను ఈ పనిని ఎందుకుచేయాలి?' అని శిష్యులు అడిగేవారుకాదు. చెప్పింది తు.చ. తప్పకుండా పాటించడం తమ కర్తవ్యం. గురువు ఆజ్ఞప్రకారం ఉదయమే భిక్షచేసి తెచ్చిన పదార్థాన్నంతా గురువుగారి వద్ద సమర్పించి, పశువులమేత కోసం ఉపమన్యు వనానికి పోతూండేవాడు.

ఈతనిని పరీక్షించాలని నిర్ణయించుకున్న గురువు, అతడు తెచ్చిన భిక్షాద్రవ్యాలు తీసుకొనేవాడే తప్ప 'ఏమయినా తిన్నావా? త్రాగావా?' అని కూడా అడిగేవాడు కాదు. 'గురువుగారు పెడితేనే తినాలి తప్ప, స్వతంత్రించి అడగరా'దనే జ్ఞానం కలిగిన ఉపమన్యు, మారుమాటాడక పశువులవెంట పోతూండేవారు.

ఒకనాటి సాయంత్రం పశువులు తోలుకుని ఇంటికి వచ్చాడు ఉపమన్యు. గురువుగారు శిష్యుణ్ణి చూశాడు. తను ఆహారం పెట్టడం లేదు కదా! మరి ఈ పిల్లవాడు ఏం చేస్తున్నాడో తెలుసుకుందామని అడిగాడు. "ఏమోయ్! రోజూ ఏం తింటున్నావు?" అడివిలోకి వెళ్ళి ఆకులూ, అలములూ తింటున్నాను" అని వినయంగా సమాధానమిచ్చాడు ఉపమన్యు.

తను ఆహారం పెట్టటంలేదు సరకదా! ఏదో ఒకటి తింటున్నాడులే అని ఊరుకోకుండా. "ఆకూ అలమూ నీవే తింటే ఇక పశువులకేమి మిగులుతుంది? వాటి ఆహారం మనం తినకూడదు" అన్నాడు. "సరే!" అన్నాడు ఉపమన్యు.

మరికొన్ని రోజుల తరువాత సాయంకాలం ఆరోగ్యంగా ఇంటికి తిరిగివచ్చిన పిల్లవాడ్ని చూసి "ఏమోయ్! ఆరోగ్యంగా ఉన్నావా? ఏం తింటున్నావు? అడిగాడు. "మూడు పొదుగుల పాలు దూడలు త్రాగాక, మిగిలిన ఒక పొదుగులోని పాలుత్రాగి కడుపునింపుకుంటున్నాను" అన్నాడు. "అయ్యయ్యో! నువ్వ

త్రాగుతున్నావని కదా! దూడలకిచ్చే పాలు ఆవు నీకు వదిలేస్తోంది? దూడలు చిక్కిపోవూ నీవల్ల! అందుచేత, దూడల ఆహారం నువ్వు తీసుకోకూడదు" అన్నాడు గురువుగారు. "సరే!" అన్నాడు శిష్యుడు. మరో నాలుగు రోజుల తరువాతచూస్తే ఉపమన్యు మామూలుగ పుష్టిగానే కనిపించాడు.

"ఏమోయ్ ఎలా ఉంటున్నావు? ఏమి తింటున్నావు?" అడిగారు. గురువుగారూ "మీరు చెప్పినట్లు దూడలకోసం పొదుగులో ఉన్న పాలు నేను తాగట్లేదు.  అయితే అవి పాలు తాగాక వాటి సెలవులలోంచి వ్యర్థంగా పోయే నురుగును తాగుతున్నా ఆచార్యా!" అన్నాడు.

"అయ్యో! నువ్వు తాగుతున్నావని కదా!  ఆ దూడదలు తమ కడుపు మాడ్చుకుని నీకోసం పాలు వదిలేస్తున్నాయి... జంతువుల్ని హింసించవచ్చా?" అన్నారా గురువుగారు.

'అలాగే'నని ఆ పాలూ త్రాగడం మానేశాడు. ఇన్ని చేసినా గురువుగారిపైన కోపం రాలేదు. ద్వేషం కలగలేదు. అన్నీ తన మంచికేకదా! అనుకుంటున్నాడు.

చిన్నపిల్లవాడు, ఆకలికదా ఏదో ఒకటి తినకుండా ఎలా ఉండాలి? అసలెలా ఉండగలడు? గురువుగారు ఇతరులకు పనికొచ్చేది ఏదీ తినవద్దన్నారు. ఇక ఎవరూ తిననిదీ, ఎవరికీ పనికిరానిదీ అయిన అడవిలో కనపడిన "జిల్లేడు" ఆకులను కోశాడు. అందులోంచి వచ్చిన పాలు అతని కళ్ళలో పడి కళ్ళుకాస్తా కనిపించడం మానేశాయి.

అసలే నీరసం, దానికి తోడు కళ్ళు కనిపించడం మానేయడం; ఒకదానికొకటి తోడై, సాయంకాలానికి పిల్లవాడు దారితప్పిపోయాడు. ఒక గోతిలో పడిపోయాడు. పశువులన్నీ ఇంటికి చేరినా ఉపమన్యువు రాలేదు.

చాలాకాలంగ గురువుగారి పరీక్షలను గమనిస్తున్నా పైకి ఏమీ అనలేక లోలోపల కుమిలిపోతూ ఉంది గురుపత్ని. ఇక ఇప్పుడు భోరుమని విలపించింది. భార్యపోరు పడలేక, గురువుగారు, ఉపమన్యువును వెదకటానికి అడవికి బయలుదేరారు. ఇంతలో అశ్వనీదేవతలు ఉపమన్యువు దగ్గరికి వచ్చి ప్రేమతో "నీకు పోయినకళ్ళు తిరిగివచ్చేట్లు మేముచేస్తాం" అన్నారు.

ఉపమన్యువు దానిని తిరస్కరిస్తూ "నాకు ఏదిచేసినా ఆచార్యుడే చేయాలితప్ప మరెవ్వరూ చేయనవసరం లేదు" అని స్పష్టంగా చేశాడు.

చేసేదేమీలేక అశ్వినీదేవతలు మౌనంగా ఉండిపోయారు. అప్పటికే అడవిఅంతా కలియతిరిగిన గురువుగారు, ఉపమన్యు పడిన గొయ్యి సమీపానికి చేరి "ఉపమన్యూ, ఉపమన్యూ" అంటూ ఎలుగెత్తి పిలవసాగారు.

ఉపమన్యు గోతిలోంచే మూలుగుతూ "ఓయ్" అంటూ సమాధానం చెప్పాడు.

గురువుగారు అక్కడికి వచ్చి గోతిలోంచి ఆ పిల్లవాణ్ణి బయటికి తీశారు. అశ్వినీదేవతలు ఇస్తానన్నా.. స్వతంత్రించి దృష్టిశక్తిని పిల్లవాడు తీసుకోలేదని తెలిసి గురువుగారికి బాధ ఆగలేదు. తనపై పిల్లవానికుండే విశ్వాసానికి పొంగిపోయి, అశ్వనీదేవతల ద్వారా దృష్టి నిప్పించడంతోపాటు, బ్రహ్మవిద్యలన్నీ అతనికి కరతలామలక మయ్యేట్లు గురువుగారు వరమిచ్చారు.

ఇన్నిరకాల పరీక్షలు తట్టుకొని నిలబడినందువ్లలనే అతనికి అన్నివిద్యలూ లభించాయి. పైగా ఉపమన్యువుయొక్క పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోయింది. చూశారా!

# 11. మనసులు పెనవేసుకుపోయేట్లు చేసేదే ఉత్తమ మైత్రి

రామానుజులవారు శ్రీరంగంలో వేంచేసి ఉన్నరోజులవి. వారు చేసే సంప్రదాయ సేవగురించి వారికుండే అద్భుతమైన వైదిక జ్ఞానము గురించి కాంచీపురము సమీపములో నివశిస్తూ ఉండే కూరేశులు అనేవారు విన్నారు. కూరేశులు గొప్ప సంపన్నులు మాత్రమే కాదు, తలస్పర్శి అయిన జ్ఞానంకూడా కలవారు. సహజవైరాగ్య సంపన్నులైన కూరేశులు తమ సంపదలన్నింటినీ దానధర్మాలు చేసేసి తమ ధర్మపత్ని అయిన ఆండాళ్ళమ్మతో శ్రీరంగం చేరారు.

రామానుజులవారిని సేవించి వారి సన్నిధిలో తమకి స్థానాన్ని ప్రసాదించమని సంప్రదాయసేవకు తామూ వారికి తోడుంటామని ప్రార్థించారు. కూరేశుల్ని శ్రీరామానుజులు ప్రేమతో తమ పరివారంగా స్వీకరించారు. వయసులోనూ జ్ఞానంలోనూ పెద్దలయిన కూరేశులు శ్రీరామానుజులయొక్క జ్ఞానవైభవము చేత ఆశ్రయంచేతకూడా ప్రభావితులై రామానుజులను తమ ఆచార్యులుగా స్వీకరించారు. అయితే వీరిరువురి మధ్య శిష్యాచార్య సంబంధంకంటే పరస్పరమైత్రీ అనురాగాలే అధికంగా ఉండేవి.

ఒకరికి కలిగిన సందేహానికి మరొకరు పరస్పర ప్రపూరకులుగా ఉండేవారు. వేదవ్యాసప్రణీతములైన బ్రహ్మసూత్రాలకి వేదవ్యాసునియొక్క మనస్సుని తెలిపేటట్లుగా ఒక భాష్యము వ్రాయాలని రామానుజులు అనుకున్నారు. నిజమైన మిత్రులకు మనస్సులు సమానంగా స్పందిస్తాయి. వారు సాగించే కృషికూడా అట్లానే ఉంటుంది కదా! శ్రీకూరేశులూ రామానుజులవార్ల విషయంలో అదెలా సార్థకమో చూద్దాం!

వేదవ్యాసుని భావాన్ని స్పష్టంగా తెలిపే ఒకమంచి వ్యాఖ్యానాన్ని బ్రహ్మసూత్రాలకి రాయాలనుకున్నారు. అయితే వేదవ్యాసుని మనస్సుని గుర్తించడమెలా? వేదవ్యాస భగవానుని యొక్క మూడవతరం శిష్యులైన బోధాయనులు అనే ఒక మహర్షి వేదవ్యాసుని యొక్క అభిమతాన్ని నేరుగానే తెలుసుకుని ఒక వ్యాఖ్యానం రాశారని, దానిని "బోధాయన వృత్తి" అంటారని, ఆ గ్రంథము కాశ్మీర దేశంలో ఉండే "సరస్వతీ భండారము" అను చోట లభిస్తుంది అని శ్రీరామానుజులు విన్నారు.

తామున్నది శ్రీరంగంలో. వేలమైళ్ళు ప్రయాణం చేస్తే గాని తాము హిమాలయాలలో ఉన్న కాశ్మీరదేశం చేరలేరు. అయినా పూర్వాచార్యుల అభిమతాన్ని స్పష్టముగా తెలుసుకోనిదే బ్రహ్మసూత్రాల వంటి వైదిక గ్రంథాలకి వ్యాఖ్యానం రాయతగదు అని నిర్ణయించుకున్నారు. కాశ్మీర దేశానికి పయనమయ్యారు. రామానుజులవారికి శిష్యప్రాయులు, ఆంతరంగిక మిత్రులు అయిన కూరేశులు కూడా రామానుజులకు తోడుగా బయలుదేరారు.

చాలాకాలం ప్రయాణంచేసి వారు కాశ్మీరదేశం చేరగలిగారు. వారికి ఆ గ్రంథం లభించింది కూడా. అయితే అక్కడి పండితులు అక్కడే ఉండి ఆ గ్రంథాన్ని చూసుకోవచ్చు అన్నారు. బయటకు ఇవ్వటానికి అంగీకరించలేదు. చాలా విస్తారమైన గ్రంథం కావటంచేత గ్రంథమంతా చదివే అవకాశము లేదాయె. మరొక ప్రతి రాసుకుందామా అంటే అది అంత సులభంగా అయ్యేకార్యం కాదు. ఇప్పటిలాగ "ఫోటోకాపీలు" తీసుకొనే పద్ధతి అప్పుడు లేదాయె. అక్కడివారు రామానుజులవారికి కొద్దిరోజులు సమయమిచ్చారు గ్రంథాన్ని చూసుకోవటానికి. లభించిన సమయంవరకు రామానుజులు ఆ గ్రంథాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.

ఇచ్చిన సమయం అయిపోయింది. తాము వెళ్ళవలసిన నిర్బంధం ఏర్పడింది. "సమయము చాలలేదే! గ్రంథాన్ని పూర్తిగా చూసే అవకాశం కలగలేదే! చూసిన విషయాన్నైనా పునరాలోచన చేసే అవకాశమూ కలగలేదే!" అని రామానుజులవారు విచారించసాగారు. కూరేశులు వారిని ఓదారుస్తూ "స్వామీ! మీరేమీ చింతించవలసిన అవసరము లేదు" అన్నారు. "ఎందుకని?" అడిగారు రామానుజులు. "దేవరవారు పగలు గ్రంథాన్ని చూసి విశ్రాంతి తీసుకునే సమయంలో ఈ దాసుడు ఆ గ్రంథాన్నంతటినీ పూర్తిగా అధ్యయనం చేసేశాడు. అలాగ మొత్తం గ్రంథంలోని విషయం అంతా నేను ధరించే ఉన్నాను. మీరు ఏది ఎక్కడ కావాలంటే అక్కడ నేను చెప్పగలను" అన్నారు. కూరేశుల మాటలు రామానుజులవార్కి ఆశ్చర్యాన్ని కలిగించాయి. క్లిష్టమైన రెండు మూడు ఘట్టాలని కూరేశులను పరీక్షించటానికి రామానుజులవారు అడిగి చూశారు. తడుముకోకుండా కూరేశులు ఆ ఘట్టాన్ని స్పష్టం చేయడంతో రామానుజులవారికి ధైర్యం వచ్చింది. వారిరువురూ కలిసి బ్రహ్మసూత్రాలకు తగిన భాష్యాన్ని "శ్రీభాష్యము" అనే పేరుతో రచించాలనుకున్నారు.

మైత్రి ఎప్పుడూ కూడా గొప్పతనాన్ని పేరుప్రతిష్ఠల్నీ కోరదు. "జగదాచార్యులూ, ఉత్తమ ఆశ్రమములో ఉన్న యతిసార్వభౌములూ అయిన మీ పేరుమీదనే ఈ గ్రంథరచన సాగాలి. మీరు చెపుతూ ఉండండి నేను లేఖకునిగా రాస్తూఉంటాను" అన్నారు కూరేశమిత్రులు. దానికి రామానుజులు "లోతైన జ్ఞానము కలిగిన మీరు కేవలం రాసే బాధ్యత మాత్రమే తీసుకున్నప్పుడు నేను చెప్పే విషయంలో ఎక్కడయినా స్పష్టత లేక సవరణలు జరగాలి అంటే మీరు చెప్పాలికదా!" అడిగారు రామానుజులు. "ఆచార్యులు పెద్దలు అయిన మీరు చెప్తుంటే దానికి మార్పులూ చేర్పులూ చెప్పటం నాకు తగదు" అన్నారు కూరేశులు. "మరి ప్రామాదికంగా నైనా స్ఖలనములు ఏర్పడితే సవరించటం ఎలా?" అడిగారు రామానుజులు. దానికి కూరేశులు ఒక ఉపాయాన్ని చెప్పారు. "అలాంటివి ఎక్కడైనా జరిగినా ఇది లోపము అని ఎత్తి చూపడం నాకు తగదు. అలాంటప్పుడు మీరు చెప్పే విషయాన్ని నేను రాయకుండా నిలిపివేస్తాను. అది చూసి దేవరవారే గ్రహించండి" అన్నారు కూరేశులు.

శ్రీభాష్య రచన ప్రారంభమై చక్కగా సాగుతుండగా ఒకచోట "ఆత్మకు లక్షణమేమి?" అనే విషయం వచ్చింది. "జ్ఞానమున్నదీ, పరాధీనమైనదీ ఆత్మ" అంటూ రామానుజులు ఆత్మకి నిర్వచనం చెప్పారు. కూరేశుల కలం అక్కడే ఆగిపోయింది. రామానుజులు మళ్ళీ చెప్పారు. కలం కదలలేదు. 'ఏమైంది? నేచెప్పిన లక్షణం సరిగాలేదా?' ప్రశ్నించారు రామానుజులు.

పై నిర్వచనం ఆత్మ లక్షణాన్ని సరిగ్గా చెప్పటంలేదు. అలా చెప్పితే గురువుగారిని ఎదిరించినట్లవుతుంది. 'అలాకాదు, మరోలా...' అన్నా అదీ గురువును ఎదిరించినట్లవుతుంది. అందుకే వారు మౌనంగా ఊరుకున్నారు.

రామానుజులకు పరిస్థితి అర్థమైంది. తాము చెప్పినదాన్ని పునఃపరిశీలన చేసుకోవడం ప్రారంభించారు. ఈ సందర్భాన్ని ప్రస్తావించే ఆళ్వారులు శ్రీసూక్తి ఒకచోట వారికి లభించింది. దానిలో "దైవానికి దాసుడనై, పరాధీనుడనై నేనున్నాను" అని ఉంది. లోతుగ అధ్యయనం చేసాక దీని తాత్పర్యం రామానుజులకు గోచరించింది.

జ్ఞానం లేని ప్రకృతి ఎప్పుడూ పరాధీనమే. జ్ఞానమనేది ఉన్నా ఆత్మగూడ అలానే పరాధీనము. ఆత్మ, ప్రకృతి అనే రెండూ దైవానికి పరాధీనాలే తప్ప వాటికంటూ స్వతంత్రతేమీ లేదు. అది గుర్తించడమే కద

తెలివికలిగి ఉండటమంటే! జ్ఞానమున్నందుకు ప్రయోజనమూ అదే! అందుచేత "దైవానికి ఎప్పుడూ పరాధీనమై ఉన్నాననే జ్ఞానం కలిగి ఉండటమే ఆత్మకు లక్షణం. ఆత్మకి ఇదే నిర్వచనం. "జ్ఞానమున్నది" అని ముందు చెపితే అది అహంకారానికి దారితీసి 'నేను పరాధీనుడిని కాదు, స్వతంత్రుడనే' అనిపించవచ్చు. అందుకే, ముందే 'పరాధీనుడు' అని చెప్పేస్తే ఆతర్వాత కలిగే జ్ఞానం దానికి తగ్గట్టుగ కలుగుతుంది. అహంకారాన్ని రానివ్వదు. కనుక "పరాధీనతను ముందు చెప్పి, అలాంటి జ్ఞానం కలది ఆత్మ" అని లక్షణం చెప్పాలి. పదాలు కాస్త అటూ ఇటూ అయితే ఎంత తేడా వస్తుందో చూసారా?

దీనిని సంస్కృతంలో "శేషత్వేసతి జ్ఞాతృత్వం ఆత్మనోలక్షణం" అంటారు. ఆళ్వారుల శ్రీసూక్తికి తాత్పర్యమిదే! దీనిని గుర్తించి రామానుజులు కూరేశులను పిలచి "పరాధీనతను గుర్తించిన జ్ఞానం ఉండటమే ఆత్మకి సహజ లక్షణం" అన్నారు. కూరేశుల కలం చకచకా ముందుకు సాగింది. రామానుజుల ముఖం వికసించింది.

ఎదుటివారి మనస్సును కష్టపెట్టకుండా ఎంతో గహనమైన విషయాన్ని కూడా తేటతెల్లం చేసిన కూరేశులయొక్క హృదయ సౌందర్యానికి రామానుజులవారు ఎంతో సంతోషించారు.

స్నేహమెప్పుడూ మిత్రుల ప్రాణానికి, అవసరమైతే, తన ప్రాణాన్ని పణంగా పెట్టేట్లు చేస్తుంది. రామానుజుల కీర్తి బాగా పెరిగిపోవడం చూసి చోళదేశాన్ని పాలించే రాజుకి కన్నుకుట్టింది. ఏదో ఒక నెపంతో రామానుజుల వారిని అంతమొందించాలి అని నిర్ణయించుకున్నాడు. తన భటులని పంపి రామానుజుల వారిని బంధించి తెమ్మన్నాడు. వారి రాకను ముందుగానే కూరేశమిత్రులు పసిగట్టారు. వయోవృద్ధులైన మహాపూర్ణులతో ఆలోచన సాగించారు.

"రామానుజులవారిని ఇప్పుడు ఏదోరకంగా తప్పించినా ఏదో ఒక ఉపద్రవం ఈ దుష్టపాలకుడినుండి రాబోయే కాలంలో వరుసగా రాకమానదు. అందుచేత సురక్షితమైన ప్రాంతానికి వీరిని చేర్చాలి" అనుకున్నారు. వెంటనే రామానుజులు వారిని కర్ణాటక దేశంలో ఉండే తిరునారాయణపురం అనే ఊరికి మారువేషంలో పంపే ఏర్పాట్లు చేశారు.

భటులు రామానుజులవారిని వెతుక్కుంటూ రానేవచ్చారు. ఆ వేళకి రామానుజులవారి కాషాయాన్నీ, త్రిదండాన్నీ ధరించి రాజాస్థానానికి తామే రామానుజులమంటూ వెళ్ళారు కూరేశులు. మొదట వీరే రామానుజులు అనుకుని శాస్త్రవాదం చేశారు. శాస్త్రంలో గెలవలేమని తెలిసాక తన పిడివాదాన్నే చేస్తూ కూరేశుల యొక్క నేత్రాల్ని పెకలించమన్నాడు.

నిజానికి రామానుజులవారు వచ్చి ఉంటే వారే ఈ దండన అనుభవించవలసి వచ్చేది. కూరేశులకి రామానుజులవారి మీద ఉండే ప్రేమ, వారిని తప్పించి కూరేశుని అనుభవింపజేసేట్టు చేసింది. రామానుజుల వారిపై కూరేశులకుండే ప్రేమకి హద్దులేదు.

నేత్రాలు కోల్పోయిన కూరేశులు ఒకనాడు శ్రీరంగనాథుని సేవకై ఆలయానికి బయలుదేరారు. ఒక ద్వారపాలకుడు కూరేశుల్ని ఆపేశాడు. ఆ వ్యక్తితో రెండవ ద్వారపాలకుడు "వారి నెందుకురా ఆపుతావు! వారు అజాతశత్రువు. పైగా పెద్దవారు కదా! వదిలెయ్! వదిలెయ్! అంటున్నాడు" వారి మాటలు విన్న కూరేశులు 'విషయం ఏమిటి?' అని అడిగారు. దానికి రెండవ ద్వారపాలకుడు "అయ్యా! రామానుజ

సంబంధంకలవారిని ఆలయంలోకి పంపవద్దని రాజుగారి ఆజ్ఞ. అయినా, తమవంటి పెద్దలకి ఆ నియమాలు ఏమీ అక్కరలేదు. అదే మావాడితో చెప్తున్నాను. మీరు లోపలికి వెళ్ళిరండి" అన్నాడు.

కూరేశులకు మొదట నోట మాటరాలేదు. ఆతరువాత 'నీ దయకు సంతోషం. అయితే నేను ఆలయానికి మాత్రం వెళ్ళలేనులే! వెనుదిరిగి వెళ్ళిపోతాను" అన్నారు.

"లేదు బాబూ! మీలాంటి మంచివారికి పరవాలేదు వెళ్ళండి" అన్నాడు. "నాయనా! నీ మాట ప్రకారం నేను రంగడి దర్శనానికి వెళితే రామానుజ సంబంధాన్ని కోల్పోయినట్టేకదా! నాకు రంగడి సంబంధంకంటే రామానుజ సంబంధమే ముఖ్యం. మీ రాజుగారి ఆజ్ఞప్రకారం లోపలికి వెళ్ళి రామానుజ సంబంధాన్ని వదులుకోలేను. వెళ్ళొస్తా" నంటూ అటునుంచే వెనుదిరిగి వెళ్ళిపోయారు. తాము ఆచార్యులుగా భావించిన రామానుజుల కోసం దైవాన్ని కూడా వదలటానికి వెనుకాడలేదు కూరేశులు.

కూరేశుల హృదయవైశాల్యాన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టం. పన్నెండేళ్ళ తరువాత చోళరాజు ఉపద్రవం తగ్గాక రామానుజులు తిరిగి శ్రీరంగం విచ్చేసారు. నేత్రహీనులైన కూరేశులను చూసి రామానుజుల వారికి హృదయం కరిగిపోయింది. తమకోసం కదా వీరు ఇన్ని పాట్లు పడింది! అంటూ కూరేశులకు ఒక సలహానిచ్చారు. "మీరు ఏవైనా అడిగితే భగవంతుడు ఎప్పుడూ కాదనడు. నా కోసమైనా మీరు స్వామి సన్నిధికి వెళ్ళి నేత్రాలను ఇమ్మని ప్రార్థించరూ! స్వామి తప్పక వింటాడు" అని పంపించారు.

రామానుజుల ఆజ్ఞను కాదనలేక పెరుమాళ్ళ సన్నిధిలో కూరేశులు "భగవాన్! నిన్ను నిరంతరం సేవిస్తూ ఉండే నిత్యసూరుల దివ్యనేత్రాన్ని ప్రసాదించు" అని ప్రార్థించారు. (అంటే మోక్షాన్ని ఇమ్మని కూరేశుల కోరికన్నమాట) దానికి భగవంతుడు అర్చక ముఖేన అంగీకరిస్తూ... "కూరేశా! మీ సంబంధం కలవారికి అందరికీ మోక్షాన్ని ప్రసాదిస్తున్నాం" అన్నారు.

మఠానికి తిరిగివచ్చిన కూరేశులను రామానుజులు "మీరు పెరుమాళ్ళను ఏమడిగారు? వారేమన్నారు?" అని అడిగారు. విషయాన్ని చెప్పారు కూరేశులు.

"భౌతిక నేత్రాన్ని కోరమంటే మీరు మోక్షాన్ని కోరారా. మేము ఇక్కడ ఉంటూ ఉండగానే మీరు మమ్మల్ని వదిలి పరమపదం వెళ్ళిపోదామనుకుంటున్నారా?" అని రామానుజులు బాధతో అడిగారు. దానికి కూరేశులు "పరమపదంలో ప్రవేశించేవారికి అక్కడివారు పాదాలు కడిగి స్వాగతిస్తారుట. మీరు ముందు వెళితే తరువాత వచ్చే నాకు మీరు పాదాలు కడగలవలసి వస్తుంది. నా స్వరూపానికి అది విరుద్ధం కదా! నేనే ముందు వెళితే మీకు పాదాలు కడిగే అవకాశము ఏర్పడుతుంది. అందుకే నేను ముందు వెళ్ళాలని కోరుకున్నాను" అంటూ రామానుజులవారిని సేవించారు.

కూరేశుల భావశుద్ధికి రామానుజులవారు సంతోషించడమే కాకుండా భగవంతుని వరం ప్రకారం వారి సంబంధంకల తనకికూడా మోక్షం ఖాయమని అందరితో చెప్పుకొని మురిసిపోయారట.

వీరిరువురికీ ఉండే ప్రేమ, మైత్రి, శిష్యాచార్య సంబంధము మొదలైనవన్నీ కలిసి ఒకరికోసం మరొకరు అంకితమయ్యేట్లు చేశాయి. వీరిరువురి "సౌహార్దము, మైత్రి" మానవజాతికే ఆదర్శం.

## స్ఫూర్తి దాతలు

# 1. మహాత్మాగాంధి : అహింసా సిద్ధాంతం

### పరిచయం

ఆధునిక భారత రాజనీతితత్వ విశారధులలో గాంధీజీకి విశిష్టస్థానం ఉంది. ఆధునిక రాజనీతి తత్వవిచారం గాంధీతోనే ప్రారంభమైంది. ఉత్తేజం పొందిన ఉపాధ్యాయుడు, ఒక ప్రవక్త. ప్రపంచ పౌరుడుగా సమాజంపై తనదైన విలక్షణమైన పాత్రను పోషించాడు. మానవ విలువలు, ధర్మమార్గం, నీతి, శాంతి, అహింస, సత్యాగ్రహం, నిగ్రహశక్తి అనేవాటికి సమున్నత స్థానంలో గాంధీ మనకు కనిపిస్తాడు. గాంధీచేసే ప్రతీ క్రియలోనూ అత్యున్నత మానవ విలువలు / మనకు దర్శనమిస్తాయి. ఆయన నిర్వహించే ప్రతీ కార్యక్రమం యావత్ మానవాళికే ప్రేరణ కలిగిస్తుంది. సత్యాగ్రహమే జీవిత ధ్యేయంగా, అహింసా మార్గమే పరమావధిగా, శాంతిమార్గమే ఉన్నత ఆశయంగా యావత్ భారతజాతికి అంకితమైన నిబద్ధ కర్మజీవి. భారతజాతికి స్వాతంత్ర్యం అందించాలనే తపనకు తనను, తన జీవితాన్ని, తన కుటుంబాన్ని త్యాగం చేసిన నిస్వార్థపరుడు గాంధీ. అందువల్లనే ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ "ఈ శతాబ్దం తరువాత గాంధీ అనేవాడు ఈ భూమిమీద జీవించి ఉండేవాడంటే భవిష్యత్ తరాలవారు నమ్మరు" అని పేర్కొన్నాడు.

### జీవిత చరిత్ర

గాంధీ పూర్తిపేరు మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ. ఈయన గుజరాత్‌లోని కథియవార్ జిల్లా పోర్‌బందర్‌లో అక్టోబర్ 2, 1869 న జన్మించారు. తండ్రి గుజరాత్‌లోని చిన్న సంస్థానంలో ఉద్యోగం చేసేవాడు. తల్లి పుతలీబాయి దైవభక్తి ఉన్న గృహిణి. రాజ్‌కోటలో మెట్రిక్ వరకు చదివి 1888వ సంవత్సరంలో స్కూల్ ఫైనల్ పాసైన గాంధీకి 12వ ఏటనే కస్తూరిబా అనే మహిళతో వివాహం జరిగింది. చిన్న వయస్సులోనే వివాహం జరిగినా విద్యలో ఆసక్తిగల గాంధీ తన 19వ ఏటనే లండన్ వెళ్ళి న్యాయవాద వృత్తిని అభ్యసించాడు. లండన్ బయలుదేరే ముందు మద్యం ముట్టనని, మాంసం జోలికి పోనని, పరస్త్రీవంక కన్నెత్తి చూడనని తన తల్లికి ప్రమాణం చేశాడు. బారిష్టర్‌లా పూర్తిచేసుకొని లండన్ తిరిగివచ్చిన తరువాత కొంతకాలం రాజ్‌కోట లోనూ, తరువాత ముంబాయిలోనూ న్యాయవాదిగా జీవితం ప్రారంభించాడు. తరువాత 1893 లో ఒక ముస్లిమ్ కేసు వాదించే నిమిత్తం దక్షిణాఫ్రికా బయలుదేరి అక్కడి భారతీయులు, దక్షిణాఫ్రికాలోని నల్లజాతివారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కళ్ళారా చూసి, వారి హక్కులకోసం పోరాటం జరిపాడు. ముఖ్యంగా తెల్లవారి దమననీతి, పైశాచిక వృత్తిని ధైర్యంగా ఎదుర్కొనడమే కాకుండా వాటిని ప్రపంచవ్యాప్తంగా సభ్య సమాజంలోకి తీసుకురావడంలో గాంధీ సఫలీకృతుడయ్యాడు. దక్షిణాఫ్రికాలో జరుగుతున్న ఉద్యమంలో గాంధీ పాత్రను తెలుసుకున్న భారత మితవాద నాయకుడు గోపాలకృష్ణ గోఖలే, భారతదేశంలో జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనవలసిందిగా గాంధీకి జాబురాశాడు. దాన్ని అందుకున్న గాంధీ స్వదేశం తిరిగివచ్చి భారత స్వాతంత్రోద్యమంలో కీలకపాత్ర పోషించాడు. అంతవరకు పట్టణప్రాంతాలకే పరిమితమైన ఉద్యమం

గ్రామీణ ప్రాంతాలకు, కార్మిక కర్షక వర్గాలకు విస్తరించడంలో గాంధీ కృషి ఎంతో ఉంది. చివరకు 1947 ఆగష్టు 15వ తేదీన భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించిపెట్టే సంపూర్ణ స్వరాజ్యాన్ని కళ్ళారా చూడకుండానే 1948 జనవరి 30వ తేదీన ఒక మతోన్మాది (నాధూరామ్ గాడ్సే) తుపాకి గుండ్లకు బలయ్యాడు.

**గాంధీజీని ప్రభావితం చేసిన వివిధ అంశాలు**

గాంధీజీని ప్రభావితం చేసిన అంశాలు

i) భగవద్గీత : గాంధీజీ దీన్ని నిత్యపారాయణంగా చేసుకున్నాడు. అంతవరకు భగవద్గీతను వృద్ధులు చదువుకొనే గ్రంథంగా భావించేవారు. గాంధీ దాన్ని ఏ వయస్సులో ఉన్నవారు చదివితే ఆ అనుభూతులు పొందవచ్చని యావత్ భారత జాతికి తెలియజేశాడు.

ii) జాన్‌రస్కిన్ (John Ruskin) రచించిన "అన్ టు ది లాస్ట్" (Un to the lost) ప్రభావం కూడా గాంధీపై ఉంది.

iii) గాంధీజీని ప్రభావతం చేసిన మరో వ్యక్తి జైనమతాచార్యుడయిన బేచార్జిస్వామి. ఇతను గాంధీ ఇంగ్లండ్ వెళ్ళడానికి సహాయపడిన వ్యక్తి.

iv) గాంధీ జైలులో ఉన్నప్పుడు థోరో (Thorow) రచించిన "ఎస్సై ఆన్ సివిల్ డిస్‌ఒబీడియన్స్" (Essay on civil disobedience) అనే గ్రంథం కూడా ప్రభావం చూపింది.

v) టాల్‌స్టాయ్ (Tolstoy) రచించిన "దకింగ్‌డమ్ ఆఫ్ గాడ్ ఈజ్ వితిన్‌యూ" (The kingdom of God is within you) అనే గ్రంథమే గాంధీ అహింసపట్ల ఒక నిశ్చితమైన అభిప్రాయం ఏర్పడటానికి కారణమైంది. టాల్‌స్టాయ్ ఏక్రియా ప్రతిఘటన (Passive resistance) ప్రపంచమానవులందరికీ ఉపయోగపడుతుందని గాంధీ అభిప్రాయం.

vi) ముంబాయిలోని సంఘసంస్కర్త అయిన రాజా చంద్ర ప్రభావం కూడా గాంధీపై పడింది.

vii) వేదాలు, ఉపనిషత్తులు వీటి ప్రభావం గాంధీపై పడటమే కాకుండా వాటిని తరచూ సభలు సమావేశాలలో ఉచ్చరిస్తూ ఉండేవాడు. భగవద్గీతతోపాటు బైబిల్, ఖురాన్, జందావ్‌స్తా కూడా పఠనం చేస్తూ ఉండేవాడు.

**గాంధీ రచనలు**

గాంధీజీ తత్వం ఒక జీవిత విధానంగా చెప్పవచ్చు. "నాకు కర్మసిద్ధాంతాలు తప్ప ఉద్గ్రంథాలు రాయడం తెలీదు. అని గాంధీ పేర్కొన్నప్పటికీ ఎన్నో రచనలు చేశాడు. అవి :

i. సత్యంపై ప్రయోగాలు
ii. హిందూ స్వరాజ్
iii. ఉపన్యాస సంపుటి

iv. సత్యాగ్రహ ఇన్ సౌత్ఆఫ్రికా

v. ఫ్రమ్ ఎర్రవాడ మందిర్ మొ॥నవి.

ఇవికాకుండా కొన్ని పత్రికలకు ఎడిటర్‌గా ఉంటూ సంపాదకీయాలను కూడా రాశాడు. అవి :

1. ఇండియన్ ఒపీనియన్ – 1903
2. యంగ్ ఇండియా – 1919
3. నవజీవన్ – 1919
4. హరిజన్ – 1933

**గాంధీ రాజనీతి భావాలు**

తను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడంలో రాజీలేని కర్మజీవి గాంధీ. వ్యక్తిని, సమాజాన్ని, రాజ్యాన్ని, యావత్ జాతిని ఒక మంచి మార్గంవైపు మళ్ళించడానికి మూడు అస్త్రాలను ప్రయోగించాడు. అవి సత్యం (Truth), అహింస (Non-violence), సత్యాగ్రహం (Satyagraha). వాటిని భారత స్వాతంత్రోద్యమం లోకి ప్రవేశపెట్టి విజయం సాధించడమే కాకుండా నాటి సమాజానికి ఆచరణాత్మక పద్ధతులుగా చేశాడు. విశేషమేమిటంటే ప్రతిది తను ముందు ఆచరించి ఇతరులకు బోధించేవాడు. గాంధీజీ మతం గురించి మాట్లాడుతూ మతం గురించి తెలియనివారికి దేశాభిమానం ఎట్లా తెలుస్తుంది అని ప్రశ్నించాడు. "మతం లేనిదే రాజకీయాలు లేవు. మతరహితమైన రాజకీయాలు ప్రాణాంతకాలు; అవి ఆత్మహత్య చేస్తాయి" అని భావించాడు. గాంధీజీ నిత్య సత్యాన్వేషి. సత్యంలోనే ప్రేమ, అహింస అనేవి కనిపిస్తాయని "సత్యం అహింస అనేవి వ్యక్తికి కాకుండా వర్గాలకు, సమాజాలకు, జాతులకు కూడా ఆచరణలో ఆవశ్యకమైనవి" అని గాంధీజీ పేర్కొన్నాడు.

a) అహింస : గాంధీజీ అభిప్రాయంలో ప్రపంచంలో అన్ని మతాలకు అహింస అనేది హృదయం వంటిది. 'అహింస' అంటే హింస చేయకుండా ఉండడం అని అర్థం. విస్తృతార్థంలో చెప్పాలంటే ఎట్టి పరిస్థితులలోనూ ఏ జీవిని బాధించకుండా ఉండడమే అని అర్థం. అహింస అంటే చేతల్లోనే కాదు, త్రికరణశుద్ధిగా సర్వకాల సర్వావస్థలలో ఆచరించడం, ఆత్మవిమర్శనం చేసుకోవడం జరగాలి. దురాలోచన కూడా హింసే. అందువల్ల అహింసాపరులకు, ఎట్టి పరిస్థితుల్లోనూ విరోధులుండవు.

అహింస అంటే కేవలం దయ, అనాసక్తి, నిస్వార్థం మాత్రమే కాదు. అది ఒక "విముక్తమైన ఆత్మగుణం" (Quality of dirembodied soul) ఇతరుల దుఃఖాన్ని చూడలేని అసక్తత వల్ల కలిగే కరుణ, సాహసం, ఇత్యాది సుగుణవంతమైన అంశాలు, అహింస కలిగించే గుణాలుగా గాంధీజీ పేర్కొనడం జరిగింది.

గాంధీజీ ఉద్దేశంలో అహింసను ప్రపంచంలో ఏ శక్తి ఎదుర్కొనజాలదు. ఇది అత్యంత క్రియాశీలమైన అస్త్రం. దీన్ని కేవలం బ్రిటీష్ పాలకులపైనే కాక మన సమాజంలో జరుగుతున్న అనేక దురాగతాలకు అపూర్వ శక్తిగా అహింసను గాంధీ ఉపయోగించాడు.

గాంధీజీ ప్రయోగించిన అహింసా సిద్ధాంతం, బ్రిటీష్ పాలకుల పునాదులను కదిలించివేసిందని ప్రాశ్చాత్య రాజనీతి శాస్త్రజ్ఞులు (Western Political Scientists) కూడా వ్యాఖ్యానించడం గమనార్హం. ఈవిధంగా వ్యక్తి స్వాతంత్ర్యంగాని దేశ స్వాతంత్ర్యంగాని అహింసా పద్ధతిలోనే సాధ్యమవుతుందని ఈ విధానమే మనకు సరైన మార్గమని గాంధీజీ బోధించాడు.

## సత్యాగ్రహం

సత్యాగ్రహం అనే మాటను గాంధీజీ దక్షిణాఫ్రికాలో ఉండగా రూపొందించారు. దీనినే ప్రేమశక్తి అని ఆత్మశక్తి అని పేర్కొన్నాడు. ఇది అద్భుతమైన సాధనం. సత్యాగ్రహం అంటే అన్యాయాన్ని, అసత్యాన్ని ఎదిరించే పద్ధతి. తాను బాధను అనుభవిస్తూ శత్రువులోని మంచితనాన్ని ఆస్వాదించగల శక్తి అని చెప్పవచ్చు.

సత్యాగ్రహం హింసకు సంపూర్ణ వ్యతిరేకి. కోపం, క్రోధం, విరోధం, అసూయ మొదలయిన దుర్గుణాలు సత్యాగ్రహికి పనికిరావు.

## సత్యాగ్రహ పద్ధతులు

1. బ్రహ్మచర్యం పాటించడం
2. ఏ ప్రాణిని నాశనం చేయకుండా ఉండడం
3. అబద్ధం చెప్పకుండా ఉండడం
4. న్యాయంగా ఉండడం
5. కోరికలను అదుపులో పెట్టుకోవడం

సత్యాగ్రహికి గాంధీజీ ప్రయోజనకరమైన కార్యక్రమాలను సూచించాడు. అవి :

1. సంఘంలో ఐకమత్యాన్ని భద్రపరచడం
2. అంటరానితనాన్ని నిర్మూలించటం
3. మద్యపానాన్ని నిషేధించడం
4. గ్రామీణ పారిశ్రామికాభివృద్ధి
5. స్త్రీజనోద్ధరణ

## ఎ. హర్తాళ్

హర్తాళ్ అంటే ప్రజాజీవితాన్ని స్థంబింపచేయడం, అంగళ్ళను మూసివేయడం, పనులను నిలిపివేయడం మొదలైనవి. ఈ అస్త్రాన్ని గాంధీజీ దక్షిణాఫ్రికాలో ప్రయోగించి తప్పొప్పులను సరిచేసి పదునుపెట్టిన ఆయుధంగా తయారుచేశారు.

## బి. శాసనోల్లంఘన

శాసనోల్లంఘన ఇదొకరకమైన సత్యాగ్రహం. ఈ కార్యక్రమం ద్వేషరహితంగా అహింసాయుతంగా నిర్వహించాలి. ఇది కూడా వినూత్నమైన ఆయుధం. రక్తపాతం లేకుండా తిరుగుబాటును నిర్వహించి కార్యసిద్ధికి దోహదం చేస్తుంది.

### సి. హిజ్రత్

ఆత్మగౌరవం భద్రత లోపించిన పరిస్థితులలో తన జన్మస్థలం వదిలి మరోచోటుకు నివాసం మార్చడాన్ని హిజ్రత్ అంటాం. దుర్మార్గాన్ని ఎదిరించటంలో ఇదొక మార్గం. స్వాతంత్ర్య సముపార్జనకు బేరూబేరీలో ఈ పద్ధతిని చేపట్టాడు.

### డి. శుద్ధమైన ఉపవాసం

న్యాయమైన దాన్ని సాధించటానికి ఆకలిదప్పులను నిగ్రహించి పరిమితంగానో నిరవధికంగానో ఉద్యమాన్ని చేపట్టటాన్ని నిరసన వ్రతం అంటాం. ఈ దీక్షను చేపట్టాలంటే వ్యక్తులలో భక్తిభావం పవిత్రత ఉండాలి. ఈనాడు నిరసన దీక్షలంటే అపహాస్యం పాలైయ్యాయి. ప్రతీ చిన్న విషయానికి ఉన్నదానికీ లేనిదానికీ నిరసన దీక్ష అని చెప్పి ఈ శుద్ధమైన ఉపవాసదీక్షను భ్రష్టుపట్టిస్తున్నారు. కానీ గాంధీజీ ఆనాడు ఎంతో పెద్ద అవసరం ఉంటే తప్ప చేపట్టేవాడు కాదు.

### ఇ. సహాయనిరాకరణ

గాంధీజీ అనుసరించిన అహింసాయుత పద్ధతులలో సహాయనిరాకరణ (Non-cooperation) మద్యపాన నిషేధం, విదేశీ వస్తువులను బహిష్కరించడం, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించడం, స్వంతంగా చరఖాతో నూలు వడికి ఖాదీవస్త్రాలు తయారుచేసుకొని వాటినే ధరించడం ఇవన్నీ సహాయనిరాకరణలో భాగాలే.

### ఆర్థిక వ్యవస్థపై గాంధీ

ఆర్థిక సమానత్వ భావనను గాంధీజీ సమర్థించాడు. సమాజ అవసరాలు తీర్చుకోవడానికి అందరికీ అవసరమైన వస్తువులు సరఫరా చేసి తీరాలి. మార్క్సిస్టు సిద్ధాంతం "ప్రతి ఒక్కరికీ వారి అవసరం మేరకు" ("to each according to his need") అనే భావనకు ఆయన కట్టుబడ్డాడు. ఆర్థిక సమానతలోని మౌలికాంశాలు, ప్రతీ కుటుంబం జీవించడానికయ్యే కనీస అవసరాలు కల్పించాలని అంటే ఒక వసుధైక కుటుంబం ఏర్పరచాలని గాంధీజీ అభిప్రాయం. ఇవన్నీ సమాజంలో అందరికీ సమకూరాలంటే చేతివృత్తులతో చేసే కుటీర పరిశ్రమల ఆవశ్యకత ఎంతో ఉందని గాంధీజీ అభిప్రాయం. వాటిని అమలుచేసినప్పుడే గ్రామీణ సమాజం పరిపుష్టి అవుతుందని గాంధీ భావన.

గాంధీజీ ప్రతిపాదించిన సామ్యవాద భావనలో రాజు, రైతు, కూలీ, పేదవాడు, దరిద్రుడు, యజమాని, కార్మికుడు అందరూ సమాజంలో గౌరవ అభిమానాలు పొందాలని వారందరూ సమానులేనని గాంధీజీ అభిప్రాయం. సామ్యవాద సమాజంలో ప్రతీవ్యక్తికి కూడు గుడ్డ నీడకు లోటు ఉండకూడదు. చేతినిండా పని ఉంటే అవసరాలను తీరుస్తుంది. కాని సోవియట్ రష్యాలాగే వ్యక్తి స్వాతంత్ర్యహరణం ఆయనకు గిట్టలేదు. వ్యక్తి స్వాతంత్ర్యం, సొంత ఆస్తి చాలా అవసరమని ఆయన సిద్ధాంతం.

## గ్రామ స్వరాజ్యం (Gram Swaraj)

భారతదేశ ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగాలంటే అభివృద్ధిని గ్రామాలతోనే ప్రారంభించాలని గాంధీజీ సూచించాడు. దేశ సౌభాగ్యానికి గ్రామాలు పట్టుకొమ్మలు అని నమ్మిన వ్యక్తి గాంధీ. పల్లెలు ఆర్థికంగా, సాంఘికంగా అభివృద్ధిని సాధించినప్పుడే దేశం యావత్తు అభివృద్ధి బాటలు వేస్తుందని గాంధీజీ అభిప్రాయం.

ప్రతి గ్రామం తనకు తాను కావలసిన ఆహారాన్ని, వస్త్రాలను ఇతర కనీస అవసరాలను తానే ఉత్పత్తి చేసుకుంటుంది. దానికి పశుసంపద ఉంటుంది. సాయంత్రంవేళ పిల్లలు వినోదానికి ఆటస్థలాలు ఏర్పాటుచేయాలి. ఒకవేళ గ్రామ అవసరానికి మించిన సేద్యపు భూమి ఉంటే దేశ సౌభాగ్యాన్ని పెంచే పంటలు వేయాలి. గ్రామస్థులకు కావలసిన అవసరాలు ముఖ్యంగా మంచి నీటివసతి కల్పించడం, మురుగునీటిని పారద్రోలడం, గ్రామీణ విద్యుత్ సౌకర్యాలను ఏర్పాటుచేయడం, గ్రంథాలయాల ఏర్పాటు, వ్యాయామశాలలు ఏర్పాటు, ఇవన్నీ పంచాయితీ నిర్వహించాలి. బావులు, చెరువులు అన్నీ పంచాయితీ ఆధీనంలోనే ఉండాలి. గ్రామంలోని ప్రతీ బాలిక, బాలునికి నిర్బంధ ప్రాథమిక విద్యను అమలుజరపాలి.

## ముగింపు

భారత స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ నిర్వహించిన పాత్ర అపూర్వం. రాజకీయ పోరాటంలో నైతిక విలువలకు అత్యున్నత ప్రాముఖ్యం ఇచ్చాడు. గాంధీజీ తన రాజనీతి తత్వవిచారంలో మానవ జీవితంలో విశ్వమానవ సౌభ్రాతృత్వానికి బాటలు వేశాడు. సర్వమత సమైక్యతపై ఆయనకున్న విశ్వాసం అమూల్యమైంది. "మానవులంతా సోదరులే" అన్న ఆయన ప్రబోధం మానవజాతి మనుగడకు ఒక దివ్యజ్యోతిలా నిలిచింది. ఆధునిక కాలంలో ఎన్నో దేశాలు ఆయన సిద్ధాంతాలను ఆచరిస్తున్నాయి. స్వతంత్ర భారత దేశ ప్రజలకు ఆయన జాతిపిత, మహాత్ముడు. ఆయన ప్రబోధాలుకాని, సూచించిన మార్గాలు కాని నేటి జాతికి అనుసరణీయాలు. ఆయన పాల్గొన్న ప్రతీ ఉద్యమంలోనూ ప్రతీ కదలికలోనూ తనే ముందుండి యావత్ భారతజాతిని నడిపించాడు. తాను కాని, తన కుటుంబసభ్యులుకాని తన బంధుమిత్రులుకాని ఏనాడు పదవులు ఆశించలేదు. రాజకీయాలు అంటే సమాజ సేవకు మార్గాలు అని నిత్యం నమ్మే ఒక సత్యశోధకుడు. నిరుపేదలకు తోడునీడగా నిలిచిన గొప్పవ్యక్తి. హరిజనోద్ధరణే తన ధ్యేయమని త్రికరణ శుద్ధిగా నమ్మిన ధీశాలి. ఆనాటి భారత స్వాతంత్ర్య సమరంలో నలభై కోట్లమంది భారతీయులకు నాయకుడిగా ముందుండి నడిపించిన గొప్ప నాయకుడు. అందువల్ల లూయీ ఫిషర్ (Lui Fisher), "భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలనే ఒక సజీవ ఆకాంక్షకు గాంధీ ప్రతీక" అని అభివర్ణించాడు.

# 2. విద్వాన్ సర్వత్ర పూజ్యతే

ఎంత పేదరికం నుంచి వచ్చినా ఉన్నతమైన ఆలోచనలతో స్కాలర్‌షిప్‌ల సహాయంతో ఆయన చదువుకున్నాడు. చదివించే స్తోమత లేక తండ్రి కొడుకును పూజారిగా చేద్దామనుకున్నా, కుర్రవాడి జిజ్ఞాసను చూసి స్కూలుకు పంపించారు. ఇరవైసంవత్సరాలకే మహాసముద్రం లాంటి ఫిలాసఫీని ఔపోసన పట్టి విద్యార్థులకు బోధించటం ప్రారంభిస్తే ఆయన పాఠాలు వినటానికి విద్యార్థులేకాక సహోపాధ్యాయులు కూడా కిటికీల వద్ద నిలబడి వినేవారు. ఆయన విద్యార్థుల అభిమానాన్ని ఎంతగా చూరగొన్నారంటే ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో బోధించటానికి తను పనిచేస్తున్న కళాశాల వదిలి వెళుతుంటే విద్యార్థులంతా కళాశాల నుంచి రైల్వేస్టేషన్ వరకూ పూలమాలలతో నిండిన బండిని స్వయంగా తమ చేతులతో లాక్కెళ్ళారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి అతిథిగా ఒకటి రెండు ఉపన్యాసాలు ఇవ్వటానికి వెళ్ళిన ఆయన ఉపన్యాసాలను విని సమ్మోహితులైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ యంత్రాంగం ఆయనకోసం ప్రత్యేకంగా పదవిని సృష్టించి అక్కడే ఉండిపొమ్మని అభ్యర్థించింది. అలాంటి పదవులన్నీ తృణప్రాయంగా వదిలేసి స్వదేశంలో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావటానికి కృషిచేసి, విద్య అనేది జీవించటానికి ఏం చేయాలో నేర్పటమేకాక, ఎలా జీవించాలో కూడా నేర్పాలన్న ప్రాథమిక సిద్ధాంతాన్ని ప్రవచించారాయన. భారతదేశ రాష్ట్రపతిగా ఎన్నికైన ఆయనను కలిసి మీ జన్మదినాన్ని వేడుకగా జరుపుకోవటానికి అనుమతి అడిగినప్పుడు విద్యార్థులు, శ్రేయోభిలాషులతో ఆయన "నేను నిరంతరం విద్యార్థిగా ఉండే ఉపాధ్యాయుడ్ని, మీరు వేడుక చేయదలిస్తే అలా నిరంతరం విద్యార్థులుగా ఉండి తమ ఉపాధ్యాయ వృత్తి ద్వారా మేధావులను తయారుచేస్తున్న ఉపాధ్యాయ వృత్తికీ వేడుకలు జరపండి." అని అన్నారు. ఆ రోజు నుంచే సెప్టెంబర్ 5ను జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఆ వ్యక్తి ఎవరో కాదు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్.

స్వగృహే పూజ్యతే మూర్ఖః
స్వగ్రామే పూజ్యతే ప్రభుః ।
స్వదేశే పూజ్యతే రాజా
విద్వాన్ సర్వత్ర పూజ్యతే ॥

మూర్ఖుడు, తన ఇంటిలోనే పూజలందుకుంటాడు. గ్రామపెద్ద తన గ్రామంలోనే పూజలందుకుంటాడు. రాజు తన దేశంలో మాత్రమే పూజలందుకుంటాడు. విద్వాంసుడు ఎక్కడికెళితే అక్కడ పూజలందుకుంటాడు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ డాక్టర్ రాధాకృష్ణన్. జీవితంలో ఒక్కసారైనా ఒక గొప్ప అధ్యాపకుడి చేతిలో పడితే ఆ వ్యక్తి గొప్ప నాగరికుడిగా మారే అవకాశం ఉందంటారు Bertrand Russel. ఈ విషయాన్ని బహుశ పురాణాల్లో హిరణ్యకశిపుడు కూడా గ్రహించినట్లుంది. అందుకే....

చదువని వాడజ్ఞుండగు
చదివిన సద సద్వివేక చతురతగలుగున్
చదువగవలయును జనులకు
చదివించెద నార్య లొద్ద జదువుము తండ్రీ!

అంటాడు కుమారుడైన ప్రహ్లాదునితో. అంత రాక్షసుడిగా పేరొందిన హిరణ్యకశిపుడే గురువుల గొప్పతనం గ్రహించాడు. "ఆకాశం ఎత్తులో ఉన్న ఈ 'గురు' శబ్దం భూలోకంలో పడి, అటుపై చిత్రసీమలో స్వైరవిహారం చేసి, అక్కడ కూడా అవమానాలకు, వెక్కిరింతలకు గురై ఎక్కడా తలదాల్చుకోలేక పాతాళంలో పడిపోయిన ఈరోజుల్లో గురు శబ్దం ఎవరైనా పలుకుతుంటే వెక్కిరింతగా వినిపిస్తోంది" అనే పులికంటి మాటలు ఈనాటి కాలంలో అందరికీ ఆలోచనీయాంశం. గురువు ఆజ్ఞ పాటించటానికి పొలంలో నుంచి నీరు పోకుండా, పగలూ, రాత్రీ పొలానికి అడ్డంగా తానే గట్టైపడుతున్న అరుణి (మహాభారతంలోని ఉపాఖ్యానంలో పేర్కొన్న పాత్ర) కాలం నాటికి... ఈనాటికి గురుశిష్య సంబంధంలో వచ్చిన విపరీతమైన మార్పునకు పులికంటి మాటలే ఉదాహరణ. "జీతం పుచ్చుకోవటం వల్ల ఉపాధ్యాయులు సేవకులు అవుతున్నారు. వేతనం ఇస్తుండటంతో విద్యార్థులు ప్రభువులవుతున్నారు" అని అన్న కందుకూరి మాటలు కూడా ఈ కాలం విద్యార్థులు, గురువులు, తల్లిదండ్రులందరినీ ఆత్మావలోకనం చేసుకోవటానికి ప్రేరేపించేవే. సాధారణ గురువులు సమాచారాన్ని ఇస్తారు. మధ్యస్థమైన గురువులు జ్ఞానాన్ని ఇస్తారు. గొప్ప గురువులు స్ఫూర్తిని ఇస్తారు.

విశాఖపట్నం ఎ.వి.ఎన్. కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న రోజులవి. టీనేజి ఆకర్షణలు, ఎదిగీ ఎదగని వ్యక్తిత్వం, అంతర్గతంగా అంతులేని సంఘర్షణలతో, ప్రతి విద్యార్థి సతమతమయ్యే సమయమది. సంస్కృతం క్లాసు తీసుకుంటున్న గురువుగారు పురాణాల్లో మహర్షుల గురించి చెబుతూ, తపస్సు ద్వారా సాధించలేనిది ఏదీ లేదన్నారు. కొందరు విద్యార్థులు గురువుగారిని ఇరుకున పెట్టడానికి పురాణకాలంలో తపస్సు ఎలా చేసేవారో తాము చూడలేదనీ, ఈ మధ్యకాలంలో మన దేశంలో తపస్సు చేసినవాళ్ళు ఎవరైనా ఉంటే చెప్పమని అడిగారు. గురువుగారు ఆలోచించి 'గాంధీజీ' అని సమాధానమిచ్చారు. గాంధీజీ తపస్సు చేశారనటానికి నిదర్శనం ఏంటి? అని అడిగారు ఆ విద్యార్థులు. అప్పుడు గురువుగారు గాంధీజీ జీవితంలో జరిగిన ఒక సంఘటనను ఇలా వివరించారు.

ఒకసారి గాంధీజీకి, రవీంద్రనాథ్ ఠాగూర్‌కి మధ్య సూర్యోదయ సమయంలో సంభాషణ జరుగుతోంది. ఉదయభానుని లేత కిరణాలతో ప్రభావితుడైన ఠాగూర్, గాంధీజీ ఏదో ధ్యాసలో ఉండటం గమనించి "గాంధీజీ మీరెందుకంత నిశ్చలంగా ఉంటారు? సూర్యోదయం వేళ ఉదయభానుడి లేత ఎర్రని కిరణాలు చూస్తే మీ మనసు నిండిపోదా? పక్షుల కిలకిలా రావాలతో ఆ సహజ సంగీతంతో మీ హృదయం పరవశించిందా? విచ్చుకుంటున్న ఎర్రగులాబీలను చూస్తే ఆహ్లాదంగా అనిపించదా?" అని ప్రశ్నించారు. దానికి గాంధీజీ "గురుదేవ్ నేనేమీ జీవంలేని శిల్పాన్ని కాదుకదా. ఉదయభానుడి ఎర్రని కిరణాలతో, పక్షుల కిలకిల రావాలతో, విచ్చుకునే గులాబీలతో పరవశించకుండా ఉండటానికి. కానీ నేనేమి చేయను? నా మనసంతా వేరేచోట ఉంది. ఈ లేత గులాబీ ఎర్రదనాన్ని ఆకలితో అలమటించే కోట్లాది జీవుల చెక్కిళ్ళపై ఎప్పుడు చూస్తానా అని... ఆనందం నిండిన వారి గొంతుల్లో నుంచి ఆ పక్షుల కిలకిలారావాల్లాంటి మధురధ్వని ఎప్పుడు వింటానా అని... ఉదయభానుడి లేత కిరణాలతో ఆ పేదవాని హృదయం (అతని సమస్యలు తీరి) ఎప్పుడు పరవశిస్తుందా" అని అన్న గాంధీజీ సమాధానానికి ఠాగూర్ మిన్నకుండిపోయారు. అందుకేనేమో దేశం కోసం, దేశప్రజలకోసం అంతగా తపించిన గాంధీజీని 'మహాత్మా' అని సంబోధించారు.

తపస్సు అంటే లక్ష్యం కోసం అనునిత్యం తపించటమే అని వివరించారు గురువుగారు. స్ఫూర్తి ప్రదాయకమైన ఆయన సమాధానంతో ప్రశ్న అడిగినవారి గొంతు పెగల్లేదు కానీ, మిగతా వారందరి నుంచి కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి. జీవితాంతం స్ఫూర్తిని ఇచ్చే మా గురువుగారి వివరణ ఎంతమంది జీవితాలను ప్రభావితం చేసిందో?

ప్రపంచంలో మిగతా అన్ని వృత్తులను నేర్పించే వృత్తే ఉపాధ్యాయ వృత్తి. ఇంజనీర్లయినా, డాక్టర్లయినా, లాయర్లయినా, సైంటిస్ట్‌లైనా, ప్రధానమంత్రులైనా, రాష్ట్రపతులైనా, ఉపాధ్యాయుడిచ్చిన శిక్షణ ద్వారా వచ్చినవారే. వేమన అన్నట్లు...

గురుని శిక్ష లేక గురుతెట్లు కలుగును
అజునికైన, వానియబ్బకైన,
తాళపుచెవి లేక తలుపెట్టులూడును
విశ్వదాభిరామ వినురవేమ

"గురువు లేకుండా ఎంతటి వారికైనా గొప్పదనం సిద్ధించదు. రఘువంశ రాజైన అజుడైనా... ఆయన తండ్రైనా, ఎవరైనా సరే. తాళంచెవి లేకుండా తలుపు తీయటం ఎలా సాధ్యం?" అని అర్థం. అంటే అజ్ఞానం అనే తాళం కలిగిన విద్యార్థి అనే ద్వారానికి, జ్ఞానం అనే తాళంచెవితో తలుపు తీసేవాడే గురువుగారు. తల్లిదండ్రులు జన్మనిస్తారు. ఆ జన్మని సార్థకం చేసుకునేలా ప్రేరణ ఇచ్చేది గురువు కాబట్టి గురువే జీవితానికి చుక్కాని లాంటివాడు.

బుద్ధుడు మహాసమాధిలోనికి ప్రవేశించేటప్పుడు ఆయన శిష్యులందరిలో తీవ్ర ఆవేదన ఆవరించింది. అశ్రువులలో అందరూ గద్గద స్థితిలో ఉన్నారు. బుద్ధుడి ప్రియశిష్యుడైన ఆనందుడు ఆయన దగ్గరకు వెళ్ళి, మహాత్మా మీరు ఇన్నాళ్ళూ మా అందరికీ మార్గం చూపించారు. అజ్ఞానాంధకారంలో నుంచి జ్ఞాన ప్రకాశంలోకి మమ్మల్ని పయనింపచేశారు. మీరు నిష్క్రమిస్తే మాకు మార్గం ఎవరు చూపుతారు? అంటూ రోదించాడు. అందుకు బుద్ధుడు సమాధానంగా.

నా జీవితంలో నేను ఆచరించింది, అనుభవంతో తెలుసుకున్నది మీకు బోధించాను. నా జ్ఞానాన్ని మీ హృదయాల్లో నాటటానికి ప్రయత్నించి నా ధర్మాన్ని నేను నిర్వర్తించాను. నా తర్వాత వెలుగు కోసం నీలో నువ్వు చూసుకో. ఆత్మదీపోభవ (be your own lamp) అంటారు. నిజమైన గురువు, నిజమైన శిష్యులకు వీరే ఉదాహరణ.

ప్రతి విద్యార్థి సగటున 25 వేల గంటల సమయాన్ని కళాశాల ఆవరణలో గడుపుతాడు. కాబట్టి అతనికి అత్యున్నత విలువలు కలిగిన ఉపాధ్యాయుల బోధన అవసరమంటారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం. ఒక ఉత్తమ ఉపాధ్యాయుడి ప్రభావం ఎన్ని తరాల వరకు ఉంటుందో చెప్పలేం. ఆంధ్రా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదివే రోజుల్లో ప్రొఫెసర్ నాగమునీశ్వరరావు ఎలక్ట్రానిక్స్ బోధించేవారు. ఆయన క్లాస్‌కి వచ్చిన సమయం ఆధారంగా విద్యార్థులు వాచ్‌లు సరిదిద్దుకునేవాళ్ళు. అంత కచ్చితంగా

ఉండేది ఆయన సమయపాలన. విద్యార్థికి పఠనం, మననం, రెండూ అవసరమని నొక్కి చెప్పేవారు. ఆయన అంటే అందరికీ గౌరవంతో కూడిన భయం ఉండేది. ఒక క్లాస్‌లో ఆయన చెప్పిన కథ ఇప్పటికీ గుర్తుంది.

ఒక తాత, పిల్లలకు కబుర్లు చెబుతున్నాడు. గొప్పవాళ్ళు ఎలా అవుతారు అని అడిగారు పిల్లలు. దానికి తాత ప్రతి మనిషిలోనూ రెండు జట్లు ఉంటాయి. నాలోనూ, మీలోనూ కూడా ఉన్నాయి. ఆ రెండు జట్లూ ఎప్పుడూ పరస్పరం పోటీపడతాయి. ఒక జట్టులో భయం, కోపం, ఈర్ష్య, అసూయ, ద్వేషం, గర్వం, అహంకారం, ఆత్మన్యూనత ఉన్నాయి. రెండో జట్టులో ఆనందం, శాంతి, ప్రేమ, అణకువ, దయ, క్షమ, సత్యం, ఆత్మవిశ్వాసం ఉన్నాయి. మరి ఏ జట్టు గెలుస్తుందని ఉత్కంఠతో అడిగారు పిల్లలు. మీరు దేన్ని ప్రోత్సహిస్తే అది గెలుస్తుంది. గొప్పవారైన వాళ్ళంతా రెండో జట్టును ప్రోత్సహించినవారే. రెండోజట్టును ప్రోత్సహిస్తే మీరూ గొప్పవారు కావచ్చు. ఈ కథ మాలో ఎంతోమందికి గమ్యాలు చేరుకోవడానికి... ఆయా రంగాల్లో రాణించి ముందుకెళ్ళడానికి దిశానిర్దేశం చేసిందంటే అతిశయోక్తి కాదేమో! ఆయన్ని తలుచుకున్నప్పుడల్లా గురువులు జీవించడానికి ఏం చేయాలో నేర్పడమేకాక, ఎలా జీవించాలో కూడా నేర్పాలని భగవద్గీతలో కృష్ణుడు అంటారు –

యద్యదాచరతి శ్రేష్ఠః తత్త దేవేతరో జనః ।
సయత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే ॥

ఉత్తములైన గురువులు ఏది ఆచరిస్తే ఇతరులు దాన్నే ఆచరిస్తారు. వారు దేనిని ప్రమాణంగా స్వీకరిస్తే లోకమంతా దాన్నే స్వీకరిస్తుంది. ఒక పిల్లవాడి జీవితం తెల్లకాగితం లాంటిది. అతని జీవితంలో బోధించే ప్రతి గురువు ఏదో ఒకటి రాస్తారు. ఆ రాసే విషయం ఆ గురువు ఔన్నత్యం మీద ఆధారపడి ఉంటుంది. సోక్రటీస్ ఇందుకు గొప్ప ఉదాహరణ. తనను నిరంతర విద్యార్థిగా భావించుకున్న ఆయన జ్ఞానవ్యాప్తికి తానొక మాధ్యమాన్నని, ఉత్ప్రేరకాన్ని మాత్రమేనని భావించేవారు. అందుకే ఆయన శిష్యులు ఆయన కంటే గొప్పవారయ్యారు. లేతవయసులో రాక్షస సంహారం కోసం రామలక్ష్మణుల్ని తనతో పంపమన్న విశ్వామిత్రుని విజ్ఞప్తిని అంగీకరించలేకపోయిన దశరథునితో వశిష్ట మహాముని... విశ్వామిత్రుని వంటి గురువు లభించడం ఎంతో అదృష్టమని చెబుతూ...

ఏష విగ్రహవాన్ ధర్మః ఏష వీర్యవతామ్ వరః ।
ఏష విద్యాధికో లోకే తపసః చ పరాయణమ్ ॥

ఈయన విగ్రహమే ధర్మానికి ప్రతిరూపం. వీరత్వంలో ఈయనకు వేరెవరూ సాటిలేరు. మేధస్సులో లోకంలో అందరినీ మించినవాడు. ఋషుల్లో బ్రహ్మర్షి అని... దశరథునికి ఆ గురువు గొప్పతనాన్ని, వ్యక్తిత్వాన్ని గురించి చెబుతాడు. అలాంటి గొప్ప గురువు లభించబట్టే శ్రీరాముడు రఘుకులాన్వయ రత్నదీపమయ్యాడు. అలాంటి గురువులందరినీ స్మరించుకుంటూ.... "ఆచార్య దేవోభవ" ॥

# 3. డా॥ బి.ఆర్. అంబేద్కర్

## పరిచయం

భారతరత్న డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్‌ను మూక్-నాయక్ (అణగారిన వర్గాల నాయకుడు)గా కొలుస్తారు. అస్పృశ్యులకు ఒక గుర్తింపునిచ్చిన మహాపురుషుడు అంబేద్కర్ అని పండిట్‌నెహ్రూ కొనియాడారు. ఈయన దేశంలోని పీడిత వర్గాలకు ఆశాజ్యోతిగా వెలుగొందారు. రాజ్యాంగనిర్మాణంలో అంబేద్కర్ జరిపిన కృషి విశిష్టమైందని బాబూ రాజేంద్రప్రసాద్ నివాళులర్పించారు. న్యాయంకోసం పోరాడి ఎదురులేని వ్యక్తిగా నిలిచింది ఒక అంబేద్కరేనని సి. రాజగోపాలాచారి పేర్కొన్నారు. తరతరాలుగా స్థిరపడిపోయిన అన్యాయాన్ని ప్రతిఘటించిన తిరుగుబాటుదారు అంబేద్కర్ అని ఎన్.వి. గాడ్గిల్ ప్రశంసించారు. అంబేద్కర్‌ను ఒక ఆధునిక మనువుగా ఎం.వి. పైలీ పరిగణించారు. ఫ్రాంక్ ఆంథోని దృష్టిలో అంబేద్కర్ ఒక "రాజీపడని పోరాట యోధుడు", నవబుద్ధునిగా, నవభారత దార్శనికుడిగా, సమర్థవంతమైన పాలకుడిగా, గొప్ప విద్యావేత్తగా, మేధావిగా అంబేద్కర్ దేశ చరిత్రలో నిలిచిపోయారు. సంప్రదాయ, సామాజిక వ్యవస్థను బలంగా వ్యతిరేకించిన అంబేద్కర్ కుల, పురోహిత, బ్రాహ్మణ, అన్యాయ, దోపిడీల పరంపరను తీవ్రంగా ప్రతిఘటించి సమసమాజ స్థాపనకోసం ఎనలేని కృషి చేశారు.

20వ శతాబ్దంలో భారత రాజనీతి తత్వవేత్తల్లో ప్రముఖుడిగా గుర్తించదగిన గొప్ప తాత్వికుడు డా॥ బి.ఆర్. అంబేద్కర్, ఇతని వ్యక్తిత్వం ఉన్నతమైంది, తాను బాల్యంలో ఎదుర్కొన్న సామాజిక-ఆర్థికపరమైన వివక్షలను పునాదిగా చేసుకొని తన వ్యక్తిత్వాన్ని సమున్నతంగా మల్చుకున్నాడు. అస్పృశ్యుల వెతలు, అణగారిన వర్గాల బాధలపై పూర్తి అవగాహన ఉన్న అంబేద్కర్‌వారి సామాజిక - ఆర్థిక, రాజకీయ హోదాలను మెరుగుపరచాలనే బలమైన కాంక్షను పెంచుకున్నారు.

వేదకాలం తరువాత (In the post-vedic period) భారత సామాజిక-రాజకీయ రంగాలలో కులం ఒక ప్రత్యేక లక్షణంగా అవతరించింది. కులం, సామాజిక అసమానతలను, వైరుధ్యాలను సృష్టించి కొన్ని వర్గాల ఆధిపత్యానికి మరికొన్ని వర్ణాల పరాధీనతకు అవకాశం కల్పించింది. బ్రిటీషువారి రాకతో పాశ్చాత్య విద్యనభ్యసించిన కొంతమంది మొదటి తరం భారతీయ మేధావులు సామాజిక అసమానతలను, రుగ్మతలను రూపుమాపాలనే కాంక్షతో సంస్థలను స్థాపించి సంస్కరణలకు పూనుకున్నారు. ముఖ్యంగా, రాజారాం మోహన్‌రాయ్ స్థాపించిన 'బ్రహ్మసమాజం', దయానంద సరస్వతి స్థాపించిన 'ఆర్యసమాజం', స్వామి వివేకానంద స్థాపించిన 'రామకృష్ణమిషన్' జ్యోతిరావ్ పూలే స్థాపించిన 'సత్యశోధక సమాజం' వంటి సంస్థలు, జస్టిస్ రవడే వంటి వ్యక్తుల ప్రజాస్వామ్య, లౌకిక, హేతువాద భావాలు భారత సమాజాన్ని పట్టి పీడిస్తున్న కులం, దాని ఫలితంగా ఉద్భవించిన అసమానతలు, అంటరానితనం వంటి రుగ్మతలను తొలగించటానికి కృషి చేస్తున్న కాలంలో సామాజిక వైతాళికుడు బాబాసాహెబ్ అంబేద్కర్ జన్మించారు.

## జీవిత విశేషాలు

భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14 (వైశాఖ పూర్ణిమ) నాడు, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు అతిసమీపంలో ఉన్న "మౌ" అనే గ్రామంలో, రామ్‌జీ సక్‌పాల్, భీమాబాయి దంపతులకు 14వ సంతానంగా

జన్మించారు. అంబేద్కర్ ఐదు సంవత్సరాల చిరుప్రాయంలో ఉండగా తల్లి మరణించింది. పర్యవసానంగా మేనత్త అయిన మీరాబాయి పెంపకంలో పెరిగాడు. డా॥ అంబేద్కర్ మహారాష్ట్రలో "మహార్" గా పిలువబడే అంటరానికులంలో జన్మించాడు.

ఆనాటి పరిస్థితుల్లో అస్పృశ్యులు చదువుకోవాలనుకోవటం పెద్ద సాహసమే. నాడు అంటరానివారిని ఏ బడిలోనూ చేరనిచ్చేవారు కాదు. చివరకు ఏదోవిధంగా స్థానిక మరాఠీ పాఠశాలలో ప్రాథమిక విద్యలో చేర్పించారు. ఆతరువాత హైస్కూల్ విద్యకోసం 'సతారా' లోని ప్రభుత్వ పాఠశాలలో అంబేద్కర్ చేరారు. సతారా పాఠశాలలో ఎన్నో చేదు అనుభవాలను చవిచూశారు. పాఠశాలలో అగ్రకులాల పిల్లలతోపాటు కాకుండా ఒక మూలన కింద కూర్చోబెట్టేవారు. మిగతా విద్యార్థులలాగా దాహం తీర్చుకోవడానికి, ఆటల-పాటల్లో పాల్గొనడానికి వీలులేదు. ఈవిధమైన నిరాదరణ, వివక్షలు అంబేద్కర్ పసిహృదయాన్ని వేధించాయి. సంస్కృతాన్ని బోధించే ఉపాధ్యాయుడు అంబేద్కర్‌కు సంస్కృతాన్ని బోధించడానికి నిరాకరించాడు. ఎందుకంటే, సంస్కృతం దైవికభాష (Divine language) కాబట్టి అస్పృశ్యుడైన అంబేద్కర్ దానిని అభ్యసించే అర్హత లేదనేది అతని అభిప్రాయం. అంబేద్కర్‌కు సంస్కృతం చదవాలనే కోరిక బలంగా ఉన్నప్పటికీ విధిలేని పరిస్థితుల్లో పర్షియన్ భాషను ఎంచుకున్నారు.

రామ్‌జీ సక్‌పాల్ 1904 లో ఉద్యోగ నిర్వహణలో భాగంగా బొంబాయి వచ్చాడు. అంబేద్కర్ సైతం తండ్రితోపాటు బొంబాయి మారవలసి వచ్చింది. బొంబాయిలో ప్రతిష్టాత్మకమైన 'ఎలిఫిన్‌స్టోన్' హైస్కూల్‌లో చేరారు. అదే పాఠశాలలో 1907 సం॥లో మెట్రిక్యులేషన్ ఉన్నత శ్రేణితో (Mericulation passed with distinction) పాసయ్యాడు. ఒక మహార్ కులానికి చెందిన విద్యార్థి మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణత పొందటం ప్రప్రథమం. అదొక చారిత్రక సంఘటన.

అయితే, ఆనాటి సంప్రదాయ పరిస్థితుల వల్ల పద్నాలుగు వసంతాల ప్రాయంలోనే భీమ్‌రావ్ వివాహం చేసుకోవలసి వచ్చింది. పెళ్ళినాటికి భీమాబాయి కేవలం తొమ్మిది వసంతాల బాలిక. ఇటువంటి పరిస్థితులలో సైతం భీమ్‌రావ్ తన విద్యా వ్యాసంగాన్ని కొనసాగించాలని నిశ్చయించుకున్నారు.

ఫలితంగా, డా॥ అంబేద్కర్ తన కళాశాల విద్యను ఎలిఫిన్ స్టోన్ కళాశాలలోనే బరోడా సంస్థానాధీశుడైన మహారాజు శాయాజీరావ్ గైక్వాడ్ సహాయంతో కొనసాగించారు. నాడు మహారాజు నెలకు రూ॥ 25 ల చొప్పున ఉపకార వేతన రూపంలో సహాయం అందించారు. ఈ సహాయంతోపాటు గొప్ప విద్యావేత్త అయిన 'మాక్స్‌ముల్లర్' సైతం భీమ్‌రావ్‌కు బట్టలు - పుస్తకాలు కొనిచ్చేవారు. అంబేద్కర్ కళాశాల విద్యార్థిగా ఉండే సమయంలోనే తండ్రి అయ్యారు. భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ ప్రథమ కుమారుడు యశ్వంత్.

డా॥ అంబేద్కర్ 1913 లో బి.ఎ. ఉత్తీర్ణుడయ్యారు. ఆతరువాత గైక్వాడ్ ఉపకారవేతన సహాయంతో అమెరికా వెళ్ళారు. అక్కడ న్యూయార్క్‌లోని కొలంబియా యూనివర్సిటీలో చేరారు. భారతదేశ చరిత్రలోనే ఒక మహార్ (అంటరాని) కులానికి చెందిన వ్యక్తి విదేశాలకు చదువుకోసం వెళ్ళటం చారిత్రాత్మక ఘట్టం. 1915 సం॥లో "ప్రాచీన భారతదేశంలో వాణిజ్యం" (Ancient Indian Commerce) అనే పరిశోధనా వ్యాసానికి ఎం.ఎ. డిగ్రీని, 1917 సం॥లో "నేషనల్ డివైడెండ్ ఫర్ ఇండియా", ఎ హిస్టారికల్ అండ్

ఎనలిటికల్ స్టడీ” (National Dividend for Indian Historical and Analytical study) అనే పరిశోధనా పత్రానికి పిహెచ్‌డి. డిగ్రీలను కొలంబియా యూనివర్సిటీ నుంచి పొందారు.

కొలంబియా నుంచి వెళ్ళి బ్రిటన్‌లోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ‘లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్” (London school of Economics and Political science) లో ఎం.ఎస్సీ (ఎకనామిక్స్), డి.ఎస్సీ (ఎకనామిక్స్) లో చేరారు. ఆతరువాత లండన్‌లోని ‘గ్రెస్ ఇన్ కళాశాలలో బార్-ఎట్-లా కోర్సులో చేరారు. డా॥ అంబేద్కర్ లండన్‌లో పుస్తక పఠనం కోసం బ్రిటీష్ మ్యూజియం గ్రంథాలయంలో ఎక్కువ సమయం గడిపేవారు. ప్రపంచంలోనే ఆ గ్రంథాలయంలోని ఎక్కువ పుస్తకాలను చదివిన రెండో వ్యక్తి డా॥ అంబేద్కర్ కాగా మొదటివ్యక్తి సామ్యవాద ప్రవక్త కారల్‌మార్క్స్.

బరోడా మహారాజు ఉపకారవేతనం నిలిపివేయటంతో స్వదేశానికి తిరిగివచ్చి బరోడా సంస్థానంలో మిలిటరీ సెక్రటరీగా ఉద్యోగంలో చేరారు. అయితే, సంస్థానంలో ప్రతిరోజు తనకు జరుగుతున్న అవమానాలను, తనపట్ల చూపుతున్న వివక్షలను భరించలేక ఒక సంవత్సరంలోపే ఉద్యోగానికి రాజీనామాచేసి బొంబాయి వెళ్ళారు. బొంబాయిలోని “సైడన్‌హం” (Sydenham) కళాశాలలో రాజకీయ అర్థశాస్త్ర ప్రొఫెసర్‌గా చేరారు. అక్కడ కూడా విద్యావంతులైన తనతోటి అధ్యాపకులు కులభావంతో జరిపిన అవమానాలను, వివక్షలను చీత్కరించుకొని దానిని కూడా వదులుకున్నారు. ఈ నేపథ్యంలోనే డా॥ అంబేద్కర్ అణగారిన వర్గాల గొంతును వినిపించడానికి “మూక్ నాయక్” (మరాఠీ) అనే వారపత్రికను స్థాపించారు.

డా॥ అంబేద్కర్ లండన్‌లో ఎం.ఎస్సీ, డి.ఎస్సీ, బార్-ఎట్-లా కోర్సులను పూర్తిచేయడానికి కొంతమంది మిత్రుల, ఆప్తుల సహకారాలతో డబ్బును సమకూర్చుకొని తిరిగి లండన్‌లో వెళ్ళారు. 1921 సం॥లో “ప్రొవిన్షియల్ డిసెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా” (Provincial Decentralisation of Imperial Finance in British India) అనే పరిశోధనా పత్రాన్ని సమర్పించి ఎం.ఎస్సీ (ఎకనామిక్స్) డిగ్రీని, 1923 సం॥ లో “ది ప్రాబ్లమ్ ఆఫ్ ది రుపీ” (The problem of the Rupee) అనే పరిశోధనా పత్రానికిగాను డి.ఎస్సీ (ఎకనామిక్స్) డిగ్రీని పొందారు. అదే సంవత్సరంలో బారిష్టర్ డిగ్రీని కూడా పూర్తిచేసి, తర్కం, అర్థశాస్త్రాలను మరింత లోతుగా అధ్యయనం చేయడానికి జర్మనీలోని ‘బోన్’ విశ్వవిద్యాలయానికి వెళ్ళారు. కాని కేవలం మూడు నెలల కాలంలోనే స్వదేశానికి తిరిగి వచ్చారు.

1923, జూన్ నెలలో ఇండియాకు తిరిగి వచ్చిన డా॥ అంబేద్కర్ పరిపూర్ణమైన ధార్మికుడిగా స్వదేశంలోని సాంఘిక అసమానతలకు, కుల తత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాలని నిశ్చయించుకున్నారు. కుల చట్రాన్ని ఛేధించి, అంటరానితనం నుంచి దళితులను విముక్తులను చేయాలని సంకల్పించి, అనేక పోరాటాలను నడిపించారు. బ్రిటీష్ కాలంలో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని, పదవులను అణగారిన వర్గాల ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా వినియోగించారు. ఈ ఆశయసాధనలో భాగంగా పీడిత ప్రజల నాయకుడిగా, రాజ్యాంగ నిర్మాతగా, స్వతంత్ర భారతదేశ తొలి న్యాయశాఖ మంత్రిగా ఎన్నో సేవలందించి 1956 డిసెంబర్ 6న తుదిశ్వాస విడిచారు.

1. Annihilation of caste, 1936 (ఎన్‌హీలేషన్ ఆఫ్ క్యాస్ట్) కుల నిర్మూలన
2. Who were the shudras, 1946 (హు వర్ ది శూద్రాస్) శూద్రులంటే ఎవరు
3. Who were the Untouchables, 1948 (హు వర్ ది అనటచ్‌చబుల్స్) అస్పృశ్యులంటే ఎవరు

వీటితోపాటు డా॥ బి.ఆర్.అంబేద్కర్ మరణానంతరం ప్రచురించిన ప్రముఖ రచనలలో ముఖ్యమైనవి.

1. Rise and Fall of Indian women 1956 (రైజ్ అండ్ ఫాల్ ఆఫ్ ఇండియన్ వుమెన్) భారత మహిళల ఉత్థాన పతనం
2. Dr. Ambedkar on Buddhism 1982 బుద్ధిజంపై అంబేద్కర్ ఆలోచనలు

అదేవిధంగా డా॥ అంబేద్కర్ తన సామాజిక, రాజకీయ తాత్విక ఆలోచనల ద్వారా నిమ్న, అంటరాని కులాల వారిలో చైతన్యం తీసుకురావటానికి నడిపిన సైద్ధాంతిక కరదీపికల్లో "మూక్‌నాయక్" ప్రముఖమైంది. ఈ పత్రికనే 1927 తరవాత "బహిష్కృత భారత్" పేరుతో నడిపించారు.

డా॥ అంబేద్కర్ భారతదేశంలోని అణగారిన వర్గాల పురోభివృద్ధి కోసం స్థాపించి, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయ సహకారాలను అందించిన సంస్థలలో ముఖ్యమైనవి.

1. సిద్దార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్, 1946
2. మిలింద్ మహా విద్యాలయ 1951
3. సిద్దార్థ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఎకనామిక్స్ 1953
4. సిద్దార్థ కాలేజ్ ఆఫ్ లా 1956

అంతేకాకుండా, డా॥ అంబేద్కర్ భారతదేశంలోని అణగారిన చైతన్యానికి అనేక సంఘాలను, సంస్థలను, రాజకీయ పార్టీని స్థాపించారు. వాటిల్లో ముఖ్యమైనవి.

1. బహిష్కృత హితకారిణి సభ 1924
2. సమత సైనిక్‌దళ్ 1928
3. ఇండిపెండెంట్ లేబర్‌పార్టీ 1936
4. భారతీయ బౌద్ధమహాసభ, 1955
5. రిపబ్లిక్ పార్టీ 1956.

అదేవిధంగా డా॥ అంబేద్కర్‌కు సంబంధించిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పవిత్ర ప్రదేశాలలో ముఖ్యమైనవి.

1. జన్మభూమి ...... మౌ (కంటోన్‌మెంట్) మధ్యప్రదేశ్
2. క్రాంతి భూమి ...... మహద్
3. దీక్షభూమి ...... నాగ్‌పూర్
4. చైతన్య భూమి ...... చుపాటి (శివాజీపార్క్‌కు దగ్గరలో) బొంబాయి

డా॥ అంబేద్కర్ మూడున్నర దశాబ్దాల ప్రజాజీవన ప్రస్థానాన్ని అయిదు దశలుగా వర్గీకరించవచ్చు. అవి :

1. 1918-1928 ఈ దశలో డా॥ అంబేద్కర్ భారతావనిలోని అణగారిన వర్గాల ప్రయోజనాల పరిరక్షణకోసం న్యాయవాదిగా, ఒక సత్యాగ్రహిగా కృషిచేశారు.
2. 1928-1936 ఈ దశలో దళితులకు ప్రత్యేక నియోజకవర్గాల ఏర్పాటుకోసం పోరాటం చేశారు.

| | | |
|---|---|---|
| 3. | 1937-1946 | ఈ దశలో డా॥ అంబేద్కర్ అనేకరకాల ప్రభుత్వపరమైన అధికార పదవులను నిర్వహించి నిమ్న వర్గాల ప్రయోజనాలను సమకూర్చారు. |
| 4. | 1946-1950 | ఈ దశలో భారత రాజ్యాంగ రూపకల్పనకోసం అవిరళకృషి సల్పి, నవ ప్రజాస్వామ్య భారతదేశంలో "అభినవ మనువు"గా ఖ్యాతి గడించారు. |
| 5. | 1950-1956 | ఈ దశలో సనాతన సంప్రదాయాలకు, సాంఘిక అసమానతలకు ఆలవాలమైన హిందూమతాన్ని త్యజించి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలకు నిలయమైన బౌద్ధమత వ్యాప్తికి పాటుపడ్డారు. |

ఈవిధంగా డా॥ అంబేద్కర్ ప్రజ్ఞాపాటవాలు ఉన్న ఒక ప్రొఫెసర్‌గా, న్యాయవాదిగా, ప్రజాప్రతినిధిగా, రాజ్యాంగ నిర్మాతగా, కేంద్రమంత్రిగా, సంఘసంస్కర్తగా అన్నింటికంటే ముఖ్యంగా శతాబ్దాల తరబడి అణచివేతకు, దోపిడీకి, పీడనకు గురవుతున్న నిమ్న, దళితజాతుల విముక్తికోసం అవిశ్రాంతంగా తిరుగుబాటు చేసిన పోరాటయోధుడు. ఆయా వర్గాల సంక్షేమం పురోభివృద్ధికోసం రాజ్యాంగపరంగా పలురకాల ప్రయోజనాలను సమకూర్చిన ప్రజాబాంధవుడు. అందువల్ల భారతదేశం ప్రతిష్ఠాత్మకమైన "భారతరత్న" పురస్కారాన్ని అంబేద్కర్‌కు ప్రధానం చేసి, దేశ ప్రతిష్ఠను ఇనుమడింపచేసుకుంది.

## ప్రభావితం చేసిన పరిస్థితులు

డా॥ అంబేద్కర్, గొప్ప సామాజిక విప్లవకారుడుగా మారటానికి ఎన్నో అంశాలు, సంస్థలు వ్యవస్థలు, వ్యక్తులు దోహదపడ్డాయి. అంబేద్కర్ వ్యక్తిత్వాన్ని సంఘ సంస్కర్తగా అతని ఆలోచనలలను గౌతమబుద్ధుడు, కబీర్, జ్యోతిరావ్ పూలే వంటి మహనీయులు గణనీయంగా ప్రభావితం చేశారు. గౌతమబుద్ధుని బోధనల నుంచి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి భావాలు అంబేద్కర్‌ను ఆకర్షించాయి. కబీరు బోధన నుంచి హిందూమతం బలహీనతలను అంబేద్కర్ గ్రహించారు. ఈ సందర్భంగా మత దృక్పథం, ఆచరణలో సంస్కరణలను తీసుకురావడానికి ఉపయోగపడాలని గుర్తించారు.

జ్యోతిరావ్ పూలే ఆలోచనలతో స్ఫూర్తిపొందిన అంబేద్కర్ ఆయన గురించి వివరిస్తూ... "మనకు ఉన్న గొప్ప సంఘ సంస్కర్తలలో పూలే ఒకరని" ప్రశంసించారు. "ఆధునిక భారత దేశ గొప్ప శూద్రుడు పూలే అని, స్వాతంత్ర్యం కంటే సామాజిక ప్రజాస్వామ్యమే భారతదేశాన్ని కులవ్యవస్థనుంచి విముక్తి చేయగలదని బోధించిన పూలే భావనలను ముందుకు తీసుకెళ్ళటానికి అంబేద్కర్ ఎంతో శ్రమించారు.

హిందూ సామాజిక వ్యవస్థపై, కులవ్యవస్థపై హిందూమత గ్రంథాలపట్ల ఆయన తీసుకున్న వైఖరి, అంబేద్కర్‌కు పూర్వపు సంఘ సంస్కర్తలకు భిన్నంగా అంబేద్కర్‌ను నిలబెట్టింది. సమకాలీన సామాజిక, రాజకీయ పరిస్థితులను విశ్లేషించడానికి చరిత్రను కూడా ఒక సాధనంగా ఎంచుకున్న అంబేద్కర్ "శూద్రులంటే ఎవరు"? "అస్పృశ్యులంటే ఎవరు?" వంటి గ్రంథాలను రాసి, వారి దుస్థితికి గల చారిత్రక కారణాలను విమర్శనాత్మకంగా పటిష్టమైన దూరదృష్టితో శాస్త్రీయంగా విశ్లేషించారు.

## అంబేద్కర్ సామాజిక భావాలు

మహర్ అనే దళిత కులానికి చెందిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అగ్రవర్ణాల నుంచి ఎన్నో అవమానాలను, చీత్కారాలను ఎదుర్కొన్నారు. నిరంతరం వివక్షతో కూడిన వ్యవహారశైలిని అనుభవించారు. ఈ కారణంగా

దేశంలో పాతుకుపోయిన సంప్రదాయవాద సామాజిక వ్యవస్థను ఆసాంతం ప్రక్షాళన చేయాలని అంబేద్కర్ తన యుక్తవయస్సులోనే నిర్ణయించుకున్నారు. సమాజంలో విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టాలని భావించారు. బ్రాహ్మణత్వం, కులతత్వ పోకడలనుంచి, అలాగే పీడన, దోపిడీ, అణచివేతల నుంచి నిమ్నకులాల వారిని పరిరక్షించడానికి మహోద్యమం చేపట్టారు. ఈ ఉద్యమంలో దళితులందరూ (మహిళలతోసహా) పాలుపంచుకొని తమ హక్కులను, ఉనికిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. బాలగంగాధర్ తిలక్ చెప్పినట్లు దళితుల కోసం వేరే ఎవరో పోరాడవలసిన అవసరం లేదని, దళితులు తమను తాము కుల బంధనాల నుంచి విముక్తి చేసుకోవాలని అంబేద్కర్ సూచించారు. సామాజిక నిర్మాణం, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, నమ్మకాలను తీవ్రంగా ప్రతిఘటించాలని దళితులకు సూచించారు.

## అస్పృశ్యత

అస్పృశ్యత అంటే జన్మతః ఒక ప్రత్యేక కులం లేదా కుటుంబంలో జన్మించిన కొందరు వ్యక్తులు స్పృశించడం ద్వారా కలిగే అశుద్ధమని సంప్రదాయ సిద్ధాంతం చెబుతుంది. ఈ ఆచారం కేవలం హిందూ సమాజంలో మాత్రమే కనిపిస్తుంది. "అస్పృశ్యులు : వారు ఎవరు?" అనే గ్రంథంలో అంబేద్కర్ అస్పృశ్యత మూలాలను గురించి చర్చించారు. హిందూ సమాజం నాగరికమైన వ్యవస్థగా ఆయన గుర్తించలేదు. ఎందుకంటే హిందూ సమాజం మానవాళిలో భాగంగా ఉన్న విశాలమైన ప్రజానీకాన్ని శతాబ్దాల తరబడి అణచివేసి, ప్రధానస్రవంతికి దూరంగా ఉంచింది. అస్పృశ్యులను పీడించడమే కాకుండా (బానిసలుగా చూడడం) గ్రామాలకు దూరంగా నివాసాలు ఏర్పాటుచేసుకునేలా చర్యలు తీసుకుంది. ఫలితంగా వారు శతాబ్దాల తరబడి గ్రామాలకు వెలుపలే జీవిస్తున్నారని అంబేద్కర్ సిద్ధాంతీకరించారు.

## అంబేద్కర్ రాజనీతి భావాలు

అంబేద్కర్ మౌలికంగా రాజకీయ సిద్ధాంతవేత్త కాకపోయినా తన రచనలలో మాత్రం నిర్దిష్టమైన రాజకీయ, న్యాయపరమైన ఆలోచనలను అంతర్లీనంగా ప్రతిబింబించారు. ముఖ్యంగా, రాజ్యాంగసభ సమావేశాలలో ఆయన ఆయా అంశాలపై వెలిబుచ్చిన అభిప్రాయాలు అందుకు నిదర్శనం. రాజ్యం ఒక ముఖ్యమైన సాధనమని అంబేద్కర్ పరిగణించారు. రాజ్యం మూడు లక్ష్యాల సాధన కోసం కృషి చేయడానికి ఉనికిలో ఉంటుందని చెప్పారు. ఆ లక్ష్యాలు కింది విధంగా ఉన్నాయి.

1. రాజ్యానికి సంబంధించిన విధులే తొలి లక్ష్యంగా ఉంటుంది. పౌరుని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సుఖసంతోషాల పరిరక్షణ పవిత్ర లక్ష్యంగా ఉండాలని అంబేద్కర్ ఆకాంక్షించారు.
2. రాజ్యం న్యాయపరమైన విధులను కూడా నిర్వహించాలి. అలాగే సమాజంలో సాంఘిక, రాజకీయ, ఆర్థిక న్యాయాన్ని పాటించాలి. మత, కుల, వర్ణ తారతమ్యాలు లేకుండా చూడాలి. శాంతిభద్రతలను పరిరక్షించాలి.
3. చివరగా, రాజ్యం ప్రతిపౌరుని అమితమైన కాంక్ష, భయాందోళనలకు దూరంగా ఉంచాలి.

పై విధులను నిర్వహించడం ద్వారా రాజ్యం పౌరులకు సేవకుడిగా ఉంటుంది. అలాగే ప్రజాసంక్షేమానికి మూలసాధనంగా నిలుస్తుంది. ఆవిధంగా రాజ్యానికి ప్రజాస్వామిక స్వరూపం సమకూరుతుంది.

ప్రజాస్వామ్యంపై అంబేద్కర్ ఎనలేని విశ్వాసాన్ని కలిగిఉండేవారు. ఎందుకంటే ప్రజలకు రాజ్య నిర్వహణలో ప్రత్యక్ష భాగస్వామ్యం కల్పించడమే కాకుండా ఎలాంటి రక్తపాతం లేకుండా అసమానతలను రూపుమాపడానికి ప్రజాస్వామ్యం విస్తృతమైన అవకాశాలను అందిస్తుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో వారసత్వం ఉండదు. ఒకే వ్యక్తి చేతిలో అపరిమితమైన అధికారాలు సుదీర్ఘ కాలం ఉండజాలవు. ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రతినిధులే అధికార పగ్గాలను చేపడతారు.

ఈ సందర్భంగా డా॥ బి.ఆర్. అంబేద్కర్ ప్రజాస్వామ్యం కేవలం ప్రభుత్వరూపం మాత్రమే కాదని అదొక ఉమ్మడి జీవన విధానమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో వృత్తులను ఎన్నుకునే హక్కు అన్ని వర్గాల ప్రజలకు ఉండాలని, అలా జరగని పక్షంలో బానిసత్వమే రాజ్యమేలుతుందని చెప్పారు. సమానత్వం సాధ్యం కాకపోయినా పౌరులందరినీ సమానంగా చూడడం సాధ్యమేనని అంబేద్కర్ భావించారు. అయితే, ఇలాంటి ఆలోచనలను కులం, అంటరానితనం తిరస్కరిస్తాయి. కాబట్టి వాటిని అన్ని రూపాలలో నిషేధించాలని కోరారు.

సామాజిక న్యాయం లేని ప్రజాస్వామ్యం నిరర్థకమవుతుందని, ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేయాలంటే సమాజంలో ఎలాంటి ప్రస్ఫుటమైన అసమానతలు ఉండకూడదన్నారు. ఆర్థిక, సామాజిక న్యాయంలేని పక్షంలో రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సాధించలేమని అంబేద్కర్ పేర్కొన్నారు. సమాజంలో ప్రజల సంపద, ఆదాయ అసమానతలను తగ్గించాలని, పీడిత వర్గాలకు రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని కోరారు. రాజ్యాంగంలో కల్పించిన ప్రత్యేక హక్కులను భవిష్యత్తులో నిరాకరించే అవకాశం ఉండకూడదన్నారు. అయితే, ఇలాంటి హక్కులు స్వార్థ ప్రయోజనాలుగా లేదా శాశ్వత హక్కులుగా మారకూడదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, డా॥ బి.ఆర్.అంబేద్కర్ సంక్షేమ రాజ్య లక్ష్యాలు నెరవేరేంతవరకు పీడితవర్గాలకు రక్షణ అవసరమని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్యం నిరంతరం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తన స్వరూపాన్ని మార్చుకుంటూ ఉంటుంది. అంతేకాదు, ప్రజాస్వామ్యం రూపమేకాదు దాని ఉద్దేశాలు, లక్ష్యాలు కూడా మారుతూ ఉంటాయి. ఆధునిక ప్రజాస్వామ్య లక్ష్యం నిరంకుశ రాజరిక పాలనను అణచివేయడం కాదు; ప్రజాసంక్షేమానికి, సామాజిక న్యాయానికి పాటుపడటం అని డా॥ అంబేద్కర్ అభిప్రాయపడ్డారు.

డా॥ అంబేద్కర్ ప్రజాస్వామ్యాన్ని ఈవిధంగా నిర్వచించారు. నా దృష్టిలో "ప్రజల ఆర్థిక, సామాజిక జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పులను ఎలాంటి రక్తపాతమూ లేకుండా తెచ్చే ఒక ప్రభుత్వ రూపమూ, విధానమే ప్రజాస్వామ్యం". డా॥ అంబేద్కర్ మరింత వివరణ ఇస్తూ... ప్రభుత్వాన్ని నడిపే వ్యక్తుల సామాజిక, ఆర్థిక జీవనరంగాలలో మౌళికమార్పులు తేవడానికి ప్రజాస్వామ్యం అనుమతించినప్పుడు, ఆ మార్పులను ఎలాంటి రక్తపాతం లేకుండా ప్రజలు ఆమోదించే పరిస్థితి ఉన్నప్పుడు అక్కడ ప్రజాస్వామ్యం ఉన్నట్లు చెప్పగలను. ప్రజాస్వామ్యానికి అదే గీటురాయి. బహుశ ప్రజాస్వామ్యానికి ఇదే సర్వోత్తమ పరీక్ష కూడా అని అంబేద్కర్ వివరించాడు.

డా॥ అంబేద్కర్ ప్రజాస్వామ్యం విజయవంతంగా పనిచేయడానికి ఆరు ముఖ్యాంశాలు అనుకూలంగా ఉండాలన్నారు.

| | | |
|---|---|---|
| మొదటి అంశం | : | సమాజంలో అసమాతనలు ఉండకూడదు. |
| రెండవ అంశం | : | బాధ్యతాయుత ప్రతిపక్షం. ప్రతిపక్షమనేది ప్రజాస్వామ్యంలో ఖచ్చితంగా ఉండాలి. |
| మూడవ అంశం | : | చట్టం ముందు, పరిపాలన ముందు అందరూ సమానంగా పరిగణించబడటం. |
| నాలుగో అంశం | : | పాలకులు రాజ్యాంగపరమైన నీతిని పాటించడం. |
| అయిదో అంశం | : | ప్రజాస్వామ్యం పేరిట మైనారిటీల మీద నిరంకుశ పెత్తనం లేకుండా చూడడం. మెజారిటీ పక్ష ప్రభుత్వం మైనారిటీలకు భద్రతను కల్పించాలి. |

పార్లమెంటరీ తరహా ప్రజాస్వామ్యమే ప్రజలకు అనుకూలమైనదని అంబేద్కర్ సూచించారు. రాజ్యాంగ నిర్మాణ సభలో చర్చ సందర్భంగా మన రాజ్యాంగ స్వభావం ఎలా ఉండాలనే దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు బ్రిటీషు పద్ధతిని ఇష్టపడితే మరికొందరు అమెరికన్ పద్ధతిని అభిమానించారు. మరికొందరు ఈ రెండూ మనకు సరిపడవన్నారు. అయితే, సుదీర్ఘ చర్చల అనంతరం మెజారిటీ సభ్యులు బ్రిటన్‌లోని పార్లమెంటరీ ప్రభుత్వ తరహాయే మనదేశానికి నప్పుతుందనే అభిప్రాయానికి వచ్చారు.

అయితే, స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన అస్థిర, ప్రత్యేక పరిస్థితులను బట్టి అంబేద్కర్ అధ్యక్షతరహా ప్రభుత్వం వైపు మొగ్గుచూపారు. భారతదేశ స్వేచ్ఛ, సమగ్రతలను అధ్యక్షతరహా ప్రభుత్వం ఒక్కటే కాపాడగలదని నమ్మారు. ఈ విషయంలో అలెగ్జాండర్ పోప్ సిద్ధాంతాలతో ఏకీభవించారు. "అధికారం పాలకుడిని అవినీతిపరునిగా మారుస్తుంది. అపరిమిత అధికారం ఎల్లలులేని అవినీతికి దారితీస్తుంది" అనే పోప్ సిద్ధాంతం నేటికీ వర్తిస్తుంది. అధికారాల పంపిణీ, వికేంద్రీకరణ, కేంద్ర – రాష్ట్ర అధికారాల సమతుల్యం లాంటి అంశాలపై అంబేద్కర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు.

## పౌరహక్కులు – స్వేచ్ఛలు

పౌరులందరికీ సమానమైన హక్కులు, స్వేచ్ఛలను ప్రజాస్వామ్య ప్రభుత్వం కల్పించగలదని అంబేద్కర్ పేర్కొన్నారు. తన కష్టార్జితం, వృత్తి ద్వారా పొందే లాభాల నుంచి పౌరుడిని దూరం చేయకూడదని చెప్పారు. అంటే సామ్యవాద, కమ్యూనిస్టు పాలన దేశానికి మంచిది కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆస్తిహక్కు తప్పనిసరి అని పేర్కొన్నారు. అయితే సమాజంలోని అన్ని వర్గాలకు సామాజిక–ఆర్థిక–రాజకీయ ప్రయోజనాలు సమానంగా అందేలా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంటుందన్నారు. అప్పుడే ఆదర్శ రాజ్యం ఏర్పడగలదన్నారు. మౌలిక లేదా ప్రాథమిక హక్కులు పౌరులందరికీ సమానంగా కల్పించాలని చెప్పారు. ఈ హక్కులు ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించేలా ఉండాలన్నారు. అందుకే కొన్ని నిర్దిష్టమైన హక్కులను రాజ్యాంగంలో పౌరుల ప్రాథమిక హక్కులుగా చేర్చారు. తన హక్కులకు భంగం కలిగితే పౌరుడు న్యాయస్థానాలను ఆశ్రయించేలా రాజ్యాంగంలో కొన్ని న్యాయపరమైన అంశాలను చేర్చారు. ఇలాంటి ప్రత్యేక హక్కు ఎంతో కీలకమైంది, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది. ఈ హక్కులేనిదే మిగతా ప్రాథమిక హక్కులు కూడా నిర్వీర్యం అవుతాయని అంబేద్కర్ బలంగా నమ్మారు. ప్రాథమిక హక్కులు ప్రజాస్వామ్యానికి ప్రతీకాత్మ అని ఆయన పరిగణించారు.

## సమాజంలోని వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు

దేశ పౌరులందరికీ ఎలాంటి వివక్ష లేకుండా సమానమైన హక్కులను కల్పించడమే కాకుండా సామాజిక న్యాయం కోసం కొన్ని ప్రత్యేకమైన సదుపాయాలను కూడా అందించాలని అంబేద్కర్ సూచించారు. ఆ మేరకు సమాజంలోని వెనుకబడిన తరగతులకు రాజ్యాంగంలో విద్య, ఉపాధిల విషయమై రిజర్వేషన్లు ప్రవేశపెట్టారు. చారిత్రకంగా, సాంఘికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా ఎంతో వెనకబడి ఉన్న షెడ్యూల్డు కులాలు, తెగలకు ఈ రిజర్వేషన్లను వర్తింపచేశారు. అలాగే ఇతర సామాజిక, ఆర్థికంగా వెనుకబడిన పౌరులకు ప్రత్యేక సదుపాయాలను కల్పించారు. ఈ వర్గాలు ప్రధాన స్రవంతి సమాజానికి ఎప్పుడూ దూరంగా ఉండేవి. సమాజంలో వీరు అంతర్భాగం కావడానికి రిజర్వేషన్లు దోహదపడగలవని అంబేద్కర్ భావించారు. రాజ్యం ఈ వర్గాలకు అండగా నిలుస్తూ వాటి సంక్షేమానికి పాటుపడాలని, రిజర్వేషన్లు నిర్దిష్టంగా అమలుచేయాలని, అవి సాధారణ సామాజిక స్థాయికి చేరుకునే వరకు కొన్ని ప్రత్యేకమైన కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి అమలుచేయాలని, అప్పుడే వెనుకబడిన తరగతులవారు ఇతర పౌరులతో సమానంగా తమ హక్కులు, స్వేచ్ఛలను అనుభవించగలరని అంబేద్కర్ ప్రగాఢంగా నమ్మారు.

## ముగింపు

తన జీవిత కాలంలో దేశం సామాజిక, రాజకీయ నిర్మాణంలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ సంక్రమణాన్ని సమగ్రంగా తీసుకురావడానికి అంబేద్కర్ కృషి చేశారు. ఈ కృషిలో ఆయన చాలావరకు విజయం సాధించారు. అంటరానితనం నిర్మూలనకు, దళితుల సమస్యల పరిష్కారానికి తన జీవితాన్ని అంకితం చేశారు. నౌరోజీ, రనడే, గోఖలే లాంటి తొలి జాతీయవాద నాయకుల అడుగుజాడలలో నడుస్తూ ఆయన సంఘ సంస్కరణకు ప్రాధాన్యత నిచ్చారు. రాజకీయ స్వాతంత్ర్యాన్ని రెండవ ప్రాధాన్యతాంశంగా భావించారు. "ముందు సంస్కరణలు – ఆతరువాతే స్వాతంత్ర్యం" అనే నినాదంతో ముందుకుసాగారు. అలాగే సమాజంలో మహిళల స్థాయిని పెంచడానికి విశేషంగా కృషి చేశారు. మత, కులాలకు అతీతంగా దేశంలోని మహిళలందరూ దళిత వర్గం కిందికే వస్తారని పేర్కొన్నారు. బ్రాహ్మణిలు సమాజంలో మహిళలు దళితులకంటే ఎక్కువ స్థాయిలో దోపిడీ, పీడన, అణచివేతకు గురవుతున్నారని స్పష్టం చేశారు. హిందూ కోడ్ బిల్ ద్వారా మహిళల స్థితిని మెరుగుపరచడానికి చాలా కృషి చేశారు. తన జీవితకాలంలో హిందూ సమాజంలో సంస్కరణలు తీసుకురావడంలో విఫలమైన అంబేద్కర్ తీవ్ర నిరాశ నిస్పృహలతో ఆ మతాన్ని త్యజించి బౌద్ధాన్ని స్వీకరించారు. దళితులు కూడా బౌద్ధాన్ని స్వీకరించాలని పిలుపునిచ్చారు. ఏది ఏమైనప్పటికీ దేశ చరిత్రలో అందరూ గర్వించదగిన సంఘసంస్కర్తలు, న్యాయకోవిదులు, రాజ్యాంగ నిర్మాతలలో అంబేద్కర్ అగ్రగణ్యులుగా నిలిచిపోయారు. రాబోయే తరాలు కూడా ఆయన చేసిన కృషిని, సేవలను గుర్తిస్తారు. 'భారతరత్న' అనే బిరుదు మరణానంతరం లభించినా అంబేద్కర్ తన జీవితకాలంలోనే జాతి రత్నంగా వెలుగొందారు.

# 4. కొత్తపల్లి జయశంకర్

తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుపొందిన ప్రొఫెసర్‌కొత్తపల్లి జయశంకర్ (ఆగష్టు 6, 1934 – జూన్ 21, 2011) వరంగల్ జిల్లా ఆత్మకూరు (వరంగల్ జిల్లా) మండలం పెద్దాపూర్ (ఆత్మకూరు) గ్రామశివారు అక్కంపేటలో జన్మించారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి అజన్మ బ్రహ్మచారిగా జీవించారు. ఆర్థికశాస్త్రంలో పీహెచ్‌డి పట్టా పొంది, ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రార్‌గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ – ఛాన్సలర్ వరకు ఉన్నత పదవులు పొందారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కె. చంద్రశేఖరరావుకు సలహాదారుగా, మార్గదర్శిగా వెన్నంటి నిలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని తరుచుగా చెప్పే జయశంకర్ 2011, జూన్ 21న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించారు.

### బాల్యం

1934, ఆగష్టు6న వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేటలో జయశంకర్ జన్మించాడు. తల్లి మహాలక్ష్మి, తండ్రి లక్ష్మీకాంత్‌రావు. ఆయనకు ముగ్గురు అన్నదమ్ములు, ముగ్గురు అన్నదమ్ములు, ముగ్గురు అక్కచెల్లెళ్ళు ఉన్నారు. జయశంకర్ తల్లిదండ్రులకు రెండో సంతానం. సొంత కుటుంబాన్ని నిర్మించుకోకుండా తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకింతం చేసి అజన్మ బ్రహ్మచారిగా మిగిలిపోయాడు.

### ఉద్యోగ జీవితం

బెనారస్, అలీగఢ్ విశ్వవిద్యాలయాలనుంచి ఆర్థికశాస్త్రంలో పట్టా అందుకున్న జయశంకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేశాడు. 1975నుంచి 1979 వరకు వరంగల్ సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు. 1979 నుంచి 1981 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, 1982 నుంచి 1991 వరకు సీఫెల్ రిజిస్ట్రార్‌గా, 1991 నుంచి 1994 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేశాడు.

### అధ్యాపకుడిగా

అధ్యాపకుడిగా ఆయన ఎంతో మందికి మార్గనిర్దేశం చేశారు. వృత్తిపట్ల నిబద్ధతను, తెలంగాణ ఉద్యమం పట్ల చిత్తశుద్ధిని వారిలో నూరిపోశారు. ఎమర్జెన్సీ కాలంలో ఆయన సీ.కే.ఎం కళాశాలకు ప్రిన్సిపల్‌గా పనిచేశారు. సీ.కే.ఎం కళాశాల అంటేనే జిల్లాలో విప్లవ విద్యార్థి ఉద్యమానికి కేంద్రంగా అప్పట్లో పేరుండేది. విప్లవకవి వరవరరావు లాంటి ఆ కళాశాల అధ్యాపకుల్ని ఆయన నిర్బంధం నుంచి కాపాడారు. ఆయన

అధ్యాపకుడిగా హన్మకొండలోని మల్టీపర్పస్ స్కూల్లో మొదట తెలుగు బోధించారు. ఒక అధ్యాపకున్ని విద్యార్థులు గుర్తుపెట్టుకోవడం సర్వసాధారణమే కానీ ఒక అధ్యాపకుడే తన విద్యార్థుల్ని గుర్తుపెట్టుకొని పేరుపెట్టి పిలవడం ఒక్క జయశంకర్ సార్‌కే సాధ్యం అంటూ ఆయనకు తనకు 35 ఏళ్ళ అనుబంధం ఉందని, ప్రముఖ సాహితీవేత్త రామశాస్త్రి అన్నారు. జయశంకర్ విద్యార్థుల్లో అనేక మంది దేశవిదేశాల్లో ప్రస్తుతం ప్రముఖ స్థానంలో ఉన్నారు. వీరిలో కేయూ మాజీ ప్రొఫెసర్ ఎన్. లింగమూర్తి, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, ప్రొఫెసర్ కే. సీతారామావు తదితరులు అనేక మందికి ఆదర్శగురువు జయశంకర్.

### తెలంగాణా ఉద్యమంలో

1969 తెలంగాణా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. 1952లో జయశంకర్ నాన్ ముల్కీ ఆద్యమంలో, సాంబార్, ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నాడు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకుడిగా ఆయన 1954లో ఫజల్ అలీ కమిషన్‌కు నివేదిక ఇచ్చాడు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఆయన పుస్తకాలు రాశాడు. తెలంగాణలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేశాడు. జయశంకర్ తన ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశాడు. అబ్ తొ ఏక్ హీ ఖ్వాయిష్ హై, వొ తెలంగాణ దేఖ్‌నా ఔర్ మర్‌జానా' (ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలి. తర్వాత మరణించాలి) అని అనేవాడు.

తెలంగాణ ఉద్యమాన్ని గల్లీ నుంచి ఢిల్లీదాకా, ఢిల్లీ నుంచి అమెరికా దాకా వ్యాప్తిచేయడంలో ఆయన పాత్ర మరవలేనిది. జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతోన్న అన్యాయాల పట్ల, అసమానతల పట్ల తీవ్రంగా పోరాటం చేశారు. 1952 నాన్ ముల్కీ ఉద్యమంలోకి ఉరికి ఆనాటి నుంచి సమరశీల పాత్రను పోషించారు. ఎవరూ మాట్లాడటానికి సాహసించని కాలంలోనే 1954 విశాలాంధ్ర ప్రతిపాదనను ఎండగట్టిన ధీశాలి జయశంకర్. విశాలాంధ్ర ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మొదటి ఎస్సార్సీ కమిషన్ ముందు హాజరై తెలంగాణ వాణిని బలంగా వినిపించిన అపర మేధావి కొత్తపల్లి జయశంకర్. అధ్యాపకునిగా, పరిశోధకుడిగా ఆయన ఏం చేసినా తెలంగాణ కోణంలోనే నిత్యం ఆలోచించి ఆచరించే మహనీయుడు. తెలంగాణ డిమాండ్‌ను 1969నుంచి సునిశితంగా అధ్యయనం చేసి, విశ్లేషిస్తూ ప్రతీరోజూ రచనలు చేసిన అక్షరయాత్రికుడు ఆయన.

తెలంగాణలోని ప్రతీపల్లె ఆయన మాటతో పోరాట స్ఫూర్తి అందుకున్నది. ఆయన తిరగని ప్రాంతం లేదు. తెలంగాణ విషయంలో ఆయన చెప్పని సత్యం లేదు. జాతీయ, అంతర్జాతీయ వేదికలమీద, విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థల సభలో, సమావేశాల్లో తెలంగాణ రణనినాదాన్ని వినిపించిన పోరాట శీలి.

## చివరిమాటలు .... భవిష్యత్ తెలంగాణ

భవిష్యత్తు తెలంగాణలో అభివృద్ధి చాలా శ్రీఘ్రంగా జరుగుతుంది. నీళ్ళలో మన వాటా తేలిన తర్వాత జలవనరుల విషయంలో స్వేచ్ఛ ఉంటుంది. స్వయంపాలనలో శాసిస్తాం... ఇతరుల పాలనలో యాచిస్తున్నాం. పెద్ద ప్రాజెక్టుల సంగతి కాసేపు పక్కన పెడితే... నిజాం కాలంనాటికే తెలంగాణ ప్రాంతంలో గొలుసు చెరువులు చాలా ఉండేవి. ఉద్దేశ పూర్వకంగానే వాటిని నాశనం చేశారు. తెలంగాణ వస్తే మొదటగా ఈ చెరువులను పునరుద్ధరించాలి. అన్నీ సాధ్యం కాకపోవచ్చు... అయినా వీటిని బాగుచేస్తే ... గ్రామీణ వ్యవస్థ సస్యశ్యామలం అవుతుంది. ఇక నిజాం కాలంలో విద్య, వైద్యం రెండూ ఉచితమే... అయితే వీటన్నింటిని పాలకులు నాశనం చేశారు. అభివృద్ధి అంటారు కానీ వాళ్ళు ఇక్కడ ఒక్క ఆసుపత్రినిగానీ, కాలేజీనిగానీ కట్టారా? ముఖ్యంగా వనరుల విషయంలో, తెలంగాణకు జరిగిన నష్టాన్ని ఆయన బాధాతప్త హృదయంతో చెప్పేవారు. ఇక మన భాషను, యాసను ఎగతాళి చేసినవారిని ఎండగుతూనే... భవిష్యత్ తెలంగాణను గొప్పగా ఊహించేవారు. ఆ సంగతులు ఆయన మాటల్లోనే...

1952లో విశాలాంధ్రకు వ్యతిరేకంగా పోరాటం మొదలయ్యింది. నేనప్పుడు వరంగల్‌లో ఇంటర్ చదువుతున్నా. 1948 -52 ప్రాంతంలో ఉద్యోగాల కోసం వలస వచ్చారు. తెలంగాణలో ఇంగ్లీషు రాదు. .. కమ్యూనిస్టు భావాలు చాలా ఉంటాయని కేంద్రం ఆంధ్ర ఉద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చింది. ఇక్కడికొచ్చిన వాళ్ళు మనల్ని బాగా ఎక్కిరించే వాళ్ళు. అయ్యదేవర కాళేశ్వరరావు అనే ఆయనను పిలిపించి వరంగల్‌లో ఉపన్యాసం పెట్టించారు. ఆయన మనల్ని బాగా వెక్కిరిస్తే... మేం ప్రతిఘటించినం. కలెక్టర్లు, పోలీసులు కూడా వాళ్లే కాబట్టి లాఠీచార్జీ జరిపించారు. అప్పుడు నేను కూడా లాఠీదెబ్బలు తిన్నా. అప్పటికే తెలంగాణ ఎన్జీవోస్, టీచర్లు ఆంధ్రోళ్ళ వల్ల అవమానాలకు గురవుతూ... హైదరాబాద్‌లో ఓ సమావేశం ఏర్పాటు చేశారు. వరంగల్ నుంచి నేను కూడా బయలుదేరినా... మా బస్సు భువనగిరిలో ఫెయిలయ్యింది. ఈలోపు అఫ్జల్‌గంజ్‌లో కాల్పులు జరిగి ఏడుగురు విద్యార్థులు చనిపోయారు. ఒకవేళ ఆ సమయానికి నేను కూడా అక్కడికి చేరుంటే... అమరవీరుల జాబితాలో చేరే వాణ్ణి. ఆ అదృష్టం నాకు దక్కలేదు. బతికి ఏం చేశానయ్యా అంటే... ఈ ఘోరాలన్నీ చూడాల్సి వచ్చింది. భాషను... యాసను ఎగతాళి చేశారు...

తెలంగాణ భాషను చాలా ఎగతాళి చేశారు. 1970లో జంధ్యాల పాపయ్య శాస్త్రి అనే పెద్ద కవి తెలంగాణ ఏర్పడితే దక్షిణ పాకిస్తాన్ అవుతుంది అని రాశాడు. అంతేకాదు... తెలుగు భాషను భ్రష్టు పట్టిస్తున్నారు. తురకల భాష మీది.. తౌరక్యాంధ్రం అన్నారు. భాషకు మతం ఉండదు. మతానికి భాష ఉంటుంది. మనది తురకల భాష ఎలా అయ్యింది? నేను ఉర్దూలోనే చదువుకున్నా. సీమాంధ్రులు రాసిన కవిత్వంలో బేజార్, పంకా, జెండా పదాలన్నీ ఉర్దూనే కదా... ఇక శ్రీశ్రీ కూడా ఎన్నో ఉర్దూ పదాలను ఉపయోగించి భాషను సుసంపన్నం చేశాడు. అయితే విషాదం ఏంటంటే... సీమాంధ్రులకు వాళ్ళు వాడినది ఉర్దూ పదం అనేది వాళ్ళకే తెలియదు. అది తెలియదనేది కూడా వాళ్ళకు తెలియదు. అందుకే ఎవడి భాష వాడికే ప్రామాణికం.

## 1956 నవంబర్ 1 : ఒక రాచపుండు

మృత్యువు క్యాన్సర్ రూపంలో అతడ్ని దహించింది. కానీ సమైక్యాంధ్రలో బతుకు అతడ్ని అనుక్షణం రాచపుండై వేధించింది. జయశంకర్ ఓ సామాన్యమైన వ్యక్తి. సగటు తెలంగాణ బిడ్డ. కానీ మహోన్నతమైన వ్యక్తిగా ఎదిగినాడంటే, మలి తెలంగాణ ఉద్యమానికి ముగ్గుపోసిన దీర్ఘదర్శి అయినాడంటే అది ఉట్టిగ జరగలేదు. అది ఎంతటి సంఘర్షణతో కూడుకున్నదో తన సన్నిహితులకు తెలుసు. ఇవ్వాళ నలుగురికీ తెలువాల్సిందీ ఒకటుంది. అది క్యాన్సర్ అని!

అవును. ఆయన క్యాన్సర్‌తో పోయిండు. తెలంగాణంలో మనం రాచపుండు అంటమే అది ఆయన్ని పట్టిపీడించింది. ఇవ్వాళా నిన్నకాదు. ఆ సంగతి చెప్పడానికి ముందు ఒక ఘట్టాన్ని చెప్పకోవాల్సిందే. అది నిజాం స్టేట్. తనకు టీచర్‌గా అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేతికందిన సందర్భం. అందరి లెక్కనే సంతోషంతో నలుగురికి చెప్పుకున్నడు. మురిసిపోయిండు. తీరా ఉద్యోగంలో చేరేందుకు వెళ్లేటప్పటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. సరేలే అనుకుని అట్లనే అపాయింట్‌మెంట్ ఆర్డర్ చేత పట్టుకుని జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వడానికి వెళితే, తన స్కేల్ మారిందని తెలిసి విస్తుపోయిండు. నిజమే మరి. ఆంధ్రప్రదేశ్ అవతరణతో మన జీతాల్ని తగ్గించిండ్రు. 'ఎంటిది?' అని అడిగితే, 'మిస్టర్ జయశంకర్. ఇది మీ నిజాం గవర్నమెంట్ కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. మైండిట్...' అన్నరట. దాంతో జయశంకర్ మరింత ఖంగుతిన్నడు.

ఇంకేమన్నరంటే, 'ఇష్టముంటే చేయి లేకపోతే లేదని' అమర్యాదగా చెప్పించ్రట. దాంతో ఆయన అహందెబ్బతింది. ఆత్మగౌరవం భంగపడ్డది. నిజానికి ఇంకా తాను అన్యాయం అని కూడా అనలే. కానీ వాళ్ళ తీరు అట్ల ఉండింది. ఒక పురుగును చూసినట్టు చూసి, అతణ్ణి హేళన చేసింద్రు. అప్పుడు తన కళు ్ళ విచ్చుకున్నాయి. ఇదేంది. మనని బతిమాలి ఉమ్మడిగా ఉందామని ఒప్పించిన వాళ్ళేనా వీళ్ళు. మన గడ్డమీద మననే పరాయివాళ్ళుగా చూడడం ఏమిటీ అని జయశంకర్ విస్తుపోయిండు. వాళ్ళ జీతాలతో సమానంగా మన జీతాలు తగ్గించినందుకు సంజాయిషీ ఇవ్వవలసింది పోయి తలబిరుసుతో' ఉద్యోగం చేస్తే చేయి... లేకపోతే' అని అనడం యువకుడైన జయశంకర్‌ను తీవ్ర మనస్తాపానికి గురిచేసింది. తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినట్టయింది. తెలంగాణ బిడ్డగా మొట్టమొదటి సారిగా జయశంకర్ తీవ్రంగా బాధకు గురైంది ఇక్కడే. ఇక, అదీ మొదలు, ఆయన ఎన్నో చూసిండు.

ఆంధ్రప్రదేశ్ అవతరణ వల్ల తెలంగాణ బిడ్డలు ఇంకెన్ని విధాలు మోసపోతరో ఆ రోజే తనకు అర్థమైంది. ప్రశ్నిస్తే మననెట్లా హేళన చేస్తరో, దెబ్బలు ఆరోజే ఆయనకు తేటతెల్లమయింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మన పైసలు మనం వాడుకుంటాం. అన్నిటికన్నా ముఖ్యమైనది ఏంటంటే... ఈ ప్రాంతంలో ప్రజాస్వామిక సంస్కృతిని ధ్వంసం చేశాయి ప్రభుత్వాలు, ఉద్యమాలను అణచివేసి బీభత్సం సృష్టించారు. అందుకే ప్రజాస్వామిక సంస్కృతి తిరిగి స్థాపించబడాలి. అది జరిగితేనే మిగతా కార్యక్రమాలు జరుగుతాయి. తెలంగాణలో ఇవన్నీ సాధ్యమే... ఎందుకంటే తెలంగాణ ప్రజల్లో ఆ చైతన్యం ఉంది కనుక.

## నమస్తే తెలంగాణ పత్రిక ఆవిష్కరణకు సరిగ్గా వారం రోజుల ముందు...

తెలంగాణ సాధికారిక స్వరం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఇంటర్వ్యూ ప్రారంభసంచికలో వేయాలని 'నమస్తే తెలంగాణ' ఎడిటర్ అల్లం నారాయణ అనుకొన్నాడు. జయశంకర్ సార్‌తో మాట్లాడటమంటే.. సుదీర్ఘ తెలంగాణ ఉద్యమాన్ని గురించి తెలుసుకోవడమే. ఆ ఉత్సాహంతోనే సార్‌కు ఫోన్లు చేసి విసిగించాను. 'ఇప్పుడు నా ఆరోగ్యం బాగాలేదు. అయినా ఇప్పుడు నా ఇంటర్వ్యూ ఎందుకయ్యా చూద్దాంలే ... 'అంటూ సున్నింతంగా తిరస్కరించినప్పటికీ ... చివరికి ఒప్పుకున్నారు.

హబ్సీగూడ రోడ్ నెంబర్ 5లో ఉన్న 'కాంక్రీట్ హార్మొని' అపార్ట్‌మెంట్‌లోని ఐదవ అంతస్థులోని పెంట్‌హౌస్... అక్కడినుంచి చూస్తే ఉద్యమాల పోరాటాల గడ్డ ఉస్మానియా యూనివర్శిటీ గొప్పగా కనిపిస్తోంది. అదేమాట సార్‌తో అంటే.. 'ఉస్మానియాను తలుచుకుంటే తెలంగాణ వాడినైనందుకు గర్వంతో ఛాతి ఉబ్బుతుంది. ఎన్నెన్ని పోరాటాలకు, ఆరాటాలకు అది వేదికైంది చెప్పు. అందరికీ ఉస్మానియా యూనివర్శిటీ అంటే చెట్లు కనిపిస్తాయి... కానీ మొన్నటికి మొన్న తెలంగాణ కోసం అమరులైన అనేకమంది విద్యార్థులు ఆ చెట్ల సాక్షిగా నాకు కళ్ళముందే కదులుతు కనిపిస్తరు. దుఃఖమొస్తది... అయితే నాలుగుకోట్ల తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచే అదృష్టం ఎంతమందికి దక్కుతుంది. వాళ్లకు మరణం లేదు... అదే ఉస్మానియాలో డిసెంబర్ 9 ప్రకటన తర్వాత పిల్లలు జరుపుకున్న సంబరం నా జీవితంలో మర్చిపోలేని గొప్ప జ్ఞాపకం. కానీ వారి భవిష్యత్ కలలతో ఆడుకున్నది ఎవరు? వారి ఆశలతో ఆడుకుని... వారి శవాలపై ప్రమాణం చేసిన రాజకీయనాయకులకు వాళ్ల ఉసురు తగలకుండా పోతుందా' అంటూ భావోద్వేగానికి గురయ్యారు.

### అస్తమయం

మీరు చేయాల్సింది మీరు చేశారు. ఈ సమయంలో నేను ఇక్కడ ఇక ఉండలేను. నేను వరంగల్‌కే పోతాను. నన్ను పంపండి' అంటూ ఆయన పుట్టిన గడ్డమీద మమకారంతో వారం రోజుల క్రితం ఇక్కడికి వచ్చారు. ఇంట్లోనే వైద్యులు ఆయనకు అన్నిరకాల వైద్యసేవలు అందించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి ఆయన పల్స్‌రేట్ పడిపోవడంతో ఆక్సిజన్ అందించారు.

మా వనరులు మాకున్నాయి. మా వనరులపై మాకు అధికారం కావాలి. యాచక దశనుంచి శాసించేదశకు తెలంగాణ రావాలి! మా తెలంగాణ మాగ్గావాలి...!! యాభైఏళ్ళుగా ఇదే ఆకాంక్ష... ఇదే శ్వాస... ఇదే లక్ష్యం... ఇదే జీవితం... ఇందులోనే మరణం! ఉద్యమాన్ని 21-6-2011 మంగళవారం ఉదయం 11.30 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు.

### సంతాపం

ప్రొఫెసర్ జయశంకర్ మృతికి మూడురోజులు సంతాపదినాలుగా పాటించాలని తెలంగాణ ప్రజాఃసస్త్రంఘాలు, అన్ని జేఏసీలకు తెలంగాణ జేఏసి ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ సూచించారు. మంగళవారం

ఆయన హన్మకొండలో జయశంకర్ పార్థివ శరీరాన్ని సందర్శించి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ ప్రాంతంలో నల్లజెండాలు ఎగురవేయాలని, కొవ్వొత్తులను వెలిగించి ప్రదర్శనలు నిర్వహించాలని ఆయన కోరారు. ఎన్ని రకాలుగా సంతాపం ప్రకటించాలో అన్ని రకాలుగా సంతాపం ప్రకటించాలని ఆయన సూచించారు.

## అక్కడికి చేరుంటే... అమరవీరుణ్ణి అయ్యేవాణ్ణి

తరతరాలుగా తెలంగాణకు పాలకులు, మీడియా చేస్తున్న అన్యాయాలు, అక్రమాల గురించి గంటల తరబడి వివరించే సత్తా, సాధికారత ప్రొఫెసర్ జయశంకర్ సొంతం. నీళ్ళు, ఉపాధి, విద్య, సంస్కృతి... ఇలా ఏ అంశాన్ని తీసుకున్నా అందులోని సంగతి ఆయనకు ఆనాడే సుస్పష్టమైంది. ఇవ్వాళ ఆయన క్యాన్సర్‌తో మరణించిండంటే అది చిన్న విషయం. రాష్ట్రంలో అడుగడుగునా అన్యాయాలు, అణచివేతలు, లాఠీలు, తూటాలు, చివరకు నిన్న మొన్నటి పిల్లలు తనముందే పిట్టల్లా రాలిపడుతుంటే, ఇంతటి సంక్షోభాన్ని చూస్తూ చూస్తూ ఆయన ఇంతకాలం బతికిండంటే అది ఓ నరకయాతన.

నిన్న మొన్న వచ్చిన క్యాన్సర్ తన శరీరాన్ని దహించివుండవచ్చుగాక, కానీ నాటినుంచే తన మనసును సలసల మరిగించిన పాలకుల అనైతిక పరిపాలన అతణ్ణి తీవ్రంగా కృంగదీసింది. ఆ పరితాపం, నిస్సహాయత నుంచే ఆయన ఒక అనివార్యమైన కలగన్నాడు. అదే 'ప్రత్యేక తెలంగాణ'. ఇందుకోసం ఆయన 'సిద్ధాంతకర్త'గా తన మేధస్సుకు పదునుపెట్టుకోవాల్సి వచ్చింది. సమకాలీన రాజకీయాలను ఔపోసన పట్టేలా, 'భౌగోళిక తెలంగాణ'కు మద్ధతుగా నిలబడేలా చేసింది. తెలంగాణ ఏర్పాటువైపు అన్ని రాజకీయపార్టీలూ ఐక్యంగా కదిలేందుకు అహర్నిశలూ శ్రమించేలా చేసింది. స్వయంగా ఉద్యమకారుడూ కావాల్సి వచ్చింది. కాళోజీ 'నా గొడవ'ను 'తెలంగాణ గొడవ'గా మలిచేలా చేసింది. 'తెలంగాణ రాష్ట్రం – ఒక డిమాండ్' అన్న పుస్తకమే తన బతుకుపుస్తకంగా మారేలా చేసింది. నిజానికి జయశంకర్ చాలా మామూలుగా మనిషి. ఎటువంటి వ్యధాభరిత ప్రయాణం లేకుండా హాయిగా, నిమ్మలంగా బతకాల్సిన ఓ మామూలు మనిషి. కానీ, ఇయ్యాళ తనకోసం యావత్ తెలంగాణ కన్నీరుకార్చే మనిషయ్యిండంటే – అందుకు కారణం దశాబ్దాల నుండి తెలంగాణ కోసం సుదీర్ఘంగా శ్రమించి జనాన్ని కదిలించి, తెలంగాణ ప్రజల కలలను సాకారం కావడానికి తోవచూపిన మార్గదర్శి. అసమానతలనుండి, అన్యాయాలనుండి, అవినీతినుండి, అగౌరవంనుండి, దూరం జరిగి సగర్వంగా తెలంగాణా ప్రజలు తలెత్తుకునేలా చేయడానికి మనసా వాచా కర్మణా కృషిచేసిన త్యాగమూర్తి జయశంకర్‌గారు. తెలుగువాళ్ళు భౌగోళికంగా విడిపోయినా, అన్నదమ్ముల్లా కలిసిఉండాలని ఆకాంక్షించిన హితైషి. విడిపోయి అభివృద్ధి చెందుదాం అని చాటిచెప్పిన దార్శికుడు.

# 5. జయప్రకాశ్ నారాయణ్ (1902-1979)

## పరిచయం

భారత గడ్డపై జన్మించిన అతికొద్దిమంది మహోన్నతులలో జయప్రకాశ్ నారాయణ్ ఒకరు. తాను యుక్తవయస్సులో ఉండగా మహోజ్వలంగా జరుగుతున్న జాతీయోద్యమంలో చేరాడు. జవహర్‌లాల్ నెహ్రూ, అబ్దుల్‌కలాం ఆజాద్ వంటి జాతీయ నాయకుల ఉపన్యాసాల ప్రేరణతో నేను జాతీయోద్యమంలో చేరానని ఆయన చాలాసార్లు చెప్పుకున్నారు. ఆతరువాత స్వతంత్ర భారతదేశంలో సంపూర్ణ విప్లవ ఆవశ్యకతను గుర్తించి దాని సాధనకోసం సైద్ధాంతిక పునాదులను నిర్మించిన గొప్ప జాతీయయోధుడు జయప్రకాశ్ నారాయణ్. అధికారయుత రాజకీయాలకు లంచగొండితనానికి, ఆశ్రయ రాజకీయాలకు, రాజకీయ అవినీతికి, ఆశ్రిత పక్షపాతాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి. తాను నమ్మిన భావాలకోసం తన జీవిత చరమాంకంలో సైతం జైలు జీవితం గడిపిన ప్రజానాయకుడు.

జయప్రకాశ్ నారాయణ్ రాజకీయ భావాలు స్థిరమైనవికావు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తన రాజకీయ భావాలను మార్చుకుంటూ ప్రజాబాహుళ్యపు సమస్యలపై పోరాడిన వ్యక్తి జయప్రకాశ్ నారాయణ్. ఆయన రాజకీయ భావాలు మార్క్సిస్టు సామ్యవాదం నుంచి ప్రజాస్వామ్య సామ్యవాదంవైపు, ప్రజాస్వామ్య సామ్యవాదంనుంచి సర్వోదయంవైపు, సర్వోదయం నుంచి సంపూర్ణ విప్లవం దిశగా రూపాంతరం చెందాయి. సమకాలీన సమస్యల అవగాహన, వాటి పరిష్కారంకోసం పోరాడేతత్వం భారతదేశంలోని అశేష ప్రజానీకం చేత "లోక్‌నాయక్"గా జయప్రకాశ్ నారాయణ్ కీర్తించబడ్డాడు. అందుకే జయప్రకాశ్‌కు రాజకీయతాత్వికుడనే కాకుండా గొప్ప భావాలుగల జాతీయనాయకుడుగా గుర్తిస్తారు. ఆయన దృష్టిలో, కొత్త సిద్ధాంతాలను ప్రతిపాదించడం కంటే, మానవాళికి కావలసిన తిండి, స్వాతంత్ర్యం, సామాజిక న్యాయాలను అందివ్వటమే లక్ష్యంగా పనిచేయాలన్నాడు. మానవాళి ఎదుర్కొంటున్న సమస్త సమస్యల పరిష్కారానికి పనికివచ్చే ఏ సిద్ధాంతమైనా మంచిదేననేది ఆయన అభిప్రాయం. అందుకే కొందరు జయప్రకాశ్ నారాయణ్‌ను గాంధీయన్ మార్క్సిస్టుగా అభివర్ణించారు. దీనికి తగినట్టుగానే జె.పి. ప్రజాస్వామిక మానవతావాద భావాలు ఆయన 'రాజకీయ పంథాలో మనం గమనించవచ్చు.

## జీవిత విశేషాలు - రచనలు

ఆధునిక భారతదేశ చరిత్రలో అక్టోబర్ నెలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే అతికొద్దిమంది ప్రఖ్యాత నాయకులైన మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి వంటి గొప్ప నిరాడంబర మానవతావాద మూర్తులను, జయప్రకాశ్ వంటి గొప్ప దేశభక్తి గల ప్రజానాయకులను ఈ దేశానికి అందించింది. జయప్రకాశ్ నారాయణ్, హర్షదయాల్, ఫుల్‌రాణీదేవిలకు మొదటి సంతానంగా 1920 అక్టోబర్ 11న జన్మించాడు. జయప్రకాశ్ తండ్రి నీటిపారుదల శాఖలో చిరుద్యోగి తల్లి సంప్రదాయ గృహిణి. కుటుంబ పోషణ తండ్రి సంపాదన మీదే

జరిగేది. అయినప్పటికీ జయప్రకాశ్ విద్యాబుద్ధులు చెప్పించటానికి వారు వెనుకాడలేదు. ప్రాథమిక విద్యాభ్యాసం గ్రామంలోనే జరిగింది. ఆ తరువాత పాఠశాల, కళాశాల విద్య పాట్నాలో జరిగింది. జయప్రకాశ్ 1909 సం॥లో పాఠశాల విద్యలో ఉత్తీర్ణుడయ్యాడు.

కళాశాల విద్యకోసం పాట్నా చేరాడు. జయప్రకాశ్ సామాన్యశాస్త్ర అధ్యయనం పట్ల ఎక్కువ శ్రద్ధ చూపించేవాడు. అందువల్ల ఆయన తన కళాశాల విద్యలో సైన్సు గ్రూపు తీసుకున్నాడు. భౌతిక, గణిత, రసాయనిక శాస్త్రాలతోపాటు, ఆంగ్లము, హిందీ, సంస్కృత భాషల అధ్యయనాన్ని ఎంచుకున్నాడు. కళాశాల విద్యలో ప్రథమశ్రేణి సంపాదించడంవల్ల గౌరవ ఉపకారవేతనం కూడా పొందాడు. ఉన్నత విద్యకోసం కాశీ విశ్వవిద్యాలయంలో చేరమని తల్లిదండ్రులు చేసిన వత్తిడిని జయప్రకాశ్ అంగీకరించలేదు. ఎందుకంటే, బ్రిటీష్ ఆర్థిక సహాయంతో నడిచే ఏ విద్యాలయంలో విద్యనభ్యసించరాదనే గాంధీ భావాలతో ఏకీభవించి ఆయన కాశీలో చేరలేదు. ఇక్కడే జయప్రకాశ్ జీవితం తలకిందులైంది. ఆ పరిస్థితులలో తాను భారతదేశం వెలుపల అమెరికాలో విద్యనభ్యసించాలని నిర్ణయించుకున్నాడు.

1920, మే 16న బీహార్‌లో ప్రముఖ నాయకుడైన బ్రిజ్‌కిషోర్ ప్రసాద్ కుమార్తె ప్రభావతిని వివాహమాడాడు. అప్పటికీ ఆయనకు ఉన్నతవిద్యపై మక్కువ పోలేదు. అందువల్ల 1922లో ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికాకు జినాస్ అనే ఓడలో బయలుదేరాడు. బర్కిలీలోని కాలిఫోర్నియా యూనివర్సిటీలో కెమికల్ ఇంజనీరింగ్‌లో చేరాడు. కాని పరిస్థితులు అనుకూలించక మధ్యలోనే విద్యను ఆపి చికాగోలోని విస్‌కాన్‌సిన్ (Wisconsin) యూనివర్సిటీలో బి.ఎ. సామాజిక శాస్త్రాన్ని అభ్యసించాడు. ఆ తరువాత "సామాజిక పరివర్తన" అనే పరిశోధనా అంశాన్ని ఎంచుకొని డాక్టరేట్ కోర్సులో చేరాడు. అందువల్ల జయప్రకాశ్ అమెరికాలో ఎన్నో చిన్నచిన్న ఉద్యోగాలు చేశాడు. 1929 లో భారతదేశానికి తిరిగివచ్చి వార్ధా 'ఆశ్రమం'లో గాంధీజీ దగ్గర ఉన్న తన భార్యను కలిశాడు. బ్రహ్మచర్యాన్ని పాటించి దేశసేవ చేయాలనే తన భార్య సూచనను అంగీకరించి దాన్ని పాటించాడు. భారత జాతీయ కాంగ్రెస్‌లో కార్మిక విభాగానికి సహాయకుడిగా పనిచేశాడు. తరువాత జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యాదర్శులలో ఒకడుగా ఎన్నికయ్యాడు. 1932 లో జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నందుకు అరెస్టు చేయబడి జైలు జీవితం గడిపాడు. జైలులో తన సహచరులతో చర్చించి భారతదేశంలో సోషలిస్టు ఉద్యమానికి పునాదులు నిర్మించాడు. 1934 సం॥లో అఖిల భారత సోషలిస్టు సమావేశాన్ని ఏర్పాటుచేసి తదనంతరం కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని స్థాపించాడు. ఇది కాంగ్రెస్‌పార్టీలో అంతర్భాగంగా కొనసాగింది. 1936 సం॥లో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ తరపున "సోషలిజం ఎందుకు" (Why socialism) అనే కరపత్రాన్ని ప్రచురించాడు. 1940 నుండి 1946 వరకు అనేక పర్యాయాలు జైలుకు వెళ్ళాడు. జైలునుంచి వచ్చిన తరువాత కొంతకాలం అజ్ఞాత జీవితం కూడా గడిపాడు. స్వాతంత్ర్యానంతరం 1948 నుంచి 1951 వరకు జయప్రకాశ్ లోహియాతో కలిసి సోషలిస్టు పార్టీ కార్యకలాపాలు చేపట్టాడు. 1952 నాటి ఎన్నికలో తన పార్టీ స్వతంత్రంగా పోటీచేసి ఓడిపోవడంతో కొంత నిరాశచెందాడు. ఆ నేపథ్యంలో, క్రియాశీలక రాజకీయాల నుంచి విరమించుకొని సర్వోదయ,

భూదానోద్యమాలకు జీవితం అంకితం చేయాలని నిర్ణయించుకున్నప్పటికీ అది సాధ్యం కాలేదు. 1962 సం॥లో భారత్-పాక్ సంఘీభావ సంఘాన్ని స్థాపించాడు. 1965 సం॥లో "రామన్‌మెగ్సెసే" అవార్డును తన సేవలకు ప్రతిఫలంగా ప్రకటించడంతో సంతోషించాడు. 1974 లో సంపూర్ణ విప్లవం కోసం పిలుపునిచ్చాడు. ఇదే సం॥లో గుజరాత్, బీహార్ విద్యార్థులు చేపట్టిన ఉద్యమాలకు మద్దతునిచ్చి, ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు, అవినీతి, లంచగొండితనానికి వ్యతిరేకంగా పోరాటం చేశాడు. ఆతరువాత 1977 సం॥లో జనతాపార్టీ స్థాపనలో కీలకపాత్రను పోషించాడు. 1979 సంవత్సరం అక్టోబరు 8న మరణించాడు.

## సమకాలీన పరిస్థితులు - రచనలు

భారత జాతీయోద్యమంలో ప్రభావితులైన నాయకులలో జయప్రకాశ్ నారాయణ్ ఒకరు. కళాశాల జీవితానికి స్వస్తిచెప్పి, ఆనాటి ఎందరో విద్యార్థులలాగా తాను కూడా మహోజ్వలంగా సాగుతున్న జాతీయోధ్యమంలో చేరడానికి నిశ్చయించుకున్నాడు. కాని కుటుంబ పరిస్థితులవల్ల తల్లిదండ్రుల ఒత్తిడితో కళాశాల విద్యను పూర్తిచేసి 1922 లో ఉన్నత విద్యనభ్యసించడానికి అమెరికా వెళ్ళాడు. 1929 లో స్వదేశానికి తిరిగివచ్చి భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరి జాతీయ రాజకీయాలలో ప్రత్యక్ష పాత్రను పోషించాడు.

జయప్రకాశ్ నారాయణ్ యువకుడిగా ఉన్నప్పుడు, నెహ్రూ, అబ్దుల్ కలాం ఆజాదుల ఉపన్యాసాల వల్ల ప్రభావితుడయ్యాడు. అమెరికాలో విద్యార్థిగా ఉన్నప్పుడు జయప్రకాశ్‌కు మార్క్సిస్టు సాహిత్యంతో పరిచయం ఏర్పడింది. యం.ఎన్.రాయ్, అప్పటికే తన రచనల ద్వారా అమెరికాలో బహుళ ప్రచారం పొందారు. రాయ్ ఇతర మార్క్సిస్టులతో పరిచయాలు ఏర్పడ్డాయి. అందువల్ల యం.ఎన్.రాయ్, లాఫ్‌లెట్ అనే అభ్యుదయవాది, యూదు, యూరోపియన్ విద్యార్థి మిత్రుల సహవాసంలో మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేసి జయప్రకాశ్ మార్క్సిస్టుగా మారాడు. నిర్దిష్టమైన కార్యక్రమంలో మానవాళి అభ్యుదయానికి మార్గం చూపేది మార్క్సిజమే కాని గాంధీతత్వం కాదని భావించాడు. ఈ సందర్భంగా మాస్కోలో విప్లవతత్వాన్ని బోధించే ఓరియంటల్ యూనివర్సిటీలో శిక్షణ పొందాలని తలంచాడు. కాని కుటుంబ ఆర్థిక పరిస్థితులు, మాస్కో వెళితే తిరిగి భారతదేశం రావడానికి బ్రిటీష్ ప్రభుత్వం అనుమతించదనే రాజేంద్రప్రసాద్ ఉత్తర సారాంశం. అదేవిధంగా, భారత స్వాతంత్ర్య పోరాటం భారతదేశంలోనే చేయాలిగాని మాస్కో నుంచి కాదని చెప్పిన హితవు జయప్రకాశ్ తిరిగి భారతదేశానికి వచ్చేటట్లు చేశాయి.

1929 లో భారతదేశానికి వచ్చిన జయప్రకాశ్ భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరి ప్రత్యక్ష రాజకీయాలు నెరపటానికి పూనుకున్నాడు. 1932 లో నాసిక్ జైల్లో తన సహచరులైన అచ్యుత పట్వర్ధన్, మినూమసానీ, నానా సాహెబ్ గోరే, యం.ఎల్. దంత్ వాలా మొదలైన వారితో కలిసి భారతీయ సోషలిస్టు ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. అయితే, వీరంతా అప్పటికీ భారత జాతీయ కాంగ్రెస్‌లో క్రియాశీల సభ్యులే. వీరంతా కాంగ్రెస్‌లో ఉంటూనే సమసమాజం కోసం కృషిచేయాలని నిర్ణయించుకున్నారు. సోషలిస్టు భావాలు గల యువకులంతా భారత జాతీయ కాంగ్రెస్‌లో అంతర్భాగంగానే "కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ"ని స్థాపించారు.

భారతదేశంలో సోషలిస్టు ఉద్యమాన్ని తమ భావాల చేత, తమ రాజకీయ చర్యల ద్వారా ఎంతో సుసంపన్నం చేశారు. 1948 లో కాంగ్రెస్ నుంచి విడిపోయి సోషలిస్టు ఏర్పడింది. అయితే భారత కమ్యూనిస్టు పార్టీ బలాన్ని పుంజుకోవడంవల్ల భారతీయ సోషలిస్టు ఉద్యమం భారత రాజకీయ జీవితంలో తన ప్రభావాన్ని కోల్పోయింది.

**జయప్రకాశ్ నారాయణ్ – రచనలు**

జయప్రకాశ్ మారుతున్న రాజకీయ పరిస్థితులకు ప్రతిబింబంగా తన రాజకీయ భావాలను ఎప్పటికప్పుడు తన రచనల ద్వారా తెలియజేశాడు. తన తొలిదశ నాటి సామ్యవాద భావాల నుంచి తన అంతిమదశ వరకు భారత సమాజంలో చోటుచేసుకున్న సమస్యలపట్ల జయప్రకాశ్ ఏవిధంగా స్పందించాడో తన రచనల ద్వారా తెలుసుకోవచ్చు.

1. వై సోషలిజమ్ (Why socialism) (1936)
2. టువార్డ్స్ ఎ న్యూ సొసైటీ (1958) (Towards a new Society)
3. టువార్డ్స్ టోటల్ రివల్యూషన్ (1978) (Towards Total Revoluation) మొదలగునవి.

**జయప్రకాశ్ నారాయణ్ – రాజనీతి భావాలు**

జయప్రకాశ్ నారాయణ్ రాజకీయ భావాలను తెలుసుకొనే ముందు, మానవ స్వభావంపై ఆయన అభిప్రాయాలను తెలుసుకోవం అవసరం. ఎందుకంటే, జయప్రకాశ్ నారాయణ్ రాజకీయ భావజాలం అంతా 'మనిషి' మనోవైజ్ఞానిక రీతుల, వైఖరులలో రావలసిన మార్పుల ఆధారంగానే వివరించబడింది.

రాజనీతిశాస్త్ర పితామహుడు అరిస్టాటిల్ వర్ణించినట్లుగా జయప్రకాశ్ నారాయణ్ అభిప్రాయంలో మానవుడు 'సంఘజీవి' రాజకీయజీవి కూడా. ఎందుకంటే మనిషి సమాజంలో పుట్టి, ఇతర సమాజ సభ్యులతో లౌకిక జీవితం గడిపి సమాజంలోనే మరణిస్తాడు. అందువల్ల ప్రతి మనిషి ఇతరులతో సంఘజీవితాన్ని కోరుకుంటాడు. తన దైనందిన సంఘ జీవితంలో ఉత్పన్నమయ్యే కొన్ని ప్రత్యేక సమస్యల పరిష్కారంకోసం రాజకీయ జీవితంవైపు పయనిస్తాడు. ప్రాథమికంగా మనిషి సంఘ జీవితం కుటుంబంతో ప్రారంభమై 'గ్రామసభ'లో పరిపుష్టమై గ్రామ పంచాయితీలో రాజకీయ జీవిగా రూపాంతరం చెందుతుంది.

జయప్రకాశ్ నారాయణ్ అభిప్రాయంలో మనిషి సంఘ, రాజకీయ ప్రస్థానంలో కుటుంబం ప్రాథమిక యూనిట్ 'గ్రామసభ' రెండోయూనిట్. గ్రామసభ వయోజనుల చర్చావేదిక లాంటిది. గ్రామసభలో చర్చించిన అనేకరకాల సమస్యలకు, తీర్మానాలకు ఒక నిర్దిష్ట విధాన నిర్ణయం 'గ్రామపంచాయితీ'లో జరుగుతుంది. గ్రామ పంచాయితీ ప్రజలందరి సమ్మతి ఆధారంగా అందరి సమిష్టి ప్రయోజనాలను ఆశించి విధాన నిర్ణయాలను చేస్తుంది. జయప్రకాశ్, 'కుటుంబం' ప్రాథమిక సాంఘీక యూనిట్‌కాగా గ్రామపంచాయితీని ప్రాథమిక రాజకీయ యూనిట్‌గా అభివర్ణించాడు. అందువల్ల, గ్రామపంచాయితీ, రాజకీయ ఉపరితల

నిర్మాణానికి (Political super power) పునాదివంటిది. ప్రాచీన భారత సమాజంలో ఈ తరహాలో మానవులు జీవించారని జయప్రకాశ్ అభిప్రాయపడ్డారు. అయితే ప్రాచీన భారత సమాజంలో 'గ్రామసభ' స్వయం నిర్ణయాధికారాన్ని, స్వాలంబనను, స్వయం నియంత్రణతో సఖ్యత, సమన్వయం, సమిష్టితత్వం కలిగి ఉండేది. అందువల్ల జయప్రకాశ్, మానవుడు జన్మతః మంచివాడనీ, సమాజంలోని భౌతిక రాజకీయ పరిస్థితులు అతడ్ని స్వార్థపరుడుగా మారుస్తున్నాయని చెప్పాడు. అందుకే ఈ సమాజంలోని భౌతిక, సాంఘిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థలలో పరిపూర్ణ మార్పును తీసుకురావలసిన అవసరాన్ని జయప్రకాశ్ నొక్కి చెప్పాడు.

## భారత రాజకీయ వ్యవస్థ పునర్నిర్మాణంపై జయప్రకాశ్ నారాయణ్ భావాలు

జయప్రకాశ్ నారాయణ్ భారత రాజకీయ వ్యవస్థను పునః నిర్మించాలని తలంచారు. అందుకు సంపూర్ణ సామాజిక పరివర్తనను కోరుకున్నాడు. నేటి సమాజంలో నెలకొన్న అసమానతలు. అన్యాయం, అవినీతి, అణచివేత, దివాళాకోరుతనం లాంటి రుగ్మతలను తొలగించి నిజమైన ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థను నెలకొల్పాలని భావించాడు. నిర్మించబోయే నూతన రాజకీయ వ్యవస్థ బాధ్యతాయుత, సమాఖ్య రూపంలో ఉండాలన్నాడు. రాజకీయ అధికార విభజన, ఆర్థిక వనరుల విభజన సక్రమంగా జరిపి ప్రజా నియంత్రణలో ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ నడవాలని భావించాడు. ప్రాచీన భారత రాజకీయ వ్యవస్థల లాగా నేటి ప్రజాస్వామ్య రాజ్యం మానవ నైతిక విలువల ప్రాతిపదికన నిర్మించాలని పేర్కొన్నాడు. అంతేకాదు, కుల – రాజకీయాలకు, పార్టీ–రాజకీయాలకు, స్వార్థ రాజకీయాలకు అతీతంగా ప్రజాస్వామ్య రాజ్యం ఉండాలని తలంచాడు.

జయప్రకాశ్ రాజకీయ వ్యవస్థ పునః నిర్మాణానికి సంబంధించి ఉదారవాద భావజాలాన్ని ప్రదర్శించాడు. ఆయన అభిప్రాయంలో సమున్యాయ పాలన సూత్రం ఆధారంగా ప్రజాస్వామ్యం ఏర్పడాలని కోరుకున్నాడు. ప్రజల జీవితానికి, స్వేచ్ఛకు, ఆస్తులకు సరైన రక్షణ కల్పించబడాలి. సామాజిక విలువల ఆధారంగా ఏర్పరిచే రాజకీయ ప్రజాస్వామ్యం వర్థిల్లాలంటే ప్రజలు కొన్ని ప్రత్యేక లక్షణాలను. విశ్వాసాలను సంతరించుకోవాలి. అవి:

1. అహింస మీద నమ్మకం ఉండాలి. 2. మనిషికిగల సామర్థ్యం, చైతన్యాల మీద పూర్తి విశ్వాసం ఉండాలి, 3. మానవులందరూ సమానులే అనే మౌలిక సూత్రం మీద నమ్మకం ఉంచాలి. 4. మనుషులు పరస్పర సహాయ సహకారాలతో సమిష్టిగా మెలగగలుగుతారనే దాని మీద నమ్మకం ఉండాలి. 5. స్వాతంత్ర్య పిపాస కలిగి అణచివేతను ఎదిరించే సహనం పట్ల దృఢసంకల్పం ఉండాలి. 6. స్వప్రయోజనాల కంటే జాతీయ ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. 7. రాజకీయ వ్యవస్థ పట్ల పూర్తి విశ్వాసంతో విధేయతను, బాధ్యతలను పాటించే సమ్రతలను ప్రతి వ్యక్తి పాటించాలి. 8. ఇతరుల అభిప్రాయాలను, భావాలను గౌరవించే లక్షణం ఉండాలి. 9. కేవలం భౌతిక ప్రయోజనాలను మాత్రమే పొందాలనే విధానాన్ని నియంత్రించుకోవాలి.

ఈ విధమైన లక్షణాలను, విశ్వాసాలను ప్రజలు అలవర్చుకున్నట్లయితే, విలువల ప్రాతిపదికన ఏర్పడే ప్రజాస్వామ్య ప్రభుత్వ మనుగడ కొనసాగించగలదు. జయప్రకాశ్ అభిప్రాయంలో ప్రజాస్వామ్యం కేవలం

ప్రజలందరికీ భాగస్వామ్యం కల్పించే ప్రభుత్వ రూపం మాత్రమే కాదు సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో వ్యక్తి స్వేచ్ఛ పరజీవనానికి సంబంధించిన జీవనవిధానం కూడా. జయప్రకాశ్ నారాయణ్ ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని, రాజకీయ ప్రజాస్వామ్యం నుంచి విడదీయరాదంటాడు. వాస్తవానికి, ఆయన దృష్టిలో ఈ రెండింటికలయికగా ఏర్పడేదే నిజమైన ప్రజాస్వామ్యం. వీటిల్లో ఏ ఒక్కటి లేకున్నా అది అసంపూర్ణమే అవుతుంది. అందుకే, స్వయం–నియంత్రణ, స్వయం–అభివృద్ధి అనే లక్షణాలను ప్రతి మనిషి అలవర్చుకోవాలంటాడు. ఇవి అలవర్చుకోనట్లయితే మనిషి రాజకీయ జీవితం నుంచి సాంఘిక, ఆర్థిక జీవితం వేరుచేయబడుతుంది. ఫలితంగా మనిషి ఎప్పుడూ అసంతృప్తితో బ్రతకవలసి వస్తుంది.

ఈ అసంతృప్తి రాజకీయ అనిశ్చితికి దారితీస్తుందంటాడు జయప్రకాశ్, దీని దృష్ట్యా గ్రామసభ, గ్రామపంచాయితీలు వ్యక్తుల సాంఘిక, రాజకీయ జీవనాలకు పునాదిగా ఉంటాయి. నిజానికి ఈ రెండు ప్రాచీన భారత రాజకీయ వ్యవస్థకు పునాదిగా ఉండేవి. వాటిని పునఃనిర్మించడమే మనం చేయవలసిందని జయప్రకాశ్ పేర్కొన్నాడు.

## సామ్యవాదం పై జయప్రకాశ్ భావాలు

భారత జాతీయోద్యమ కాలంలోనే పాశ్చాత్య దేశాలలో సామ్యవాద సిద్ధాంతం బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఈ పరిణామం సహజంగానే ఎంతో మంది భారతీయ యువకులను, మేధావులను ఆకర్షించింది. తిలక్, రనడే వంటివారు. అనిబిసెంట్ ఆర్థిక జాతీయవాదం (Economic Nationalism) గురించి మాట్లాడేవారు. అనిబిసెంట్, లాలాలజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ మొదలయినవారు సామ్యవాదం గురించి అక్కడక్కడ ప్రాస్థావించినప్పటికీ దానిపై వారు దృష్టిని కేంద్రీకరించలేదు.

1930 దశకంలో నాసిక్ జైలులో ఉన్న జయప్రకాశ్, అచ్యుతపట్వర్ధన్, దంతవాలా, నానాసాహెబ్ గోరే, మినుమసాని వంటి సోషలిస్టు భావాలు గల యువకులు భారతదేశంలో 'సోషలిస్టు పార్టీ'ని స్థాపించాలని భావించారు. వారి ఆశయాలకు అనుగుణంగానే 1934 సం॥లో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఆవిర్భవించింది. 1936సం॥నాటి "కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ" సమావేశంలో జయప్రకాశ్ నారాయణ్ తన సామ్యవాద భావాలను "సామ్యవాద మెందుకు" (Why socialism) అనే కరపత్రంలో తెలియచేశాడు. దీనిలో ప్రపంచ వ్యాప్తంగా విభిన్న తేడాలతో సామ్యవాద సిద్ధాంతం ప్రాచుర్యంలో ఉన్నప్పటికీ మార్క్సిజమే అసలు సిసలైన సామ్యవాదమని జయప్రకాశ్ అభిప్రాయపడ్డాడు. ఇదే విషయాన్ని రష్యా విప్లవం రుజువు చేసిందని కూడా పేర్కొన్నాడు.

అయితే మార్క్సిజం ఆచరణలో చోటుచేసుకునే హింసకు జయప్రకాశ్ నిరసించాడు. ఈ సందర్భంగా, రష్యాను పారిశ్రామికంగా మార్చడానికి ఆ దేశ నాయకత్వం అనుసరించిన హింసాత్మక పద్ధతులను జయప్రకాశ్ నారాయణ్ ఖండించాడు. సామాజిక, ఆర్థిక స్థితిగతులను మార్చడానికి చేసే ప్రయత్నంలో బలప్రయోగానికి తావులేదని, కేవలం పరివర్తన ద్వారా మాత్రమే అది సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డాడు. సామాజిక పరివర్తనలో బలప్రయోగం వల్ల 'వ్యక్తి స్వేచ్ఛ' బలయిపోతుందని జయప్రకాశ్ చెప్పాడు. అంతేకాదు సమాజంలోని అన్ని

రంగాల్లో సాంకేతికపరంగా పునర్నిర్మాణాన్ని చేపట్టి సమతూకంగా సమాజాన్ని అభివృద్ధి చేయడమే సామ్యవాద లక్ష్యంగా ఉండాలని భావించాడు. ఈ లక్ష్య సాధనకోసం కనీస కార్యక్రమాన్ని వివరించాడు.

1. భారత రాజకీయ వ్యవస్థను బ్రిటీష్ సామ్రాజ్యవాదం నుంచి పూర్తిగా విడిపోయిన సంపూర్ణ స్వాతంత్ర్య వ్యవస్థగా తీర్చిదిద్దడం.
2. వివిధ రూపాల్లో కొనసాగుతున్న భూస్వామ్య వ్యవస్థను రూపు మాపటం.
3. రైతుల, శ్రామికుల రుణాలన్నింటినీ రద్దుచేయడం.
4. దున్నేవాడికే భూమి చెందాలి.
5. దేశ ఆర్థికాభివృద్ధి సాధనకోసం ప్రణాళికలను రూపొందించి అమలుచేయాలి.
6. సహకార, సమిష్టి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహించి అభివృద్ధి చేయాలి.
7. పరిశ్రమలు, బ్యాంకులు, గనులు వంటి కీలకమైన రంగాలను జాతీయం చేయాలి.
8. ప్రభుత్వం కుల, మత, లింగ పరమైన వివక్షను పాటించకూడదు.
9. ప్రతి వ్యక్తికీ వృత్తిపర వయోజన ఓటుహక్కు కల్పించాలి.
10. ప్రభుత్వ పని హక్కును గుర్తించి అమలుచేయాలి.

ఈ సందర్భంగా జయప్రకాశ్ ప్రజలతో ఏర్పడిన వివిధ సంఘాల పర్యవేక్షణలో వారి అభివృద్ధి కాంక్షించే పై కార్యక్రమాన్ని చేపట్టాలన్నాడు. ఉత్పత్తి సాధనాలను సమాజపరం చేయడంద్వారా ప్రజలు దోపిడీ నుంచి విముక్తి చెందుతారు. ఫలితంగా, ప్రతి కుటుంబం, ప్రతి గ్రామం స్వయం పోషకమైందిగాను, స్వయం పాలనా వ్యవస్థగా రూపొంది అభివృద్ధి చెందుతాయని జయప్రకాశ్ విశ్వసించాడు.

## పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పై జయప్రకాశ్ భావాలు

జయప్రకాశ్ నారాయణ్, మానవాళి సంక్షేమానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యమే సరయిన ప్రభుత్వ వ్యవస్థ అని అభిప్రాయపడ్డాడు. ఈ తరహా ప్రభుత్వ వ్యవస్థలో మాత్రమే సమాజ సవాళ్ళను, ఎదుర్కొంటూ సామాజిక మార్పు సాధ్యమవుతుందన్నాడు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అధికార వకేంద్రీకరణతో కూడిన సమాఖ్య ప్రభుత్వం ఏర్పడుతుంది. ఇటువంటి ప్రభుత్వ వ్యవస్థ మాత్రమే ప్రాంతీయ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న వ్యత్యాసాలను తొలగించగలదు.

సమాజంలోని నైతిక విలువలు, సమిష్టి సహకారం, వ్యక్తిగత ప్రయోజనాల కంటే జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిచ్చే స్వభావం ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని పరిపుష్టం చేస్తాయి. అదేవిధంగా ప్రజల సహనం, పరస్పర సహకారం, సమస్యలు పరిష్కరించుకొనే నేర్పు ప్రజాస్వామ్యాన్ని మరింతగా పెంపొందించడానికి దోహదపడతాయి. జయప్రకాశ్ దృష్టిలో ప్రజాస్వామ్యం అంటే కేవలం ఒక ప్రభుత్వ విధానం మాత్రమే కాదు. అది ప్రజల సంపూర్ణ భాగస్వామ్యం కూడా. ఎందుకంటే, ప్రజాస్వామ్యం ప్రజలకు సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమానత్వాన్ని కల్పిస్తుంది.

ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రజల సార్వజనిన ఓటు హక్కుతో కాలనియమాన్ని పాటిస్తూ జరిగే ఎన్నికల ద్వారా ఏర్పడుతుంది. ఇది మెజారిటీ అనే సూత్రం ఆధారంగా పనిచేస్తుంది. ఈ సందర్భంగా జయప్రకాశ్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని లోపాల్ని ఎత్తిచూపాడు. ఇందుకు గల కారణాలను ఆయన విశ్లేషించాడు.

ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన ఓటర్లు సైతం స్వచ్ఛందంగా, యధేచ్ఛగా కాకుండా అనేక రకాల ఒత్తిళ్ళకు , ప్రలోభాలకు లోనయి తమ ఓటును వినియోగించుకుంటున్నారు. ఎన్నికల సందర్భంగాజరుగుతున్న దాడులు, చెలరేగుతున్నా హింస ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నాయి. ఎన్నికలలో ధనబలం, కండబలం ఉన్నవారే రాణిస్తున్నారు. సిద్ధాంతాలు, పార్టీ విధానాలు, మ్యానిఫెస్టోలు మాట మాత్రంగా చెప్పుకోడానికి తప్పా అవి ఓటర్లను ఏమాత్రం ప్రభావితం చేయటంలేదంటారు జయప్రకాశ్. నానాటికీ పెరుగుతున్న ఎన్నికల వ్యయం, సాధారణ పౌరుడు ఎన్నికలలో నిలబడే అవకాశాన్ని తొలగిస్తూ ఉంది. ఫలితంగా, పారిశ్రామిక, జమిందారీ, భూస్వామ్య వర్గాలకు చెందిన వారు మాత్రమే ఎన్నికలలో పోటీ చేస్తున్నారు. అదేవిధంగా, వివిధ రకాల ప్రభావవర్గాలు, ప్రయోజన వర్గాలు, ట్రేడ్ యూనియన్లు ప్రజాస్వామ్యాన్ని తన జేబు సంస్థగా వాడుకుంటున్నాయని జయప్రకాశ్ పేర్కొన్నాడు. మరోవిధంగా చెప్పాలంటే, భారత ప్రజాస్వామ్యాన్ని పారిశ్రామిక, జమిందారీ, భూస్వామ్య వర్గాలకు, ప్రభావ, ప్రయోజన, ట్రేడ్ యూనియన్‌లకు తాకట్టు పెట్టినట్లు అయిందని జయప్రకాశ్ వాపోయాడు. అందువల్ల జయప్రకాశ్ ఎన్నికల పద్ధతిని పార్టీ రాజకీయాలకు అతీతంగా భారత ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించాలని భావించాడు.

## సర్వోదయ సామ్యవాదం పై జయప్రకాశ్ భావాలు

జయప్రకాశ్ రాజకీయ భావాల్లో మరో కలికితురాయి సర్వోదయ. 'సర్వోదయ' అంటే "పరిపూర్ణమైన వెలుగు". గాంధీయిజం, సర్వోదయం పట్ల విశ్వాసం పెంచుకొని ఆచార్య వినోభా భావే ప్రారంభించిన భూదానోద్యమం ద్వారా తన లక్ష్యాన్ని సాధించవచ్చని భావించి సర్వోదయకు తన జీవితాన్ని అంకింతం చేయాలని నిశ్చయించుకున్నారు. అందుకే 1960 నుంచి 1974 వరకు భూదాన, సర్వోదయ ఉద్యమాలలో జయప్రకాశ్ క్రియాశీలక కార్యకర్తగా పాల్గొన్నారు. ఆయన ఒక సందర్భంలో, సాంఘిక మార్పును తీసుకురావడానికి గాంధీ ప్రజలకు అందించిన ఆయుధమే సర్వోదయ అని. ఇది 'గాంధీ' కమ్యూనిజం అని పేర్కొన్నారు.

**జీవన్‌ధాన్ :** జయప్రకాశ్ ప్రతిపాదించిన 'జీవన్‌దాన్' భావన సర్వోదయ ఉద్యమంలో అంతర్భాగమైంది. ఆయన ఉద్దేశంలో, రాజ్య శాసనాల ఆధారంగా కాకుండా సర్వోదయ సూత్రాల ద్వారా సామజిక పరివర్తనను సాధించవచ్చు. సమాజం పరిపూర్ణ పరివర్తన చెందిన తరువాత 'సమసమాజం' గా ఏర్పడుతుందని, అప్పుడు ప్రతి ఒక్కరూ సమాజ సంక్షేమం కోసం అంకితమవ్వడాన్ని "జీవన్‌దాన్"గా జయప్రకాశ్ పేర్కొన్నాడు. సాంఘిక విప్లవంకోసం భూదాన్, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధిలో ప్రతి ఒక్కరు అంకిత భావంతో పనిచేయలని చేప్పాడు. జయప్రకాశ్ జీవన్‌ధాన్‌లో ప్రధానంగా, భూదానం, గ్రామీణ పరిశ్రమలు, పార్టీ రహిత రాజకీయాలతోపాటు ప్రజలందరి భాగస్వామ్యంగల నిర్మాణాత్మక పథకాలు రూపొందించడం లాంటి అంశాలకు అధిక ప్రాధన్యత ఉంటుంది.

ప్రతి మనిషి కుటుంబ బాధ్యతలను కనీస స్థాయికి తగ్గించుకొని వ్యవసాయం, పరిశ్రములు, ఇతర ఉత్పత్తి రంగాలలో ఎక్కువస్థాయిలో కష్టించి పనిచేయాలని సూచించాడు. ప్రజల ఆస్తిపట్ల ధర్మకర్తలుగా వ్యవహరించి సాధారణ జీవితం గడుపుతూ ఉన్నతంగా ఆలోచించాలి.

## సంపూర్ణ విప్లవంపై జయప్రకాశ్ భావాలు

భారతీయ రాజనీతి తత్వానికి, జయప్రకాశ్ అందించిన అత్యంత విశిష్టమైన భావన సంపూర్ణ విప్లవం. జయప్రకాశ్ క్రియాశీలక రాజకీయల నుంచి విరమించుకున్న తరవాత అహింసాయుత పద్ధతుల ద్వారా సాంఘిక పునర్నిర్మాణ కార్యక్రమంలో నిమగ్నమయ్యాడు. భారత రాజకీయ రంగంలో చోటుచేసుకున్న అవినీతి, విలువల క్షీణత, లంచగొండితనం, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగం, పేదరికం, వ్యవసాయ రంగంలో సంక్షోభాలు మొదలైన అంశాలలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బీహార్, గుజరాత్ రాష్ట్రాలలో యువకులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమాలను లేవదీశారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువకులను ఎంతో బలమైన శక్తిగా అభివర్ణించారు. దాంతో యువకులు, విద్యార్థులు తమ ఉద్యమాలకు నాయకత్వం వహించడం ద్వారా దేశ ప్రయోజనాలను పరిరక్షించాలని జయప్రకాశ్‌ని కోరారు. ఇది జయప్రకాశ్‌కు కొత్త స్ఫూర్తిని నూతనోత్తేజాన్ని ఇచ్చింది. ఆవిధంగా యువత, విద్యార్థి ఉద్యమాన్ని అహింసా పద్ధతులలో నడపటానికి జయప్రకాశ్ నడుంబిగించారు.ః

## ముగింపు

సంపూర్ణ విప్లవాన్ని సాధించడానికి అనుసరణీయమైన సాధనాలు గాంధీతత్వం నుంచి గ్రహించినవే. ముఖ్యంగా, అహింసా మార్గం, సహాయనిరాకరణ, శాసనోల్లంఘన, శాసన ప్రతిఘటన వంటివి. అదేవిధంగా విద్యార్థి. యువశక్తులను విప్లవానికి అనుగుణంగా మలచడానికి తాను స్వయంగా చేసిన కృషి సంపూర్ణ విప్లవ ఉద్యమానికి సమగ్ర రూపాలయినాయి. అంకిత భావం కలిగిన విద్యావంతులు, స్వార్థరహితులు అయిన వ్యక్తుల ద్వారా సంపూర్ణ క్రాంతి సాధ్యమని జయప్రకాశ్ విశ్వసించాడు. ఈ విధంగా, అంతిమ విశ్వాసాన్ని రాజ్యంలోగాని, పార్టీలోగాని, వ్యక్తిలో ఏర్పరచుకున్నారు. రాజ్యంకాని, పార్టీగాని ఈ నూతన మానవుల్ని సృష్టించజాలదని, ఈ నవ్య మానవుడు లేకుండా నాగరిక జీవనం సాధ్యం కాదని ఆయన తుదివరకు విశ్వసించారు.

*లోపాల ఆధారంగా ఎవరినీ అంచనా వేయకూడదు. ఓ వ్యక్తికి గల గొప్ప సుగుణాలు అతడికి మాత్రమే ప్రత్యేకం. అతనికున్న దోషాలు సర్వ సామాన్యమైన మానవ బలహీనతలు. అతడి వ్యక్తిత్వ నిర్ధారణలో వాటిని పరిగణించ కూడదు.*

# ౬. మల్లాది సుబ్బమ్మ

మల్లాది సుబ్బమ్మ. వర్తమాన సమాజంలో స్త్రీ హక్కుల గురించీ, స్త్రీ స్వేచ్ఛ గురించీ మాట్లాడేటపుడు మల్లాది సుబ్బమ్మ పేరు గుర్తురానివారుండరు. మల్లాది సుబ్బమ్మ ఒక సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి తన పదవయేట మరొక సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబానికి కోడలుగా వెళ్ళారు.

"మా చిన్నతనంలో స్త్రీలంటే కేవలం యింటికి, పిల్లలకూ, భర్తకూ సేవచేసేవారని నమ్మి ఆమెను అలా తీర్చిదిద్దేవారు. ఆ భావదాస్యంతో పెరిగిన నేను ముప్ఫైఆరు యేళ్ళదాకా కుటుంబభారం, పిల్లలపెంపకం, అత్తమామల సేవ, పూజలు, వ్రతాలతో టైమంతా వేస్టు చేసుకున్నాను, ఆ తర్వాత యేం పోగొట్టుకున్నానో గ్రహించిన నేను వ్యవస్థతో యెదురు తిరిగి మళ్ళీ చదువు ప్రారంభించి బి.ఏ దాకా చదివాను. స్త్రీలకు స్వేచ్ఛా సమానత్వాలు కావాలని గ్రహించి ఆ లక్ష్య సాధనకోసం మహిళోద్యమానికీ, స్త్రీ విమోచనకూ నా జీవితాన్ని అంకితం చేశాను." అంటున్న మల్లాది సుబ్బమ్మ దాదాపు నలభై సంవత్సరాలుగా పత్రికా సంపాదకురాలిగా, మహిళోద్యమ నాయకురాలిగా, సమాజంలోని మూఢాచారలను వ్యతిరేకించే హేతువాదిగా అనేక రంగాలలో కృషి చేశారు.

1980లో ఆమె మహిళాభ్యుదయ సంస్థను స్థాపించారు. సభలు, సమావేశాలు, అధ్యయన శిబిరాలూ నిర్వహించి స్త్రీలలో చైతన్యం కలిగించటం, కుటుంబ హింసను వెలికితీసి దానిపై స్త్రీలలో ఒక అవగాహన కలిగించటం, దోషులను శిక్షింపజేయటం మొదలైనవి ఆ సంస్థ ప్రధానంగా చేసే పనులు, అభ్యుదయ వివాహ వేదిక స్థాపించి వితంతు వివాహాలూ, వర్ణాంతర వివాహాలూ మత ప్రమేయం లేకుండా జరిపిస్తున్నారు. కుటుంబ సలహా కేంద్రం నడుపుతూ భార్యాభర్తల మధ్య వచ్చే తగవులను రాజీ ద్వారానో, విడాకుల ద్వారానో పరిష్కరిస్తున్నారు. విడాకులు పొందిన స్త్రీలకు వృత్తివిద్య నేర్పడం, ఉపాధి కల్పించటం వంటి పనులు కూడా ఈ సంస్థ చేస్తుంది. మహిళాభ్యుదయ సంస్థ ప్రభుత్వం వెల్‌ఫేర్ ఇన్‌స్టిట్యూట్‌గా గుర్తించి, వరకట్న మరణాల గురించి ఈ సంస్థ చేసే ఆరోపణలకు ప్రాధాన్యతనిస్తూ ఆర్డరు జారీ చేసింది.

పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పి.యు.సి.యల్) ఆంధ్రప్రదేశ్ శాఖకు ఆమె అధ్యక్షురాలిగా పనిచేశారు, సంపూర్ణ మద్య నిషేధ సమితి ప్రారంభించి మద్యానికి వ్యతిరేకంగా మూడు సంవత్సరాలపాటు పోరాడారు. ఆమె రచయిత్రి కూడా. యాభైకి పైగా పుస్తకాలు రాశారు. స్త్రీల మీద మతాలు విధించే కట్టడుల గురించి రాసిన పుస్తకాలు బహుళ ప్రచారం పొందాయి. "పాతివ్రత్యం నుండి ఫెమినిజం దాకా" అనే పేరుతో తన ఆత్మకథను రాశారు. 1996వ సంవత్సరంలో 'నేషనల్ హ్యూమన్‌రైట్స్ ఆవార్డు' పొందారు. 'ఢిల్లీ తెలుగు అకాడమీ నేషనల్ అవార్డు', 'దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అవార్డు', 'త్రిపురనేని రామస్వామి అవార్డు', 'అంబేద్కరు అవార్డు' ఇట్లా అనేక పురస్కారాలూ, సన్మానాలూ పొందారు.

1980వ సంత్సరంలో మల్లాది సుబ్బమ్మ ట్రస్టును స్థాపించి తన యావదాస్తినీ, ఇంటినీ, బంగారాన్నీ ఆ ట్రస్టుపేర రిజిష్టరు చేశారు. 2000 సంవత్సరంలో ఆమె తన పేరుమీద బాలికల కోసం వృత్తి విద్యా కళాశాలను ప్రారంభించారు.

"నేను చేసింది ఆవగింజంత. నా కొచ్చిన గౌరవాలు గుమ్మడికాయంత. అందువల్ల నేను సమాజానికి ఎంతో రుణపడి ఉన్నాను" అంటారామె.

# 7. దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

రాజమండ్రిలో పుట్టి కాకినాడలో పెరిగిన దుర్గాబాయ్ చిన్నతనంలోనే జాతీయోద్యమానికి దగ్గరయ్యారు. 12ఏళ్ళ వయసులో తనఇంట్లోనే బడితెరిచి తెలుగు, హిందీ పాఠాలతో పాటు పిల్లలకు ఆటపాటలుండేలా చూశారు. గాంధీ రాజమండ్రి వచ్చినపుడు (1919) దుర్గాబాయి గాంధీనిధికి డబ్బు వసూలు చేసి దానితో బాటు తనచేతి బంగారు గాజులు కూడా ఇచ్చారు. తన ఇంట్లోనే విదేశీ వస్త్రాలన్నీ తగలబెట్టి ఖద్దరు ధరించటం ప్రారంభించారు.

కాకినాడలో జరిగిన నేషనల్ కాంగ్రెస్ మహాసభకు ఆరువందల మంది వాలంటీర్లను తన బడిలో తయారుచేసి 15 సంవత్సరాల వయసు లేని కారణంగా తాను వాలంటీర్‌గా వెళ్ళలేకపోయారు. 1926లో గాంధీ కాకినాడ వచ్చిన సందర్భంగా మహిళా సభలో గాంధీ ఐదు నిముషాలు మాట్లాడే అనుమతి సంపాదించి. ఆయన ఉపన్యాసాన్ని తానే అనువదించారు. ఐదు నిముషాలనుకున్న ఉపన్యాసం గంటకు పైగా సాగింది. స్త్రీలు తమ ఆభరణాలన్నీ గాంధీకి ఇచ్చారు. అప్పటి నుండీ గాంధీ ఆంధ్రదేశ పర్యటనలో దుర్గాబాయ్ ఆయన అనువాదకురాలు.

ఉప్పు సత్యాగ్రహ సమయంలో మద్రాసులో ఉన్న దుర్గాబాయి, అక్కడ సత్యాగ్రహంలో పాల్గొని, పోలీసుల అరెస్టును తప్పించుకుంటూ మద్రాసు పరిసరాలలో ఉపన్యాసాలు ఇస్తూ ప్రజలను సత్యాగ్రహం వైపు మళ్ళించారు. రాయవెల్లూరు జైలులో పదినెలలుండి విడుదలై కరాచీ కాంగ్రెస్‌కు హాజరయ్యారు. తర్వాత మళ్ళీ రాయవెల్లూరులో, మదురైలో కఠిన జైలు జీవితం గడిపారు. ఈమె జైలు జీవితం కారణంగా భర్త మరో వివాహం చేసుకున్నాడు.

ఉప్పు సత్యాగ్రహం తర్వాత దుర్గాబాయి చదువు మీద దృష్టికేంద్రీకరించారు. బెనారస్ మెట్రిక్ పాసై. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఇంటర్ పూర్తిచేసి, ఆంధ్ర విశ్వ విద్యాలయం నుంచి రాజనీతి శాస్త్రంలో బి.ఏ.ఆనర్స్ చేశారు. మద్రాసులో లా చదివి, అక్కడే ఆంధ్ర మహిళా సభ ఏర్పాటు చేశారు. కాన్‌స్టిట్యూషన్ అసెంబ్లీలో హిందూకోడ్ బిల్లు మీద ఆమె చేసిన ఉపన్యాసం చాలా కీలకమైంది. స్వాతంత్ర్యానంతరం ఆమె రకరకాల సాంఘిక రాజకీయ సేవా కార్యక్రమాలలో భాగమయ్యారు.

1952లో దుర్గాబాయి ప్లానింగ్ కమీషన్ సభ్యురాలవటంతో ఆమెకు ఆర్థికమంత్రి చింతామణీ దేశ్‌ముఖ్‌తో పరిచయమై, 1953లో వారి వివాహం జరిగింది. ప్లానింగ్ కమిషన్ పని తర్వాత, సాంఘిక సంక్షేమశాఖ అధ్యక్షురాలిగా పది సంవత్సరాలపాటు పనిచేశారు. 1958లో భారత ప్రభుత్వం ఏర్పరిచిన జాతీయ మహిళా విద్యా సమాఖ్యకు అధ్యక్షురాలై, విలువైన రిపోర్టు తయారు చేశారు. ఆ నివేదిక ఆధారంగా స్త్రీలకు విద్యా శిక్షణావకాశాలు మరింత మెరుగయ్యాయి. కామన్‌వెల్త్, ఐక్యరాజ్యసమితులలో విద్యాభివృద్ధి విభాగాలలో, వాటి కార్యక్రమాలలో పాల్గొన్నారు. 1965లో టెహరాన్‌లో జరిగిన అంతర్జాతీయ నిరక్షరాస్య నిర్మూలనా సమావేశంలో పాల్గొని, పారిస్ సమావేశ ప్రణాళిక తయారుచేసి, దేశంలో సాక్షరతా కార్యక్రమాలకు ఒక రూపం కల్పించారు.

ఈమెకు 1963వ సంవత్సరంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌నిచ్చి గౌరవించింది. 1971లో భారత ప్రభుత్వం 'నెహ్రూ లిటరరీ అవార్డు' నిచ్చింది. 1975లో భారత ప్రభుత్వం దుర్గాబాయి దేశ్‌ముఖ్‌ని 'పద్మ విభూషణ్'తో గౌరవించింది.

# 8. జనంపల్లి కుముదినీ దేవి

వరంగల్ జిల్లాలో వడ్డేపల్లి గ్రామంలో జన్మించారు. కుముదిని తలిదండ్రులు, పింగళి చూడామణీ, వెంకటరామ రెడ్డీ పిల్లల్ని చదివించాలనే ఉద్దేశంతో, కుముదినికి ఐదేళ్ళ వయసులో, హైదరాబాదు వచ్చారు. ఇరవయ్యవ శతాబ్దపు తొలిరోజుల్లో పర్దాను నియమంగా పాటించే జమిందారీ కుటుంబంలోంచి వచ్చిన రాణీ కుముదిని సెయింట్ జార్జి గ్రామర్ స్కూల్లో సీనియర్ కేంబ్రిడ్జి చదివారు. చదువుతో పాటు గుర్రపుస్వారీ, కారు నడపటం, తుపాకీ గురిచూసి పేల్చటం మొదలైన విద్యలన్నీ నేర్చుకున్నారు. పదిహేడేళ్ళ వయసులో వనపర్తి జమిందారు రాజారామదేవ్ రావుని వివాహం చేసుకున్నారు. వివాహమయ్యాక పర్దా వదిలి సాంఘిక సేవ చేయటానికి బైటి ప్రపంచంలోకి రావటంతో ఆమె చాలా విమర్శలు ఎదుర్కొన్నారు.

ఆధ్యాత్మిక భావనలు బలంగావున్న కుముదినీ దేవి స్వామి శివానంద శిష్యురాలు. ఆయన ప్రభావంతోనే ఆమె సంఘసేవలోకి వచ్చారు. 1958వ సంవత్సరంలో హైదరాబాదు నగరశివార్లలో ఉండే కుకట్‌పల్లిలో ఆమె 51ఎకరాల భూమి కొని శివానంద పునరావాస ఆశ్రమం స్థాపించారు. అపుడందులో యాభైమంది కుష్టువ్యాధిగ్రస్తులు ఉండేవారు. వారికి ఆశ్రయం, ఆహారం, వైద్యం అన్నీ ఆశ్రమంలోనే దొరికేవి. ఇవాళ ఆ ఆశ్రమం కుష్టువ్యాది నిరోధం, చికిత్స, వ్యాధిగ్రస్తుల పునరావాసం ఇట్లా అన్నింటిగురించీ పనిచేసే సంపూర్ణమైన సంస్థలాగా పనిచేస్తోంది. ఇందులో ఆరువందల మంది ఉంటున్నారు. రెండువందలమంది ఉండి వైద్యం చేయించుకుని వెళ్ళేందుకు కావలసిన సదుపాయాలతో ఆసుపత్రి కూడాఉంది.

1958వ సంవత్సరంలోనే స్థాపించిన 'సేవాసమాజ బాలికా నిలయం' వ్యవస్థాపక సభ్యులలో కుముదిని ఒకరు. ముగ్గురు బాలికలతో మొదలైన బాలికా నిలయం ఇప్పుడు అరవైమంది బాలికలతో నడుస్తోంది. వాళ్ళక్కడ చదువుకుంటూ, వృత్తి విద్యలు నేర్చుకుంటారు. వారి వివాహ విషయంలో కూడా సంస్థ సహాయపడుతుంది. కుముదిని అనాథ శిశువులను పెంచి, దత్తత కోరే వారికి ఇచ్చేందుకు ఒక సంస్థనూ, తన తల్లిపేరుతో చూడామణీ వృద్ధ ఆశ్రమాన్నీ నెలకొల్పారు. నిజామియా హైదరాబాద్ అసోసియేషన్ ట్రస్ట్ యొక్క వ్యవస్థాపక ట్రస్టీగా రాణీ కుముదిని హైదరాబాదు పాతనగరంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల స్త్రీలకు అర్థవంతమైన చదువు నేర్పేందుకు చురుకుగా పనిచేస్తున్నారు.

1962వ సంవత్సరంలో కుముదినీ దేవి హైదరాబాదు మున్సిపల్ కార్పొరేషన్‌లో మున్సిపల్ కౌన్సిలర్‌గా, మేయర్‌గా పనిచేశారు. కుముదిని మేయర్ అయిన సంవత్సరమే హైదరాబాద్‌లో వరదలొచ్చాయి. ఎడతెరిపిలేని వర్షాలతో ప్రజలకు నిలవనీడ లేకుండా పోయింది. ఆమె రాత్రింబవళ్ళూ బాధితులను పరామర్శించి. వారికోసం నిధులు సేకరించి, స్వయంగా సహాయాన్ని అందించారు. ఆమె 1962-72 సంవత్సరాలలో రెండుసార్లు వనపర్తి నియోజకవర్గం నుంచి శాసనసభ్యురాలిగా ఎన్నికయ్యారు. ముఠా రాజకీయాలకు దూరంగా ఉంటూ తన నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేవారు. తన ఆత్మతృప్తి కోసం ఆమె సంఘసేవను ఎంచుకున్నారే గాని రాజకీయాలను కాదు. ఆమె లేపాక్షి హస్తకళల కేంద్రానికి అధ్యక్షులుగా ఉన్నారు. 89సంవత్సరాల వయసులో ఈనాటికీ కుముదినీదేవి తను సాధించినవాటితో సంతృప్తి పడకుండా, అలుపెరగకుండా సేవా కార్యక్రమాలలో భాగమైపోయారు.

ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా ఎన్నో అవార్డులూ, గౌరవాలు ఆమెకు దొరికాయి. వాటిలో 1994వ సంవత్సరంలో సాంఘిక సేవకు యిచ్చే 'యుధ్‌వీర్ అవార్డు' చాలా ముఖ్యమైనది. సమాజంలో అవకాశాలులేని, దొరకని, వ్యాధిగ్రస్తుల, వృద్ధుల, వికలాంగుల జీవితాలలో వెలుగు తీసుకురావటానికి చేసిన కృషికి గుర్తింపుగా, రాణి కుముదినికి 1977వ సంవత్సరంలో 'మెహదీజంగ్ సెంటినరీ హ్యూమన్‌రైట్స్ అవార్డు' ఇచ్చి గౌరవించారు.

# ౨. మాసుమా బేగం

మాసుమా బేగం హైదరాబాదులో జన్మించారు. ఈమె తల్లి తయ్యబా భేగం బిల్‌గ్రామి. ఆమె సంఘ సేవకురాలు. నైజాం రాజ్యంలో గ్రాడ్యుయేట్ అయిన మొదటి ముస్లిం మహిళ 1908లో హైదరాబాదులో వచ్చిన మూసీ వరదలలో ప్రజలను ఎంతో ఆదుకున్నారు. అంజుమన్-ఏ-ఖనాతీన్‌ను స్థాపించి బీద పిల్లల కొసం హైదరాబాదు నగరంలో ఏడు పాఠశాలలు స్థాపించారు.

మాసుమా బేగం మహబూబియా కళాశాలలో ఉర్దూ భాషలో ప్రావీణ్యానికి బంగారు పతకం పొందారు. తర్వాత లండన్‌లో రాయల్ డ్రాయింగ్ సోసైటీ సర్టిఫికెట్ పొంది, ట్రినిటీ కాలేజీ ఆఫ్ మ్యూజిక్‌లో పియానో అభ్యసించారు. ఫ్రెంచ్, హిందీ, తెలుగు, పర్షియన్ భాషలు నేర్చుకున్నారు.

మాసుమా బేగం హైదరాబాదులో ఎన్నో సంస్థలలో సభ్యురాలిగా ఉండి ఆ సంస్థల నిర్వహణలో తోడ్పడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యురాలిగా పదిసంవత్సరాలు పనిచేశారు. లేడీ హైదరీ క్లబ్బుకు అనేక సంవత్సరాలు అధ్యక్షులుగా ఉన్నారు. 1962-64 మధ్యకాలంలో ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్సుకు అధ్యక్షులుగా ఉన్నారు. అంతర్జాతీయ మహిళా సమావేశాలకు హాజరయ్యారు.

1952వ సంవత్సరంలో జరిగిన సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా హైదరాబాదు నుంచి అసెంబ్లీకి నిలబడి గెలిచారు. అప్పటినుంచి 11 సంవత్సరాలు హైదరాబాదు నియోజకవర్గ శాసన సభ్యులుగా పనిచేశారు. అన్ని సంవత్సరాలు ఒక మహిళ ఒకే నియోజక వర్గం నుంచి ప్రాతినిధ్యం వహించటం ఇప్పటికీ అరుదుగానే జరుగుతుంది. వాసన సభ్యురాలిగా తన నియోజకవర్గ సమస్యలను మాసుమా బేగం అసెంబ్లీలో తరచు చర్చకు పెట్టేవారు. రాజకీయ పరిణితితో చర్చలలో పాల్గొనేవారు. 1960లో ఆమె సాంఘిక సంక్షేమ శాఖకు మంత్రి అయ్యారు. హైదరాబాదునుంచి మంత్రి పదవి పొందిన మొదటి మహిళ మాసుమా బేగం. 1967లో న్యూఢిల్లీలో భారత ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బోర్డుకు అధ్యక్షులుగా ఒకటిన్నర సంవత్సరాలు పనిచేశారు. అంజుమన్-ఏ-ఖవాతీన్ అధ్యక్షులుగా, కరస్పాండెంట్‌గా చాలా సంవత్సరాలు పనిచేశారు.

ఆమె గోల్నాకాలో తన తల్లి ప్రారంభించిన అంజుమన్ బాలికా ప్రైమరీ పాఠశాలను 'సమర్థంగా' నడిపారు. ఈ పనిలో ఆమె భర్త ప్రొఫెసర్ హుసియన్ ఆలిఖాన్ ఎంతో తోడ్పడ్డారు. ఈ స్కూల్లో పిల్లలకు ఉచిత విద్య దొరికేది. ఉర్దూ భాషలో విద్యాబోధన జరిగేది. మాసుమా బేగం గైడ్స్ శిక్షణలోనూ, రెడ్‌క్రాస్‌తోనూ సన్నిహితంగా కలిసి పనిచేశారు. యాభై సంవత్సరాల ఆమె సాంఘిక సేవను గుర్తించి ఆమెకు భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' బిరుదును ఇచ్చింది. ఆమెకు ఇస్లాం మతంలో విశ్వాసం ఉంది. ఇతర మతాల పట్ల ఎంతో గౌరవం ఉంది. మతపరమైన ఈ సామరస్య భావన తనకు తలిదండ్రుల నుంచి సంక్రమించిందని మాసుమా బేగం చెబుతారు.

# 10. శాంతాబాయి కిర్లోస్కర్

శాంతాబాయి తలిదండ్రులు కాశీబాయి, డాక్టర్ జి.కె. కిర్లోస్కర్‌లు, డాక్టర్ కిర్లోస్కర్ 1907వ సంవత్సరంలో హైదరాబాదుకి వచ్చి ప్రాక్టీసు ప్రారంభించారు. హైదరాబాదులో అప్పుడు విద్యాబోధన ఉర్దూ మాధ్యమంలో జరిగేది కాబట్టి శాంతాబాయి మెట్రిక్ వరకూ పూనాలోని హుజుర్‌పాగా అనే హిందూ బాలికాపాఠశాలలో చదివారు. సెలవులు మాత్రం హైదరాబాదులో గడిపేవారు. ఫెర్గుసన్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నప్పుడు శాంతాబాయి తాను డాక్టర్ కావాలని నిర్ణయించుకున్నారు. కుటుంబంలో తల్లితప్ప మిగిలినవారందరూ శాంతాబాయి నిర్ణయాన్ని వ్యతిరేకించారు. చదివిన చదువు చాలనీ, పెళ్ళిచేసుకోమనీ బలవంతపెట్టారు. తల్లి కాశీబాయి మాత్రం కూతురు చదువుకుని తీరాల్సిందేనని గట్టిగా పట్టుబట్టింది. శాంతాబాయినే కాదు మిగిలిన నలుగురు కూతుళ్ళూ, ఇద్దరు కొడుకులూ కూడా పెద్ద చదువులు చదివేలా కాశీబాయి ప్రోత్సహించింది.

శాంతాబాయి ఢిల్లీలో లాహెూర్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న లేడీ హార్డింజ్ కాలేజీలో ఎమ్.బి.బి.యస్. పూర్తిచేశారు. వెంటనే నైజాం రాజ్యంలో బీదర్ రాష్ట్రంలో రెండు సంత్సరాల పాటు మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసి ఆ తర్వాత ఏడేళ్ళపాటు (1929-36) సికిందరాబాద్‌లోని కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ అస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేశారు. 1936లో కింగ్ కోఠీ రోడ్డులో ఒక ప్రసూతి వైద్యశాలను ప్రారంభించారు. నగరంలో అలాంటి ఆసుపత్రి అంతకుముందు లేదు. ఎడ్వర్డ్ మెమోరియల్ ఆస్పత్రిలో తనతోపాటు పనిచేసిన నమ్మకమైన ఉద్యోగులను తీసుకుని ఆత్మవిశ్వాసంతో శాంతాబాయి ఆ ప్రసూతి వైద్యశాలను ప్రారంభించారు. 1929లో డాక్టర్ ఎస్.డి. సత్వలేకర్‌ను వివాహం చేసుకున్నారు. 1938వ సంవత్సరంలో తన కూతుళ్ళను పెద్దవాళ్ళ సంరక్షణలో ఒదిలి డబ్లిన్ వెళ్ళి వైద్యశాస్త్రంలో మరింత ఉన్నతవిద్యను అభ్యసించి వచ్చారు.

శాంతాబాయి తన జీవితమంతా మంచి డాక్టర్‌గా ప్రజల గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ పొందారు. హైదరాబాదులో తొలి తరపు మహిళా డాక్టర్లలో ఒకరిగా, వృత్తిలో తిరుగులేని సామర్థ్యం, స్త్రీల ఆరోగ్యం పట్ల అంకితభావం ఉన్న శాంతాబాయి తన కాలంలో మరపురాని మనిషి అనిపించుకున్నారు. ఆమె తన వృత్తికి సంబధించిన సంఘాలలో పనిచేయటమే కాకుండా, ఇతర సాంఘిక, సాంస్కృతిక సంఘాలలో కూడా ఆసక్తితో పనిచేసేవారు.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జైలు నుంచి విడుదలైన ఖైదీల సహాయ సంస్థ, స్త్రీశిశు సంక్షేమ సంఘం, మహారాష్ట్ర మండలి మొదలైన సంఘాలలో శాంతాబాయి సభ్యులుగా ఉండి వాటి అభివృద్ధికి కృషిచేశారు. క్రీడాకారిణి అని చెప్పేంతగా ఆమెకు ఆటలలో ఆసక్తి ఉంది. అరవైయేళ్ళొచ్చేంత వరకూ ఆమె టెన్నిస్ ఆడారు. ఈత అంటే ఎంతో ఇష్టం. డెబ్బై అయిదేళ్ళ వయసులో కూడా ఈత కొట్టేవారు. హైదరాబాద్ ఖోఖో, కబాడీ అసోసియేసన్‌కు ప్రెసిడెంట్‌గా ఉన్నారు. భారతదేశంలో వివిధ ప్రాంతాలకూ ప్రయాణం చేయటమంటే ఆమెకు ఇష్టం. ఇన్ని రంగాలలో ఇంత ఆసక్తిగా పనిచేసే శాంతాబాయికి వంట చేయటం మరింత ఇష్టం. తన వైద్యం నుంచీ, సాంఘిక కార్యక్రమాలనుంచీ, ఆటలనుంచీ ఖాళీ దొరికినప్పుడల్లా వంటచేసి వేడివేడిగా వడ్డించి, ఇష్టంగా తినేవారిని చూడటం ఆమెకు మరీ మరీ ఇష్టం.